ఆంధ్రప్రదేశ్

మార్చి 1977 | ఉగాది ప్రత్యేక సంచిక | వెల. 50 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 21

మార్చి, 1977
ఫాల్గుణ-చైత్ర, 1898-99 శా.శ.

సంచిక : 5

ఉగాది ప్రత్యేక సంచిక

ప్రధాన సంపాదకులు :
శ్రీరాజ్యం సిన్హా

సంపాదకులు :
కుందుర్తి ఆంజనేయులు

పాఠకులకు
ప్రకటన కర్తలకు
ఉగాది శుభాకాంక్షలు
—ఎడిటర్

ముఖచిత్రం : పోచంపాడు ప్రాజెక్టు

రెండు,మూడు కవరుపేజీలు: కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్ర (బుజ్జాయి బొమ్మల చిత్రాలు)

చివరికవరు పేజీ : న్యూఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవాల్లో సమాచార శాఖ అలంకృతశకటం

వెల: 50 పైసలు

సాలుచందా : ఆరు రూపాయలు

ప్రచురణ :
డైరెక్టర్,
సమాచార, పౌర సంబంధ శాఖ,
హైదరాబాద్

ముద్రణ :
డైరెక్టర్,
కేంద్ర ముద్రణాలయం,
హైదరాబాద్.


రిజిస్టరు నెం : హెచ్. హెచ్. డి. 81

57—1

ఈ సంచికలో...

పేజీ

7 ప్రణాళికల ద్వారా ప్రగతి
9 ప్రజాశక్తి ప్రహ్లాదుడు (కవిత)
10 కోరుకొండ సైనిక పాఠశాల
12 స్త్రీలకు పురుషులతో సమాన వేతనాలు
13 అందరినీ పలకరిస్తున్న అందాలహరివిల్లు:
25 సూత్రాల కార్యక్రమం అమలు
18 సామాన్యుల విజయ గాథలు
21 నింగీ-నేలా (కవిత)
22 జనాబ్ గౌస్ బేగ్ సాహెబ్
22 చేదు నిజం (కవిత)
26 తెలుగు వారి హాస్యప్రియత్వం
32 కవితా వేశం-నా దేశం (వచన కవితా రూపకం)
36 పాఠక లేఖలు
37 జిల్లాలలో ఏం జరుగుతోంది ?
39 గ్రంథసమీక్ష
41 హెచ్చరింత (కవిత)
42 జిల్లా వార్తలు



జననం: 13–5–1905 మరణం: 11–2–1977

భారత రాష్ట్రపతి
శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
అస్తమయం

భారత రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఫిబ్రవరి 11 వ తేదీ ఉదయం గం॥ 8.52 లకు తీవ్రమైన గుండెపోటుతో క్రొత్త ఢిల్లీలో మరణించారు. అస్వస్థత కారణంగా మలేషియా నుండి రాష్ట్రపతి అంతకుముందు రోజు ఢిల్లీకి వచ్చారు. మరణ వార్త తెలియగానే ప్రధానమంత్రి, యూనియన్ మంత్రులు, యితర ప్రముఖులు రాష్ట్రపతి భవనానికి వెళ్ళి జోహారులర్పించారు. భారత ప్రభుత్వం 13 రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది. 13వ తేదీ ఆదివారం నాడు రాష్ట్రపతి భౌతిక కాయానికి సకల రాజలాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

శ్రీ ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ 1905వ సంవత్సరం మే 13 వ తేది ఢిల్లీలో జన్మించారు. ఆయన తండ్రి కల్నల్ జడ్. ఏ. అహమ్మద్ అస్సాంలోని గోలాఘాట్ సబ్-డివిజన్‌లో కాఖరిహట్‌కు చెందిన వారు.

శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ భారతదేశంలో విద్యాభ్యాసం తర్వాత ఇంగ్లండుకు వెళ్లి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో సెయింట్ కాథరీన్ కళాశాలలో చేరి 1927లో పట్టభద్రులైనారు. మరునటి సంవత్సరం లా పరీక్షలో ఉత్తీర్ణులై లండన్ ఇన్నర్ టెంపుల్‌లో న్యాయవాది అయినారు.

భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత అవిభక్త భారత దేశపు పంజాబ్ హైకోర్టులో న్యాయవాదిగా నమోదు అయినారు. కొద్ది కాలం కలకత్తాలో న్యాయవాదిగా పని చేశారు. శ్రీ అహమ్మద్ 1931 లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రాథమిక సభ్యత్వాన్ని పొందారు. 1935లో ముస్లిమ్ రిజర్వుడు స్థానంలో పోటీచేసి అస్సాం శాసన సభకు సభ్యుడుగా ఎన్నిక అయినారు.

శ్రీ అహమ్మద్ 1936 నుండి కొద్ది కాలం తప్ప అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోనూ, ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోనూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీలోనూ సభ్యులుగా ఉన్నారు. 1938-39లో అస్సాంలోని మొదటి కాంగ్రెస్ మంత్రి వర్గంలో ఆర్థిక, రెవిన్యూ మంత్రిగా చేరారు.


మహాత్మాగాంధీ అనతి మేరకు స్వర్గీయ గోపీనాథ్ బార్డోలాయ్ తోపాటు శ్రీ అహమ్మద్ మంత్రివర్గం నుండి రాజీనామా చేసి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. విడుదల అయిన వెంటనే తిరిగి నిర్బంధింపబడి మూడున్నర సంవత్సరాలపాటు కారాగారంలో వుండి 1945 ఏప్రిల్‌లో విడుదల చేయబడ్డారు.


కొద్ది కాలం తరువాత శ్రీ అహమ్మద్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో సభ్యులైనారు. 1952-53లో రాజ్యసభకు కాంగ్రెసు సభ్యులుగా ఎన్నికైనారు. 1955లో భారత న్యాయవాదుల ప్రతినిధి వర్గానికి నాయకులుగా రష్యాకు వెళ్ళారు. 1945లో శ్రీ అహ్మద్ బేగం అబీదాను వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. 1957లో భారత ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా ఐక్యరాజ్య సమితి సమావేశాలకు హాజరైనారు.

1957లో శ్రీ అహమ్మద్ పెద్ద మెజారిటీతో అస్సాం శాసన సభకు ఎన్నిక అయ్యారు. మరునటి సంవత్సరం రాష్ట్ర మంత్రి వర్గంలో ఆర్థిక, న్యాయ, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్, స్థానిక ప్రభుత్వ శాఖల మంత్రిగా చేరారు. 1964లో ప్రత్యేక ఆహ్వానంపై అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. జపాన్, హాంగ్‌కాంగ్‌ల మీదుగా భారత దేశానికి తిరిగి వచ్చారు. 1965లో మలేషియా స్వాతంత్ర్య దినోత్సవాలకు భారత దేశ ప్రతినిధిగా కౌలాలంపూరుకు వెళ్ళారు. శ్రీ అహమ్మద్ 1966 జనవరి 29వ తేదీన కేంద్ర మంత్రివర్గంలో నీటిపారుదల, విద్యుచ్ఛక్తి మంత్రిగా చేరారు. 1966 నవంబరు 14వ తేదీన కేంద్ర విద్యామంత్రిగా నియమించబడ్డారు.

"1967 సాధారణ ఎన్నికలలో అస్సాంలోని బార్‌పేట నియోజక వర్గంనుండి లోక్ సభకు ఎన్నిక అయ్యారు. 1967 మార్చి 13వ తేదీ ఏర్పాటు అయిన నూతన ప్రభుత్వంలో పారిశ్రామిక అభివృద్ధి, కంపెనీ వ్యవహారాల క్యాబినెట్ మంత్రిగా నియుక్తులయ్యారు. 1969 ఫిబ్రవరి నుండి 1970 జులై వరకు శ్రీ అహమ్మద్ పారిశ్రామిక అభివృద్ధి, దేశీయ వాణిజ్య కంపెనీ వ్యవహారాల క్యాబినెట్ మంత్రిగా పని చేశారు.

1974 ఆగస్టు 24 వ తేదీన శ్రీ అహమ్మద్ భారత రాష్ట్రపతిగా ఎన్నికయినారు.









అంతిమ యాత్ర

రాష్ట్రపతి భవన్‌లో శ్రీ ఫకృద్దీన్ అలీ అహ్మద్ భౌతిక కాయంపై ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, తాత్కాలిక రాష్ట్రపతి శ్రీ బి. డి. జెట్టి పుష్ప గుచ్ఛాలను వుంచి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీ అహ్మద్ సతీమణి బేగం అబీదా అహ్మద్, వారి కుమారుడు, తదితరులు దుఃఖోద్వేగంతో అంజలి ఘటించారు. న్యూఢిల్లీలోని దర్బార్ హాలు ఎదురుగా అసంఖ్యాక ప్రజానీకం తమ రాష్ట్రపతిని చివరిసారి చూసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. అలంకృత సాయుధశకటంపై రాష్ట్రపతి భౌతిక కాయాన్ని రాజలాంఛనాలతో దర్బార్ హాల్ వెలుపలికి తీసుకొని వచ్చి ఊరేగింపు జరిపారు.





గవర్నరు శ్రీ ఆర్. డి. భండారే సంతాప సందేశం

"మన ప్రియతమ రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ ఈ ఉదయం ఆకస్మికంగా మరణించారని తెలిసి నేను దిగ్భ్రాంతి చెందాను. శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ గత కొన్ని దశాబ్దాలుగా ప్రజాసేవ చేస్తూ జాతికి తమ జీవితాన్ని అంకితం చేశారు. ఆయన పరిపాలనాదక్షుడు, పార్లమెంటేరియన్, ఆయన ప్రముఖ స్వాతంత్ర్య యోధుడేకాక అనేకసార్లు జైలు శిక్షలుకూడా అనుభవించారు. హిందూ మహమ్మదీయ సమైక్యతకు, జాతీయ సమైక్యతకు ఆయన నిర్విరామంగా కృషిచేశారు. ఆయన జాతీయవాది, దేశానికి అడ్డుగోడలుగా నిలిచిన మతాల మధ్య, కులాలమధ్య, ప్రాంతాలమధ్య ఎల్లలు ఎరగనివాడు. దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సమగ్రతకు, సమైక్యతకు గొడ్డలి పెట్టుగా ఉన్న దుష్టశక్తులకు, స్వార్థపర ధోరణులకు వ్యతిరేకంగా ఆయన కృషిచేశారు. సమాజంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ మత విషయాలలో అపూర్వమైన మార్పులను తెచ్చే అహింసా విధానం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విధానాలలో ఆయనకు ప్రగాఢమైన విశ్వాసం ఉంది. భారత రాష్ట్రపతిగా జాతీయ సమైక్యతా సమగ్రతలకు చిహ్నంగానేగాక సాంస్కృతిక మానవతా వాదాలకుకూడా ఆయన ప్రతీకగా నిలిచారు. ప్రజలందరి ప్రేమాభిమానాలను చూరగొన్నారు."

ముఖ్యమంత్రి సంతాప సందేశం

"ఈరోజు ఉదయం మన ప్రియతమ రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీఅహమ్మద్ ఆకస్మికంగా మరణించటం నన్ను దిగ్భ్రాంతుడిని చేసింది. శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ మన దేశంలో చిరకాలంగా ప్రజల సేవకుడుగా పేరుపొందారు. శ్రీ అహమ్మద్ 1931లో భారత జాతీయ కాంగ్రెసులో సభ్యుడుగా చేరారు. ఆయన 1935లో అస్సాం శాసనసభకు సభ్యుడుగా ఎన్నికై 1938లో ఆ రాష్ట్రంలోని మొదటి కాంగ్రెసు మంత్రివర్గంలో చేరారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో ఎంతో ప్రజాసేవ తరువాత శ్రీ అహమ్మద్ 1966లో కేంద్ర మంత్రివర్గంలో చేరి అనేక శాఖలలో మంత్రిగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్యయోధుడుగానూ, రాష్ట్ర కేంద్ర మంత్రివర్గాలలో మంత్రిగానూ శ్రీ అహమ్మద్ దేశ ప్రజల సేవకే తనజీవితాన్ని అంకితం చేశారు. రాష్ట్రపతిగా శ్రీ అహమ్మద్ అందరి ఆదరాభిమానాలను పొందగలిగారు. భారతదేశ ఆశయాలైన శాంతి సౌహార్ద్రాలను ప్రపంచమంతటా వ్యాప్తిచేశారు.

పదవిలో ఉండగానే మరణించిన రెండవ రాష్ట్రపతి ఆయన. ఆయన మరణంతో దేశం ఒకగొప్ప పుత్రుడిని కోల్పోయింది. ప్రతి సంవత్సరం కొన్ని వారాలపాటు శ్రీ అహమద్ మన రాజధానిలో రాష్ట్రపతి నిలయంలో నివసిస్తూ మన మధ్యవుంటూ వుండేవారు. మన రాష్ట్ర ప్రజలలోని అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలు ఆయన పొందారు. ఆయన మరణంపట్ల శోకించని వారుండరు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక.

బేగం అబీదా అహమ్మద్‌కు, యితర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసుకుంటున్నాను."

ఆంధ్రప్రదేశ్ గవర్నరు రాజీనామా




శ్రీ ఆర్. డి. భండారే

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఆర్.డి. భండారే ఫిబ్రవరి 6వ తేదీన గవర్నరు పదవికి రాజీనామా చేశారు.

శ్రీ భండారే 1976 జూన్ 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ బి. జె. దివాన్ తాత్కాలిక గవర్నరుగా ఫిబ్రవరి 17వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ శ్రీ అవుల సాంబశివరావు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైనారు.

శ్రీ బి. జె. దివాన్
ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు




ఉగాది సందేశం

ఉగాది పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. చాంద్రమాన సంవత్సరాన్ని అనుసరించే ప్రజలందరికీ "ఉగాది" నూతన సంవత్సర ఆరంభాన్ని తెలియజేసే పండుగ. ఈ పండుగను కర్నాటక, మహారాష్ట్ర కేరళ ప్రజలు కూడా జరుపుకుంటారు. ఈ విధంగా ఉగాది పండుగ ప్రజల సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా ఉన్నది.

ఇటువంటి శుభ సందర్భాలలో మనమందరమూ కొంత ఆత్మావలోకనము చేసుకొని సాటి ప్రజల క్షేమానికి ఇంకా ఎక్కువ సేవచేసే మార్గాలను వెదుకుకోవాలి ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎన్నుకోబడిన మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని సౌభాగ్యవంతంగా చేయడానికి, మన ప్రగతి మార్గంలో యింతవరకు అడ్డుగోడలుగా నిలిచివున్న సాంఘిక దురాచారాలను అంతం చేయడానికి కృషిచేస్తూ ఉన్నాయి. దీని ఫలితంగా మన ప్రజల జీవితాలలో అపూర్వమైన మార్పులు కలుగుతూ ఉన్నాయి. ప్రభుత్వం యొక్క ఈ కృషికి ప్రజలు అందజేస్తున్న సంపూర్ణ సహకారం మన భవిష్యత్తును మరింత ఆశాజనకంగా చేస్తూ ఉన్నది. రాబోయే కాలంలో కూడా దేశపు ప్రతి పౌరుడు దేశం పేరు ప్రఖ్యాతులను అధికం చేయడానికి తన సంపూర్ణ సహకారాన్ని అందించగలడని ఆశిస్తున్నాను.

మరొకసారి రాష్ట్ర ప్రజలందరకూ నా హృదయ పూర్వక శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

ప్రణాళికల ద్వారా ప్రగతి



ప్రణాళికా బద్ధమైన భారత దేశ పురోగమన కృషి మన వైభవోపేతమైన సుదీర్ఘ చరిత్రలో నవశకాన్ని తెరుస్తుంది. మన రాజ్యాంగంలో మన విధానానికి సంబంధించి పొందు పరచబడిన ఆదేశిక సూత్రాలు ఆధారంగానే మన ప్రణాళికాబద్ధమైన ప్రగతి కృషి కొనసాగుతుంది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ సమానంగా అందే సాంఘిక వ్యవస్థను వీలయినంత శక్తివంతంగా కల్పించి, పరిరక్షించడంద్వారా ప్రజల సంక్షేమాన్ని పెంపొందించే రాజ్యాంగాన్ని యీ ఆదేశిక సూత్రాలు మనకు అందిస్తున్నాయి.

—శ్రీ పిడతల రంగారెడ్డి

సమాజంలోని బలహీనవర్గాలను ఎంతమాత్రం విస్మరించడం జరగలేదు. మన రాజ్యాంగంలోని 46వ అధికరణలో దేశ ప్రజల్లో బలహీనవర్గాలవారి విద్యా ప్రయోజనాల్ని ఆర్థిక ప్రయోజనాల్ని—ముఖ్యంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారి ఆర్థిక, విద్యా ప్రయోజనాలను—పరిరక్షించి పెంపొందించేందుకు, సామాజిక అన్యాయాలనుంచి వారిని రక్షించేందుకు దేశం ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొనబడింది.

ఈ ప్రాతిపదికమీదనే మన ఐదవ పంచవర్ష ప్రణాళికకు రూపకల్పన జరిగింది. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బృహత్తర కృషికి యీ మౌలిక అవగాహనే ప్రాణం. ఈ విషయాన్ని గురించి అయిదో పంచవర్ష ప్రణాళిక ఒకచోట 'దారిద్ర్యాన్ని నిర్మూలించడం, ఆర్థిక స్వయం శక్తిని సాధించడం—యీ రెండూ దేశం సాధించాలనుకున్న బృహత్తర లక్ష్యాలు' అని నొక్కిచెప్పింది. స్థూలంగా వీటికి అనుగుణంగానే మన ప్రణాళికా రచన జరిగింది.

ముఖ్యమైన మార్గదర్శక సూత్రాలు

అయిదో పంచవర్ష ప్రణాళికను రూపొందించే టప్పుడు కొన్ని ముఖ్యమైన మార్గదర్శక సూత్రాలను దృష్టిలో వుంచుకోవడం జరిగింది. వ్యవసాయ రంగంలో 1964–65కు ముందుగా జరిగిన అభివృద్ధినీ, ఆ తరువాతి సంవత్సరాలలో దాదాపు స్తంభించిపోయిన అభివృద్ధినీ, దృష్టిలో వుంచుకొని వ్యవసాయాభివృద్ధికి యిస్తున్న ప్రాధాన్యం అయిదో పంచవర్ష ప్రణాళికలో కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలో పుష్కలంగావున్న ఖనిజ వనరులవల్ల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య సమతుల పారిశ్రామిక అభివృద్ధిని సాధించడానికీ, ఉపాధి అవకాశాలను విస్తృత పరచడానికి వీలుగా రాష్ట్ర పారిశ్రామికీకరణకు ఒక సమగ్ర, సమీకృత కార్యక్రమాన్ని చేపట్టడంఅవసరం. నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో విద్యుచ్ఛక్తి కొరత ఎక్కువగా వున్నందువల్ల యిటు వ్యవసాయాభివృద్ధికీ, అటు పారిశ్రామికాభివృద్ధికీ తగినంత విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే కార్యక్రమాన్ని ఒకదానిని రూపొందించి అమలు పరచడం చాలా అవసరం అని భావించడం జరిగింది.

ఇటీవల 1977–78 వార్షిక ప్రణాళికకు తుదిరూపం యిచ్చేటప్పుడు యీ విషయాలన్నిటినీ స్థూలంగా మనసులో వుంచుకొని రూ. 365.75 కోట్లు రూపాయలను కేటాయించడం జరిగింది. 1976–77 వార్షిక కేటాయింపు రూ. 267.85 కోట్లకన్నా 1977–78కి చేసిన కేటాయింపు 36.5 శాతం ఎక్కువ. అంటే రూ. 365.75 కోట్లు. 1976–77 వార్షిక ప్రణాళిక కేటాయింపును ముందుగా రూ. 267.85 కోట్లు కేటాయించినప్పటికీ వాస్తవానికి చేసిన కేటాయింపు లెక్కగడితే రూ. 285 కోట్లు వుంది. అందువల్ల 1977–78 వార్షిక కేటాయింపుతో 1976–77లో చేసిన అసలు కేటాయింపును పోల్చినప్పుడు 1977–78 కేటాయింపు సుమారుగా

30 శాతం వుంటుంది. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పవలసి వుంది. 1977-78 వార్షిక కేటాయింపు నాలుగవ పంచవర్ష ప్రణాళిక ఆఖరి ఏడాది వార్షిక కేటాయింపు కన్న నాలుగురెట్లు ఎక్కువ. నాలుగవ పంచవర్ష ప్రణాళిక ఆఖరు ఏడాది వార్షిక కేటాయింపు రూ. 89 కోట్లు మాత్రమే. 1977-78 సంవత్సరపు మన రాష్ట్ర వార్షిక ప్రణాళిక మొత్తం దేశంలోని వివిధ రాష్ట్రాల వార్షిక ప్రణాళికలతో పోల్చి చూస్తే మనది మూడో స్థానం. మొదటిది ఉత్తరప్రదేశ్. ఆ తర్వాతది మహారాష్ట్ర. అందుచేత మన రాష్ట్ర ప్రణాళికాభ్యుదయంలో యీ వార్షిక ప్రణాళికను ఒక మైలు రాయిగా పేర్కొనవచ్చు.

రంగాలవారీ కేటాయింపు

ఈ దృష్ట్యా సేద్యపునీటి పారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు చేసిన రంగాలవారి కేటాయింపులను మరోసారి పరిశీలించడం యిక్కడ అప్రస్తుతం కాబోదు. సేద్యపు నీటిపారుదల, విద్యుచ్ఛక్తి రంగాలలో గణనీయమైన పెరుగుదలకు 1977-78 వార్షిక ప్రణాళికా కేటాయింపు వీలు కల్పిస్తుంది. వర్తమాన సంవత్సరంలో విద్యుచ్ఛక్తికి కేటాయింపు రూ. 111 కోట్లు కాగా వచ్చే ఏడాది కేటాయింపు రూ. 140 కోట్లు వుంటుంది. కృష్ణానదిపై నిర్మిస్తున్న శ్రీశైలం జలవిద్యుత్పథకాన్ని మన రాష్ట్రంలోని ప్రముఖ విద్యుదుత్పాదక కేంద్రంగా పేర్కొనవచ్చు. దీనిని తొందరగా పూర్తిచేస్తే మన రాష్ట్ర విద్యుదవసరాలను తీర్చడమే గాక వ్యవసాయ, పారిశ్రామిక రంగాల విస్తరణకు కూడా వీలు కలుగుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు మీద కేటాయింపు రూ. 32 కోట్లకూ, విజయవాడ థర్మల్ విద్యుత్కేంద్రంమీద కేటాయింపు రూ. 41 కోట్లకు పెంచడం జరిగింది.

రాష్ట్ర జనాభాలో మూడింట రెండు వంతుల మంది తమ జీవన భృతికోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి వున్నందువల్లనూ, వ్యవసాయోత్పత్తులు బాగా పెరిగితేగాని తక్కువ వ్యవధిలో తలసరి ఆదాయం పెంచడం సాధ్యంకాదు గనుకనూ ప్రణాళికలో ముఖ్యమైనరంగమైన వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం యివ్వడం జరిగింది. 1976-77 వార్షిక ప్రణాళికలో నీటి పారుదల రంగానికిచేసిన కేటాయింపు రూ. 80 కోట్లు కాగా 1977-78 లో రూ. 107 కోట్లు కేటాయింపు జరిగింది. పోచంపాడుకు రూ. 20 కోట్లు, గోదావరి బరాజ్‌కు రూ. 11 కోట్లు కేటాయించారు. మిగత భారీ, మధ్యరకం సేద్యపు నీటిపారుదల పథకాలకు రూ. 25 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో రూ. 10 కోట్లను కొత్త పథకాలకోసం ప్రత్యేకించారు.

సాగులోకి అధిక భూములు

దేశంలోని పెద్ద నదీలోయ ప్రాజెక్టుల్లో ఒకటైన నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు మన ప్రణాళికావేత్తలు ఇంతకుముందువలె అధిక ప్రాముఖ్యం యిచ్చారు. ఇంకా అనేక సువిశాల ప్రాంతాలకు యీ ఆనకట్ట ప్రయోజనాలను విస్తరింపజేయాలని ఉద్దేశించారు. ముఖ్యంగా అయిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో అదనంగా 50 లక్షల హెక్టార్లను సాగులోకి తేవాలని 20 అంశాల ఆర్థిక కార్యక్రమం క్రింద భారత ప్రభుత్వం ఉద్దేశించడంతో నాగార్జునసాగర్ ప్రాధాన్యం మరింత పెరిగింది. సుమారు లక్ష 60 వేల హెక్టార్లు నాగార్జున సాగర్ క్రింద సాగులోకి రావచ్చు. అందుచేతనే మన 1977-78 వార్షిక ప్రణాళికలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకోసం రూ. 37.50 కోట్లు కేటాయించారు.

ఇటీవలి కాలంలో దేశమంతటా బలహీన వర్గాలవారి సంక్షేమానికి అత్యధిక ప్రాముఖ్యం వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా యిదేవిధంగా కృషి జరుగుతున్నది. మనరాష్ట్రంలో షెడ్యూలు, వెనుకబడిన తరగతులవారు మొత్తం రాష్ట్ర జనాభాలో 52 శాతం వున్నారు. అందుచేత 20 అంశాల ఆర్థిక కార్యక్రమం క్రింద వెనుకబడిన వర్గాల సంక్షేమంకోసం 1977-78 వార్షిక ప్రణాళికలో రూ. 1 కోటి కేటాయింపు జరిగింది. హరిజనులు, వెనుకబడిన తరగతులవారికోసం యిళ్ల స్థలాల సేకరణ నిమిత్తం చేసిన కేటాయింపు కూడా కోటి రూపాయలకు పెంచారు.

ఇతర రంగాలకుచేసిన కేటాయింపులు :—

(1) వ్యవసాయం, దాని అనుబంధ సర్వీసులకు రూ. 26.50 కోట్లు (2) సహకార చక్కెర కర్మాగారాలతో సహా సహకార రంగానికి రూ. 6.50 కోట్లు (3) పరిశ్రమలు, గనుల త్రవ్వకాలకు రూ. 11 కోట్లు (4) రవాణా, వార్తా సౌకర్యాలకు రూ. 28.50 కోట్లు (5) విద్యకు రూ. 6 కోట్లు (6) నీటిసరఫరాకు రూ. 15.75 కోట్లు (7) గృహనిర్మాణం, పట్టణాభివృద్ధికి రూ. 9.13 కోట్లు (8) వైద్య, ప్రజారోగ్యానికి రూ. 4.44 కోట్లు.

వీటన్నిటినిబట్టి, మనం అయిదో పంచవర్ష ప్రణాళికలో లక్ష్యించుకున్న ఉన్నత ఆశయాలు అచిరకాలంలోనే వాస్తవ రూపాన్ని సంతరించుకోగలవని తేటతెల్లమవుతున్నది. నిజానికి యిది ఏమంత తేలికైనపనికాదు. లక్ష్యసాధనకు మనముందున్న బాట సుదీర్ఘమైనది. ఎన్నో ఆటంకాలతో కూడి కష్టసాధ్యమైనది. అయినా అచంచలమైన ఆత్మవిశ్వాసంతో, దృఢ దీక్షతో మన పురోగమన యాత్రను కొనసాగిద్దాం. మన కన్నులముందున్న భవిష్యత్తు మనల్ని విస్పష్టంగా, నిర్విచారంగా కూర్చోనివ్వదు. మనలో ఆశలు రేకెత్తిస్తోంది. అందుకే యింత ఆరాటం.

జిల్లాల్లో ఏం జరుగుతోంది?

ఎల్లవరం తాలుకా

తూర్పుగోదావరి జిల్లా ఎల్లవరం తాలూకా గిరిజన ప్రాంతములో నీటి వనరులు పుష్కలముగా నున్నవి. కన్నేరు, ఏదేరు, ఏలేరు మొదలగు ఎన్నో కొండవాగులకూ యీ తాలూకా పుట్టినిల్లు. అయినప్పటికి యీ ప్రాంతము వర్షాధారమై ప్రకృతి మీద ఆధార పడి తరుచు కరువుకు గురైయ్యేది. ఈనీటి వనరుల అభివృద్ధికి తోడు వ్యవసాయాభివృద్ధికి అమలు జరుపుతున్న కృషి బహు ప్రశంసనీయము.

ఆరు సూత్రాల పథకం క్రింద రూ. 7.10 లక్షలు ఖర్చుచేసి య. 408లకు నీటి సరఫరాకు గాను మల్లపాడువద్ద (య. 200లు), బొరన్న గూడెంవద్ద (య. 300లు), గొరగొమ్మివద్ద (య.73లు), జంజ త్రివద య 103లు) కొండవాగులకు అడ్డకట్టలు కట్టి నూతన చెరువులు తయారుచేయుకార్యక్రమములు మార్చి 77 నాటికి పూర్తికానున్నవి.

1976-77సం॥రములో గిరిజన ప్రాంతములందు జరుపుటకుగానూ రూ. 100 లక్షల మామూలు యిరిగేషను స్కీముల క్రింద పెద ఎర్రంపాడువద్ద వెండిగెడ్డవాగుకూ రూ. 3 లక్షలు ఖర్చుతో య 300లసాగుకు ఒక ఆనకట్ట స్కీము, పిడత మామిడివద్ద ఊటకాలువకూ రూ. 4.29లు ఖర్చుతో య. 175ల సాగుకు ఒక నూతన చెరువు తయారుచేయు పథకమునకూ ప్రభుత్వము మంజూరుచేసింది.

రూ 200లు లక్షలు సమగ్ర గిరిజనాభివృద్ధి పథకము క్రింద (I.T.D.A) య 550లకు నీటి సరఫరాకు గాను రూ 12,84 లక్షలు ఖర్చుతో ఉర్లాకులపాడు వద్ద పెద్దకాల్వకు, అమ్మిరేకుల వద్ద కొండకాల్వకు రెండు రిజర్వాయరు స్కీములకు కొమరవరం వద్ద దుమ్మ కొండ వాగుకు ఒక ఆనకట్ట స్కీము తూర్పుగోదావరి జిల్లాకలెక్టరు మంజూరు చేశారు.

1977-78, 1978-79 సం॥రములలో అమలు జరుపుటకు గాను యీ తాలూకాలో అదనముగా య. 739 లకు యిరిగేషన్ సదుపాయములకు గాను రూ 15.24 లక్షలు ఖర్చుతో మరినాలుగు నీటిపారుదల పథకములు సిద్ధముగా యున్నవి.

ఇవికాక అయిదవ ప్రణాళికానంతరమున కూడా గిరిజన ప్రాంతాభివృద్ధికి గాను రూ 66.19 లక్షలు ఖర్చుతో య. 4724లు సాగుకు 15 స్కీములతో ఒక మాస్టర్ ప్లాను తయారు చేసి ఛీఫ్‌యింజనీరు వారికి పంపబడింది.

—శ్రీ పి.వి. సుబ్బారావు

ప్రకాశం జిల్లా గిద్దలూరు తాలూకా

గిద్దలూరు స్టేట్ బ్యాంకు వారు గిద్దలూరు, కొమరోలు, ముండ్లపాడు, తాళ్ళపల్లి, రాచర్ల, నరవ, గొతవరము, తురిమేళ్ళ నర్సిరెడ్డిపల్లి, మదారు పల్లె, అనుములపల్లె, రామాపురం, వద్దుల వాగుపల్లె, పొదలకుంట పల్లె, గోసానిపల్లె గ్రామములను దత్తత చేసి కొన్నారు 4% వడ్డీ రేటున బలహీన వర్గాలకు, వెనుకబడిన తరగతులకు నిస్సహాయులకు మొత్తం 352 మందికి రు1,52,00/- ఋణసహాయం అందజేశారు. ఇందులో షెడ్యూలు కులములు తెగలకు చెందిన వారు 82 మంది బలహీన వర్గాలకు చెందిన వారు 266 మంది, వికలాంగులు 4 మంది, ఇవికాక చిన్నతరహా పరిశ్రమలకు 5 మందికి రు. 1,77,000/- చిన్న వ్యాపారులకు 197 మందికి, రు 2,72,000/- వ్యవసాయదారులకు 1050 మందికి రు 10,65,000/- ఇతరులకు 495 మందికి రు. 5,98,000/ ఋణసహాయం చేసినది

వ్యవసాయ రంగములో సహేతుకమైన వడ్డీ రేట్లుతో 913 మందికి రు. 9,98,000/లు చిన్నతరహా వ్యాపారులకు 97 మందికి రు 1,87,000 బలహీన వర్గాలవారికి 20 మందికి రు 15,000/లు ఋణసహాయ మందజేశారు.

గిద్దలూరు వైశ్యబ్యాంకు వ్యవసాయక ఋణాలు 15 మందికి రు 50,000/- 60 మంది ఉద్యోగులకు రు. 25,000/- అప్పుగా యిచ్చారు

కంభంలోని స్టేట్ బ్యాంకు ఋణాలు

4% వడ్డీ రేటు చొప్పున బలహీన వర్గాలకు వెనుకబడిన తరగతులకు, నిస్సహాయులకు మొత్తము 344 మందికి రు 1,36,000 లు అందజేసినది. అందు షెడ్యూలు కులములు, తెగల-రు 209 మంది, వెనుకబడిన తరగతులవారు 106 మంది, యితర నిస్సహాయులు 29 మంది సహేతుకమైన వడ్డీ రేట్లకు వ్యవసాయ రంగములో 627 మందికి రు 11,96,000/-లు చదువుకొన్న నిరుద్యోగులకు 80 మందికి, రు 5,00,000/-లు ఋణ సహాయం మందజేసినది.


—శ్రీ బి.బుగ్గారెడ్డి

నెల్లూరు జిల్లా రాపూరు తాలూకా

నెల్లూరు జిల్లా రాపూరు తాలూకాలో డిసెంబరు 76 వరకు బలహీన వర్గాల వారి సంక్షేమం కోసం ఉద్దేశింపబడిన సహకార వ్యవసాయ క్షేత్రాలలోని భూమి 1606 ఎకరములు సాగులోనికి తేబడింది.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచి రాపూరు వ్యవసాయ అభివృద్ధికిగాను, రబీసీజనుకు లింగన్నపాలెం రూ 1,80,500 వండ్లూరుకు రూ. 59,000 చిత్తలూరుకు రూ. 52,800 లు సహకార సంఘములకు ఋణంములను మంజూరు చేశారు.

—శ్రీ వేణుగోపాల్



'మనీ బ్యాక్' పాలసి
(డబ్బు ముందు చెల్లింపు పాలసీ)

కాలపరిమితి తీరకముందే నిర్ణీత వ్యవధులలో ఇతర పథకాల క్రిందకన్న త్వరగాను, ఎక్కువగాను, సొమ్ము తిరిగి లభిస్తుంది.

'క్యాష్ & కవర్' పాలసీ
(నగదు & రక్షణ పాలసీ)

ప్రతి 5 సంవత్సరాలకు వాయిదాలలో సొమ్ము గ్యారంటీగా చెల్లింపబడుతుంది — బీమా చేసిన పూర్తి సొమ్ముపై బోనసులతో సహా — పైగా జీవితకాలమంతా బీమా రక్షణ.

'ప్రోగ్రెసివ్ ప్రొటెక్షన్' పాలసి
(వర్ధమాన సంరక్షణ పాలసీ)

కొత్తగా దరఖాస్తుచేసే పనిగానీ, వైద్య పరీక్షతోగానీ పనిలేకుండా, పాలసీ విలువ నిర్ణీత కాల వ్యవధులలో పెరుగుతూ ఉంటుంది.

మారే కాలానికి....
మారుతున్న అవసరాలకు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

daCunha/LIC/38 TEL.

గ్రంథసమీక్ష

తరం తరం

[వంద మంది కవుల అభ్యుదయ కవితా సంకలనం: గౌరవ సంపాదకులు: కుందుర్తి: ప్రచురణ: ఫ్రీవర్స్‌ఫ్రంట్. హైదరాబాదు-36: 214 పేజీలు. వెల: రూ. 10-00]

తూరుపారపట్టకపోతే నూర్పిన ధాన్యపుపొట్టును వేరుచేయలేము. పాఠకలోకానికి దిన, వార, పక్ష, మాసపత్రికలందిస్తున్న కవితారూపమైన రచనల్లో తాలెంత, బోలెంత అని తేల్చి, మంచి రచనల్ని నాలుగు కాలాలపాటు నిలిచేలాగా చేయడానికి 'కావ్య సంకలనాలు" అవసరం, తెలుగులో 'ముద్దుకృష్ణ' సంపాదించిన 'వైతాళికులు' కవితా కేదారంలో పండిన విత్తనాల ధాన్యం 'కల్పన' 'మహాసంకల్పం' రసజ్ఞులు తలదాల్చ వలసిన కావ్య సంపుటాలు. తెలుగులో ఇప్పటికి వచ్చిన కావ్యసంకలనాల సంఖ్య ఎక్కువేమికాదు ఇంకా ఎన్నో సంకలనాలు రావలసిన అవసరం ఉన్నది. ఉత్తమ కావ్యసంకలన మనిపించుకోదగిన వైతాళికులలో జాషువా, ఏటుకూరి, తుమ్మలవంటి ప్రసిద్ధ కవులు కొందరు చోటు చేసికోలేదు. అదే విధంగా ప్రతికావ్య సంకలనంలోను కవులతిరస్కృతివల్లనైతేనేమి, సంపాదకుల అభిరుచి భేదంవల్లనైతేనేమి, అజాగ్రత్త వల్లనైతేనేమి యిటువంటి లోపాలు తప్పవు. ఎక్కువ సంకలనాలు వెలువడితే లోపం లేకుండాపోతుంది. ఒక్కొక్క కవి ప్రభావం సమకాలికులపైన అత్యధికంగా ఉన్నా ఆయన కవితలు పుస్తకరూపం ధరించక పోవచ్చు. అటువంటి వారి కవితల నాస్వాదించటానికి కావ్యసంకలనాలే శరణ్యం. 'అజంతా' కవిత పుస్తక రూపంలో రానేలేదు.

'తరం తరం' సుమారు నాలుగు దశాబ్దాలలో వచ్చిన వచన కవితలలో మేలైన వానిని గుదిగుచ్చి అందించిన మంచి కవితా సంకలనం. "ఆత్మలో అభ్యుదయమూ, రూపంలో వచన కవితా ప్రక్రియ" ను అనుసరించిన కవుల సంకలనంగా సంపాదకత్వం వహించిన శ్రీ కుందుర్తి తెలిపారు. ఇది ప్రధాన ధ్యేయమైనా అభ్యుదయ దృక్పథాన్ని అనుసరించక, కవిత్వానికి మాత్రమే కమిట్ అయిన కవుల కవితలను కూడా ఇందులో చేర్చటం సంపాదకుల విశాల దృక్పథాన్ని వెల్లడిస్తుంది. వందమంది రచనలున్న యీ సంపుటిలోని రచనలన్నీ వచన కవితలే. "సంఖ్యను అయిదు వందలకు పెంచుకో గలిగితేగాని యీ యుగాన్ని పూర్తిగా ప్రతిఫలించడం సాధ్యంకాదు. అయినా ఉన్నంతలో దీనిని సర్వ సమగ్రంగా చేయాలని ప్రయత్నం చేశాం." అంటున్నారు సంపాదకులు. అభ్యుదయ భావుకులై, రసవంతమైన కవిత్వం వ్రాసికూడ యీ సంపుటి కెక్కనివారు కొద్దిమందికాగా, కవిత్వంకాని కేవలం వచనమే వ్రాసి అభ్యుదయ దృక్పథం మాత్రం ఉండి కవిత్వపు ముక్కు మొగ మెరుగని వారూ యిందులో చోటు చేసుకున్నారు. అభ్యుదయ కవిత్వ మార్గంలో ఉత్తమ వచన కవిత వ్రాసిన వారి సంఖ్య వంద మందికే విధంగా చూచినా మించదని యీసంపుటం చదవగానే అనిపిస్తుంది అన్నిరకాలధోరణులను ప్రతిఫలించటానికైనా వంద సంఖ్య తక్కువేమీకాదు- ఎక్కువే. అభ్యుదయ కవిత్వంలో వచ్చిన అన్ని మంచి ధోరణులనూ, రంగు రుచి వాసనలతో సహా యీసంపుటి చక్కగా ప్రతిఫలింప జేస్తున్నది.

ఈ సంకలనంలో మొట్టమొదటగా కనిపించే 'పరిత్యాగి పరివేదన' అజంతా రచన, మొత్తం పుస్తకానికి మకుటాయమానంగా ఉన్నది. "నన్ను నేనే పోల్చుకోలేక నాకు నేనే సహస్ర యోజనాల దూరంలో నిలబడ్డాను. నా వాతావరణం మీద నేనే పొగలాగ వ్యాపించుకుపోయాను" అనే వాక్యాలూ, "సారవంతమైన స్మశానం", "స్వప్నకన్యలు", "గగన కుసుమ సౌరభం" వంటి పదబంధాలూ రసజ్ఞుల నాకట్టుకొంటాయి. "అద్దంలో నా ముఖం చూడటానికే నాకు భయం నా సంతకంలోని అక్షరాలను చూస్తేనే నాకు చెప్పలేనంత భయం" "అంతదాకా ఎందుకు రోడ్డుమీద నా మృత కళేబరాన్ని నేనే లక్షసార్లు చూశాను" ఈ గీతంలోని పాదాలు కవిగా అజంతా ప్రత్యేకతను వేనోళ్ళ చాటుతున్నాయి.

అనిసెట్టి, అవసరాల సూర్యారావు, ఆరుద్ర, కాళోజి, కుందుర్తి, రమణారెడ్డి, గోపాలచక్రవర్తి, గంగినేని, తుమ్మల వెంకట్రామయ్య, దాశరథి, పఠాభి, పురిపండా, తిలక్, రామదాసు, బైరాగి, రెంటాల, వరదారాజేశ్వరరావు, విద్వాన్ విశ్వం, శశాంక, శిష్ట్లా, నారాయణబాబు, శ్రీశ్రీ, నారాయణరెడ్డి, సోమసుందర్ మొదలైన తొలితరం అభ్యుదయ కవుల శ్రేష్ఠమైన రచనలు సంపుటంలో ఉన్నాయి. ఈనాటి పాఠకులకు వీరి రచనలు షడ్రసోపేతమైన విందు చేస్తాయి.

"ఉదయం కానేకాదను కోవడం నిరాశ
ఉదయించి అట్లానే ఉండాలనుకోడం దురాశ" (కాళోజి)

"ఆ కవాటం ఇంక తెరవకు
కిన్నెత్తి చూడను ఋషులను, కాపురుషులను...
ఇప్పుడు నామది మౌన మహతి...
ఇవాళ తెలిసింది జీవితం ఒంటరితనానికి మరో పేరని
నా బరువు నేనే మోసుకుంటూ నడవాలని"

(గోపాల చక్రవర్తి)

"హత్యలు అబద్ధాల మధ్య
జూలు విప్పే తూరుపుకొండ
చూస్తే గుండె ఆగుతుంది" (గంగినేని)

బాల గంగాధర తిలక్ రచన "గొంగళీ పురుగులు", బైరాగి రచన, "నూతిలో గొంతుకలు"... శ్రీశ్రీ రచన, "వ్యత్యాసాలు", రామదాసు "నిష్క్రమణం" వంటి రసవంతమైన రచనలు యీ సంకలనపు విలువను పెంచుతున్నవి.

అభ్యుదయ కవులలో స్తబ్ధత ఏర్పడిన తరువాత మళ్ళీ వచ్చిన మల్లారెడ్డి, సి.వి. సూతలపాటి, శివారెడ్డి వంటి కవుల రచనలు, 'చేతనావర్తం' కావ్యసంపుటులను వెలయించి వచన కవితలో వెలుగును విరజిమ్మిన సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, సంపత్కుమార, వేముగంటి నరసింహారెడ్డి గారల రచనలూ, భీమన్న, శేషేంద్ర శర్మ, అరిపిరాల విశ్వం, వంటి స్వేచ్ఛా జీవుల రచనలూ, విప్లవ కవులలో నగ్నముని, జ్వాలాముఖి నిఖిలేశ్వర్, రచనలూ, దిగంబర కవులలో భైరవయ్య, మహా స్వప్నరచనలూ యింకా సరికొత్తతరానికి చెందిన, కవిత్వానికి మాత్రమే కమిట్ అయిన ఇస్మాయిల్, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ మొదలైన వారి రచనలతో యీ సంపుటం చూడముచ్చటగా ఉన్నది. పూల తోటలో ఏ చెట్టు అందం దానిదే. పువ్వుల వాసనలు, రంగులూ ఒకటిగా ఉండవు. కవితోద్యానవనంలోనూ అంతే. చల్లగా, పరిమళాలు వీస్తూగాలి, అన్ని కిటికీలు తెరచి, అన్ని ఋతుపవనాలనూ ఆహ్వానించవలిసిందే. కవిత్వంలో కాలుష్యం హెచ్చయినదని విజ్ఞులు తలుస్తున్నారు. ఈ కాలుష్య నివారణకు, వ్యక్తి స్వేచ్ఛకు, ఆత్మ వికాసానికి తోడ్పడుతున్న 'తరం తరం' కొన్ని తరాల కవులకు ప్రాతినిధ్యం వహిస్తూ మరి కొన్ని తరాలవరకూ కవితను చైతన్యవంతంగా నింపెదుతుంది.

రసజ్ఞులందరూ తప్పక దగ్గరుంచుకోవలసిన కావ్య సంకలనమిది.

—రామమోహనరాయ్

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

జె. బాపురెడ్డి, "ఉషస్సు", 8-3-224/1/1, యూసఫ్‌గూడా, హైదరాబాద్-45.

శ్రీమతి భండారు సరోజినీదేవి, ఆర్. ఎమ్. పి, ఇంటి నెం. 43-14-3, న్యూ కాలనీ
విశాఖపట్నం-4

కశెట్టి మల్లేశ్వరయ్య, సెక్రెటరీ, జిల్లా ఎన్. జి. ఓ. కల్చరల్ అసోసియేషను.
రెవిన్యూ కాలనీ, అనంతపురం.

వి. యల్. సుందరరావు, ప్రధాన కార్యదర్శి, అఖిల భారత స్వాతంత్ర్య యోధుల సంస్థ,
బాపట్ల.

మహమ్మద్ నవాజ్ అలీ, అధ్యాపకుడు, జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల,
నర్సంపేట-506132.

శ్రీమతి వేదవతీదేవి, "గోకుల్", 41, ఎ. ఐ. సి. కాలనీ, మెహదీపట్నం.
హైదరాబాద్-28

జె. ఎస్. రామకృష్ణ, నిడుమోలు, దివి తాలూకా, కృష్ణా జిల్లా-521156.

రామమోహనరాయ్, 4-5-51, కల్యాణివీధి, చంద్రమౌళినగర్, గుంటూరు-2

తుమ్మల సీతారామమూర్తి, అప్పికట్ల, గుంటూరు జిల్లా.

తులసీరాం, అరండల్‌పేట, 17వ లైను, 3వ అడ్డ రోడ్డు, గుంటూరు.

రేణుశ్రీ, శ్రీ ఎన్. నరసింహమూర్తి, 4/415, రంగాజీవీధి, జార్జిపేట, అనంతపురం.

జి. ఎస్. రామారావు, ఎస్. ఆర్. టి. 270, సనత్ నగర్, హైదరాబాదు-18.

శాయిరాం, చిన్నపడుగు పాడు, కోవూరు, నెల్లూరు జిల్లా.

అందరినీ పలకరించిన అందాల హరివిల్లు

బడుగువర్గాల జీవితాలు పల్లవిస్తున్నతీరు

ఆంధ్రప్రదేశ్‌లో 25 సూత్రాల కార్యక్రమం విజయవంతంగా అమలు జరుగుతూంది

ఆంధ్రప్రదేశ్‌లో 25 సూత్రాల కార్యక్రమం ఉత్సాహంతో, పట్టుదలతో అమలు చేయబడుతున్నది. రాష్ట్రం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లను విజయవంతంగా పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వ శాఖలను, సంస్థలను క్రమబద్ధం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రజలలోని అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి అందజేస్తున్న సహాయ సహకారాలు ముఖ్య కారణాలని చెప్పవచ్చును. ఆంధ్రప్రదేశ్‌లో 1975 నవంబరు 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు, 1976లో అవే తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ ఉత్సవాలు జరిపి ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి దాని అమలు వేగంగా జరగడానికి కృషి జరిగింది. ఈ ఉత్సవాలలో బలహీన వర్గాలకు, స్త్రీలకు, పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యత యివ్వబడింది.

కార్యక్రమం అమలును సమీక్షించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక రాష్ట్ర స్థాయీ సంఘం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఈ కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయి సంఘాలను కూడా ఏర్పాటు చేశారు.

ఆహార ఉత్పత్తిలో పెరుగుదల—ధరల తగుదల

1975–76లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార ధాన్యాల ఉత్పత్తి అత్యున్నత స్థాయిని చేరుకొని 94.28 లక్షల టన్నులు ఉన్నది. 1972 73 సంవత్సరంలో పండించిన 67.08 లక్షల టన్నులతో పోలిస్తే యిది 40 శాతం అభివృద్ధిగా ఉన్నది. అధిక దిగుబడి వంగడాలను ఉపయోగించటంవల్ల, అదనపు ప్రాంతాలకు నీటిపారుదల సౌకర్యాలు విస్తరింపచేయడంవల్ల ఆహారధాన్యాల ఉత్పత్తిలో ఈ పెరుగుదల సాధ్యమైంది.

రాష్ట్రంలో బియ్యం సేకరణ ఎక్కువ చేయబడింది. 1971–72లో బియ్యం సేకరణ 2.61 లక్షల టన్నులు మాత్రమే ఉండగా 1975–76లో యిది 13 61 లక్షల టన్నులకు పెరిగింది. గత సంవత్సరం మన రాష్ట్రం కేంద్ర నిల్వలకు 10 లక్షల టన్నుల బియ్యాన్ని అందించింది.

రాష్ట్రంలోని ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేందుకు 22,000 చౌకధర దుకాణాలు ఏర్పాటు చేశారు. 1975 మార్చి మాసానికి ముందు రాష్ట్రంలో 31 సూపర్ బజార్లు మాత్రమే ఉండగా నేడు 110 సూపర్ బజార్లు మన రాష్ట్రంలో పనిచేస్తున్నాయి. వీటిలో మహిళలు నిర్వహిస్తున్న మహిళా సూపర్ బజార్లు 18 వున్నాయి. హాస్టళ్లలో నివసిస్తున్న దాదాపు 1.40 లక్షల విద్యార్థులకు, 50,000 పారిశ్రామిక కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమంవల్ల లాభం కలుగుతున్నది.

యిటీవల ఏర్పడిన తుఫానులు, దుర్భిక్ష పరిస్థితులవల్ల ముఖ్య ఆహార ధాన్యాల ధరలలో స్వల్పంగా పెరుగుదల కనిపించినా మొత్తం మీద వివిధ వస్తువుల ధరలు అదుపులో ఉంచబడి అత్యవసర పరిస్థితికి ముందుకంటే తక్కువ స్థాయిలోనే వున్నాయి. వంటనూనెల వంటి కొన్ని పదార్థాల విషయంలో ధరల పెరుగుదల చెప్పుకోదగినంతగా ఉన్నది. అందువల్ల రాష్ట్ర పౌర సరఫరా సంస్థ వేరుశనగ నూనె ఖరీదుచేసి వంటనూనెలను ప్రజలకు పంపిణీ చేసే పథకాన్ని చేపట్టింది

రాష్ట్రంలో దొంగ వ్యాపారులు, దొంగ నిల్వదారులు, చీకటి వ్యాపారస్తులపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు తీసుకున్నది. 1975 జూలై నుండి 1976 డిసెంబరు మాసాంతం వరకు 3,227 వ్యక్తులను నిర్బంధములోకి తీసుకొని, రు 2 3 కోట్ల విలువ కలిగిన ఆస్తులను జప్తు చేశారు.

భూములు లేని వారికి భూములు

నూతన భూమి గరిష్ఠ పరిమితి చట్టం క్రింద 4 38,847 డిక్లరేషన్లు దాఖలు చేయబడ్డాయి. వీటిని 93 ట్రిబ్యూనళ్లు పరిశీలించి వాటిల్లో 3.90 597 కేసులను పరిష్కరించాయి. వీటిలో 37 631 కేసులు మిగులు భూములు కలిగినవిగా నిర్ణయించారు. యింతవరకు 8,25,038 యెకరాల భూమిని మిగులు భూమిగా ప్రకటించి దానిలో 1,26,729 యెకరాల భూమిని ప్రభుత్వం వశం చేసుకుంది.

యిప్పటికే 63 013 యెకరాల మిగులు భూమిని 38 640 మంది వ్యక్తులకు పంచిపెట్టారు. వీరిలో 21,000 షెడ్యూల్డు కులాల, 8,000 షెడ్యూల్డు తెగల ప్రజలు చేరి వున్నారు. వీరికి యిచ్చిన మిగులు భూములను వ్యవసాయ యోగ్యం చేయడానికి ఒక సమగ్ర పథకం తయారుచేశారు.

మిగులు భూములను కేటాయించటంతోపాటు దాదాపు 5,00,000యెకరాల భూములను భూస్వాముల నుండి 90,000 మంది

రక్షిత కౌలుదారులకు బదిలీ చేశారు. దాదాపు 22 లక్షల యెకరాల ప్రభుత్వ భూములను భూములులేని పేదలకు పంచిపెట్టారు.

యిండ్లు లేని వారికి యిళ్ళ స్థలాలు

హరిజనులకు, యితర గ్రామీణ బీదలకు యిళ్ళ స్థలాలు కేటాయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది భూమిసేకరణ చట్టాన్ని సవరించి జిల్లా కలెక్టర్లకు వారు సేకరించిన భూములకు నష్టపరిహారాన్ని వాయిదాలలో చెల్లించే అధికారాలను యిచ్చారు.

రాష్ట్రంలో యిండ్ల స్థలాలు అవసరమైన 14 లక్షల కుటుంబాలున్నాయని అంచనా వేశారు. 1976 మార్చి నెలవరకు 6.61 లక్షల కుటుంబాలకు యిళ్ళ స్థలాలు కేటాయించారు. 1975-76 సంవత్సరంలో 21,001 యెకరాలకు మించిన ప్రైవేట్, ప్రభుత్వ భూములను 4.66 లక్షల కుటుంబాలకు యిండ్ల స్థలాలుగా యిచ్చారు. యీ సంవత్సరం 5 లక్షల కుటుంబాలకు యిళ్ళ స్థలాలు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇందుకోసం బడ్జెట్‌లో 1975-76లో కేటాయించిన రూ.2.5 కోట్ల నిధులను 1976-77లో రూ.3.5 కోట్లకు పెంచారు. ఈ సంవత్సరంలో యిప్పటికే 13,100 యెకరాలను యిండ్ల స్థలాలుగా కేటాయించారు. 1977-78 సంవత్సరం ప్రణాళికలో యిందు కోసం మరొక రూ. కోటి అదనంగా కేటాయిస్తారు.

పై కార్యక్రమమేగాక భూముల్లేని రైతులకు, వ్యవసాయ కూలీలకు, గ్రామీణ వృత్తి పనివారలకు మరొక సౌకర్యం చట్ట రీత్యా కలుగజేస్తున్నారు. దీనివల్ల వీరు గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ భూములపై యిండ్లు నిర్మించుకొని వుంటే ఆ స్థలాలు వారికి వశం చేస్తారు. దీనివల్ల 82,000 మంది వ్యక్తులకు లాభం కలుగుతుంది. వీరిలో 50,000 మందికి ఇప్పటికే స్థలాలు వశం చేశారు.

వెట్టిచాకిరీ నుండి విముక్తి

ఆంధ్రప్రదేశ్‌లో వెట్టిచాకిరి విస్తారంగా అమలులో లేదు. అయినప్పటికీ వెట్టిచాకిరికి సంబంధించిన కేసులు తనిఖీ చేసి దానికి గురియైనవారిని విముక్తులను చేయడానికి గట్టి చర్యలు తీసుకున్నారు. వెట్టిచాకిరి గురించి సమాచారం అందించి, ఆ విషయంలో నేరారోపణ రుజువైతే ఆ సమాచారం అందించిన ప్రతి వ్యక్తికి రూ. 100 పారితోషికం యిచ్చే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు యిచ్చారు. కొన్ని జిల్లాలలో ఈ సందర్భంగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేశారు.

ఇంతవరకు వెట్టిచాకిరీకి చెందిన 1,000 కేసులు నమోదు చేయబడ్డాయి. విచారణ తరువాత వీటిలో అధికభాగం నిజమైన కేసులు కాదని తేలింది. వెట్టిచాకిరి నుండి విముక్తి చేయబడిన కార్మికులకు పునరావాస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకొన్నారు. వెట్టిచాకిరి నుండి విముక్తులైన కార్మికులకు వ్యవసాయ భూములు యిండ్ల స్థలాలు మంజూరుచేయడం వారి పిల్లలకు ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యాలు కల్పించడం విషయంలో కలెక్టర్లకు అధికారాలు యిచ్చారు. వారికి మంజూరు చేయబడిన భూములను సాగు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలు యివ్వవలసిందని కలెక్టర్లను ఆదేశించారు. గొర్రెలు, పాడిపశువులు మొదలైనవి ఖరీదు చేయడానికి రుణాలు కూడా మంజూరు చేశారు కొంత మంది వెట్టిచాకిరీ నుండి విముక్తి అయిన కార్మికులకు యితర ఉద్యోగ పథకాల ద్వారా పునరావాసం కల్పించారు.

గ్రామీణ రుణాలపై మారుటోరియం

1975 ఆగస్టు నెలలో జారీ చేసిన ఆర్డినెన్సు వల్ల సన్నకారు రైతులు, భూముల్లేని కార్మికులు గ్రామీణ వృత్తి పనివారలు చెల్లించవలసిన రుణాల వసూలుపై మారుటోరియం విధించారు. దీని ఫలితంగా 22,000 కోర్టు వివాదాలు, 1,400 రుణాల వసూలు పిటీషన్లు నిలుపు చేయబడ్డాయి.

ఇటీవల జారీ చేసిన క్రొత్త ఆర్డినెన్స్‌వల్ల సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తి పనివారలు చెల్లించవలసిన రుణాలన్నీ పూర్తిగా రద్దు చేశారు. ఈ ఆర్డినెన్సువల్ల తాకట్టు పెట్టబడిన వస్తువులు, స్థిరాస్తులు, రుణదాతల నుండి వసూలుచేసి రుణగ్రహీతలకు అప్పగించే ఏర్పాటు జరుగుతుంది.

సహకార సంఘాలద్వారా సన్నకారు, రైతులకు పరపతి కల్పించే సౌకర్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకొంటున్నది. 1974-75 లో రు 42.01 కోట్లు మాత్రమే ఉన్న స్వల్పకాలిక వ్యావసాయిక రుణాల మొత్తం 1975-76 లో రు. 65 95 కోట్లకు పెరిగింది ఈ పెరుగుదల 57 శాతమున్నది. ప్రస్తుత సంవత్సరంలో రు. 100 కోట్లు స్వల్ప కాలిక రుణాలకోసం కేటాయించారు, ఖరీఫ్ తరుణంలో దీనిలో రు. 72.46 కోట్లు పంచి పెట్టారు. రబీ తరుణంలో రు. 30 కోట్ల రుణాలు అందజేస్తారు.

సహకార పరపతి పొందేవారిలో సన్నకారు, లాభసాటికాని రైతులభాగం పెరుగుతున్నది. 1975-76 లో 46% మాత్రమే ఉన్న ఈ భాగం 1976 ఖరీఫ్‌లో 55 శాతానికి పెరిగింది. రాబోయే నెలలో యిది యింకా పెరిగే సూచనలున్నాయి.

సహకార సంఘాల చట్టం సవరించారు దీనివల్ల గ్రామీణ ప్రాంతాలలో సహకార సంఘాల మేనేజింగ్ వ్యవస్థలలో షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల, యితర బలహీనవర్గాల ప్రతినిధులు 50 శాతానికి తక్కువ కాకుండా ఉండే వీలు కలుగుతుంది.

సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలు రాష్ట్రంలోని 16 జిల్లాలలో ఏర్పాటు చేశారు. వీటివల్ల సన్నకారు, లాభసాటి కాని రైతులు, వ్యవసాయ కూలీలకు లాభం కలుగుతుంది. 1976 నవంబరు మాసాంతం వరకు ఈ సంస్థలు రు. 7 కోట్ల నిధులను రైతులకు, వ్యవసాయ కూలీలకు సబ్సిడీలుగా అందజేసింది. మరొక రు. 21 65 కోట్ల మొత్తాన్ని ఆర్థిక సంస్థల ద్వారా రుణాలుగా వీరికి అందజేశారు. ఈ సంస్థలు చేపట్టిన కార్య క్రమాలలో '8,300 బావులను

త్రవ్వటం అభివృద్ధి చేయటం, నీటి పారుదలకొరకు 2,100 బావులను త్రవ్వటం, 4,200 పంపుసెట్లను సరఫరా చేయడం 16,100 పాడిపశువులను, 11,000 గొర్రెలను, 4,500 జతల కాడెద్దులను సరఫరా చేయడం చేరివున్నాయి.

రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన వర్గాలు, మహిళలకు ఆర్థిక సహాయ కార్యక్రమాలు అమలుచేసే ఉద్దేశంతో మన ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లను స్థాపించింది. వాణిజ్య బ్యాంకులు మొదలైన ఆర్థిక సంస్థలద్వారా ఈ వర్గాల ప్రజలకు ఆర్థిక సహాయం అందజేస్తాయి. ఇప్పటివరకు 1.5 లక్షల బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు లాభం కలిగే విధంగా రు. 25 కోట్ల ఖర్చుకాగల ఆర్థిక సహాయ కార్యక్రమాలను ఈ కార్పొరేషన్లు చేపట్టాయి. ఈ కార్యక్రమాలలో నీటిపారుదల, బావుల త్రవ్వకం, అభివృద్ధి, పాడిపశువుల సరఫరా, పాడిపరిశ్రమ యూనిట్ల స్థాపన, పందుల పెంపకం, కోళ్ల పెంపకం పథకాల స్థాపన, సైకిల్ రిక్షాల పంపిణీ, ఇతర రకాలైన ఉద్యోగ కల్పన, వ్యాపార పథకాలు చేరి వున్నాయి.

వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు

వ్యవసాయ కూలీల కనీస వేతనాలను 1975 డిసెంబరులో సవరించి పెంచారు. సవరించబడిన రేట్ల ప్రకారం వయోజన వ్యవసాయ కూలీకి రు. 900 నుండి రు. 1400 వరకు ఆయా జోనుల ప్రకారం చెల్లిస్తారు. రోజువారీ పనిచేసే కూలీలకు రు. 3 నుండి రు. 5 వరకు కూలీ చెల్లిస్తారు. పురుషులకు, స్త్రీలకు సమాన వేతనాలు చెల్లిస్తారు.

కనీస వేతనాలను అమలు చేసేందుకు, వాటి అమలును పర్యవేక్షించేందుకు జిల్లా కార్మిక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులను, యితర అధికారులను ఆదేశించారు.

సాగులో ఎక్కువ భూమి

నీటిపారుదల సౌకర్యాలను అధికం చేయటానికి ఆంధ్రప్రదేశ్‌లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద 5వ పంచవర్ష ప్రణాళిక కాలంలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులద్వారా 4.6 లక్షల హెక్టార్ల భూమికి అదనంగా నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. దీనికితోడు మరొక 2.4 లక్షల హెక్టార్లభూమిని క్రొత్తగా నీటి పారుదల సౌకర్యం క్రిందికి తేవడం లేక చిన్నతరహా నీటి పారుదల పథకాల క్రింద నీటిపారుదల సౌకర్యాలను స్థిరీకరించడం కూడా జరుగుతుంది.

రాష్ట్రం యొక్క ప్రణాళికలో నీటిపారుదలకొరకు పెట్టుబడి 1973-74 లో ఉన్న రు. 21.61 కోట్ల నుంచి 1976-77 లో రు. 80 కోట్లకు పెంచారు. 1977-77 సంవత్సరంలో ఈ మొత్తం రు. 107.15 కోట్లు ఉంటుంది. 1977-78 వార్షిక ప్రణాళికలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ఖర్చు పెట్టేరు. 37.5 కోట్లు 1974-75 వార్షిక ప్రణాళికలో మొత్తం నీటిపారుదల సౌకర్యాలపై ఖర్చుపెట్టిన నిధులను మించిపోతుంది.

ఐదవ ప్రణాళిక మొదటి రెండు సంవత్సరాల కాలంలో భారీ, మధ్యతరహా పథకాల ద్వారా 71,000 హెక్టార్ల భూమికి నీటి పారుదల సౌకర్యాలు కలిగించారు. ఇదే కాలంలో చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 78,000 హెక్టార్ల భూమికి కొత్తగా నీటిపారుదల సౌకర్యాలు కలిగించడం, లేక స్థిరీకరించడం జరిగింది. 1976-77లో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 1.24 లక్షల హెక్టార్ల భూమికి, చిన్నతరహా ప్రాజెక్టుల క్రింద 64,000 హెక్టార్ల భూమికి నీటి పారుదల సౌకర్యాలు కల్పిస్తారు. 1977-78 సంవత్సరంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 90,000 హెక్టార్ల భూమికి, చిన్నతరహా ప్రాజెక్టుల క్రింద 49,300 హెక్టార్ల భూమికి నీటి పారుదల సౌకర్యాలు కల్పిస్తారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, భూగర్భ జలాల ఉపయోగార్థం గొట్టపుబావుల నిర్మాణం చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ స్థాపించింది. వివిధ ప్రాజెక్టుల కమాండు ఏరియాలు సత్వరం అభివృద్ధి చెందేందుకు సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టే ఉద్దేశంతో కమాండు ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేకంగా స్థాపించారు. యిందుకొరకు ఒక ప్రత్యేక చట్టం చేసే ఉద్దేశమున్నది.

సౌభాగ్యానికి విద్యుచ్ఛక్తి

రాష్ట్రంయొక్క ఉపయోగార్థమేగాక దేశంలోని దక్షిణ ప్రాంతానికికూడా లాభించేందుకు అవసరమైన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా ఉన్నాయి. ప్రణాళికలలో విద్యుచ్ఛక్తి ఉత్పాదనకోసం కేటాయించిన నిధులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. 1973-74 లో విద్యుచ్ఛక్తికి కేటాయించిన నిధులు రు. 45 కోట్లు ఉండగా 1976-77 లో అవి రు. 111 కోట్లకు పెరిగాయి. 1977-78 వార్షిక ప్రణాళికలో విద్యుచ్ఛక్తి కోసం రు. 140 కోట్లు కేటాయించారు.

5వ ప్రణాళిక ప్రారంభంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన శక్తి 668 మెగావాట్లు ఉన్నది. 5వ ప్రణాళిక కాలంలో యిప్పటి వరకు దీనిని 1,118 మెగావాట్లకు పెంచారు. 5వ ప్రణాళిక అంతానికి మరొక 940 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన శక్తి దీనికి కల్పుతారు. దీనివల్ల 5వ ప్రణాళిక అంతానికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన శక్తి 2,000 మెగావాట్లు అవుతుంది అనగా 5వ ప్రణాళికా కాలంలో విద్యుత్ ఉత్పాదనశక్తి మూడు రెట్లు పెరుగుతుంది.

1976 డిసెంబరు మాసాంతానికి విద్యుదీకరణ పొందిన గ్రామాల సంఖ్య 12,560 ఉన్నది. అత్యవసర పరిస్థితి ప్రకటించిన తరువాత 2,097 గ్రామాలకు, 216 కుగ్రామాలకు విద్యుదీకరణ లభింపచేశారు. ఒక ప్రత్యేక కార్యక్రమం క్రింద 2,600 హరిజన వాడలకు విద్యుదీకరణ లభించింది. విద్యుత్ సరఫరా పొందిన పంపుసెట్ల సంఖ్య 2.94 లక్షలకు పెరిగింది. కేంద్ర రంగంలో రామగుండంవద్ద ఒక సూపర్ థర్మల్ కేంద్రాన్ని పెస్తారు.

చేనేత కార్మికులకు నూతన పథకాలు : కోట్లాది మంది ప్రజలకు వస్త్రాలు

రాష్ట్రంలో సహకార రంగంలోనూ, వెలుపల ఉన్న చేనేత పరిశ్రమను పునరుజ్జీవింపచేసి అభివృద్ధి చెందించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ సంవత్సరాంతానికి 3,00,000 చేనేత పనివారు సహకార రంగంలో సభ్యులుగా చేరుతారని ఆశిస్తున్నారు. పనిచేయకుండా ఉన్న 169 చేనేత సహకార సంఘాలను పునరుద్ధరించడంద్వారా 20,000 చేనేత పనివారికి పని కల్పించడం జరిగింది.

ఎగుమతులకు అనువైన చేనేత వస్త్రాలను ఉత్పత్తిచేసే ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించారు. యిటువంటి వస్త్రాలను ఉత్పత్తిచేసే మగ్గాల సంఖ్య గతంలో 30,000 మాత్రమే ఉండగా అది ప్రస్తుతం 65,000 లకు పెరిగింది. ఈ వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్న చేనేత పనివారు గతంలో 5 నుంచి 8 రూపాయల వరకు సంపాదించుచుండెడివారు. ప్రస్తుతం వారి సంపాదన రు. 15 నుండి రు. 20 వరకు యున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జౌళి అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 3,000 మంది చేనేత పనివారలు పని చేసే 9 ఉత్పత్తి కేంద్రాలను స్థాపించింది. 5 జిల్లాల్లోని 11,000 మంది చేనేత పనివారలకు లాభించే మరొక రెండు క్రొత్త పథకాలు చేపట్టారు. వీనిలో ఒకటి చేనేత పరిశ్రమ సమగ్రాభివృద్ధికోసం మరొకటి ఎగుమతిచేసే వస్త్రాల ఉత్పత్తి కేంద్రాల కొరకు ఉద్దేశింపబడ్డాయి. కంట్రోలు రకాలకు చెందిన చీరెలు, ధోవతుల ఉత్పత్తి చేనేత రంగానికి అప్పగించారు. రాష్ట్రంలోని 1,000 చేనేత సంఘాలు, 8,000 మగ్గాలపై కంట్రోలు రకాలకు చెందిన చీరెలను, ధోవతులను ఉత్పత్తి చేస్తున్నాయి. యింతవరకు రెండు లక్షల మీటర్ల కంట్రోలు వస్త్రం ఉత్పత్తి చేయబడి మార్కెట్టు లోకి విడుదల చేయబడింది. 1977 మార్చి నాటికి కంట్రోలు వస్త్రం ఉత్పత్తి 5 లక్షల మీటర్లను చేరుకోవచ్చును.

రాష్ట్ర వినియోగదారుల సహకార ఫెడరేషన్ ప్రతి నెల సూపర్ బజారు, మార్కెటింగ్ సంఘాలు, సహకార సంఘాల ద్వారా బలహీన వర్గాల ప్రజలకు 3,894 బేళ్ళ కంట్రోలు వస్త్రాన్ని పంచిపెడుతున్నది.

పట్టణ స్థలాలపై గరిష్ఠ పరిమితి

పట్టణ స్థలాల గరిష్ఠ పరిమితి చట్టం క్రింద యింతవరకు 20,000 ప్రకటనలు యిందుకు సంబంధించిన అధికారులముందు దాఖలు చేయబడ్డాయి. వీటిని పరిశీలిస్తున్నారు. పారిశ్రామిక వ్యవస్థలు, సినిమా స్టూడియోలు మొదలైనవి పట్టణ స్థలాలు పొంది ఉండడానికి అనుమతులను యిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నది.

పన్నుల ఎగవేత నిరోధము

స్టాంపు డ్యూటీ విషయంలో ఆస్తుల విలువలను తక్కువగా చూపించి పన్నులు ఎగవేసే అవకాశం ఎక్కువగా ఉన్నది. 1975 ఆగస్టు నెల నుండి అమలులోకి వచ్చిన స్టాంపుల చట్టం సవరణవల్ల ఆస్తియొక్క నిజమైన విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ వసూలు చేసే సౌకర్యం కలుగుతుంది. రాష్ట్రానికి చెందిన యితర పన్నులను, డ్యూటీలను ఎగవేయకుండా కఠినమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. విద్యుచ్ఛక్తిని దొంగతనంగా వాడుకోకుండా చూడటంకోసం విద్యుచ్ఛక్తి బోర్డు ప్రత్యేక చర్యలను తీసుకొంటున్నది. విద్యుచ్ఛక్తిని దొంగతనంగా వాడుకొనేవారిని పట్టుకొని శిక్షలు విధించడానికి 7 ప్రత్యేక దళాలను బోర్డు ఏర్పాటు చేసింది.

దొంగరవాణాదారుల ఆస్తుల జప్తు

ఆర్థిక నేరాలను నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో పూర్తిగా సహకరిస్తున్నది. పారిశ్రామిక వ్యవస్థను నమోదు చేయడానికి, కొరతగా ఉన్న ముడిపదార్థాల ఉపయోగానికి ఆదేశిక సూత్రాలు జారీ చేశారు. 1976 విదేశీ మారక ద్రవ్య అక్రమ వాడకందారుల (ఆస్తి జప్తు) చట్టం క్రింద దొంగరవాణాదారుల స్థిరాస్తులను జప్తు చేయడానికి రాష్ట్రప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు తగిన సూచనలు జారీ చేసింది.

పరిశ్రమల యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం

ప్రారంభంలో సూచించినట్లుగా 500 లకు మించి కార్మికులున్న పారిశ్రామిక వ్యవస్థలేగాక 300 లకు మించి కార్మికులున్న వ్యవస్థలన్నిటినీ ఈ పథకంక్రిందికి తీసుకురావాలని నిశ్చయించారు. ఈ పథకం క్రిందకు వచ్చే ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 210 పారిశ్రామిక వ్యవస్థలలో 127 వ్యవస్థలలో యింతవరకు కార్మికులతో కూడిన యాజమాన్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. మిగిలిన వ్యవస్థలలో కూడా యిందుకొరకు చర్యలు తీసుకోవలసినదని కోరటం జరిగింది.

రోడ్డు రవాణాకు జాతీయ పర్మిట్లు

మన రాష్ట్రానికి కేటాయించబడిన 250 జాతీయ పర్మిట్లను అన్నింటిని రాష్ట్ర రవాణా అధికార సంస్థ జారీ చేసింది. వీటిలో 219 పర్మిట్లను మాత్రమే రవాణాదారులు సకాలంలో పొందారు. సకాలంలో పొందనటువంటి మిగతా 31 పర్మిట్లను రద్దు చేశారు. ఈ విషయంలో వచ్చిన అప్పీళ్ళను ట్రిబ్యునల్ పరిష్కరించిన తరువాత ఈ 31 పర్మిట్లను తిరిగి క్రొత్తవారికి జారీ చేస్తారు

మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపు పన్నులో ముదరా

మధ్యతరగతి ప్రజలు ఆదాయపు పన్ను చెల్లించవలసిన సగటు ఆదాయం సాలుకు రు. 8,000 కు పెంచబడింది.

చౌకధరలకు నిత్యావసర వస్తువులు

నిత్యావసర వస్తువులయిన బియ్యం, గోధుమ, చక్కెర రాష్ట్రంలోని 2,236 హాస్టళ్లకు చౌకధరలలో సరఫరా చేస్తున్నారు. ఈ కార్యక్రమంవల్ల 1.42 లక్షల విద్యార్థులకు లాభం కలుగుతున్నది. వీరిలో 44,000 షెడ్యూల్డు కులాల, 22,000 షెడ్యూల్డు తెగల విద్యార్థులు చేరివున్నారు. రాష్ట్రంలో జరిపిన శాంపిల్ సర్వేవల్ల 1976 జూలై నెలతో పోలిస్తే భోజనం ఖర్చు హాస్టళ్లలో నెలకు రు. 10 నుండి రు. 20 వరకు తగ్గినట్లు తేలింది.

పాఠ్యపుస్తకాల జాతీయకరణ

ప్రాథమిక, సెకండరీ పాఠశాలల పాఠ్యపుస్తకాలు జాతీయం చేశారు. 1974 నుండి పంచిపెట్టబడిన పాఠ్యపుస్తకాల సంఖ్య 40 శాతం పెరిగింది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడినవర్గాల విద్యార్థులకు రు. 28 లక్షల విలువగల జాతీయం చేయబడిన పాఠ్యపుస్తకాలు ఉచితంగా సరఫరా చేశారు. ఈ విధంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను సరఫరా చేసే పథకం 1976–77లో 100 శాతం చేరుకున్నది. విద్యార్థులకు నోట్ పుస్తకాలు కంట్రోలు రేటుకు సరఫరా చేసే ఏర్పాట్లు సంతృప్తికరంగా కొనసాగుతున్నవి.

పాఠశాలలలో యింతవరకు 8,100 బుక్ బ్యాంకులు ఏర్పాటు చేశారు. దీనితోడు 71 కళాశాలల్లోనూ, 104 జూనియర్ కళాశాలల్లోనూ బుక్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగింది.

అప్రెంటీస్‌షిప్ పథకం

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ప్రకటించేముందు 1,798 మంది అప్రెంటీసులు మాత్రమే శిక్షణను పొందుతుండేవారు. తర్వాత ఈ కార్యక్రమాన్ని విస్తరించటం వల్ల రాష్ట్రానికి కేటాయించిన 5,402 స్థానాలలో ప్రస్తుతం 5,409 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ పొందుతున్న అప్రెంటీస్‌లలో 471 షెడ్యూల్డు కులాల, 55 షెడ్యూల్డు తెగల అభ్యర్థులున్నారు. ఈ అప్రెంటీస్‌లలో 1,635 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు. కేంద్ర రంగంలో కేటాయించిన 4,079 స్థానాలలో 4,058 మంది అప్రెంటీస్‌లు శిక్షణ పొందుతున్నారు.

5 సూత్రాల కార్యక్రమం, కుటుంబనియంత్రణ

ఆంధ్రప్రదేశ్‌లో 1976–77 సంవత్సరంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల లక్ష్యాన్ని నాలుగు లక్షలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లక్ష్యాన్ని నవంబరు 15వ తేదీకే సాధించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న ఆరు లక్షల శస్త్రచికిత్సల నూతన లక్ష్యం డిసెంబరు 15వ తేదీకి సాధించడం జరిగింది. జనవరి 8వ తేదీ నాటికి శస్త్రచికిత్సల సంఖ్య 6.56 లక్షలను దాటిపోయింది.

గ్రామీణ ప్రాంతాలలో కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు జరిపే ఆపరేషన్ థియేటర్లలో సౌకర్యాలను అభివృద్ధి చేయటం కోసం రాష్ట్ర ప్రభుత్వం రు. 41.14 లక్షలు మంజూరు చేసింది.

ప్రభుత్వోద్యోగులు కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలను చేయించుకొనడానికి, యితర కుటుంబనియంత్రణ విధానాలను అనుసరించడానికి కొన్ని ప్రోత్సాహక చర్యలు ప్రకటించారు.

అక్షరాస్యతకు చర్యలు

అక్షరాస్యత వ్యాపింపచేసే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని 10 జిల్లాలలో రైతుల వృత్తిసంబంధమైన అక్షరాస్యత కార్యక్రమాన్ని, రెండు జిల్లాలలో సాంప్రదాయేతర విద్య కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. వయోజన విద్య కార్యక్రమాలను సక్రమంగా నడిచేట్లు చూడటానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు.

వరకట్న వ్యతిరేక చర్యలు

కట్నం యివ్వడాన్ని, తీసుకోవడాన్ని నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం 1961లో చేసిన వరకట్న నిషేధ చట్టం ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్నది. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేసే ఉద్దేశ్యంతో దానికి కొన్ని సవరణలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. స్త్రీల ఆస్తిపాస్తులకు చెందిన చట్టాలలో కూడా కట్నం తీసుకోవడాన్ని నిరుత్సాహపరచే ఉద్దేశ్యంతో కొన్ని మార్పులు సూచించడం జరిగింది.

చెట్లునాటే కార్యక్రమం

ఆంధ్రప్రదేశ్‌లో చెట్లునాటే కార్యక్రమాన్ని 1976 జూలై నెలలో పెద్దయెత్తున చేపట్టారు. పార్కులలోనూ, బంజరు భూములలోనూ, రోడ్లవెంబడి, గృహ ఆవరణలలోనూ నాటేందుకు 23 లక్షల మొక్కలను ప్రభుత్వ కార్యాలయాలకు, సంస్థలకు, ప్రజలకు పంచిపెట్టారు. 1977లో 40 లక్షల మొక్కలను పంచిపెట్టే ఉద్దేశమున్నది.

కుల నిర్మూలన

కులాంతర వివాహాలను ప్రోత్సాహపరచే ఉద్దేశంతో వివాహం చేసుకొనే దంపతులలో ఒకరు షెడ్యూల్డు కులానికి చెందినచో రు. 1,000 పారితోషికాన్ని, దంపతులలో ఒకరు వెనుకబడిన కులాలకు చెందివుంటే రు. 500 పారితోషికాన్ని యిచ్చే కార్యక్రమం అమలు జరుగుతున్నది. ఇందుకోసం ఈ సంవత్సరం రు. 8 లక్షలు కేటాయించారు.

సామాన్యుల విజయగాథలు

పోతవరం గ్రామ హరిజనుల ఆదర్శం

ఒంగోలు తాలూకా పోతవరం గ్రామంలోని హరిజనులకు ప్రధాని 20 అంశాల ఆర్థిక ప్రణాళిక క్రింద చేయూత యిచ్చే ఒక పథకం ఒంగోలు సెంట్రల్ బ్యాంకువారు తయారుచేశారు. ఈ పథకం నిర్వహణకు షెడ్యూలు కులాల ఆర్థిక సహాయ సంస్థ, చిన్న తరహా వ్యవసాయదారుల అభివృద్ధి సంస్థలు కూడా సహాయపడ్డాయి.

ఈ పథకానికి 1 లక్ష 68 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. దీనివల్ల 48 మంది హరిజనులు పాడి గేదలు కొనుక్కొని తమ ఆర్థిక పరిస్థితులను పెంపొందించుకోటానికి అవకాశము ఏర్పడింది. రెండు సార్లు పాడిగేదెల సరఫరాకు మేతకొనుగోలుకు నిధులు కేటాయించారు. సెంట్రల్ బ్యాంకువారు మొదటి దఫా వాయిదాగా రు 80,000 అప్పు మంజూరు చేశారు 48 మంది హరిజనులు పాడిగేదెలను, వాటికి అవసరమైన దాణా మొదలగు వాటిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పశువుల ఎన్నికకు, పశువులలో వ్యాధులు రాకుండా చేయటానికీ స్థానిక లైవ్ స్టాక్ ఆఫీసరు తమ సహాయాన్ని అందజేశారు. రోగ నిరోధక చర్యలు తీసుకున్నారు. యునైటెడ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్సు కంపెనీవారు ఈ పశువులకు భీమా పథకం ఏర్పాటు చేశారు. ఈ భీమా పథకం క్రింద ఒక్కొక్క గేదెకు 60 రూపాయలు ప్రీమియం కట్టవలసి వుంటుంది. ఇందువల్ల ఇటు పశువు సొంతదారుకుగాని, అటు ఆర్థిక సహాయం చేసిన సంస్థకుగాని నష్టమురాదు. బ్యాంకువారు ఒక్కొక్క గేదె కొనుగోలుకు రూ. 1,500 మంజూరు చేశారు. కాని 8 మంది హరిజనులు సుమారు రు. 2000 విలువచేసే పాడి పుష్టిగల మంచి గేదెలను కొనుక్కున్నారు.

ఇదే గ్రామంలో కొన్ని నెలలుగా ఒక పాల సేకరణ కేంద్రం నడుపుకుంటున్నారు. ఇదొక అదృష్టంగా భావించి హరిజనులు యీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీ డాకా వెంకట్రామిరెడ్డి చేయూతనిచ్చారు. గ్రామం నుంచి యిప్పటి వరకు హరిజనులకు పాల ఉత్పత్తికిగాను 3 సార్లు డబ్బు బట్వాడా యివ్వటం జరిగింది. రెండు వాయిదాల క్రింద సుమారు 4000 రూపాయలు తిరిగి జమకట్టారు

వీరు కొన్న గేదెలు ఆరులేక ఎనిమిది నెలలపాటు పాలు యిస్తాయి. రోజుకు సగటున [illegible] లీటర్లు పాలు యిస్తున్నాయి. ఈ గేదెలు వట్టిపోయిన తరువాత అంటే 8 నెలల తరువాత రెండవ దఫా వాయిదా డబ్బు సెంట్రల్ బ్యాంకు వారు హరిజనులకి ఇస్తారు.

—శ్రీ పోరూరి నాగేశ్వరరావు

పొదిలి తాలూకా అభ్యుదయం

పొదిలి తాలూకా ప్రాంతం మొత్తం రాష్ట్రంలో మరీ వెనుకబడిన తాలూకాలలో ఒకటి. ఈ ప్రాంతం పూర్తిగా వర్షాధారంగా యున్నది ఈ తాలూకాలో మొత్తం అన్నికాలాలైన నీటివనరులతో 6,000 ఎకరముల భూమిలో మాత్రమే వరి పండుచున్నది.

పొదిలి తాలూకాలోనిది గుండ్ల సముద్రం. ఇచ్చటి 63 హరిజనుల కుటుంబములవారికి 1971 సంవత్సరములో రైతాంగము వద్ద నుండి 5 ఎకరాల భూమిని రు. 6000 లకు కొని నివేశన స్థలములను యిచ్చారు. మరుసటి సంవత్సరం రు. 1 34,000 లతో గృహ నిర్మాణం జేసినారు ఒక మంచి నీటి బావిని త్రవ్వించినారు. ఈ కాలనీలో అవసరమైన మట్టి రోడ్లు మురుగు కాలువలను యేర్పాటుచేసినారు. ఒక పాఠశాల కూడా తెరువబడినది.

ఈ కాలనీ హరిజనుల ఆర్థిక పరిస్థితిని పెంపొందించుటకు సాంఘిక సంక్షేమశాఖవారు 1974 సంవత్సరంలో 15 మందికి పాడిపశువులను 50% సబ్సిడీతో సుమారు రు. 17,600 లకు సరఫరా చేసినారు.

ప్రకాశం జిల్లా షెడ్యూలు కులాల ఆర్థికసంస్థ వారిద్వారా పొదిలి స్టేట్ బ్యాంకువారు లోగడ పాడిపశువులను యివ్వగా మిగిలిన 48 కుటుంబముల వారికి యీ సంవత్సరం ఒక్కొక్కనికి రు. 700 ల చొప్పున రూ. 33 600 లను అప్పుగా మంజూరు చేసి, పాడిపశువులను సరఫరా చేసినారు.

—శ్రీ బి. రామారావు

నవచైతన్యంలో నందనవనము

ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా ఉలవపాడు సమితిలో నందన వనం ఒక చిన్న గ్రామం. గ్రామ జనాభా 1993. ఈ గ్రామం కలకత్తా – మద్రాసు జాతీయ రహదారిలో శింగరాయకొండకు 9 కిలోమీటర్ల దూరంలో వున్నది పంచాయతీసమితి వారు యీ మధ్యనే రోడ్డు వేశారు. బస్సు సౌకర్యం లేదు. ప్రాథమిక పాఠశాల కలదు రైతాంగానికి మెట్ట సేద్యం వర్షనీయా పొలాలు ముఖ్యాధారం.

యువకులు గ్రామాభివృద్ధి కొరకు 197[illegible] లో సంఘంగా ఏర్పడ్డారు సంఘం పేరు "శివాజీ యువజన సంఘం" ఆదర్శానికి మారుపేరైన శివాజీ పేరిట వున్న యీ యువజన సంఘం [illegible]జంగా

అభినందనీయులు. సంఘ ముఖ్యోద్దేశం గ్రామాభివృద్ధి, హరిజన సంక్షేమం, నిరక్షరాస్యత నిర్మూలన గ్రామ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కార్యక్రమం వారి ప్రథమ కార్యక్రమం అప్పర్ ప్రయిమరీ పాఠశాలగా నెలకొల్పుటకు ప్రయత్నాలు జరుగుచున్నవి. సంఘం అధ్యక్షుడు శ్రీ కోనూరి వెంకట సుబ్బయ్య నిరక్షరాస్యత నిర్మూలనకు వయోజన విద్యాకేంద్రం ప్రారంభించారు. పెద్దలకు ఉచితంగా పలకలు పుస్తకాలు యిచ్చి వయోజన విద్యా కేంద్రాన్ని నడుపు చున్నారు. రైతాంగం ఆధునిక పద్ధతుల కొరకు గ్రామీణ రేడియో గోష్టి సంఘం ప్రారంభించి చర్చల రూపంగా ఆధునిక పద్ధతులు తెలుపుతున్నారు గ్రామీణ ఆటలు ప్రోత్సహించుటకు ప్రతి సంవత్సరం తాలుకా, జిల్లా సాయిలో ఆటల పోటీలు నిర్వహించుచున్నారు.

సంఘ ముఖ్యోద్దేశమైన బలహీన వర్గాల అభివృద్ధి కార్యక్రమం క్రింద హరిజన ఆది ఆంధ్రులకు యిండ్ల స్థలాలు కల్పించ గలిగారు శ్రమదానం ద్వారా గ్రామంలోని వీధులు బాగుచేసారు. ఒంగోలు వి. వి. యం. కళాశాల జాతీయ సేవాదళ విద్యార్థులతో కలసి యింతకు పూర్వం గ్రామాన్ని చేరుకొను రోడు మరమ్మతు పని శ్రమదానంతో చేసారు 6-1-77 నుండి హరిజన ఆది ఆంధ్ర వాడలలోని వీధులకు ముఖ్య వసతి కల్పించుటకు ఒంగోలు వి. వి. యం. కళాశాల జాతీయ సేవాదళ విద్యార్థుల సహకారంతో శ్రమదానం నిర్వహించారు.

గ్రామాభివృద్ధి కార్యక్రమానికి యువతరం పూనుకొన్న ఈ నందనవనం 2, 3 సంవత్సరాలలో పేరుకు తగినట్లు "నందనవనం" గా జేయాలని ఆకాంక్ష.

—శ్రీ బి. ఆర్. నాయుడు

బాపట్ల తాలుకా

చీరాలకు దాదాపు 3 కిలో మీటర్ల దూరంలోని ఈపురుపాలెంలో "ఆదినారాయణ పురం" అనే సెటిలర్స్ (పాత నేరస్థుల) గ్రామం ఉన్నది వీరి పునరావాస కార్యక్రమంలో భాగంగా ఈపూరుపాలెం బీడీ పరిశ్రమ సాంకేతిక సహకార సంఘంలో వీరికి శిక్షణ ఇవ్వడానికి ఒక పథకం రూపొందించారు ఈ పథకానికి కడచిన జనవరి 21 వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పి రంగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

ఆదినారాయణపురంలోని ప్రజను "పాతనేరస్తులు" అంటున్నారు. కాని అదిసరికాదు నేరాలు చేసినది వీరుకాదు వీరి పూర్వీకులు చాలా కాలం క్రిందట సంఘవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొని శిక్షలు అనుభవించినవారందరికీ—ఈ ఊరిలో పునరావాసం కల్పించారు. అయితే ప్రస్తుతం వారెవరూ ఈ గ్రామంలో లేరు. ఇప్పుడున్నవారంతా—వారిసంతతి వారికి పునరావాస కార్యక్రమాలు, ఉపాధి కల్పన ప్రయత్నాలు ఎంత అవసరమో వారిలో మానసిక పరివర్తన కలగ జేయడంకూడ అంతే అవసరం.

ఈపూరుపాలెం బీడీ పరిశ్రమ సాంకేతిక సహకార సంఘాన్ని 1975 జూన్ 5 న సాపించారు. తొలిదశలో 15 మంది సభ్యులతో ఈ సంస్థ ప్రారంభ మయినది సభ్యులషేరుధనం రూ 4800 లకాగా సిండికేట్ బ్యాంక్ రూ. 4200 లు ఆర్థిక సహాయంచేసింది 14-20 సంవత్సరాల వయస్సులోని షెడ్యూలు తెగల, జాతుల స్త్రీ. పురుషులకు బీడీ తయారీలో శిక్షణపొందిన యువతీయువకులకు ముడి సరుకులు సరఫరాచేసి వారు కట్టిన బీడీలకు వెయ్యికి 5 00 రూపాయల చొప్పున వేతనంగా ఇచ్చి వారి ఉపాధి కల్పనకు తోడ్పాటు అందివ్వడం ఆశయంలో ఒక ముఖ్యమైన అంశం

ఈ కార్యక్రమానికి అనతి కాలంలోనే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి పనిప్రారంభించడానికి ఆసంఘం నిశ్చయించింది. అదే సమయంలో—ఆదినారాయణపురం "సెటిలర్స్" కు బీడీ తయారీలో శిక్షణ ఇవ్వాలని ప్రకాశం జిల్లా పరిశ్రమల శాఖ నిర్ణయించింది 80 మంది సెటిలర్స్‌ను అభ్యర్థులుగా ఎన్నుకొన్నది. శిక్షణ వ్యయం క్రింద రూ 30,000 లు మంజూరుచేశారు ఎన్నిక చేసిన 80 మందిని 2 జట్లుగా విభజించారు. మొదటి జట్టుకు శిక్షణ ఇవ్వడం పూర్తయింది ప్రస్తుతం రెండవజట్టు బీడీ తయారీలో శిక్షణ పొందుచున్నది. శిక్షణకాలంలో ప్రతిఅభ్యర్థికి రూ. 50 స్టయిఫండ్ ఇస్తారు.

మొదటి జట్టులో శిక్షణపొందిన వారిలో వెంకటేష్, రావమ్మ అనే ఇరువురుగలరు. బీడీలు తయారుచేయుటయే వీరి ప్రస్తుత జీవనోపాధి. వీరు రోజు ఒక్కింటికి 800ల నుండి 1200 బీడీ చుట్టగలుగు చున్నారు. అనగా రోజుకు ఒక్కొక్కరు 6-00 సంపాదించేశక్తి పొందినారు. క్రమేపి తేలికగా 2000ల బీడీలు చుట్టగలమని ఆశాభావం వ్యక్తపరిచినారు.

ప్రభుత్వం చేపట్టిన పునరావాస కార్యక్రమము విజయవంతమైనదనుటకు ఇదియే తార్కాణము.

—శ్రీ కె. సాంబిరెడ్డి

హుజూర్‌నగర్ తాలూకా

నల్లగొండ జిల్లా హుజూరునగరు తాలూకా గడ్డిపల్లి గ్రామం నాగార్జునసాగరు లాల్‌బహద్దూరు కాలువ ప్రక్కనవుండి నీటి సౌకర్యమును పొందలేదు. గడ్డిపల్లి, లింగాల, దూపాడు గ్రామాలతో చిన్న కమతాలు కల్గిన హరిజన, వెనుకబడిన కుటుంబాలున్నాయి.

వ్యవసాయ పట్టభద్రుడు డాక్టరు శ్రీ పంటా గోపాల్‌రెడ్డి గారి కార్యదీక్షతతో ఏడు గ్రామాలకు చెందిన 7 వేల ఎకరాలతో మహాత్మగాంధీ లిఫ్టు ఇరిగేషను సంఘ స్థాపనతో నెరవేరింది.

నీటివసతి కొంత ప్రాంతానికి లభించినప్పటికి వసతి లేకుండా చిన్న కమతాలవారు పెక్కుమంది యథాతథంగా జీవనాన్ని గడపుట చూసిన శ్రీ రెడ్డి కలతచెంది చిన్న కమతాల ఏకీకరణతో కలుగు ప్రయోజనాలను వకేవదే వివరించినప్పటికీ భూకమతాల ఏకీకరణకు సనేమిరా ఒప్పుకొనలేదు.

శ్రీ రెడ్డి తన అభిప్రాయాన్ని వినాలనే కొంతమంది పెద్ద కమతాలు కలిగిన 15 మందితో 415 ఎకరాల భూమి కలిగిన "మాతా" వ్యవసాయ క్షేత్రాన్ని నెలకొల్పి వరి సేద్యాన్ని తగ్గించి చెఱకు, పచ్చ ఆకటి మొదలగు వాణిజ్య పంటలను చేపట్టి సంవత్సరం నుండి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

భూకమతాల ఏకీకరణకు విముఖత చూపిన ఎకరం లోపు కలిగిన నిరుపేదలు "మాతా" వ్యవసాయ క్షేత్రపు తీరును గమనించి చిన్నకమతాల ఏకీకరణతో ఉమ్మడి వ్యవసాయము చేపట్టి సత్ఫలితాలు పొందాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు.

చిన్న కమతాలు కలిగి అందుబాటులోవున్న వ్యవసాయ బావి నీటిని సంపూర్ణంగా సద్వినియోగ పరచుకోలేని పరిస్థితి ఏకీకరణతో తొలగి అధిక భూమిని సాగుకి తెచ్చుటతోపాటు కొద్దిమందితో వ్యవసాయము నిర్వహించుచూ మిగతావారు యితర వ్యాపారాలు చేపట్టుటకు అవకాశముంటుంది. కావున ఎకరా అంతకు లోపుగల 160 కుటుంబాలకు చెందిన 370 ఎకరాలతో గడ్డిపల్లి గ్రామంలో 1. సుందర్ 2. మమత, లింగాల గ్రామంలో 3. జ్యోతి 2. అరుణోదయ, దూపాడు గ్రామంలో 1. బుద్ధ 2. దీక్ష 3. చైతన్య అను ఏడు ఉమ్మడి వ్యవసాయ సంఘాలను స్వతహాగా ఏర్పాటు చేసుకున్నారు.

ప్రతి సంఘంలో ఎకరా భూమి కలిగిన ఎనిమిది మంది సాగుచేయగా మిగతావారికి సంవత్సరం మొత్తం ఉపాధి కల్పించబడినది. కమతాల ప్రకారంగ ఫలసాయాన్ని పంచుకొనెదరు. సాగుచేయువారికి శిక్షణ గరపుటతోపాటు ప్రతి సంఘానికి అనుభవం కలిగిన సుశిక్షితుడైన ఒక సబ్ అసిస్టెంటును మహాత్మగాంధీ లిఫ్టు ఇరిగేషన్ సొసైటి సమకూర్చినది.

ఈ సంఘాలకు సామూహిక బావుల త్రవ్వకానికై నిధులను సమకూర్చుటకు పేదపెన్నిధియైన జిల్లా కలెక్టరు శ్రీ టి. నాగరత్నం హామీనిచ్చారని శ్రీ రెడ్డి తెలుపుతూ సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ పాటిగేదెలను సమకూర్చిన సభ్యుల ఆర్థిక పటిష్ఠతకు దోహదకారి కాగలదని అభిప్రాయపడ్డారు.

యీ సహకార సంఘాలు చెఱకు మరియు పచ్చ ఆకటి చేపట్టాయని డాక్టరు రెడ్డి తెలిపారు. ఈ పథకం విజయవంతమైతే మహాత్మగాంధీ లిఫ్టు యిరిగేషన్ సొసైటి పరిధిలోని ఏడు గ్రామాలకు విస్తరించదలచినని ఆయన తమ ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

—శ్రీ ఆర్.వి. నారాయణ రెడ్డి

నిరుపేదకు ఉపాధి

శ్రీ వి. రాఘవులు అనే వ్యక్తి ఖమ్మంజిల్లా భద్రాచలం పట్టణంలో గత పది సంవత్సరాలు ముఠావని(హమాలీ) వృత్తిలో జీవితం గడుపుతుండేవాడు. అంటే లారీలకు సరుకులను ఎత్తడం దించడం అతని పని. ఈ వృత్తి వలన అతడు ప్రతిరోజూ 6 లేక 7 రూపాయల మేరకు సంపాదిస్తూ ఎనిమిదిమంది సభ్యులు గల తన కుటుంబాన్ని అతి కష్టంమీద పోషించగలుగుతూండేవాడు. ఒక్కొక్కరోజు ఒంటిపూట భోజనానికి కూడా నోచుకోలేకపోయేవారట అతని కుటుంబసభ్యులు.

ప్రధాని ఆర్థిక కార్యక్రమం ఫలితంగా, అతనికి స్థానికంగా వున్న బ్యాంకునుండి ఋణసహాయం లభించడంవల్ల అతను తన గత జీవితవిధానానికి స్వస్తిచెప్పి సైకిల్ రిక్షా త్రొక్కడం నేర్చి దాని ద్వారా రోజుకు 10 నుండి 15 రూపాయల వరకు సంపాదించసాగాడు. పొదుపుగా జీవితం గడుప అలవాటుపడిన అతని కుటుంబము సుఖజీవనం చేయసమేగాకుండా కొంత ఆదా కూడ చేసింది. దానితో అతను మరిరెండు రిక్షాలు కొని ఇంకిద్దరికి ఉపాధి కల్పించగలిగాడు. ఇటు బ్యాంకుల ఋణ ధనాన్ని తీర్చుతూ మరొకవంక రెండు రిక్షాలకు యజమాని కావడం, ఇంకెందరినో ఈ వృత్తికి ప్రోత్సహించింది. ఇంతవరకు 40 రిక్షాలను స్థానిక బ్యాంకులు రాఘవులు అధ్యక్షుడుగానున్న సహకార సంఘ సభ్యులకు అందజేశాయి.

—శ్రీ హరి గోపాలకృష్ణమూర్తి

కోళ్ళఫారం అభివృద్ధి

నరసన్నపేట టౌనుకు రెండు ఫర్లాంగుల దూరములో జాతీయరాహదారికి ఎడమప్రక్కన ఉన్నది శ్రీ వెంకటేశ్వర కోళ్ళ ఫారం. ప్రస్తుతం ఈ ఫారం 4000 కోళ్ళతో 3 షెడ్లతో దినదిన ప్రవర్థమానమవుతున్నది. నరసన్నపేట నివాసి శ్రీ బొంకి చిన్న అప్పారావు 1974 డిసెంబరులో ఈ కేంద్రం స్థాపించారు. ఈయన 1969లో తిరుపతి కళాశాలలో బి.వి.ఎస్.సి పట్టా పొంది 1973 సంవత్సరములో ఎం.వి.ఎస్.సి లో ఉత్తీర్ణులైన విద్యావంతుడైన యువకుడు. ఈయన తన విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఉద్యోగాన్వేషణ చేయక నేరుగా స్వయం ఉపాధిపథకం క్రింద భారీఎత్తున కోళ్ళపెంపకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రానికి శ్రీకాకుళం వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు వారు పట్టభద్రుల సహాయ పథకం క్రింద రూ. 92,000/–లు ఋణం మంజూరుచేసారు. ఈ ఋణం నెలకు రూ. 1500లు వంతున 5 సంవత్సరాలలో తీర్చుకోవచ్చు. మొదట ఒకరోజు వయస్సుగల 2500 కోడిపిల్లలతో ఈ కేంద్రం ప్రారంభించారు. తన సాంకేతిక పరిజ్ఞానంతో కోళ్ళకు వివిధ దశలలో వచ్చే రోగాల నివారణకు చికిత్సలు, ఇంజక్షన్లు వాడి, కోళ్ళకు వచ్చే రోగాలను అరికట్టడం చేయగలిగారు. ముఖ్యంగా ఈ కోళ్ళకు కావలసిన ఆహారం స్వయముగా తన పర్యవేక్షణలో తయారుచేసుకొంటున్నారు. ప్రస్తుతం యీ ఫారంలో 4000 కోళ్ళు

వున్నాయి. సుమారు 80% వరకు గ్రుడ్లు పెట్టుచున్నవి. 10 మంది పని చేస్తున్నారు. ఈ విధంగా యీ కేంద్రం ద్వారా తన కుటుంబం కాక 10 మందికి జీవితాధారం కల్పించారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయిన గ్రుడ్లను ఈ జిల్లాలోని శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, కాశీబుగ్గ, సోంపేట, బొబ్బిలి, పార్వతీపురం, మొదలైన గ్రామాలకు బస్సులద్వారా సరఫరా చేసి అమ్ముతున్నారు. ఈ ప్రాంతాలలో గ్రుడ్లకు చాలా గిరాకీ ఉన్నది. ఈ కేంద్రాలలో కోళ్ళపెంపకం ఖర్చులు, సిబ్బందిజీతాలు, బ్యాంకుఋణం వాయిదా రూ 1,500 లు పోను నెలకు సుమారు రూ 1000 ల వరకు నికర లాభం వస్తున్నది

—శ్రీ మంత్రి శంకర్‌రావు

మన్నేటికోట హరిజనవాడకు రోడ్డు

మన్నేటికోట ఉలవపాడు సమితిలో చిన్న గ్రామం. గ్రామమునకు హరిజనవాడకు సుమారు $1\frac{1}{2}$ కిలోమీటరు దూరము కలదు. కాని రహదారి లేదు. మన్నేటికోట గ్రామస్థుడు, రైల్వే కంట్రాక్టరు అయిన శ్రీ గడ్డం శేషయ్య హరిజనవాడకు రహదారి సౌకర్యం కల్పించాలని తలచాడు. గ్రామస్థులను సంప్రదించి పట్టా భూములలో సహితం రహదారికి అంగీకరింపచేశాడు. హరిజనులను సంప్రతించాడు. సుమారు $1\frac{1}{2}$ కిలోమీటర్ల దూరం మట్టిరోడ్డు పోయించాడు. ప్రభుత్వసహాయం ఆశించలేదు. హరిజనుల సహకారం, శేషయ్య ఉత్సాహం, ఉదారస్వభావంతో రూ. 10,000 లు విలువ గలిగిన రోడ్డు పని పూర్తిచేశారు. యీ నాడు గ్రామానికి హరిజనవాడకు రహదారి సౌకర్యం ఏర్పడింది.

—శ్రీ బి. ఆర్. నాయుడు

నింగీ - నేలా

శ్రీ కశెట్టి మల్లేశ్వరయ్య

ఈ దేశంలో
అందాలమేడ ప్రక్కన పూరిపాక
మేడయందు నివసించు నతనికి నింగిని అందుకోవాలనే ఆశ
పూరిపాకలో కాపురముండువానికి మరీ కృంగకుండా
నేలను అంటిపెట్టుకోవాలని తాపత్రయం.
ఈనాటి మొజాకో ఫ్లోరింగు యింటిముందు
శతాబ్దపునాటి మట్టి రాలుతున్న మంటి మిద్దె
కేరింతలు కొడుతూ విదేశాలకు సముద్రముమీదుగా
పయనిస్తున్న సరదా వ్యక్తులకు

తీసికెళ్తున్న స్టీమరు ప్రక్కగా
హస్తిమశకాంతర భేదంతో మెలికలుతిరుగుతూ
అదే సముద్రంలో భుక్తికోసం చేపల
వేటకై జాలరులను తీసికెళ్తున్న చిన్నబోటు
రహదారి డిపార్టుమెంటువారు వేయించిన రాజబాట
కొకవైపు మానవ భౌతికకాయానికి తప్పెటలతో
నగర వీడ్కోలు
మరొకవైపు మంగళవాయిద్యాలతో పూర్ణకుంభముతో
పాటిమానవునికి నగరములోనికి సుస్వాగతము.

కారు ప్రక్కన కాలినడక
రెక్కలున్న పక్షివోలె, విమానములో పయనిస్తున్నవాడికి
నిటారుగ కిటలువారిన భూమిపై చెమటోడ్చి
పనిచేస్తున్న కర్షకుడు.

అజీర్ణవ్యాధితో ఒక్కడు—ఆకలిబాధతో మరొక్కడు
ఈ మిట్టపల్లాలు
ఆరోహణావరోహణలు
మీటర్ గేజ్ బ్రాడ్ గేజ్ లు
భూమ్యాకాశాలు
కుచేలకుబేరులు
ఏకమగుటకే

మన ప్రధాని ప్రవేశపెట్టారు
వినూత్న పథకాలను
నడుముకట్టారు సమానత సంఘీభావాల ఆచరణకు
తప్పక సాధిస్తారు సమానత్వాన్ని
పొందబోతున్నారు సామాన్యులు
ఆనందమయ జీవితాన్ని.

ఆంధ్రరత్నకు రథసారథి జనాబ్ గౌస్ బేగ్ సాహెబ్

శ్రీ వి.యస్. సుందరరావు

1918–1920 సంవత్సరాలలో చీరాల పేరాల సత్యాగ్రహం నడిపి ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్య గారు ఆంధ్ర దేశం ఆదర్శప్రాయమైనదని నిరూపించారు. మహాత్మగాంధీగారు ఆఫ్రికా నుండి భారత దేశం వచ్చి 1916 నుండి సత్యాగ్రహ విధానాన్ని ప్రచారం చేస్తున్నారు జాతీయోద్యమానికి యింతకు మించిన పోరాట విధానం లేదని చెబుతున్నారు కాని, ప్రథమంగా సాగించిన యీ సత్యాగ్రహ విజయ పరంపరలు భారత దేశమంతటా మారు మ్రోగాయి.

"గోపాల క్రిష్ణయ్య నా సత్యాగ్రహ రహస్యాన్ని కనురెప్ప పాటులో దొంగిలించాడు" అన్నారు, ఆనాడు గాంధీజీ యీ సత్యాగ్రహాన్ని గురించి. శ్రీ గోపాల క్రిష్ణయ్యగారికి పెట్టనికోట జనాబ్ గౌస్ బేగ్ సాహెబుగారు. అన్నిట ప్రధాన భూమిక యీయనది స్వచ్ఛమైన దేశభక్తుడు జాతీయ ముస్లిం, మహాసాహసి, త్యాగి, మొక్కవోని ధైర్యం. అన్నిటా సమర్థుడు. వందలు, వేలమంది ప్రజానీకాన్ని క్రమశిక్షణతో నడపగల దిట్ట ఆంధ్ర రత్న సంస్కృతం, తెలుగు, యింగ్లీషు భాషలలో పండితులు, ఆశుకవి, ఉపన్యాస చక్రవర్తి అయితే జనాబ్ గౌస్ బేగ్‌గారు, మిత భాషి, కనుసైగలో ఎంతటి కార్యాలైనా సాధించగల నిశ్చల స్వభావుడు. వీరిరువురి పొందిక, పొత్తు ఆనాడు ఆంధ్రప్రదేశంలో తెలియని వారు లేరు.

ఆంధ్ర రత్న శ్రీ దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్యగారు 39వ ఏట కన్నుమూసి నలుబదిసంవత్సరములు రేపోమాపో పూర్తి కానున్నాయ్. సెప్టెంబరు 18వ తేదీ 1976 న జనాబ్ గౌస్ బేగ్ సాహెబుగారు 86 వ యేట చీరాలలో కన్ను మూశారు.

ఒకనాడు జాతివికాసానికి, చైతన్యానికి పట్టుగొమ్మలై జాతీయ సమైక్యతను చేకూర్చి, జాతీయోద్యమ రథసారథులై అనన్య త్యాగాలు చేసి జాతి విముక్తిని సాధించిన మహాపురుషులు వీరు జాతీయ సాహిత్యంలో వీరి పవిత్ర త్యాగాలు సువర్ణాక్షరాలతో లిఖించవలసి ఉంది.

జనాబ్ గౌస్ బేగ్ సాహెబుగారు ఆనాడు ఆంధ్ర దేశంలో ఒక పురానా కుటుంబంలో జన్మించినారు. "వందేమాతరం" ఉద్యమం రోజుల్లో 1907వ సంవత్సరములో జాతీయ ఉద్యమంతో ప్రభావితులైన యువ విద్యార్థి. ఈయన తాతగారు దిలావరు బేగ్. వారు యీ చీరాల గడ్డన 96 సంవత్సరములు జీవించి కన్నుమూశారు. చీరాలకు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఓడరేవులో ఈయన ఓడలు ఉండేవి. పెద్ద గోడవున్సుకు యజమాని. భారీ ఎత్తున వ్యాపారం చేసిన ఘనాపాటి.

గౌస్ బేగ్‌గారి తండ్రిగారి హయాములో ఓడరేవు వ్యాపారం స్తంభించినది. కాని విస్తృతమైన ఆస్తి సిరిసంపదలు సంక్రమించినాయి. చీరాల పట్టణంలో అనేక నివాస గృహములు, కొబ్బరి తోటలు, యిళ్ళస్థలాలు, స్వర్ణ గ్రామములో మాగాణి భూములు మిగిలాయి. యింతటి ఆస్తిని మన గౌస్ బేగ్ సాహెబుగారు జాతీయోద్యమంలో ప్రవేశించాక హారతి కర్పూరం లాగా కరిగి పోయింది.

"నాకు నాయకుడు దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్య. ఆయన మమ్మల్ని ప్రభావితుల చేశాడు. నిజాయితీ, త్యాగం, దేశభక్తి మాకు రంగరించి పోశాడు. ఆ మహనీయుడు అటువంటి జీవితాన్ని గడిపాడు ఆయన అడుగుజాడల్లో నడచాం. ఈ నాటికీ ఆయన చెప్పిన సత్యాలనే జీవిత లక్ష్యంగా ఉంచుకొని బ్రతుకుతున్నాం. అదే నా తృప్తి. యింతకంటె ఏమి కావాలి ? సుందర్ నీవు చెప్పు' అన్నారు పక్షంరోజుల్లో కన్ను మూస్తారనగా.

జనాబ్ గౌసుబేగ్‌గారు ప్రతి కాంగ్రెసు సభలకు హాజరౌతూ ఉండేవారు. షౌకతాలి, మహమ్మదాలి సోదరులు, మౌలానా అజాద్, రాజేంద్రప్రసాద్, గాంధీజీ, మోతీలాల్, సి. ఆర్. దాసు, నెహ్రూజీ, వి. వి. గిరి మొదలైన ప్రథమ శ్రేణి జాతీయ నాయకులతో వారి అనుభవాలు, సంభాషణలు, ఆయా మహాసభల విశేషాలు, ఆనాటిస్మృతులు అనేకం చెబుతూ, ఆయన పొంగిపోతూ ఆనందాన్ని వెల్లడించేవారు.

1918–20 సం॥ లలో చీరాలను మున్సిపల్ పట్టణంగా ప్రకటించినప్పుడు–ఆ శాసనాన్నిధిక్కరించుతూ కాంగ్రెసు ఆదేశానుసారం సత్యాగ్రహం నడపారు. మునిసిపలు ఏరియాలో 5000ల కుటుంబాలు నివసించుట లేదని రుజువు చెయ్యాలి. కనుక పౌరులంతా తమ తమ గృహాలు యథేచ్ఛగా విసర్జించి, ఊరివెలుపల పూరిపాకలు, గుడారాలు వేసుకొని నివసించాలి. అది ఆనాటి సత్యాగ్రహ శాసనం, గొప్పగొప్ప భవంతులు, పెంకుటి గృహాలు వదలి వేల మంది "రామా నగరం" నేడు పేరాలగ మారిన

ప్రాంతంలో నివాసములు ఏర్పాటు చేసుకొన్నారు ప్రజలు. ప్రతి కుటుంబంనుండి ఒక సత్యాగ్రహి శాసనధిక్కారము చేయాలి. యువకులంతా "రామదండు"లో చేరాలి ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్య గారు తయారు చేసిన యిటువంటి కఠోర నియమాలను పాటించి, పోలీసుల దురాచారములను సహించి క్రమశిక్షణతో సత్యాగ్రహము చేసి మునిసిపల్ శాసనమును రద్దు చేయించిన సత్యాగ్రహం అది. దానికి సర్వసంపదను, బలాన్ని చేకూర్చిన యోధుడు జనాబ్ గౌసు బేగ్ సాహెబ్‌గారు.

చీరాల పేరాల సత్యాగ్రహ ఉద్యమ తదనంతరం 1922 సం॥ లో గౌసుబేగును పొన్నూరులో అరెస్టుచేసి వంగోలు సబ్ జైలులో రిమాండులో ఉంచారు. ఆయనతో పాటు శ్రీమతి ఉన్నవ లక్ష్మీ బాయమ్మగారు, శ్రీ స్వామి సీతారాంగారు ఉన్నారు అక్కడ వంగోలులో ఒక ఐ.సి యస్. 'సబ్‌కలక్టరు హైదరీ అనే సాహెబుగారు ఉండవారు. ఒకనాడు యీ హైదరీ దొరగారు, గౌసుబేగును తన బంగళాకు తీసుకవెళ్ళి విందుచేసి,

"ఈ ఉద్యమం బ్రాహ్మణ ప్రేరేపితమైనది. నీవు యీ ఉద్యమం నుండి విరమించుకో. లేకుంటే సాహెబు లందరికీ చెడు పేరు వస్తుంది నీకు ఎక్కడ కోరు కొంటె అక్కడ 100 లేక 200 ఎకరముల భూమిని మంజూరు చేస్తాను" అని బలవంత పెట్టాడు. అది రంజాన్ పండుగ రోజు గూడా!

"ఈ పండుగరోజు నన్ను జైలుకు పోనివ్వండి. ఈ దేశభక్తి ఉన్మాదునికి కళంకం ఆపాదించకండి" అని సమాధానం చెప్పారు. ఫలితం ఒక సంవత్సరం జైలు రు. 1000 లు జుల్మానా విధించుతూ తీర్పు యిచ్చారు. దొరగారు!

జైలు నుండి బయటకు వచ్చాక ఆంధ్రరత్న స్థాపించిన "రామ దండు" వాలంటీరు దళానికి సేనానిగా పదయాత్రలు సలిపి గ్రామగ్రామాలు తిరిగి రాజకీయ ప్రబోధం చేశారు. ఆ తరువాత ఆంధ్రరత్న యీయన్ని వ్యాపారంచేయమని ఆదేశించారు. "రాం రహీమ్" అని కంపెనీకి నామకరణంచేశారు. గుంటూరు జిల్లాలో హోల్‌సేలు సైకిలు షాపు, మందుల షాపు. ఎరువుల షాపులు స్థాపించి యీ కంపెనీ పేరుతో వ్యాపారం చేశారు.

ఇంతలో 1930-32 ఉప్పు సత్యాగ్రహోద్యమం, ఈయన యీ ఉద్యమానికి డిక్టేటరు ఎక్కడ చూసినా యీయనే ప్రత్యక్షం. ఈయన పిడికిటిలోని ఉప్పుతీయుటకు పోలీసుల లాఠీలు గూడా విఫలమైనాయి. ఎన్నో విధాల హింసించారు. ఆంధ్రదేశమంతట ఎన్నో కథలుగా చెప్పుకొన్నారు. ఈ సత్యాగ్రహ ఉద్యమంలో రెండున్నర సంవత్సరాలు జైలుశిక్ష చేసి విడుదలయ్యారు.

ఈ కాలంలో ఆయన వ్యాపారాలన్నీ స్తంభించిపోయాయి. ఉన్న ఆస్తి అంతాకర్పూరంలాగ కరిగిపోయింది.

ఈయన ఎన్నో సంవత్సరాలు అఖిల భారత కాంగ్రెసు కమిటీ సభ్యులుగా-గుంటూరు జిల్లా బోర్డు ఉపాధ్యక్షులుగా- 1939 వరకు గుంటూరుజిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా పనిచేశారు. భారత దేశానికి స్వరాజ్యం సిద్ధించాక ప్రశాంత జీవితం గడపుటకు నిశ్చయించుకొని రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు.

చేదు నిజం

✻ శ్రీ మహమ్మద్ నవాజ్ అలీ (నవాజ్)




మనిషి ఎత్తు పెరగలేదు.
పాదయాత్రను విరమించుకొని
మేధస్సుతో ఎగరడం నేర్చుకున్న నరుడు
గ్రహాంతరయానం చేస్తున్నా:


గుహాంతర,
గహన వనాంతర వాసపు వాసనల
మత్తు యింకా విరగలేదు.
మనిషి ఎత్తు పెరగలేదు.


ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మనని
హుజంతో రొమ్ము విరుచుకొనే దేశంలో
బులెట్ కంటె
బ్యాలట్ బలమైందన్న భావం కలుగలేదు


కరువును,
జనాభా బరువును పరిష్కరించుటకు
సమరాన్ని సాధనంగా ఎంచుకున్న వానికి
శాంతి స్పృహ కలుగలేదు.

సమిష్టి కుటుంబాన్ని కాదని
వేరింటి కాపురం పెట్టిన కనిష్ఠుని భావనలు
లోకమంత విశాలంగ కరుగలేదు.
మనిషి ఎత్తు పెరగలేదు.








పారిశ్రామిక రంగం పురోగమిస్తోంది

ఆంధ్రప్రదేశ్‌లో భారీ మధ్యతరహా పరిశ్రమలతో పాటు చిన్నతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చేతిపరిశ్రమలు విరివిగా అభివృద్ధి చెందుతున్నాయి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు గణనీయమైన ప్రతిపత్తి వచ్చింది విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక రంగానికి వెన్నెముక, పుష్కలంగా లభిస్తోంది. పలువిధాలైన ఉత్పత్తితో పాటు లక్షలాది మందికి జీవనోపాధి లభిస్తూంది





తెలుగు వారి హాస్య ప్రియత్వం

—శ్రీమతి వేదవతీదేవి

(గత సంచిక తరువాయి)

విందు భోజనాలకు కూర్చున్నారు పెళ్ళికి వచ్చిన జనం. విందులో ఎన్ని కమ్మని వ్యంజనాలు వడ్డించారోకాని తినే వారికి గొంతు పట్టేసిందట పాపం! మంచినీళ్లు కావలసి వచ్చాయి. వడ్డన చేస్తూ ఉన్న వయ్యారుల్ని చూస్తూ— "ఓమె! అమ్మాయి, ఏమే లేమా, మేఘ పుష్పం (మంచినీళ్లు) కావాలి!"... అని భోక్తలు ముద్ద మ్రింగుడు పడకుండా అవస్థ పడుతూ అడుగుతూ ఉంటే— ఆ అందగత్తెలకు నవ్వు ముంచుకు వచ్చింది. 'మెమె మేలు' ఎక్కువైనాయి. బాగు బాగు—ఎక్కడో మేకల్లాగు ఉన్నారే!" అంటూ చమత్కరించగా—అక్కడి వారందరికి పెళ్లున నవ్వువచ్చిఉంటుంది. తినేవాళ్లకు ఆ నవ్వులో పొలమారీ ఉంటుంది.

సరస సంభాషణం. అందుతోపాటూ శబ్దవైచిత్రి! ఈ కూర్పు కవి సార్వభౌములకే చెల్లింది.

పల్నాటి సీమలో పర్యటిస్తూ - కవి సార్వభౌముడు అక్కడి ప్రజల అనాగరికత చూచి - సున్నితంగా - ఇలా నవ్వు వచ్చేటట్లు వర్ణించాడు.

"రసికుల కేలా ! పల్నా
డెసగెడు నా రంభయైన నేకులె వడకున్:
వసుధేశుడైన దున్నును;
కుసుమాయుధుడైన జొన్న కూడే కుడుచున్!"

ఏకులు వడుకుతూ ఉన్న రంభనూ, జొన్నకూడు కుడుస్తూ ఉన్న కుసుమాయుధుణ్ణి—ఊహించుకుంటే నవ్వురానిదెవరికి?

అలాగే, భోజన ప్రియుడైన రామయ మంత్రిపై శ్రీనాథుడు పరిహాసంగా చెప్పిన ఈ పద్యపాదం—

"మారామయ మంత్రి భోజన పరాక్రమ మేమని చెప్పవచ్చునా
స్వామి యెరుంగు దక్కబళ చాతురి తాళఫలప్రమాణముల్"

రామయ మంత్రిని వెక్కిరించాడు కాని, శ్రీనాథుడు కూడా భోజన ప్రియుడే! మహా మంత్రుల సరసను కూర్చుని రాజ భోజనం అనేకసార్లు ఆరగించినవాడు. జొన్నన్నం తినవలసివస్తే గొంతు పట్టుకుంటుంది! అలాగే, చింతకాయ కలిపిన బచ్చలికూర! సరసుడూ, పైపెచ్చు మహాకవి కనుక—ఎక్కడో వ్రేపల్లె వాడలోనో ద్వారకా నగరంలోనో హాయిగా వేణుగానలోలుడై కూర్చున్న పుల్ల సరోజ నేత్రుడిని సవాలు చేస్తాడు!

"పుల్ల సరోజ నేత్ర! అల హూతవ చన్నుల చేదు ద్రావి నా
నల్ల దవాగ్ని మ్రింగుటి నటించుట నిక్కెదవేల? తింత్రిణీ
పల్లవ యుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్నకూటిలో
మెల్లనయొక్కముద్ద దిగమ్రింగుము! నీపస కాననయ్యెడిన్"

మరి, ఆ పుల్ల సరోజనేత్రుడు దీనికి ఏమి సమాధానం చెప్పాడో! వెన్నముద్దలు మ్రింగటం అంత తేలిక కాదుగా ఇది!

పల్నాటి సీమలో సంచారం చేస్తూ—శ్రీనాథుడు నీటి చుక్కకు కూడా కరువు పడినాడేమో! పరమేశ్వరుని పైకి చమత్కారంతో కూడిన విసురు విసురుతాడు,

"సిరిగల వానికి చెల్లును
తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్!"

పరమేశ్వరునితో పరిహాసం ఆడి తనకు కావలసిన వరాన్ని సాధించుకోగలిగిన ధీశాలి అతడు!

హాస్యరస భూయిష్టమైన శ్రీ నాథుల చాటూక్తులు—తెలుగు జాతి భద్రంగా పదిల పరచుకొంటుంది. ఆయా సందర్భాలలో మననం చేసుకొని మనసారా నవ్వుకొంటుంది.

"ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు
భూసురేంద్ర !......"

అనే పద్య పాదం చదువుతూ ఉండగానే - వరూధినిచేత ఇంత సరసంగా మాట్లాడించిన ఈ పెద్దనగారి వాక్చమత్కృతికి ముసిముసిగా నవ్వురాక మానదు.

కవి కులంలో - హాస్యరసపు పోకడలను గురించి తలచినప్పుడు - ముందుగా మన మనస్సులోకి వచ్చేది - వికట కవిగా పేరు పొందిన తెనాలి రామకృష్ణుడు.

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో, కవి పండితగోష్ఠులలో ఆనాడు తెనాలి రామకృష్ణుడు వెదజల్లిన హాస్యం - ఈనాటికీ - కథలుగా, గాధలుగా — బహుళ ప్రచారంలోకి వచ్చి రంజింప చేస్తున్నాయి, మన ముందు తరాలలో కూడా, చమత్కార ప్రియులైన తెలుగు వారి ఇళ్ళల్లో — ఈ తెనాలి రామకృష్ణుని హాస్యపు కథలు నవ్వుల పువ్వుల్ని వెదజల్లుతూనే ఉంటాయి,

"మేక తోకకు మేక తోక మేకకు తోక
మేక తోకకు మేక తోక మేక......" అనే పద్యం చదివేటప్పటికి — పక్కున పొంగి వచ్చే నవ్వును ఆపుకోగలమా !

నిన్న మొన్నటి సంగతికి వస్తే — హాస్య రసానికి — తెలుగు సాహిత్యంలో తగిన స్థానం ఆపాదించి పెట్టిన వారు — వీరేశలింగం పంతులు గారు, చిలకమర్తి, గురుజాడ వారు — అని చెప్పవచ్చు.

ఆ నాటి సాంఘిక దురాచారాలను మూలంగా తీసుకొని — వారు రచించిన అనేక ప్రహసనాలలో నాటికలలో, దళ్ళికలలో — చమత్కారం ఉట్టి పడుతుంది. హాస్యరసం చిందు లాడుతుంది.

గురజాడవారి కన్యా శుల్కంలో — మొదటి నుంచి చివర వరకూ — చిక్కని హాస్యం తొంగిచూస్తూ — పన్నీటి తుంపురులను మనపై వెదజల్లినట్లు ఆహ్లాదాన్ని కలగజేస్తుంది. కన్యాశుల్కంలో ఎదురయ్యే పాత్రలన్నీ — మనం ఎక్కడో ఒక చోట చూచినవే! ఎప్పుడో ఒకప్పుడు ఎరిగినవే! అందులోని ప్రతి పాత్రా — అప్పుడప్పుడూ మనను డొక్కలు చేతిలో పుచ్చుకొని నవ్వేట్లు చేస్తుంది.

"భగపతి యమృతము తేగా
భగ భగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్
పొగ చుట్టయి జన్మించెను
పొగ త్రాగని వాడు దున్నపోతై పుట్టున్''

అంటూ శిష్యుడుకి జ్ఞాన బోధ చేసే గిరీశంపైన ఎందుకో మనకు కోపం రాదు! పైగా — అతగాడి కవిత్వానికి నవ్వు వస్తుంది.

''పుల్లు మూను లైటటా
జానమిమ్ము వైటటా
మూను కన్న మొల్ల కన్న
నీదు మోము బ్రైటటా!

ఇంగ్లీషునీ తెలుగునీ — ఇంత సొంపుగా మిశ్రమం చేసి చక్కని హాస్య సృష్టి చేసిన గురజాడ మన తెలుగు వాడు!

పానుగంటి వారి 'సాక్షి' నిండా, ఎన్నో వాక్చమత్కారాలు కనిపిస్తాయి. వారి 'కంఠాభరణం' హాస్యపు పుట్ట. చిలకమర్తి వారి 'గణపతి' — అటువంటిదే!

గిరీశంతో పాటు — మన మధ్య ఒక మనిషిగా మెసులుతూ ఇప్పటికీ ఎప్పటికీ మనను నవ్విస్తూ ఉండే బారిష్టరు పార్వతీశం మన తెనుగు వాడే! నర్సాపురం తాలూకా మొగలి తుర్రు గ్రామంలో పుట్టి — తాటాకూ, కచ్చికా ట్రంకు పెట్టెలో సర్దుకొని — లండన్ మహానగరంలో బారిష్టరీ చదవబోయిన మన కుర్ర నాగన్న మొక్కపాటి నరసింహ శాస్త్రి గారి అపూర్వ సృష్టి. ఎప్పటికీ — తెలుగు నాట ఎక్కడో ఒక మూల ప్రత్యక్షం అయి— పదుగురినీ పక పక నవ్వేట్లు చేస్తూనే ఉంటాడు — బారిష్టరు పార్వతీశం!

తెలుగు నాట — మాటాడ నేర్చిన బుడుతడికి — ముందుగా నోటికి వచ్చేది వేమన శతకమే! తేట తెలుగు మాటలతో — జీవిత సత్యాన్ని ముక్కుకు సూటిగా చెప్పటం వేమన్న ప్రత్యేకత. ఆ పద్యాలలో వాడి తనంతో పాటు — హాస్యరసం — తొంగి చూస్తూ ఉంటుంది.

"పాల సాగరమున బవ్వళించిన స్వామి
గొల్లయిండ్ల పాలు కోరనేల
ఎదుటి వారి సొమ్ము ఎల్ల వారికి తీపి
విశ్వదాభిరామ వినుర వేమ!''

అన్నప్పుడూ......

"చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా!''

అన్నప్పుడూ......

"వేష భాష లెరిగి కాషాయ వస్త్రాలు
కట్టగానే ముక్తి కలగబోదు
తలలు బోడులైన తలపులు బోడులా!''

అంటేనూ — పరమ సత్యాన్ని ఎంత సున్నిత హాస్యంతో జతచేసి చెప్పాడు!... అని మందహాసం చేయకుండా ఉండలేము.

శంభో శతకంలో కవి (మల్లాది శివరాంగారు) అప్రియమైన దురాచారాన్ని, ఎంత సరసంగా బయట పెడుతున్నాడో చూడండి!

"గణపతికి పెండ్లి చేయవు
'మని' లేదా! మాకుపంపు మగవాడు కదా
కను ముక్కు తీరు లేక్కునను, భువి కట్నంబు
లెదురు నడచును శంభో!''


"పరమేశ్వరా! ముద్దుల కుమారుడు కదా! గణపతికి పెళ్ళి చేయవేమి! కను ముక్కు తీరు సరిగా లేకపోయినా పరవాలేదయ్యా మా లోకంలో మగ పుట్టుక పుట్టిన వాడయితే చాలు కట్నాలు వెతుక్కుంటూ వస్తాయి. గణపతిని మా వద్దకు పంపించేయి! వరకట్నం యిచ్చి పెళ్ళికొడుకుని చేస్తాము!"...అంటూ నవ్వుతూనే మన సాంఘికదురాచారాన్ని శంకరుడి ముందుపరిచి వెడతాడుకవి.

ఎంతటి క్లిష్ట సమస్యను ఎదుర్కోవలసి వచ్చినా, ఎంతటి దయనీయమైన దీన స్థితిలో ఉన్నా, తెలుగువాడు వీడని చిరు నవ్వుతోనే — ఆ సమస్యను ఎదుర్కొంటాడు.

మధ్య తరగతి గృహస్థు, దిన దిన గండంగా కాలం గడుపు కొస్తున్న ఆతగాడికి ఎంత కోరిక ఉంటే మాత్రం హంసతూలికా తల్పం ఎక్కడి నుంచి వస్తుంది! ఉన్నదీ చాలీచాలని కొంప. కొంపనిండా గంపెడు పిల్లలు. బక్క చిక్కిన ఇల్లాలు — జోలెగా అయిపోయిన కుక్కి మంచం, మాసిన దుప్పటి, పడుకుంటే నిద్ర పట్టదు. పగలంతా పనిచేసి వచ్చిన శరీరమైనా విశ్రాంతిగా పడు కోవటానికి లేదు. నిద్ర ఎలా పడుతుంది! మంచంనిండా, ప్రక్కనిండా నల్లులు ఉన్న బాధలు చాలవన్నట్లు జలగల్లా పీక్కుని తింటున్నాయి.

ఆ స్థితిలో — ఎవరికైనా హాస్యం జోలికి పోతుందా మనస్సు ఒక్క తెలుగు వాడికి తప్ప!

"శివుడద్రిని శయనించుట
రవి చంద్రులు మింట నుంట రాజీవాక్షం



దవిరిళముగ శేషునిపై
పవళించుట నల్లి బాధ పడలేక సుమీ!'

అంటూ, అప్పుడే ఏదో పరమసత్యం బోధ పడినట్లు తల వంకించి నవ్వుకుంటాడు!

మధ్య తరగతి వాడి అవస్థలు ఇన్నీ అన్నీ కావు. ఆతడి బాధ అతడే ఎరుగును; చాకలి వాడికి ఉన్న ఒక జతా ఉతకటానికి వేస్తే మిగిలింది మరొక్కటే! అది చిరుగుల బొంత అయిపోయింది. అన్నీ అతుకులూ మాసికలు, ఎన్నాళున్నా, వాడు ఆ మలిన వస్త్రాల్ని శుభ్రంచేసుకరాడు. ఎన్నాళ్ళో-లెక్క తెలియనన్ని నాళ్లు గడిపిన తర్వాత-ఆ చాకలి వాడు దయ తలచి తెచ్చి ఇచ్చాడు ఆ జత బట్టలు విప్పి చూస్తే-దాని రూపమే గుర్తుపట్ట లేనంతగా మారిపోయింది! అన్నీ చిరుగులు! జీర్ణవస్త్రంలా ఉంది!

అంతటి దయనీయమైన స్థితిలో ఉన్నా, వేదాంత దృష్టినీ, అందుతో మిళాయించిన హాస్యప్రియత్వాన్నీ - మరుపడా మనవాడు.

"చాకలి వానితో జగడాలు పడలేక
సిరి గలాడు పట్టు చీర గట్టె
శివుడు తోలుగప్పెనీ యని మది రోసి
భైరవుండు చీఱ పారవైచె!"

అనుకుని నవ్వుకుంటాడు - అటు పట్టు చీరలూ కట్టలేని - 'సీ' యనీ చీర పారవేయనూలేని తెలుగన్న!

'నిద్ర సుఖ మెరుగదు — ఆకలి రుచి ఎరుగదు' — అని అంటారు కాని-చీమ చిటుక్కుమంటే నిద్ర లేచిపోయే తెలుగు వాడికి నిద్రాసుఖం ఏమి దక్కుతుంది! ఒక వైపున పిల్లల ఏడుపులు-మరొక వైపున వంటి ఇంటి చప్పుళ్ళు. ఇంకొక వైపున రోడ్డుమీది రొదలు-మనస్సు నిండా అల్లుకు పోయి అలజడి చేసే వేయిన్నొక్క సమస్యలు! ఆలా నిద్ర పట్టక తన్నుకుంటుండే సమయంలో కూడా తెలుగు వాడు హాస్య ప్రియత్వాన్ని విడువలేడు, హరినీ మరువలేడు.

"కలశ పయోధిమీద దరగల్ మఱిపోయని మ్రోయ
వేయు భం
గుల తలపాన్పు పాము బుస కొట్టగ నేగతి నిద్ర చెందెదో
లనత దంద్రి! మయచీ చిటుకన్నను నిద్దురరాదు మాకు నో
బలవదరీ! కుహర భాస్వదరీ యదరీ దరీ హరీ!"

కందుకూరి రుద్రకవి—

అనుకుంటూ, హరిని సానుభూతిగా పలకరించుకుంటాడు నిద్రపట్టని ఆ నిశీధిని!

సామాన్యుడి జీవితంలో ఇటువంటి సంఘటనలు అనేకం ఎదురు వచ్చే చికాకులను వీడని చిరునవ్వుతో ఎదుర్కొంటూ పోతూ-తనకు తానే సర్ది చెప్పుకుంటాడు. ఆ చెప్పుకున్నవి జాతి జీవనంలో సామెతలుగా నిలిచిపోయినవి.

ఎన్ని ఈతిబాధలున్నా, వేళకు ఇంతకబళం కడుపులోపడాలి. లేకపోతే బండి నడవదు. అందుకే-'ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు'...అని సరసంగా అనుకుని జీవితంతో రాజీ వస్తాడు

ఇంట్లో ఎన్ని చింతలున్నా, రోగాలున్నా, వేళకు ఇంత తిండి తినే కార్యక్రమం మాత్రం తప్పదు.

"అందరకూ అన్ని రోగాలు, అడ్డ తప్పేలాకు ఏ రోగమూ లేదు!"...అనుకుని నవ్వుకోవటం తెలుసు తెలుగు వాడికి.

"అగ్రహారం పోతే పోయింది కాని ఆక్టు బాగా తెలిసింది" ...అన్నాడట హాస్యప్రియుడైన కోర్టు పక్షి. దావా ఓడిపోయినా, మరొక విధంగా తనకు జరిగిన మేలుకు సంతోషిస్తాడు పాపం! ఎంత సరస వాదం!

ఇట్లా ఉదహరించుకుంటూ పోతే-ఈ నిడివి చాలదు! మన సామెతల్లో, నానుడుల్లో-అనుభవం రంగరించిపోసిన సత్యాలతో పాటూ-హాస్యరసం అంతర్గతంగా దర్శనమిస్తూనే ఉంటుంది.

జీవితంలో ఏ సమస్యను ఎదుర్కోవలసి వచ్చినా, సణుక్కుండా, గొణుక్కుండా, విరసాన్ని కూడా సరసంగా మార్చుకుని తాను మందహాసం వీడకుండానే-ఎదుటి వాడిని ముసి ముసి నవ్వులు నవ్విస్తాడు తెలుగువాడు!

మన వీధినాటకాలలో, పగటి వేషగాళ్ళ వేషాల్లో, తోలు బొమ్మలాటలలో, హరికథా కాలక్షేపాల్లో, బుర్రకథల్లో-ఆకాశవాణిలో, చిత్ర రంగంలో-ఎక్కడ చూచినా హాస్యరసం చిందులాడుతూనే ఉంటుంది.

హరికథలో పిట్ట కథలు-ఎంత హాస్య స్ఫోరకంగా ఉంటే-శ్రోతలు అంత ఆసక్తిగా వింటారు. అల్లాగే-తెలుగు వారికి నవ్వు తెరల్ని తెప్పించే 'కేతిగాడు', 'బంగారక్క' తోలు బొమ్మలాటలలో తైతక్కలాడే ఇష్టమైన పాత్రలు.


"తమలపాకుతో తానిట్లం
తలుపు చెక్కతో నేనిట్లంటిని!"

ఇది ఎప్పుడో ఒకసారి కూచిపూడి భాగవతుల వీధి నాటకంలో వినిపించే సరసమేనా? కాదు!

ఇప్పటికీ...ఎప్పటికీ...

కాఫీ కప్పు బల్లమీద పెట్టి, జడ తిప్పుకుంటూ వెనక్కు తిరిగే పడుచు పెళ్ళాన్ని దొరకపుచ్చుకుని ఏదో ఒక వంకతో తెలుగు వాడు ఆడుకునే సరసమే ఇది!

1975 ఉత్తమ తెలుగు చిత్రాలకు ప్రభుత్వ బహుమతులు






జనవరి 4వ తేదీన విజయవాడ మ్యునిసిపల్ స్టేడియంలో మాజీ గవర్నరు శ్రీ ఆర్ డి భండారే కళాకారులకు ప్రభుత్వ బహుమతులు అందజేశారు. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, ఆర్థిక, సమాచారమంత్రి శ్రీ పి రంగారెడ్డి రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధిని గురించి వివరించారు.


శ్రీ పి. జగన్మోహనరెడ్డి, శ్రీ బి. గోపాలరెడ్డి, ఎంతోమంది ప్రముఖులు, కళాకారులు, తదితరులు సభకు హాజరయ్యారు

















కవితావేశం...నాదేశం

వచన కవితా రూపకం

✻ శ్రీ జె. యస్. రామకృష్ణ

నాందీ

కవితావేశం
నాదేశం
సమతా సందేశం
నాదేశం
మన దేశం
మమతా సంసిక్తం
మనదేశం
మానవతా సందీప్తం


'ప్రస్తావన'

వసంతం
వసంతం
వసంతం వచ్చింది
ప్రకృతికి సంతోషం ఇచ్చింది
రంగు రంగుల
రమ్య తోరణాలు
సుమసౌరభాలు
ఆభరణాలు
వసంత విహాసిని
ప్రకృతి నిత్య సువాసిని
శిశిరంతో రణించి
క్షీణించిన ప్రకృతి
చైతన్యాన్ని సంతరించుకుంది
సౌజన్యాన్ని నింపుకొంది
క్రాంతి సుమాలు
కళ్ళు విప్పుకొంటున్నాయి
శాంతి ఫలాలు
చిగురాకులు కప్పుకొంటున్నాయి
వసంతం
నితాంతం
లతాంతాల
నయనాల్లో దోబూచులాడుతోంది
'కోకిల' కమ్మని గానంలో
హేలగా పిలుస్తోంది

సూత్రధారుడు :
అతడే...
మన నాయకుడు
ఈ యుగ స్వర గాయకుడు
మూగబోయి
మూలన పడుకున్నాడు
అజ్ఞాన తస్కరుడు
స్వాతంత్ర్య శానుడు
త్రింశతి దాటలేదు వయస్సు
చిన్నబోయింది మనస్సు
యౌవనం
వనంలో విహరించి
ఊపిరిలేని ఊహలతో
అలసమైన అంతర్యంతో
గతం కుక్కి మంచంలో
వర్తమానాన్ని పరచుకొని
భవిష్యత్తు భయాన్ని కప్పుకొని
కునుకు తీస్తున్న కుర్రవాడు
కుమిలి పోతున్న వెర్రివాడు
కలత నిదురలో
కలలాంటి మెలకువలో
కల కంటున్నాడు
కలలో
ఇలలో
ఓ స్త్రీమూర్తి
మేలిమి బంగరు మేనితో
ముడుతలుదేరిన మొహంతో
త్రివర్ణ వసనాన్ని అలంకరించుకొని
అతని చెంతకు వచ్చి
నుదిటిపై చేతిని వుంచింది
ఆ స్పర్శకు
అతని తనువు పులకించి
మగతలోని చేతన మేల్కాంచి
కనులు తెరచాడు
ఎదుటనున్న స్త్రీమూర్తిని
వింతగా చూశాడు

స్వాతంత్ర్య శానుడి స్వగతం :


"ఎవరీమె"
ఎక్కడో చూసిన స్మృతి
శాంతి సంకేతాల్లా
ఆ కనులు
విరిసిన వెన్నెల్లా
ఆ నవ్వు
శాంతి దేవతా...
ఏమో
ఆ పవిత్రమూర్తిని చూస్తుంటే
ఎంతో ఆత్మీయురాలుగా భాసిస్తోంది
ఇంతకీ 'ఎవరీమె
నా కన్నతల్లా...
నా కల్పవల్లా...'
(తేల్చుకోలేకపోయాడు)
"ఎవరమ్మా నీవు
నిన్ను గుర్తించలేని
ఈ దీనుణ్ణి మన్నించమ్మా"
ఎక్కడినుండి నీరాక
ఇదిగో ఈ దీపం వెలిగిస్తానుండు
"ఎవరమ్మా నీవు
భరతమాతవా
మా శాంతి దేవతవా
కళకళలాడే నీ మోములో
ఆ కలవర పాటేమిటి
వెన్నెల విరిసే
నీ దరహాసంలో
విషాద రేఖేమిటి
ఎందుకమ్మా
ఈ నిర్వేదం
ఏమిటమ్మా ఈ విక్షిప్తత
నీ హృదయం విప్పు
నీ వ్యధలు నాతో చెప్పు
ఆలస్యమెందుకమ్మా
ఆలోచించకమ్మా.




భరతమాత :
ఇప్పటికైనా
నన్ను గుర్తుపట్టావు చాలు
అదే పదివేలు
అవును నేను
హాలాహలం గుండెల్లో
దాచుకున్న శాంతిదేవతను
ఉట్టుకినట్లుడికిపోయిన
భరతమాతను.
తుఫానులో
పెను చలిలో
తడిసిన వణకిన
గోమాతను
తరతరాలుగా
నా సిరిసంపదలను
ఎందరో ఎన్నివిధాలో
దోచుకున్నారు.
తమ పాదాక్రాంతం
చేసికొన్నారు
నా సిరిసంపదలను కాజేసి
నన్ను బానిసగా బడుగుగా
మార్చివేశారు
శతాబ్దాల బానిసత్వంలో
చిక్కి శల్యమై
చివరికి నిన్ను కన్నాను
నా బ్రతుకు బాగుపడుననుకొన్నాను
కానీ......
నా దురదృష్టం మళ్ళీ నీవు
చీకటిలోనే చిక్కుకున్నావు
ఉషస్సూర్యుణ్ణి
ఉన్మత్త మేఘాలు
చుట్టేసి బందీని చేశాయి
అణగారిన బ్రతుకులు
గతిలేని మెతుకుల కోసం
అల్లాడుతున్నాయి.
నా బిడ్డలు
మట్టిబెడ్డలు తింటున్నారు
వారి పరిస్థితి
మరీ దుస్థితి
అందుకు వగచి
ఆలోచించి ఇలావచ్చాను
వారి బ్రతుకులు మార్చుటకు
ఆకలి–వేదనలను
పరిమార్చుటకు
పథకం వేశాను
నా చిన్నారి చెల్లి
నీ బంగారు తల్లి
ఆ పథకం అమలు చేస్తుంది
పరిస్థితి విషమించి
'అత్యవసరం' ప్రకటించింది
అల్లర్లు, ఆగడాలు తగ్గాయి
చీకట్లు పోతున్నాయి.
ఈ శుభసమయంలో
నీ కుటిలో
ఈ చీకటి ఏమిటి
తలుపులు తెరచుకొని
బయటికి నడు
ఉషస్సును చూడు
తేజస్సును కొనియాడు
నవ యువకా
స్వాతంత్ర్య బాలకా
వేదన విస్మరించి
శోధనతో చూడు
అదుగో... నీ చెలికాడు
'ఇనుడు'
ఇటే వస్తున్నాడు
అతడితో పాటునడు
నీ ప్రజల శ్రేయశ్శుభాలను చూడు
నీ బాధ్యత నిర్వర్తించు
నిర్మలంగా ప్రవర్తించు
నీ ప్రజల సుఖసంతోషాలను
వేదనా విషాదాలను
నాకు తెలియజెయ్యి
నాయనా వెళ్ళు...
ఇది నీ కర్తవ్యం...
సూ:– కళ్ళు తెరచాడు
చుట్టూ చూశాడు.
స్వా భా:– "మాతా
భరతమాతా
మా భాగ్యవిధాతా
జనవినుతా
మా శాంతి దేవతా"
ఎక్కడమ్మా నీవు
ఎటు వెళ్ళావు
అయ్యో... అంతలోనే
వెళ్ళి పోయావా...
నీ పాదాలు స్పృశించందే
ఏ కన్నీరు తుడవందే
వెళ్ళి పోయావా...

1 వ గుమస్తా : మిత్రమా
ఇది నిజమా
ఇదే సోషలిజమా!
ఆకాశంలో విహరించే ధరలు
అవనిపై కేతెంచాయి
కలలోని వసంతం
కాళ్ళ చెంతకి వచ్చేసింది
ఇది నిజమా
మిత్రమా
ఇదే సోషలిజమా!

2 వ గుమస్తా:– ఎడారిలో ఒయాసిస్సు
ఎన్నేళ్ళకో ఉషస్సు
వచ్చింది
ఒయాసిస్సుతో ఊపిరి వచ్చింది
నేటితో తమస్సు చచ్చింది
చీకటి దారులు తొలగాయి
చీమలు బారులు తీర్చాయి
బుసలుకొట్టే భుజంగాలు
ఆటలు కట్టించాయి
ఇదే మార్పు
ఇదే మనజనత తీర్పు
మిత్రమా
నిజం యిది
ఋజువు యిది (సశేషం)





నగరంలో.........


ఎడమ వైపు పైన. జనవరి 31 న రాజ్‌భవన్‌లో డా దివాకర్ల వేంకటావధానికి సన్మానం.

ఎడమ వైపు మధ్య. ఇటీవల పశ్చిమ బెంగాల్ నుండి ఆంధ్ర ప్రదేశ్ వచ్చిన సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ బృందంతో విధానసభలో గోష్ఠి.

ఎడమవైపు క్రింద. సనత్‌నగర్ పారిశ్రామికవాడలో బంగ్లాదేశ్ నుండి డీసెల్ ఇంజన్ల ఎగుమతికి మొదటి ఆర్డరు స్వీకారం


కుడివైపు పైన. చందూలాల్ బారాదరిలో జనవరి 21 న ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు పారిశ్రామిక భవన సముదాయానికి ప్రారంభోత్సవం చేశారు


కుడివైపు క్రింద: హిమాయత్‌నగర్‌లో జనవరి 25 న ఖాదీ, గ్రామీణ పరిశ్రమలపై గోష్ఠికి ఆర్థిక, సమాచార మంత్రి శ్రీ పి. రంగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు.















కుడివైపు పైన: శ్రీ జి. రామారావు వ్రాసిన " ది డిఫికల్ట్ డికేడ్స్ " ను ముఖ్యమంత్రి జనవరి 26న విడుదల చేశారు.


ఎడమవైపు పైన: జనవరి 22న బేగంపేటలో స్వామి రామానంద తీర్థ జయంత్యుత్సవాలు జరిగాయి.

ఎడమ ప్రక్కన: జనవరి 29న సాహిత్య ఎకాడమీలో ఆర్థిక, సమాచారశాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి పుస్తకావిష్కరణ అనంతరం, అధ్యక్షులు శ్రీ బి. గోపాలరెడ్డికి అందజేస్తున్న దృశ్యం.

ఎడమవైపు క్రింద: జనవరి 25న రాజ్‌భవన్‌లో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల సమావేశం.

కుడివైపు క్రింద: హైదరాబాద్ రోజ్ సొసైటీ నిర్వహించిన గులాబీ ప్రదర్శనలో విజేతకు ముఖ్యమంత్రి సతీమణి శ్రీమతి మంగాయమ్మ బహుమతి ప్రదానం చేశారు.





పాఠక లేఖలు

జనవరి నెల "ఆంధ్రప్రదేశ్" అత్యంత ఆకర్షణీయకంగా ఉండి మమ్మల్నెంతో ఆనందపరచింది. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారి "మహాభారతము," సి. ఆనందరామంగారి "నిరాశలో నిండు గుండె" సీరియల్స్ పాఠకలోకానికి ఎంతో ఆనందాన్ని చేకూరుస్తున్నాయనుటలో అతిశయోక్తి లేదు. గేయకవితలు మీ (మా) ఆంధ్రప్రదేశ్‌కు హైలైట్స్. "తుఫాను సహాయక చర్యలు" ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి ప్రకటన వి.సువర్చలారాణిగారి "గాంధీజీ దృష్టిలో స్త్రీ" శీర్షిక చాలా బావున్నాయి. విద్యార్థులకు విద్యార్థినులకు ఉపయోగపడేలా ఏదైనా క్రొత్త శీర్షిక ప్రవేశపెట్టుతారని ఆశిస్తున్నాను.

వై. వి. యస్. శివప్రసాదు
యాళ్ళూరు, కర్నూలు జిల్లా.

ఆంధ్రప్రదేశ్ 20 వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక అత్యంత ఆకర్షణీయంగా వుంది. తెలుగుజాతి వికాసానికి తెలుగు సంస్కృతి స్వరూపానికి, తెలుగు సాహిత్య పరిణామానికి "ఆంధ్రప్రదేశ్" అవతరణోత్సవ ప్రత్యేక సంచిక మకుటాయమానంగాను, వివిధ విషయవిలసితంగాను, సర్వాంగ సుందరంగాను విరాజిల్లుతున్నది పదికాలాలపాటు పదిలపరచుకొని సమగ్ర "ఆంధ్ర ప్రతిబింబా"న్ని దర్శించుకోదగిన దర్పణం ఈ ప్రత్యేక సంచిక. ఈ సంచికను ఇంతగొప్పగా వెలువరించినందుకు మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

"ఆంధ్ర ప్రదేశ్" మాస పత్రికకు నేను ఒకటిన్నర దశాబ్దము నుంచి చందా దారునిగా వుంటూ పత్రిక చదువుతున్నాను. ఇతర రాష్ట్రాలలోన, విదేశాలలోను వుంటున్న ప్రవాసాంధ్రులు ఆంధ్ర ప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలను తెలుసుకొనుటకు ఈ పత్రిక దోహదకారి అవుతున్నది.

నూలు చెన్నకేశవులు
మద్రాసు 600 003

జనవరి "ఆంధ్రప్రదేశ్" ముఖచిత్రం ఒక వింతమలుపు. తుఫాను బాధితుల గురించి చాల విషయాలు క్లుప్తముగా తెలియజేశారు "గాంధీజీ దృష్టిలో స్త్రీ" మరియు "అవతరణోత్సవాలు" శీర్షికలు పత్రికకే హైలెట్. కవితలు, గేయాలు మరియు వ్యాసాలు అద్భుత పర్వన. కనీసం రెండు కథలన్న ప్రచురించ గలరని మా మనవి. విలువైన, ఉత్తమ రచనలు, అతిస్వల్ప వెలతో పాఠకుల మెదడుకు మేతనిచ్చు "ఆంధ్రప్రదేశ్" పత్రిక నిర్వాహకులకు నా కృతజ్ఞతలు. సీరియల్ కథలు రసవంతముగా సాగుతున్నవి. కార్టూన్స్ వన్‌డర్.

యం. ఏ. సలీమ్ అక్తర్,
బి కాం.
మంచిర్యాల.

ఆంధ్రప్రదేశ్ జనవరి సంచిక అందమైన ముఖచిత్రంతో మాచేతుల్లో వాలింది కూరెళ్ళగారిగేయం. శ్రీమతి వేదవతీ దేవిగారి కథ. వాస్తవానికి దగ్గరలో చాల చక్కగా ఉన్నది. కార్టూన్స్ చాలబాగున్నాయి మమ్మల్ని కడుపుబ్బనవ్వించేలా ఉన్నాయి. "నిరాశలో నిండుగుండె" సీరియల్ ఎంతో ఇన్‌ట్రెస్ గా ఉంది. ఇంకా కార్టూన్స్, కథలు విరివిగా ప్రచురిస్తారని ఆశిస్తాము

ఎ శ్రీదేవి, బి. సావిత్రి, రవీందర్
పోమాల
మహబూబ్‌నగర్ ; జిల్లా

జనవరి సంచిక మమ్మల్ని ఆనందపరిచింది తెలుగువారి హాస్య ప్రియత్వం స్కెచ్, జానపద సాహిత్యం వెల్లువలా ప్రవహింపజేసి మమ్మల్ని కడుపుబ్బ నవ్వించింది. కరీంనగర్ జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారం ఎంతో భవితవ్యం వుందని తెలుసుకొన్నాము.

ముదుగంటి సుధాకర్‌రెడ్డి
గుండిగోపాల్‌రావుపేట (కరీంనగర్)

ఆంధ్రప్రదేశ్ జనవరి 1977 మాస సంచికలో వెలువడిన "తుఫానుపెనుభూతం" యనుగేయకవిత ఆంధ్ర జనాళి హృదయ విషాద రాగమాలాపించినది. తుఫాను భీభత్స దృశ్యాలను కవివర్యులు తమ కవితా దర్పణంలో చూపి శోకభీభత్సాలను కరుణారసంతో కన్నీరొలికింపచేసారు. కవివర్యులు కూరెళ్ళగారు అభినందనీయులు. కళాకారుడు రాజ భద్రయ్యగారి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ చిత్రం నయనానంద దృశ్యమైనది ఇరవై స్తంభాలపై గుడి చక్కని గేయం, మహాభారతం మహోన్నతమైన వచనరచన

కె. లక్ష్మణాచార్య భువనగిరి

జనవరి నెల 'ఆంధ్రప్రదేశ్' పత్రిక సర్వాంగ సుందరంగా వుంది. తక్కువ వెలకు అందిస్తున్నందుకు మీకు మా ధన్యవాదాలు.

సంచికలో శ్రీమతి వేదవతీ దేవిగారి "తెలుగువారి హాస్య ప్రియత్వం" తెలుగు మనసులను చల్లగా పల్లెసీమలకు తీసుకపోయి హాయినిస్తుంది. ముమ్ముందు పత్రిక ఇంకా అభివృద్ధి కావాలని కోరుతున్నాము. మహిళా మండలుల కార్యక్రమాలకు ఒక శీర్షికను ప్రారంభించమని మనవి.

శ్రీమతి సుభద్రాదేవి
మహిళా మండలి, శిరపురం.

జనవరి, 77 ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మమ్ముచాలా ఆకట్టుకుంది! జనవరి 26 కవితబాగుంది. 'గాంధీజీ దృష్టిలో స్త్రీ' వి సువర్చలారాణి గారి వ్యాసం ఎంతో విజ్ఞాన దాయకంగా వుంది సీరియల్స్ ఒకదానితో ఒకటి పోటీపడుతూ, చాలా ఇంటరెస్టింగ్‌గా వుంటున్నాయి!

చాలా హెచ్చు సంఖ్యలో కార్టూన్లను వేశారు చాలా సంతోషం. యికముందుగూడా యిలాగే హెచ్చు కార్టూన్లను వేస్తారని ఆశిస్తున్నాను.

ఉగాది శుభాకాంక్షలతో

అరుపపల్లి లక్ష్మీరాజం
కమాన్‌పూర్ (తాలూకా పెద్దపల్లి)

ప్రజాశక్తి ప్రహ్లాదుడు

✲ శ్రీ జె. బాపురెడ్డి

ఈ నదులు మన ఎదలు
ఈ కండలు మనకొండలు
ఈ గనులు మన కనులు
ఈ పొలాలు మన బలాలు
ఇవి మన అందరికోసం
ఇది మన భారత దేశం
ఈ దేశపు సరిహద్దులు దాటి
ఏ శత్రువు రాలేదు
వచ్చాడా, చచ్చాడే
బ్రతికి బయటపడలేదు

మన పవిత్ర తీరాలను
పరిరక్షించే పారావారాలను
సముత్తుంగ తరంగ తురంగాలను
లొంగదీయ చూచిన దొంగ నీడలే
తిమిర తిమింగిలాల ఓడలే
మునిగిపోతున్నాయి ఆ మున్నీటిలో
ఉప్పొంగిన ఉద ధీశుని కదన వాటిలో

జాతి ఆర్థిక జీవనామృత భాండంలో
తస్కర ముష్కర పన్నగాలు
విదేశీ విషబిందువుల్ని రాల్చలేవు

మన కమ్మని కలల ఖాండవ వనాన్ని
విద్వేష హుతాశన కీలలు కాల్చ లేవు
అదుగో!
పచ్చి నెత్తురు త్రాగ మరిగిన
విచ్చుకత్తుల కుత్తుకలు తెగిపోతున్నాయి
నీతికి నిజాయితీకి
గోతులు త్రవ్విన గుంట నక్కలు
ఆ గోతుల్లోనే పాతుకు పోతున్నాయి —

చెట్ల చెవుల్లో పక్షులు చెప్పేస్తున్నాయి
చీకట్ల రహస్యాలు
అన్ని గుట్లూ గ్రహించినట్లు ఆ చెట్లు
తలలూపు తున్నాయి
దారుల వెంబడి నిలబడి
దొంగ రవాణా దారులను పట్టేస్తున్నాయి—

అణువు అణువులో
దేశభక్తి ఆవిష్కృత మౌతున్నది
అడుగడుగున ప్రజా శక్తి
ఆశువుగా అవతరిస్తున్నది
మోసం వలలో చిక్కిన దేశం
ముక్తిని సాధిస్తున్నది—

పల్లెటూళ్ళ పండు వెన్నెలల్ని ఎత్తుకుపోయి
పంజరాలలో బంధించి
పట్టణాల వీధుల్లో అమ్ముకుంటున్న
కసాయి వాళ్లు
కటకటాల పంజరాల్లో నేడు
కాలం చేస్తున్నారు —

నిత్యావసర వస్తువుల నిలువలు చేసి
వాటి విలువల వలువలు ఊడదీసి
చీకట్లో వేలం వేసి
స్త్రీకుక్షుల కైవసం చేసి
అనాథులను అడవికి పంపిన
ఆధునిక శకునుల ఆటలు సాగవిక—


మట్టి మాట్లాడుతున్నది
హిమాలయ శృంగాలతో
హిందూ మహాసాగర భంగాలతో
సమాజాన్ని పట్టి పీడించిన స్వార్థం
కూలిపోతున్నది శృంగభంగాలతో

అద్దె ఎంత ఇచ్చినా
అన్యాయాలను మోయలేనంటున్నవి
శకటాలు
మొండి శొండి శకటం ఏదైనా ఒప్పుకున్నా
రహదారులు దాని డొక్క చీల్చేస్తున్నాయి
ఒళ్ళంతా కళ్ళుచేసుకుని నిఘా వేస్తున్నాయి

శరణం లేదు
అమాయకుల సహనస్తంభాన్ని
కాల దన్నిన
దురాశా దురాచార హిరణ్యకశిపులకు
ఇక ఎక్కడా శరణం లేదు
దోపిడిలకు, దొంగ వ్యాపారాలకు
మరణం తప్ప శరణం లేదు
ప్రజాశక్తి ప్రహ్లాదునికి మరి భయం లేదు.



నృత్య, నాటక పోటీల్లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న గిరిజన నృత్యం




ఆటకులో యకో యీ పాఠశాల విద్యార్థులు

కోరుకొండ సైనిక పాఠశాల


1962 లో ప్రారంభమైన కోరుకొండ సైనిక పాఠశాలలో ఇప్పుడు షెడ్యూలు కులాల, షెడ్యూలు జాతులకు చెందిన 40 మంది బాలలతో సహా 483 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో హెచ్చుమంది గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చినవారు. నెలజీతం రూ 300 లకు మించని కుటుంబాల్లోంచి వచ్చిన విద్యార్థులు 183 మంది ఉన్నారు రాష్ట్రప్రభుత్వ నిధులవల్ల నడుపబడుతూన్న యీ పాఠశాల సమాజంలోని అసమానతలను తొలగించే లక్ష్యాన్నీ, అన్ని వర్గాల ప్రజల్లోంచీ వచ్చిన బాలల్లో ప్రతిభగుర్తింపు లక్ష్యాన్నీ నెరవేరుస్తోంది.

వార్షికోత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి తమ ప్రసంగంలో గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు దృష్టిలో పెట్టుకొని పాఠశాలను తీర్చిదిద్దాలని ఉద్బోధించారు.


ప్రిన్సిపాల్ కమేండర్ ఎల్. ఎస్. చౌదరి ఆంధ్రప్రదేశ్ కీర్తిని ఇనుమడించే విధంగా నడుపబడుతూన్న యీ పాఠశాల గతంలో సాధించిన లక్ష్యాలను వివరించారు. సాంఘికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజల నుండి ప్రతిభగల విద్యార్థులు నేషనల్ డిఫెన్సు ఎకాడమిలో ప్రవేశానికి యీ సంస్థ చేస్తూన్న గణనీయమైన సేవను తెలియజేశారు.




విద్యార్థులు ప్రదర్శించిన "హిట్లర్ అంతిమ దినాలు'' అనే ఆంగ్ల నాటకంలో ఒక దృశ్యం




రసవత్తరంగా నడుస్తూన్న ఒక తెలుగు నాటకం




ముఖ్యమంత్రి ప్రసంగం



విద్యామంత్రి విజేతలకు బహూకరిస్తున్న కులకర్ణి ట్రాఫీ




ప్రిన్సిపల్ కమేండర్ ఎల్. ఎస్. చౌదరి వార్షిక నివేదిక సమర్పణ



వార్షిక అథ్లెటిక్ పోటీలకుముందు ప్రమాణస్వీకార దృశ్యం



ముఖ్యమంత్రి సైన్సు ఎగ్జిబిషన్ సందర్శన



కవాతు ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు

స్త్రీలకు పురుషులతో సమాన వేతనాలు

శ్రీమతి భండారు సరోజినీ దేవి

వరండాలో పిల్లలు లెక్కలు చేసికొంటున్నారు. "ఒక పనిని యిద్దరు పురుషులు నలుగురు స్త్రీలు ఒకరోజులో చేయగలరు. ఒక పురుషునికి రోజుకు రు. 3-00లు, స్త్రీకి రోజుకు రు. 2-00లు కూలీ అయిన ఆ పని చేయుటకు ఎంత ఖర్చగును?"

స్త్రీలు పురుషులతో సమానంగా పని చేయలేరనే భావం మనకు చిన్నతనం నుండి యిలా నూరిపోయటం జరుగుతున్నది. పురుషులు స్త్రీలకన్న ఎక్కువ పని చేస్తారని చెప్పి వారికి ఎక్కువ కూలి యివ్వటం అనాదిగా వస్తున్నది. మన పల్లెలలో వ్యవసాయ కూలీలలో సగానికి పైగా ఆడవారే. వరి నాట్లు, జొన్నకోతలు, మొదలయిన పనులలో స్త్రీలు పురుషులకు ఏమీ తీసిపోకుండా పని చేస్తారు. కాని మగవాళ్ళకన్నా మాకు కూలీ తక్కువ ఎందుకిస్తున్నారు అని ఆడవారడిగితే జవాబు ఉండదు. ఒకవేళ జవాబు వస్తే ఓ వెకిలినవ్వు నవ్వి—'మగాడికీ నీకూ సావత్యమేంటే, పెద్ద మొగరాయుడిలా అడగొచ్చావ్!' అని వేళాకోళం.

తేయాకు, రబ్బరు, కాఫీ తోటలలో పనిచేసే వేలాది స్త్రీలు యిటువంటి విచక్షణకే గురి అవుతున్నారు. 1973-74లో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఒక సంఘం దేశమంతటా 200 పరిశ్రమలలో యీ విషయమై పరిశీలన చేసింది. వారు తేల్చిన విషయాలు అందరూ తెలుసుకోదగ్గవి. అగ్గిపెట్టెల పరిశ్రమలో మజూరు పనిచేసే పురుషునికి రోజు కూలీ రు. 3 69 కాగా, అదే పని చేసే స్త్రీకి రోజుకు కేవలం 72 పైసలు యిస్తున్నారు. మగ ఆపరేటర్ రోజుకు రు. 3.89 సంపాదిస్తుండగా ఆడ ఆపరేటర్‌కు రోజుకు రు. 1 07 మాత్రమే లభిస్తున్నది పొగాకు పరిశ్రమలో మగ చెక్కర్ రోజుకు రు. 6 06 తీసికొంటాడు. కాని ఆడ చెక్కర్‌కు యిచ్చేది రు. 1.87, కట్టు పనులలో కత్తిరింపులు చేసే మేస్త్రీలలో మగవారికి రోజుకు రు. 6.50 యిస్తూ ఆడవారికి రు. 1.50 మాత్రమే యిస్తున్నారు.

ఒకే పని చేసినందుకు ఒకే వేతనం యివ్వకుండా విచక్షణ చూపటం అర్థం లేనిపని, ఆడవాళ్ళకు అవమానకరంకూడా. అనేక రంగాలలో ఆడవాళ్ళు యీ అన్యాయానికి తలవంచి పని చేస్తున్నారంటే దానికి కారణం వారి పేదరికమే.

1967 నవంబరులో ఐక్యరాజ్య సమితి—ప్రపంచ వ్యాప్తంగా వున్న యీ విచక్షణకు స్వస్తి చెప్పాలని, స్త్రీ పురుషులను అన్ని రంగాలలో సమానంగా పరిగణించాలని కోరింది.

అత్యవసర పరిస్థితి వచ్చిన తరువాత మన ప్రభుత్వం "ఒకే పని చేసినందులకు స్త్రీలకు, పురుషులకూ ఒకే వేతనం యివ్వాలి" అని ఉత్తర్వు చేసింది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్త్రీలకు లాభం కలిగించటానికి తీసికొన్న అనేక చర్యలలో యిది తలమానికం వంటిది.

ఈ శాసనం వచ్చి యిప్పటికి సంవత్సరం దాటింది. ఇది ఎలా అమలు జరుగుతున్నది? ఈ శాసనాన్ని సరిగ్గా అమలు జరపటానికి తగినంత యంత్రాంగం లేదు ఈ శాసనం వలన స్త్రీలను ఆయా పనులలో నియమించకుండా కేవలం పురుషులనే కొందరు నియమించుకోవాలని చూస్తారు అట్టివారిని శిక్షించటానికి కూడా యీ శాసనంలో నిబంధనలున్నాయి ఆ నిబంధనలు అమలు జరిగేటట్లు చూడటానికి కూడా పటిష్టమైన యంత్రాంగం అవసరం.

కేవలం శాసనాల వలననే సమస్యలు పరిష్కారం కావు. ఇటువంటి శాసనాలు అమలుజరుపటానికి సరియైన వాతావరణం ఏర్పరచటానికి ప్రచారం జరగాలి ఆయా ప్రాంతాలలో మహిళా మండలులు మొదలయిన స్వచ్ఛంద సంఘాలు తీవ్రంగా కృషి చేయాలి. పెద్ద ఉద్యోగాలలో పదవులలో వున్న స్త్రీలు యీ శాసనం సరిగా అమలవుతున్నదీ, లేనిదీ శ్రద్ధగా పరిశీలిస్తుండాలి.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వం రావాలంటే, ముందు స్త్రీలలో తాము పురుషులకన్న తక్కువ వారమనే భావం పోవాలి. తమకన్న బాగా చదివిన వారిని పెద్ద ఉద్యోగాలలో వున్నవారిని తమకు భర్తలుగా లభించాలని ఆడవారు కోరుకుంటుంటారు. ఇది వారిలోని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుకు చిహ్నంగా కొందరు వర్ణించటం సహేతుకమే అనిపిస్తుంది. ఇలాంటి భావాలు వదలుకొంటే, కట్నాల సమస్యకూడా పరిష్కారం కావచ్చు. స్త్రీలకు మేలు చేకూర్చటానికి ఉద్దేశించిన చట్టాలు బాగా అమలు అయేట్లు స్త్రీలే మరింత శ్రద్ధతో కృషి చేయాలి.

హెచ్చరింత

*కళాప్రపూర్ణ శ్రీ ముమ్మల సీతారామమూర్తి

కూడు లేదని గూఁడు లేదని
గొణఁగ నేలా తమ్ములారా
గంగ వంటి మహా నదుల్ మన
గడ్డపై సాగన్

జాతి బండల మీఁద నైనను
రాజనాల్ పండించు కాఁపులు
కండ గల కై నేర్పు గల మన
కర్మకరు లుండన్

ఆర్త సేవకు జీవి తమ్ముల
నంకితము గావించి బడలెడి
కర్మ యోగు లమాత్యులై మన
గడపలో నిలువన్

అన్నిచక్కన లన్ని మన్నన
లాంధ్ర భూమికి దక్క వలె నని
ముఖ్యమంత్రి కఠోర దీక్షా
ముద్రతో నడువన్

కట్టతెగి గోదావరీ ఝరి
కదలిపా లగువేళఁ బంటకుఁ
జెట్టరాపీ నన్న యానెఱ
జెట్టి కగు శుభముల్

ఏలువారికి నండగా నా
బాలవృద్ధము నిల్వఁబడవలె
చట్టముల తోడనె బెడందలు
సడలిపో వెపుడున్

మండలమ్ముల వంగడమ్ముల
మాట మరచి తెలుంగు లందఱు
నొక కుటుంబముగా మెలంగుట
కొప్పు కొన వలయున్

ప్రేమవాహిని పొంగినపుడే
సోమరితనం బణఁగినపుడే
బ్రతుకులో మాధుర్య మొల్కును
భాగ్యములు పండున్

దొంగతనమున కంటె మిక్కిలి
దోస మగు నర్థమును దాఁచుట
మనకు మనమే పగఱ మగుటకు
మార్గ మీ దోసఁగు

వెలుపలన్ గల వైరికోటికి
వెఱవఁగాఁ బనిలే దొకింతయు
ఎడఁదఁగల లోభాది రిపులే
యేర్పెదరు పురుషున్

ఒడలు నే నని యెంచి నపుడే
పొడముదురు మోహాది శాత్రవు
లాత్మ నే నని తెలిసి కొన్నపు
డవని స్వర్గ మగున్

జిల్లావార్తలు

తిరుపతిలో హాస్టల్ భవనానికి గవర్నరు ప్రారంభోత్సవం

ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నరు శ్రీ ఆర్ డి భండారే, తిరుపతిలో జనవరి 30న హాస్టల్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 100 మంది విద్యార్థులకు వసతి కల్పించే యీ హాస్టల్‌ను రూ 3 లక్షలతో నిర్మించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ షెడ్యూలు కులాలకు విడిగా హాస్టళ్ళను ప్రారంభించినందువల్ల వారిలో తాను ఇతరులకన్న వేరువర్గం అనే భావం కల్గుతుందని అది సమైక్యతకు దారి తీయదని ఇందువల్ల షెడ్యూలు కులాలు, షెడ్యూల్డ తెగల సంక్షేమానికి కృషి చేసిన మహానాయకుల ఆశయాలు నెరవేరవని అన్నారు.

అంతకుముందు ఉత్సవానికి అధ్యక్షత వహించిన బీహారు మాజీ గవర్నరు శ్రీ ఎమ్. అనంతశయనం అయ్యంగార్ ప్రసంగిస్తూ తిరుపతి సమీపంలోని నాలుగు షెడ్యూలు కులాల కాలనీలలో హరిజనులకు ఇంకా ఎక్కువ ఇళ్ళ స్థలాలను కేటాయించాలని, వారికి సమిష్టి సహకార వ్యవసాయ సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ఇందువల్ల వీలుకలుగుతుందని అన్నారు.

శ్రీమతి శకుంతలాబాయి భండారే రూ. 1 25 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న షెడ్యూలు కులాల బాలికల హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేశారు వర్ణాంతర దంపతులకు ప్రోత్సాహక బహుమతులను గవర్నరు అందజేశారు.

అనంతశయనం కుష్ఠురోగుల కాలనీ గవర్నరు సందర్శన

మాజీ గవర్నరు శ్రీ ఆర్. డి. భండారే, జనవరి 30న తిరుపతి సమీపంలోని అక్కరంపల్లిలో అనంతశయనం కుష్ఠురోగుల కాలనీని సందర్శించి కాలనీలోని 130 మంది రోగులకు బ్లాంకెట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఇటువంటి రోగులకు మందులు పౌష్టిక ఆహారము ఇవ్వడంతోపాటు వారికి విడిగా వసతి సౌకర్యం కల్పించాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు. ప్రభుత్వంతోపాటు హింద్ కుష్ఠు నివారణ సంఘం వంటి స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ముందుకు వచ్చి యీ రోగులను ఆదుకోవాలని అన్నారు.

జిల్లా కలెక్టరు 81 మంది రోగులకు రూ. 20 రూపాయల చొప్పున పెన్షన్‌ను, 10 ఎకరాల భూమిని కేటాయించారు. రెండు బోరింగు బావులను రూ. 5,000 చొప్పున ఖర్చుతో ఏర్పాటు చేశారు. వాటికి ఆయిల్ ఇంజన్ కూడా అమర్చారు, స్థానిక రైతు శ్రీ గంగిరెడ్డి ఒక ఎకరం భూమిని విరాళంగా ఇచ్చారు. రోగుల కుటుంబాల సభ్యులకు గుడిసెలను కూడా ఏర్పాటు చేశారు.

గవర్నరు సతీమణి రోగులకు ఉచితఆహారం పంపిణీచేశారు.

బుడమేరు ఆయకట్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రసంగిస్తూ గత రెండు సంవత్సరాలలోను 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం లక్ష్యాలసాధన విషయంలో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ రికార్డును చేరుకొన్నదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎగువ ప్రాంతాలలో నీటిపారుదల సదుపాయల కల్పన విషయంలోను ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తున్నదని అన్నారు ముఖ్యమంత్రి విజయవాడకు 50 మైళ్ల దూరంలోవున్న ఇలవర్రు గ్రామంలో బుడమేరు ఆయకట్టుకు జనవరి 30 వ తేదీన శంకుస్థాపన చేశారు

ఈ ప్రాంతంలో బలహీనవర్గాలవారికి లాభం చేకూరే నిమిత్తం కొల్లేరు మత్స్య అభివృద్ధి పథకం చురుకుగా అమలు జరిగేందుకు చర్యలు తీసుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు ఏలూరుతో కమ్యూనికేషన్ సౌకర్యాలను మెరుగు చేసేందుకు ఇలవర్రుకు ఒక బస్సు రూటును మంజూరుచేస్తారని, ఒక రోడ్డును వేస్తారని అన్నారు.


మధ్యతరహా నీటిపారుదల శాఖామాత్యులు శ్రీ వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ వచ్చే యేటి వార్షిక ప్రణాళికలో నీటిపారుదల రంగానికి రూ.135 కోట్లు కేటాయిస్తారని ఈ రంగానికి గత సంవత్సరం కేటాయింపు రూ. 87 కోట్లు అని అన్నారు. కృష్ణా గోదావరి జిల్లాలలో ఛానల్ పథకాలకు ఎర్రకాలువ, బుడమేరు, తమ్మిలేరు వంటి డ్రైనేజి పథకాలకు తదితరాలకు వచ్చే సంవత్సరం రూ. 107 కోట్లు ప్రణాళిక చేబడతారని అన్నారు.

పండ్ల మార్కెట్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

జనవరి 30 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, కేదారేశ్వరంపేట వద్ద ఫ్రూట్ కమీషన్ వ్యాపారుల సంఘం నిర్మించనున్న రూ. 35 లక్షల వ్యయం అయ్యే టోకుధరల పండ్ల మార్కెట్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడిపండ్లను నిలువ చేసేందుకు శీతలీకరణ కేంద్రాన్ని నెలకొల్పి నిల్వచేసుకొని ఆ కాలంలో వాటిని ఎగుమతిచేయడం ద్వారా హెచ్చు లాభాలను పొందవచ్చునని విజయవాడలోని పండ్ల టోకు వర్తకులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ పరిపాలన శాఖామంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ నిధుల దుర్వినియోగాన్ని, లంచగొండి తనాన్ని రూపు మాపడం ద్వారా మున్సిపాలిటీల ఆదాయం ఎంతగానో మెరుగైనదని అన్నారు. మున్సిపాలిటీలు నూటికి నూరుపాళ్లు పన్నుల వసూళ్లు చేయగలిగినప్పుడే పటుతరంగా పని చేయగలుగుతాయని అన్నారు.

జిల్లాల్లో వార్తా చిత్రాలు.




రూ 60 వేల వ్యయంతో పోలీసు సిబ్బంది శ్రమదానంచేసి నిర్మించిన మామునూరు పాఠశాలను హైదరాబాద్ డి.ఐ.జి. శ్రీ పి. వి. పవిత్రన్, ఐ. పి. ఎస్ డిశంబరు 28న ప్రారంభోత్సవం చేశారు




చిన్నతరహా పరిశ్రమల శాఖమంత్రి శ్రీ వై నారాయణ స్వామి ఇటీవల రాయదుర్గంలో బలహీనవర్గాలవారికి భూమి పట్టాలు పంపిణీ చేశారు





బందరు తాలూకా పోలవరం గ్రామంలో వస్త్రాలపై కలంకారీ కళను పరిశీలిస్తున్న జపాన్ ప్రతినిధులు



గుంటూరులో లక్ష్మీసూపర్ బజారును మాజీ గవర్నరు సతీమణి శ్రీమతి శకుంతలా ఖండారే జనవరి 8న సందర్శించారు







కుడివైపు పైన: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో డి.ఎన్.ఆర్. కళాశాల అదనపు భవనానికి ప్రారంభోత్సవం.

ఎడమవైపు పైన: జనవరి 7న తెనాలిలో రాజేంద్రప్రసాద్ స్మారక క్లబ్ రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణమంటపం శంకుస్థాపన.

ఎడమవైపు మధ్యన: జనవరి 4న గుడివాడలో బియ్యం మిల్లర్ల సమావేశం సందర్భంగా ఆర్థిక, సమాచారశాఖ మంత్రి శ్రీ పి. రంగారెడ్డి తుఫాను నష్టానికి గురైన వరిపంట నమూనాను పరిశీలించారు.

ఎడమవైపు క్రింద: శ్రీ పి. రంగారెడ్డి అవనిగడ్డ దివిసీమ లలితా కళాసమితికి జనవరి 4న ప్రారంభోత్సవం చేశారు.

కుడివైపు క్రింద: ఎర్రగడ్డలో జనవరి 30న రహదార్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ సిహెచ్. వెంకట్రావు పశువుల ఆస్పత్రి విభాగానికి ప్రారంభోత్సవం చేశారు.





న్యాయశాఖామాత్యులు శ్రీ ఆసిఫ్ పాషా, మాట్లాడుతూ ఇతర వర్తకులకు వలెనే, పండ్ల రిటైల్ వర్తకులకు కూడా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని అన్నారు.

రోడ్లు, భవనాల శాఖామాత్యులు శ్రీ సి హెచ్ వెంకట్రావు మాట్లాడుతూ, మామిడిపండ్ల కాలంలో చేరువనున్న గ్రామాల నుండి పండ్లను చేరవేసేందుకు వచ్చే ఎద్దుబండ్లు నిలుపుకొనేందుకు ఎద్దుబండ్ల స్టాండును నెలకొల్పాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పశువైద్యశాలకు ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, జనవరి 30 వ తేదీన విజయవాడకు 30 మైళ్ల దూరంలోవున్న వెంట్రప్రగడ వద్ద పశువైద్యశాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందరంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం, పాడిపశువులు, పాలకేంద్రాల అభివృద్ధిపై ఆధారపడివున్నదని అంటూ కోళ్ల పెంపకం పాడికేంద్రాలు వంటి కుటీరపరిశ్రమలను పంజాబ్, హర్యాన రాష్ట్రాలవలెనే మన రాష్ట్రంలో కూడా ప్రారంభించుకోవాల్సిందిగా రైతులకు సలహాయిచ్చారు.

పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ సాగి సూర్యనారాయణరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ అనేక పశుసంవర్ధక పథకాలను అమలు చేయడంలోను పశువైద్యశాలలకు భవనాలు తదితర సౌకర్యాలను విరాళమివ్వటంలోను కృష్ణాజిల్లా రాష్ట్రమంతటికీ అగ్రగామిగా వున్నదని కొనియాడారు.


పశువైద్యశాలకు రూ. 70 వేలు మేరకు విరాళమిచ్చిన శ్రీ చలసాని కుటుంబరావును ముఖ్యమంత్రి అభినందించారు.

జిలాపరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీ పి. కోటేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు శ్రీ ఎం. అంకినీడు, శాసనసభ్యులు శ్రీ సత్యనారాయణరావు, శ్రీ కాజ రామనాధం, కృష్ణాజిల్లా కలక్టరు శ్రీ సి.యస్. రావు ప్రభృతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

హరిజనులకు పట్టాల పంపిణీ

మత్స్యశాఖామాత్యులు శ్రీ డి. మునుస్వామి, కడప జిల్లా రాయచోటివద్ద జనవరి 29 న హరిజనులకు 106 ఇండ్లస్థలాల పట్టాలను, 31 ఎకరాల మేరకు సంబంధించిన 12 భూమి కౌలు పట్టాలను పంపిణీచేశారు.

విద్యారంగం గూర్చి ప్రస్తావిస్తూ 1975-76 సంవత్సరానికి ప్రభుత్వం ఈ రంగంలో రూ. 140 కోట్లు ఖర్చుచేసిందని, హరిజనులు, తదితర వెనుక బడిన వర్గాలవారు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. తమకు యిచ్చిన వినతిపత్రానికి మంత్రి సమాధానమిస్తూ రాయవరం గ్రామంలో లిఫ్ట్ యిరిగేషన్ పథకం మంజూరీ విషయమై కృషిచేస్తామని హామీ యిచ్చారు. వ్యవసాయ కార్మికసేవాసమాజం గౌరవ అధ్యక్షుడు శ్రీ పి. వి. భద్రయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అధ్యక్షుడు శ్రీ రాజరత్నం వందనసమర్పణ చేశారు.



పెనుగొండ పంచాయతీసమితికి సర్దార్ పటేల్ వనమహోత్సవం షీల్డ్ బహుమతి

ప్రజలలో మొక్కలునాటే అలవాటును పెంపొందించటానికి కేంద్రప్రభుత్వం ప్రతిసంవత్సరం దిగువ తెలిపిన వనమహోత్సవ షీల్డును బహూకరిస్తున్నది.

ఉత్తమ జిల్లాలకు రాజేంద్ర షీల్డు, ఉత్తమ గ్రామానికి జవహర్ షీల్డు, ఉత్తమ సంస్థకు సర్దార్‌పటేల్ షీల్డు, ఉత్తమ విశ్వవిద్యాలయానికి మున్షీ షీల్డు.


1973 వ సంవత్సరానికి సంబంధించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్దార్ పటేల్ షీల్డును గెలుచుకున్నది. అనంతపురం జిల్లాలోని పెనుగొండ పంచాయతీసమితి ఈ షీల్డు పొందడానికి అర్హమైనదిగా ఎంపికచేశారు.


పెనుగొండ పంచాయతీ సమితి ప్రెసిడెంటు తరపున ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ శ్రీ. పి. యస్. రావు డిసెంబరు 15 న భోపాల్‌లో అటవీవిషయాల కేంద్ర మండలి 16 వ సమావేశంలో కేంద్ర వ్యవసాయ నీటి పారుదల మంత్రి శ్రీ అన్నా సాహెబ్‌షిండే నుండి ఈ షీల్డును స్వీకరించారు.

1972 వ సంవత్సరానికి సంబంధించి ఈ షీల్డు గెలుచుకొన్న హిమాచల్ ప్రదేశ్ నుండి 1977 జూన్ నాటికి ఈ షీల్డును పొందుతారు., 1973 వ సంవత్సరపు విజేతలు ఈ షీల్డును 1977 డిసెంబరు 13 వరకు తమ వద్ద వుంచుకొంటారు.

మత్స్య శీతలీకరణ కేంద్రం

మత్స్యశాఖామాత్యులు శ్రీ డి. మునిస్వామి, కడపలో జనవరి 30వ తేదీన మున్సిపల్ క్రొత్త మార్కెట్ వద్ద ఆంధ్రప్రదేశ్ మత్స్య అభివృద్ధి సంస్థవారి మత్స్యశీతలీకరణ యంత్రం ఒక టన్ను శక్తివంతమైనదానికి ప్రారంభోత్సవం చేస్తూ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ద్వారాను, సబ్సిడీ యిచ్చి జాతీయ బ్యాంకులద్వారా ఆర్థిక సహాయంతో నైలాను వలల కొనుగోలుకు, తదితరాలకు మత్స్యపారిశ్రామికులకు సహాయపడుతున్నదని అన్నారు. రాష్ట్రంలో మత్స్యపారిశ్రామికుల పిల్లలకు శిక్షణా సంస్థలు నెలకొల్పుతారని అన్నారు. వివిధ కార్యక్రమాలు అమలు






కుడివైపు పైన: చక్కెర పరిశ్రమల శాఖమంత్రి శ్రీ కె. బి నరసప్ప జనవరి 3వ బెత్తంచెర్లలో బహిరంగసభలో ప్రసంగించారు


ఎడమవైపు పైన. జనవరి 1వ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళ రావు ఖమ్మంలో జూబిలీక్లబ్ ప్రదర్శనశాలకు ప్రారంభోత్సవం చేశారు.


ఎడమవైపు మధ్య: జనవరి 1వ ఖమ్మంలో నాగార్జున గ్రామీణ బ్యాంకు సహాయంతో సన్నకారురైతుల అభివృద్ధి సంస్థ నిర్వహించే సహకార కోళ్ళపెంపకం–పందుల పెంపకం విభాగానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

ఎడమవైపు క్రింద: జనవరి 1వ బెత్తంచెర్లలో శేషారెడ్డి ఉన్నత పాఠశాల రజతోత్సవాలలో ముఖ్యమంత్రి ప్రసంగం.

కుడివైపు క్రింద: కృష్ణాజిల్లా ఇలప్రరు వద్ద జనవరి 1వ ముఖ్యమంత్రి బుడమేరు ఆనకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు







చేసి విజయవంతం చేసేందుకు ప్రభుత్వంతో సహకరించవలసిం దిగా ఆయన కోరారు. శాసనసభ్యులు శ్రీ జి. రంగారెడ్డి కార్య క్రమానికి అధ్యక్షత వహించారు.

హనుమాన్ జంక్షన్ వద్ద సహకార చక్కెర ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, జనవరి 30వ తేదీన ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకార రంగంలో 6 చెక్కెర ఫ్యాక్టరీలను మంజూరు చెసిందని అనంతపురం జిల్లా హిందూపురంలో నిజాం చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యంలో ఒక ఫ్యాక్టరీ మంజూరుచేసిందని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విష యంలో ప్రభుత్వం హెచ్చు శ్రద్ధ తీసుకుంటున్నదని అన్నారు. మంజూరైన ఫ్యాక్టరీలలో మొదటిదిగా హనుమాన్ జంక్షన్ వద్ద నెలకొల్పనున్న సహకార చక్కెర ఫ్యాక్టరీకి ఆయన శంకుస్థాపన చేశారు.

నాగార్జునసాగర్ నీటిని కృష్ణా జిల్లాలోని ఎగువ ప్రాంతాలకు వదులుతారని, రైతులకు ఎక్కువ లాభాన్ని యిచ్చే నీటి పారుదల వల్ల పండే మెట్టపంటలను వేయాల్సిందిగా రైతులకు ముఖ్యమంత్రి సలహా యిచ్చారు. 1981 నాటికి నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు పూర్తి అయి నీటి పారుదల పుష్కలంగా నీటి సర ఫరా జరుగుతుందని ఆయన అన్నారు.

పంచదార పరిశ్రమల శాఖామంత్రి శ్రీ కె.బి. నరసప్ప కార్య క్రమానికి అధ్యక్షత వహిస్తూ రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల విస్తీ ర్ణంలో చెరకు తోటలను పెంచుతున్నారని దేశం మొత్తంమీద పంచదార ఉత్పత్తి విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి అయ్యేం దుకు మరో 4 లక్షల ఎకరాలలో ఈ పంట పండించవలసిందని అన్నారు.

రహదారులు, భవనాల శాఖామంత్రి శ్రీ సి.హెచ్. వెంక ట్రావు, న్యాయశాఖామాత్యులు శ్రీ ఆసిఫ్‌పాషా, కోస్తా ప్రాంతం అభివృద్ధి సంఘం అధ్యక్షులు శ్రీమతి బి. జయప్రద, ప్రభృతులు ప్రసంగించారు.

విద్యార్థులచే శ్రమదానము

ఒంగోలులోని డబ్ల్యు. ఎం. కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం విభాగం విద్యార్థులు ఒంగోలుకు 35 కిలోమీటర్ల దూరం లో నందనవనం గ్రామంలో శ్రమదానంతో నిర్మించిన 1 1/2 ఫర్లాం గుల రోడ్డుకు జిల్లా కలక్టరు శ్రీ కె. స్వామినాథన్, జనవరి 12వ తేదీన ప్రారంభోత్సవం చేశారు హరిజనవాడను కలిపే ఈ లింకు రోడ్డును 40 మంది విద్యార్థులు 6 రోజుల్లో శ్రమదానం చేసి నిర్మిం చారు. రోడ్డ నిర్మాణంతో పాటు వీరు కుటుంబనియంత్రణ ప్రచారం, పారిశుధ్య ప్రచారం తదితర కార్యక్రమాలను కూడా గ్రామంలో చేపట్టారు.



ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం: మంత్రి సమీక్ష

హరిజన సంక్షేమం, మార్కెటింగ్ శాఖామంత్రి. పి. మహేంద్రనాథ్, జనవరి 10న ఆదిలాబాదులో మార్కెటింగ్ సంఘం సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ గిడ్డంగులను ఏర్పాటు చేసి నప్పుడే వ్యవసాయదార్లకు గిట్టుబాటైన ధర లభిస్తుందని అన్నారు. ఈ గిడ్డంగులు రైతులు,మార్కెట్ సంఘాల మధ్య అనుసంధానంగా గా వ్యవహరిస్తాయి. గిడ్డంగులలో వుంచిన ఉత్పత్తులకు బ్యాంకులు ఆర్థిక సహాయక సంస్థల నుండి రుణాలు లభిస్తాయి.

గిడ్డంగుల నిర్మాణానికి మార్కెట్లకు ఋణాలను మంజూరు చేస్తారని మంత్రి హామీ యిచ్చారు.

ఆ తర్వాత మంత్రి ఆదిలాబాదు తాలూకా జిమ్మా గ్రామానికి చెందిన ప్రజలకు కోళ్ళ పరిశ్రమ నెలకొల్పడానికి 11 మందికి రు 500ల చొప్పున ఋణాల మంజూరీ పత్రాలను పంపిణీచేశారు.

అంతకుముందు మంత్రి జిల్లాలో 20 సూత్రాల ఆర్థిక కార్య క్రమం అమలును గూర్చి సమీక్షించారు

రైతులకు ఋణాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి బ్యాంకు తాత్కాలిక అధ్యక్షుడు శ్రీ బండారు రత్నసభాపతి జనవరి 2వ తేదీన కడప జిల్లా సిద్ధవటం తాలూకా ముతుకూరు గ్రామంలో ముతుకూరు పంపింగ్ స్కీము క్రింద భూములు మరమ్మత్తు చేసుకొనుటకుగాను 51 మంది రైతులకు 1 లక్ష రూపాయల ఋణాల చెక్కులు పంపిణీ చేశారు

ఈ సందర్భంలో జరిగిన బహిరంగ సమావేశానికి సిద్ధవటం భూమి అభివృద్ధి బ్యాంకు కోశాధికారి శ్రీ యల్. మల్లేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు.

సర్వశ్రీ డి. చెన్నయ్య, యన్. కృష్ణమరాజు, యస్. రామభద్రయ్య, బి గోపాలరెడ్డి ప్రభృతులు కూడా యీ సమా వేశానికి హాజరైనారు.

"ఆంధ్ర ప్రదేశ్" మాసపత్రిక ప్రచురణ వివరాలు

(వార్తా పత్రికల రిజిస్ట్రేషన్ రూలు 8, ఫారం IV ప్రకారం)

ప్రచురణ స్థలం : హైదరాబాదు

ప్రచురణ వ్యవధి : మాస పత్రిక

ముద్రాపకుని, చిరునామా: డైరెక్టరు, ప్రభుత్వ కేంద్ర ముద్రణాలయం,

చంచల్‌గూడ, హైదరాబాదు-500036

ప్రచురణ కర్త : శ్రీరాజ్యం సిన్హా

చిరునామా : డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు-1

ప్రధాన సంపాదకులు : శ్రీరాజ్యం సిన్హా

చిరునామా : డైరెక్టరు, సమాచార పౌరసంబంధ శాఖ హైదరాబాదు-1.


పత్రిక పెట్టుబడిలో ఒక శాతం కంటె ఎక్కువ పేర్లుగల సభ్యులు లేక భాగస్వాములైన వారి పేర్లు, వారి చిరునామాలు } —

పైన పేర్కొన్న వివరములు యధార్థములు

హైదరాబాదు
1-3-1977

(సం) శ్రీరాజ్యం సిన్హా
ప్రచురణకర్త

PRINTED BY THE DIRECTOR OF PRINTING GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS ANDHRA PRADESH HYDERABAD


Granary of the South



ఆంధ్ర ప్రదేశ్

ఏప్రిల్, 1977 వెల: 50 పైసలు

కందుకూరి వీరేశలింగం



(తరువాయి 3 వ కవరు పేజీలో)

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 21 | ఏప్రిల్, 1977 చైత్ర-వైశాఖ, 1899 శా.శ. | సంచిక : 5

ప్రధాన సంపాదకులు :
శ్రీరాజ్యం సిన్హా

సంపాదకులు
కుందుర్తి ఆంజనేయులు

ముఖచిత్రం : మన కొత్త ప్రధాన మంత్రి
శ్రీ మొరార్జీ దేశాయి

రెండు,మూడు కవరుపేజీలు: కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్ర
(బుజ్జాయి బొమ్మల చిత్రాలు)

చివరికవరు పేజీ : "హుష్ ! మాటాడకు"
(ఫొటో : శ్రీ ఎం. మురళీధరాచార్యులు)

మధ్య పేజీల్లో ; భీముని పట్నం దృశ్యాలు
(ఫోటోలు : "రాజు")

వెల: 50 పైసలు

సాలుచందా : ఆరు రూపాయలు

ప్రచురణ :
డైరెక్టర్,
సమాచార, పౌర సంబంధ శాఖ,
హైదరాబాద్

ముద్రణ :
డైరెక్టర్,
కేంద్ర ముద్రణాలయం,
హైదరాబాద్.

రిజిస్టరు నెం : హెచ్. హెచ్. డి. 81

ఈ సంచికలో..

పేజీ

2 మాతృ భారతి (పద్యాలు)
3 1977-78 రాష్ట్ర బడ్జెట్
7 ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యులు
8 హరిజనోద్ధరణ : పంచాయతీల పాత్ర
10 గంగావతరణం (కవిత)
11 పరిగి తాలూకాలో పశుగణాభివృద్ధి
14 స్వర్ణయోగి (సీరియల్)
20 రాజధాని విశేషాలు
21 కవితావేశం నాదేశం
(వచన కవితా రూపకం)
23 భీముని పట్నం : దాని భవిష్యత్తు
(బొమ్మలతో)
27 నిరాశలో నిండు గుండె (సీరియల్)
32 సామాన్యుల విజయ గాథలు
35 మహాభారతము (సీరియల్)
39 హరిజనవాడ (సీరియల్)
42 గ్రంథ సమీక్ష
44 నవమౌక్తికమాల (కవిత)
45 జిల్లాల్లో ఏంజరుగుతోంది ?

మాతృ భారతి

డాక్టర్ దాశరథి

మంచుతెర తొలగించివేసితి
మాతృమూర్తి ముఖము చూచితి
భవ్యభాస్కర తేజమైనా
పరమశాంతము ప్రజాతంత్రము

హిమకణమ్ములె మౌక్తికములుగ
కమలపత్రమునందునింపితి :
తల్లి గళమున మెరయు మాలగ
అల్లదలచి తపించుచుంటిని

మౌక్తికమ్ములు జారిపోయెను
మాతృపదములపైన వ్రాలెను
హిమకణమ్ములన్నశ్రుకణములు
సహముగా కలగలిసిపోయెను

తల్లి భారతికేమొసంగుదు ?
మల్లెలా ? మాణిక్యసరముల ?
దివ్యరత్నాభరణ గణమా ?
నవ్యవైడూర్య ప్రకరమా ?

హిమాలయ నవకిరీటముతో
సముద్రాచ్ఛతర పీఠముతో
అధరమున దరహాస రుచితో
అమ్మ ననుగని ఇట్టులన్నది.

రత్నమాణిక్యమ్ములేలా ?
వజ్రవైడూర్యమ్ములేలా ?
ధర్మచక్రాంకిత పతాకము
దాల్చిరారా! భరత వీరా !

మూడువన్నెల నవపతాక
ఆడవలె గగనాలదాకా
అదే వీవిచ్చేటి కానుక.
అంతకంటే వలదు బాలక !

జాతి సర్వస్వతంత్రముగా
జగతిలో విలసిల్లవలెరా !
అందుకొరకై ఎందరైనా
అసువులను అర్పించవలెరా !

సేతుశీతనగమ్ము దాకా
జాతి ఒకటని ఊదు బాకా !
అన్ని భాషలు ఒక్కటను స
త్యాన్ని చాటుము మరచిపోక

మహా సౌధాలందు నన్ను
మహామహాలే చూడలేరు
మట్టిగోడల గుడిసెలంగల
మనుషులందున నేను కలను

కష్టపడి పనిచేయువాడే
ఇష్టమోయీ నాకు నిండుగ,
కర్షకుడు, కార్మికుడు, కవియు
కలిసియుండుటె నాకు పండుగ

గంగ, యమునా, గౌతమీ, కృ
ష్ణావగా, కావేరి, తుంగా,
బ్రహ్మపుత్రా నీవి పుత్రా !
భరత ధరణియె అమృతపాత్ర

శుభదినమ్మీనాడు ! స్వేచ్ఛా
ప్రభలతో అరుదెంచె భానుడు
గగన, ధరణీ, సాగరాలు
కలసి పాడినవి గీతాలు

యువతి, యువకులు, బాల, వృద్ధులు
పల్లెవాసులు, పట్నవాసులు
వీరు వారననిలేక అందరు
వీరులై పనిచేయవలెరా !

గిరులు కళకళ లాడుతున్నవి
గిరిజనుల కోలాహలముతో
ధరణి తళతళలాడుతున్నది
హరిజనుల ఆనందముతో

ఇది మహోత్సవ వేళ ! భారత
జాతిపండుగ జరుపు వేళ,
చలిపులుల సంహార మొనరిచి
జ్వాలలంతట ఎగయు వేళ

గుండెలోగల జయజ్వాల
ఉండనీ కలకాలమటులే
జాతి శత్రువు భీతిచెందగ
మండనీ కలకాలమటులే

కులమతమ్ముల కూలద్రోసి
హెచ్చుతచ్చుల త్రుంగ దీసి
ఒకరు ఒకరికి విద్యనేర్పి
జ్ఞానదీప్తిని పంచవలెరా !

ఇంత వరకట్నాలు సున్నా :
ఇల్లు వాకిలి అమ్మకన్నా !
ప్రేమయే పెళ్ళికి అవశ్యం
అమ్మడం, కొనడం అదృశ్యం

యువతి యువకుల మహాశక్తి
ఏకమై చెలరేగినపుడు
పేదతనము నశించిపోదా ?
సకల సంపద పెరిగిరాదా ?

యువకులారా ! యువతులారా !
అవనిమార్చే సేనలారా !
దేశమందలి మూఢతను పరి
మార్చుటకు కదలండి మీరు

అణువుఅణువున అమ్మభారతి
అవతరించెను అందగించెను
మాతృగౌరవమును మరింతగా
మహిని పెంచగ సాగిరారా!

ఇది మహా జనతా వినాదం
ఇది మహా కవితా ప్రమోదం
మూగజీవులలో విషాదం
పోయి కలిగినదిక వినోదం

తల్లి మాటను తలనుదాల్చుడు
తల్లి పాటను కలసిపాడుడు
మాతృభారతి పాదములపై
మమతలే మల్లెలుగ చల్లుడు

1977-78 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ శాసన సభలో, శాసన పరిషత్తులో 1977-78 సంవత్సరపు బడ్జెటును సమర్పిస్తూ 1977 మార్చి 23వ తేదీన ఆర్థిక శాఖామాత్యులు శ్రీ పిడతల రంగారెడ్డి గారు చేసిన ప్రసంగం నుండి కొన్ని భాగాలు.—

1976-77 సంవత్సరానికి ముందు, వరుసగా మూడేండ్ల పాటు రాష్ట్రంలో గణనీయమైన ఆర్థిక ప్రగతి సాధించబడింది. అంటే అటువంటి ఆర్థిక బలంతో 1976-77 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. 1973-76 సంవత్సరాల మధ్యకాలంలో, స్థిరమైన ధరల ప్రకారం లెక్కవేసుకుంటే, మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సంవత్సరానికి సగటున 7.3 శాతం కాంపౌండు పెరుగుదల రేటు కనిపించింది. ఈ మూడేండ్ల కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 27.3 లక్షల టన్నులు పెరిగింది. అంటే 40.5 శాతం పెరిగిందన్న మాట. అదే విధంగా యీకాలంలో పారిశ్రామిక రంగంలో ఉత్పత్తులు కూడా గణనీయంగా పెరిగాయి. పారిశ్రామికోత్పత్తుల సూచీ సంఖ్య. 1973 కంటే 74లో 14.4 శాతం, 1974 కంటే 75లో 12.4 శాతం, 1975 కంటే 76లో 10.6 శాతం పెరిగింది. ఈ విధంగా గడిచినమూడేండ్ల కాలంలో రాష్ట్రంలో గణనీయమైన ఆర్థిక ప్రగతి సాధించడమే కాకుండా మన ఆర్థిక వ్యవస్థ నిలద్రొక్కుకుని నిరాటంకంగా ముందుకు సాగిపోవడానికి తగినంత బలంగా గట్టి పునాదులు ఏర్పడినవి.

అయితే వ్యవసాయ రంగంలో మాత్రం యీ యేడు మనకు గట్టి దెబ్బే తగిలింది. కోస్తా జిల్లాలో వరుసగా వచ్చిన తుఫానులతో అక్కడి ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. తీవ్రమైన అనావృష్టి పరిస్థితి కూడా ఏర్పడింది. దీనికి తోడు గోదావరి ఆనకట్ట గండి పడడం మూలంగా వ్యవసాయ పరిస్థితి మరీ దిగజారిపోయింది. ఈ గడ్డు పరిస్థితులన్నిటినీ తట్టుకోడానికి ప్రభుత్వం తక్షణమే అనేక సహాయక చర్యలు తీసుకున్నది. తుఫానులవల్లా, అనావృష్టి వల్లా దెబ్బతిన్న ప్రాంతాలలో సహాయక చర్యలు తీసుకోడానికి ప్రభుత్వం 12 కోట్ల 18 లక్షల రూపాయల మొత్తం మంజూరు చేసింది. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం తుఫాను బాధితుల సహాయార్థం ప్రణాళిక సహాయం క్రింద అడ్వాన్సుగా రూ. 3 కోట్ల 53 లక్షల మొత్తాన్ని విడుదల చేసింది. ఇందులో చేనేత పారిశ్రామికులకు సహాయంకోసం రూ. 50 లక్షలు, మత్స్య పారిశ్రామికుల కోసం రూ. 25 లక్షలు చేరివున్నాయి. రైతులను ఆదుకోడానికి వారి నుండి రావలసిన ధాన్యంలెవీ రద్దు చేయడం జరిగింది. దీనికి తోడు దెబ్బ తిన్న ప్రాంతాలలో భూమి శిస్తు రెమిషన్‌కూడా యిచ్చారు. భూమి శిస్తు, తక్కావీ ఋణాల వసూళ్ళు యీ ప్రాంతాలలో వాయిదా వేయబడినవి. బాధితుల పునరావాస కార్యక్రమాల కోసం అవత్కాల తక్కావి ఋణాలు మంజూరు చేయబడినవి.

1975-76 వ సంవత్సరంలో మన రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 94.28 లక్షల టన్నులతో మునుపు ఎన్నడు ఎరుగనంత గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. నిత్య జీవితావసర వస్తువులను న్యాయ బద్ధంగా ప్రజలకు పంపిణీ చేయడానికి 22 వేల చవుక ధరల దుకాణాలు పనిచేస్తున్నాయి. 1975 మార్చికి ముందు మన రాష్ట్రంలో 31 సూపర్ బజార్లు మాత్రమే ఉండేవి. ఆ తరువాత కాలంలో యింకా అదనంగా 110 సూపర్ బజార్లను క్రొత్తగా తెరిచారు. బియ్యం, గోదుమ, పంచదార వంటి నిత్యావసర వస్తువులు రాష్ట్రంలోని 3,236 హాస్టళ్ళకు సరసమైన రేట్లకు సప్లయి చేస్తున్నారు. దీనివల్ల 1,42 లక్షలమంది విద్యార్థులకు ప్రయోజనం కలిగింది. ఈ ప్రయోజనం పొందిన వారిలో 44 వేలమంది షెడ్యూల్డు కులాల చెందిన విద్యార్థులు, 22 వేల మంది షెడ్యూల్డు జాతులకు చెందిన విద్యార్థులు కూడా వున్నారు.

భూకమతాల గరిష్ఠ పరిమితి చట్టం క్రింద 10 లక్షల, 64 వేల 4 వందల 26 ఎకరాలు మిగులు భూమిగా ప్రకటించారు. ఇందులో 79 వేల 5 వందల 11 ఎకరాల భూమిని 52 వేల 184 మందికి పంచడం జరిగింది. ఈ విధంగా భూములు పొందిన వారిలో 28 వేల 2 వందల 83 మంది షెడ్యూలు కులాలకు చెందినవారు, 9 వేల 5 వందల 44 మంది షెడ్యూలుజాతులకు చెందిన వారు. 90 వేల 6 వందల 40 మంది రక్షిత కౌలుదార్లకు సుమారు 4.35 లక్షల ఎకరాల భూమి భూఖామందుల నుండి నేరుగా బదిలీ చేయడం జరిగింది. త్వరితగతిలో భూములు పంచు పథకం క్రింద భూమిలేని పేదలకు సుమారు 22 లక్షల ఎకరాల భూమిని పంచారు.

షెడ్యూలు కులాలవారికీ, గ్రామములోని యితర పేద ప్రజలకు, యిండ్ల స్థలాలను సమకూర్చే కార్యక్రమాన్ని బహువేగవంతంగా అమలు పరచడానికి ప్రభుత్వం పూనుకున్నది. 1976 ఏప్రిల్ 1వ తేదీనుండి 8.5 లక్షల కుటుంబాలవారికి సుమారు 35 వేల ఎకరాల భూమిని యిండ్ల స్థలాలుగా పంచడం జరిగింది. ఇతరుల స్థలాలలో ప్రైవేటు భూములలో ఇండ్లు వేసుకొని నివసిస్తున్న వారికి ఆ స్థలాల యాజమాన్యపు హక్కు సంక్రమింపచేసే చట్టం క్రింద ప్రయోజనం పొందేవారు 82 వేల మంది వరకు ఉంటారని అంచనా. వీరిలో ఇప్పటికె సుమారు 50 వేల మందికి యాజమాన్యపు హక్కు లభింప జేశారు.

1975 అగష్టు నెలలో సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయకూలీలు, గ్రామీణ వృత్తి పనివారు ఇవ్వవలసిన అప్పుల వసూలును నిలుపు చేస్తూ ఒక ఆర్డినెన్సు జారీ చేశారు. ఇటీవలనే సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తి పనివారు ఇవ్వవలసిన ప్రైవేటు ఋణాలను పూర్తిగా రద్దుచేస్తూ ఒక క్రొత్త ఆర్డినెన్సు జారీ చేయబడింది. ఋణాలు తీసుకున్నప్పుడు

హామీగా పెట్టిన చరాస్తులను, తాకట్టు పెట్టిన స్థిరాస్తులను కూడా ఋణదాతలనుండి తీసికొని ఎవరివి వారికి ఇచ్చి వేయటానికి కూడా ఈ ఆర్డినెన్సులో అవకాశము కల్పించబడింది.

సహకార సంస్థల ద్వారా, ముఖ్యంగా సన్నకారు రైతులకు, ఒక మోస్తరు రైతులకు పరపతి సౌకర్యాలను ఎక్కువగా కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. వ్యవసాయ ప్రయోజనాల కోసం ఇచ్చే స్వల్పకాలిక ఋణాల స్థాయి 1974–75 సంవత్సరంలో రూ. 42.01 కోట్ల నుండి 1975–76 సంవత్సరంలో రూ. 65.95కోట్లకు పెరిగింది. ఈ పెరుగుదల 57 శాతం. వర్తమాన సంవత్సరంలో ఈ మొత్తం సుమారు రూ. 87 కోట్ల వరకు పెరగవచ్చునని అంచనా. సహకార రంగం ద్వారా అందుతున్న పరపతి సౌకర్యాలలో సన్నకారు రైతులకు, ఒక మోస్తరు రైతులకు లభిస్తున్న పరపతి శాతం కూడా పెరుగుతున్నది. 1975–76 సంవత్సరంలో పరపతి సౌకర్యంలో వీరి వంతు 46 శాతం. 1976 ఖరీఫ్ పంట కాలంలో ఇది 55 శాతానికి పెరిగింది. సహకార పరపతి సంస్థల ద్వారా అందుతున్న సౌకర్యాలకు తోడు ఇంకా అదనంగా పరపతి సౌకర్యాల కల్పన అవసరమనుకున్న ప్రాంతాలకు సహాయం చేయడానికై మన రాష్ట్రంలో మూడు గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేశారు. సన్నకారు రైతులు, ఒక మోస్తరు రైతులు వ్యవసాయ కార్మికులకు సహాయపడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలు మన రాష్ట్రంలో 16 జిల్లాలలో పనిచేస్తున్నవి. వీటి ద్వారా 18 వేల 3 వందల బావుల త్రవ్వకము, అభివృద్ధి, 2 వేల ఒక వంద సామూహిక సేద్యపు నీటి పారుదల బావుల త్రవ్వకము, 4 వేల 2 వందల పంపు సెట్ల పస్తై, 16 వేల 1 వంద పాడి పశువులు, 11 వేల గొర్రెల యూనిట్లు, 4 వేల 5 వందల జతల సేద్యపు ఎద్దుల పంపిణి మొదలగు కార్యక్రమాలు జరిగినవి.

మన రాష్ట్రంలో ప్రస్తుత సంవత్సరపు ప్రణాళికా పెట్టుబడులను సమీక్షిస్తూ యిలా అన్నారు:–

1976–77 సంవత్సరంలో అభివృద్ధి కార్యక్రమాల వేగము తగ్గకుండా నిర్వహించబడింది. మన రాష్ట్రపు వార్షిక ప్రణాళిక పెట్టుబడి ఈ ఏడు రూ. 262 కోట్ల నుండి రూ. 281.50 కోట్లకు పెరిగిన విషయం గౌరవ సభ్యులకు తెలిసిందే. కాని ఇప్పటి అంచనాల ప్రకారం ఈ ఏటి వార్షిక ప్రణాళిక రూ. 290.73 కోట్ల వరకు పెరిగే సూచనలు కనిపిస్తున్నవి. 1974–75 వార్షిక ప్రణాళిక పెట్టుబడి రూ. 148 కోట్లు. 1975–76 వార్షిక ప్రణాళిక రూ. 201 కోట్లు. వీటితో పోల్చి చూసినప్పుడు మన అభివృద్ధి ప్రణాళికల పెట్టుబడి మొత్తం రెండింతలు పెరిగినట్లు స్పష్టంగా తెలుస్తుంది. వార్షిక ప్రణాళిక పెట్టుబడి ఇంకా 26 శాతం పెంచడం ద్వారా ఈ అభివృద్ధి కార్యక్రమాల కృషి వేగాన్ని 1977–78 సంవత్సరంలో కూడా కొనసాగించడం జరుగుతుంది.

1977–78 సంవత్సరపు వార్షిక ప్రణాళిక పెట్టుబడి రూ. 365–75 కోట్లు ఉంటుంది. ఈ ప్రణాళికలో సేద్యపు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు తగినంత ఎక్కువగా కేటాయింపు జరుగుతుంది. ఈ ఏడు విద్యుచ్ఛక్తి మీద కేటాయింపు రూ. 114 కోట్లు. ఇది వచ్చే ఏడు రూ. 140 కోట్లకు పెరుగుతుంది. అదే విధంగా సేద్యపు నీటి పారుదల రంగానికి కేటాయించిన రూ. 80 కోట్లు వచ్చే ఏడు రూ. 107 కోట్లకు పెరుగుతుంది.

వివిధ రంగాలకు జరిగిన కేటాయింపులు

ఈ వార్షిక ప్రణాళికలో గత సంవత్సరపు కేటాయింపులతో తులనాత్మకంగా పరిశీలించి సమీక్షిస్తూ, వ్యవసాయమూ, దానికి సంబంధించిన ఇతర సేవా కార్యక్రమాల క్రింద 1977–78 సంవత్సరానికి కేటాయింపు రూ. 26 50 కోట్ల వరకు ఉంటుంది, అన్నారు. 1977–78 సంవత్సరానికి సహకార రంగం కేటాయింపు రూ. 6.50 కోట్లకు పెంచడం జరిగింది. ఈ ఏడు అంటే 1976–77 సంవత్సరానికి నీరు విద్యుచ్ఛక్తి అభివృద్ధి రంగానికి మొదట్లో రూ. 151.20 కోట్లు కేటాయించి తరువాత దానిని రూ. 194.19 కోట్లకు పెంచారు. ఈ పద్దు క్రింద వచ్చే సంవత్సరపు కేటాయింపు రూ. 247.17 కోట్ల వరకు వుంటుంది. పరిశ్రమలు, ఖనిజాల రంగానికి 1977–78 సంవత్సరానికి రూ. 11.25 కోట్లకు పెంచడం జరుగుతుంది. సౌకర్యాల పద్దు క్రింద యీ యేటి కంటె సుమారు రూ. 5 కోట్లు పెరుగుదల వుంటుంది. అంటే వచ్చే సంవత్సరంలో యిది రూ. 28.37 కోట్లకు పెరుగుతుంది. సాంఘిక సామాజిక సేవా కార్యక్రమాల పద్దు క్రింద ఈ ఏటి పెట్టుబడి రూ.3.787 కోట్లు. వచ్చే సంవత్సరంలో ఈ పద్దు క్రింద కేటాయింపు రూ. 44.18 కోట్లు వుంటుంది. సాధారణ ఆర్థిక సేవా కార్యక్రమాల పద్దు క్రింద 1977–78 సంవత్సరపు పెట్టుబడి రూ. 1.78 కోట్లు. 1976–77లో ఇది రూ. 1 20 కోట్లు మాత్రమే, అని అన్నారు.

సేద్యపు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి

భారీ, మధ్యతరహాలకు చెందిన వివిధ ప్రాజెక్టులకు, విద్యుచ్ఛక్తి పథకాలకు చేసిన కేటాయింపులను వివరిస్తూ, మంత్రి యిలా అన్నారు:–

రాష్ట్ర సేద్యపు నీటి పారుదల పద్దు క్రింద ప్రణాళికా పెట్టుబడి బాగా పెరిగింది. 1973–74 సంవత్సరంలో రూ. 21.61 కోట్లు ఉండేది. 1976–77 నాటికి రూ. 80 కోట్లకు పెరిగింది. 1977–78 సంవత్సరానికి ఆమోదించబడిన వార్షిక ప్రణాళికలో యీ రంగానికి రూ. 107.17 కోట్లు కేటాయింపు జరిగింది. అయిదో ప్రణాళిక మొదటి రెండు సంవత్సరాల కాలంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 71 వేల హెక్టార్ల విస్తీర్ణానికి సేద్యపు నీటి పారుదల సౌకర్యం లభించింది. దీనికి తోడు చిన్నతరహా నీటి వనరుల క్రింద క్రొత్తగా సేద్యపు నీటి వనరుల సౌకర్యం కలిగింది గానీ, లేక సేద్యపు నీటి సాగు క్రింద స్థిరపరచబడింది గానీ, మొత్తం 78 వేల హెక్టార్లు వుంటుంది. 1996–77 సంవత్సరంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 1 24 లక్షల హెక్టార్లకూ నీటి పారుదల సౌకర్య లభిస్తుంది. అదే విధంగా

వచ్చే సంవత్సరం, అంటే 1977-78 లో భారీ మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 90 వేల హెక్టార్లకూ చిన్నతరహా వనరుల క్రింద 49 వేల 3 వందల హెక్టార్లకూ సాగునీటి సౌకర్యం కలుగుతుంది".

నీటి పారుదల పథకాలు, విద్యుచ్ఛక్తి పథకాలు వివిధ దశలలో హెచ్చు కేటాయింపులవల్ల అభివృద్ధి జరుగుతున్న తీరును సమీక్షించి, మంత్రి యిలా అన్నారు:-

ఇంతవరకు మన రాష్ట్రంలో 12 వేల 5 వందల ఆరవై గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం వుంది. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధతో అమలుపరచిన కార్యక్రమంవల్ల 2 వేల 6 వందలకు పైగా హరిజన వాడలకుకూడా విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించబడింది. ఇంతవరకు 2.94 లక్షల వ్యవసాయపు పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి లభించింది. 1977-78 సంవత్సరంలో యింకా 1,750 గ్రామాలకు కొత్తగా విద్యుచ్ఛక్తి సదుపాయం కల్పించాలనీ, 25 వేల పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి లభింపజేయాలనీ సంకల్పించారు.

ప్రాజెక్టుల కమాండు ఏరియా అభివృద్ధి

పోచంపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వ, ఎడమ కాల్వ, తుంగభద్ర-కె సి. కెనాల్ ప్రాజెక్టు అనే యీ నాలుగు భారీ ప్రాజెక్టుల కమాండ్ ఏరియా అభివృద్ధి కార్యక్రమం క్రింద ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన విస్తరణ సేవా కార్యక్రమాలు, పరపతి సౌకర్యాల కల్పన, యితర ప్రాతిపదిక సౌకర్యాల కల్పన మొదలగు విషయాలలో కృషి జరుగుతుంది. ఈ నాలుగు ప్రాజెక్టుల క్రింద 1976-77 సంవత్సరంలో 37 వేల 5 వందల హెక్టార్ల విస్తీర్ణంలో పంట కాల్వల నిర్మాణం జరుగుతుంది. ఇందులో కొంత భాగంలో సేద్యపు నీటిపారుదల మెట్ట పంటల ప్రాంతము, పల్లపు ప్రాంతము క్రమబద్ధంగా అభివృద్ధి చేయబడుతుంది. వచ్చే సంవత్సరంలో యింకా 63 వేల 4 వందల హెక్టార్ల విస్తీర్ణంలో పంటకాల్వల నిర్మాణ కార్యక్రమం నిర్వహించాలని సంకల్పించారు. ఇందులో ప్రపంచ బ్యాంకు సహాయంతో అభివృద్ధి చేసే 20 వేల 8 వందల హెక్టార్ల విస్తీర్ణం కూడా వుంది.

అనావృష్టి ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమం

అనావృష్టికి గురిఅయ్యే ప్రాంతాలలో సహాయక చర్యలకు సంబంధించిన పథకాలు మన రాష్ట్రంలో అనంతపురం, కడప, కర్నూలు, మహబూబునగర్ జిల్లాల్లోను, నల్గొండ, ప్రకాశం జిల్లాలలో కొన్ని ప్రాంతాలలోనూ అమలుజరుగుతున్న విషయం ప్రస్తావిస్తూ మంత్రి "ఈ పథకాల క్రింద చేపట్టిన కార్యక్రమాలలో ముఖ్యమైనవి ఏవంటే, చిన్నతరహా నీటిపారుదల పథకాలు, భూసార సంరక్షణ, బీడు భూముల అభివృద్ధి, పాడి పరిశ్రమ అభివృద్ధి, గొర్రెల పెంపకం మొదలైనవి. జరుగుతున్న సంవత్సరంలో యీ అనావృష్టి ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు తగినంత ఎక్కువగా జరిగాయి. దీని కోసం కేటాయించిన ఖర్చు రూ. 8.48 కోట్లు. ఇందులో సగం కేంద్ర ప్రభుత్వం సహాయంగా ఇచ్చింది. ఇదికాక, అయిదో పంచవర్ష ప్రణాళిక కాలంలో పైన పేర్కొన్న జిల్లాలలో మధ్యతరహా సేద్యపు నీటిపారుదల పథకాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఒకటిన్నర కోట్ల రూపాయల మొత్తం కూడా మంజూరు చేసింది. అనావృష్టికి గురి అయ్యే జిల్లాల అభివృద్ధి కార్యక్రమం క్రింద 1977-78 సంవత్సరానికి రూ. 9.04 కోట్లు కేటాయింపు చేయబడింది.

బలహీన వర్గాల సంక్షేమం

1977-78 సంవత్సరపు వార్షిక ప్రణాళికలో షెడ్యూల్డు కులాల వారి అభివృద్ధికి రూ. 2.43 కోట్లు, గిరిజనాభివృద్ధికి రూ. 1.92. కోట్లు, వెనుకబడినవర్గాల ప్రజల అభివృద్ధికి రూ. 1.17 కోట్లు కేటాయించారు.

ఇండ్ల స్థలాల సేకరణ కార్యక్రమం క్రింద షెడ్యూలుకులాల వారికి ఉద్దేశించిన యిండ్ల స్థలాలకోసం రూ. 4 కోట్లు కేటాయించబడింది. ఇది కాక ఆరు సూత్రాల పథకం క్రింద, బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం, యితర కార్యక్రమాల కోసం కోటి రూపాయల మొత్తం కూడా వుంటుంది.

ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఆర్థిక కార్పొరేషను, ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన వర్గాల ఆర్థిక కార్పొరేషను, మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్లు 1976-77 సంవత్సరంలో బలహీన వర్గాల వారికి ఋణాలు అందజేసే విషయంలో చాలా ప్రగతి సాధించాయి.

ఈ మూడు కార్పొరేషన్లకు తోడు, గిరిజనులకు ఆర్థిక సహాయం అందజేసే ఉద్దేశంతో, యీ యేడు మరొక కొత్త కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయబడింది.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన వర్గాలవారి పిల్లలు విద్యా యోగ్యతలు సంపాదించుకోడానికి వీలుగా ఏర్పాటు చేసిన హాస్టళ్లలో సుమారు లక్ష మంది ఈ వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు. ఈ విద్యార్థులకు దుస్తులు, పాఠ్యగ్రంథాలు, వ్రాత పరికరాలుకూడా అందజేయబడుతున్నవి. ఈ విద్యార్థుల భోజనపు ఖర్చుల క్రింద యిచ్చే మొత్తాన్ని యిటీవలనే ప్రభుత్వం నెలకు రూ. 40 నుండి రూ. 50 కి పెంచింది. దుస్తులు కూడా సంవత్సరానికి రెండు జతలు లభించే సౌకర్యం చేశారు. ఇందుకోసం అదనంగా కోటి రూపాయల అదనపు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాల 'అభివృద్ధికోసం, వ్యాపార బ్యాంకుల నుండి ఋణ సహాయం పొంది, రూ. 2 కోట్ల ఖర్చుతో అదనపు హాస్టళ్ల నిర్మాణ కార్యాక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. సాంకేతిక శిక్షణ సంస్థలకు ఎక్కువగా షెడ్యూలు కులాల విద్యార్థులను ఆకర్షించాలనే సంకల్పంతో వీరికి ఆ సంస్థలలో శిక్షణ కోసం యిచ్చే స్టయిపండు మొత్తాన్ని యిటీవలనే నెలకు రూ. 40 నుండి రూ. 75 వరకు పెంచడం కూడా జరిగింది.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల విద్యార్థులకు మెట్రిక్యులేషన్ స్థాయి వరకు 1976-1977 సంవత్సరంలో మొట్ట మొదటిసారిగా నూటికి నూరుపాళ్ళు విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యగ్రంథాలు లభించాయి.

సంస్థాగత ఆర్థిక సహాయక్రింద కల్పించిన పరపతి సౌకర్యాలు, జిల్లా స్థాయి సంఘాల సూచన మేరకు యింకా అమలు జరుగనున్న పరపతి అవసరాల ప్రణాళికలను మంత్రి వివరించారు

రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి తీసుకుంటున్న ప్రోత్సాహక చర్యలను ప్రస్తావిస్తూ, మంత్రి యిలా అన్నారు:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ వారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్‌వారు తమ అభివృద్ధి కార్యక్రమాలలో ముందంజ వేస్తున్నారు. అనేక పరిశ్రమలను స్థాపించే విషయంలో పరిశీలనలు పూర్తి చేశారు. వివిధ ఫ్యాక్టరీల స్థాపన జరిగిన విషయం మంత్రి వివరించారు. చేనేత రంగం ప్రాధాన్యతనూ వివరిస్తూ:

చేనేత పరిశ్రమకు కూడా ప్రభుత్వం చెప్పుకోదగిన సహాయం చేసింది. జరుగుతున్న ఆర్థిక సంవత్సరంలో బడ్జెటులో కేటాయించిన రూ. 1.39 కోట్లు కాకుండా, ఆరు సూత్రాల పథకం నిధుల నుండి రూ. 42.17 లక్షల మొత్తం చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం అందించారు. గత సంవత్సరాంతంలో సంభవించిన ఘోరమైన తుఫానుల వలన దెబ్బతిన్న ప్రాంతాలలోని చేనేత పరిశ్రమకు సహాయంగా రూ. 50 లక్షల మొత్తం ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సంవత్సరాంతంలోగా 35 వేల మంది చేనేత పారిశ్రామికులను సహకారరంగం పరిధిలోకి తీసుకురావాలని ప్రయత్నం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్ జవుళి వస్త్రాభివృద్ధి కార్పొరేషన్ వివిధ జిల్లాలలో మూడు వేల మంది చేనేత పారిశ్రామికులకు ప్రయోజనకరంగా 9 ఉత్పత్తి కేంద్రాలను స్థాపించింది. చేనేత పరిశ్రమ తీవ్ర అభివృద్ధి పథకం ఒకటి, ఎగుమతులకు ఉద్దేశించిన ఉత్పత్తి కేంద్రాల స్థాపన పథకం ఒకటి, యీ రెండు పథకాలు ప్రారంభించబడుచున్నవి. వీటివల్ల 5 జిల్లాలలోని 11 వేల మందికిపైగా చేనేత పారిశ్రామికులు ప్రయోజనం పొందుతారు, అన్నారు.

దీని ప్రకారం 1977–78 బడ్జెటులో తగిన కేటాయింపు జరిగింది.

ప్రణాళికేతర వ్యయం గురించి ప్రస్తావిస్తూ యిలా అన్నారు:

ప్రభుత్వ ఆసుపత్రులలో లోపలి రోగులకు సంబంధించిన మందులు, భోజనపు ఖర్చుల విషయంలో అదనంగా రూ. 1.40 కోట్లు కేటాయించబడింది. దీనికి తోడు ప్రభుత్వ ఆసుపత్రులలో బయట చికిత్స చేసుకునే రోగుల మందుల కోసం రూ. 75 లక్షలు కేటాయించారు. పశు వైద్యశాలలు, చికిత్సా కేంద్రాలకు ఎక్కువగా మందులను సప్లై చేయడం కోసం రూ. 30 లక్షలు మంజూరు చేయబడింది.

ప్రభుత్వోద్యోగుల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి ఆయా సమయాలలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. గత సంవత్సరం ఇటువంటి చర్యలు చాలా తీసుకున్నారు. వాటిలో ఉద్యోగులకు కరువుభత్యం పెంచడం, పింఛనుదారులకు ఆర్థిక సహాయం పెంచటం ముఖ్యమైనవి

అభివృద్ధేతర శాఖల అవసరాలను పరిశీలించడం, ఆయా శాఖలు సమర్థవంతంగా పనిచేయడానికి వీలుగా అవసరమైన నిధులను కేటాయించడం జరిగింది.

రాష్ట్ర రెవెన్యూ ఆదాయాలను గూర్చి ప్రస్తావిస్తూ మంత్రి యిలా అన్నారు:

వచ్చేసంవత్సరం రూ 763.38 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. ఈ ఏటి సవరించబడిన అంచనా ప్రకారం రెవిన్యూ ఆదాయం రూ. 688.07 కోట్లు. కేవలం పన్నుల వసూలు ద్వారానే రూ 427.07 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయబడింది. ఈ ఏటి సవరించబడిన అంచనాల ప్రకారం రెవెన్యూ ఆదాయం 367.67 కోట్లు మాత్రమే.

1977–78 బడ్జెట్ అంచనాలలో రెవెన్యూ పద్దు క్రింద ఖర్చు రూ. 697.65 కోట్లు. వర్తమాన సంవత్సరపు సవరించబడిన అంచనాల ప్రకారం రెవెన్యూ ఖర్చు రూ. 639 64 కోట్లు. లోగడ మనవి చేసినట్లు నిర్వహణ గ్రాంట్లను, సహాయక గ్రాంట్లను పెంచినందువల్ల వచ్చే సంవత్సరంలో రెవెన్యూ ఖర్చు పెరిగింది. సవరించిన అంచనాలలో పెట్టుబడి ఖర్చు రూ. 163.90 కోట్లు కాగా వచ్చే సంవత్సరపు బడ్జెటు అంచనాలలో పెట్టుబడి ఖర్చు రూ. 201.17 కోట్లకు పెరిగింది రాష్ట్ర పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల క్రింద ప్రణాళికలో పెట్టుబడి పెరిగినందువల్ల వచ్చే సంవత్సరపు పెట్టుబడి ఖర్చు పెరిగింది

పైన పేర్కొన్న అన్ని ఆర్థిక వ్యవహారాల ఫలితంగా 1977–78 సంవత్సరం రూ. 62.50 కోట్ల లోటుతో ముగుస్తుందని అంచనా. రిజర్వునిధుల నుంచి కొంత తీసుకోవటం, పన్నులు, బకాయిలు బాగా వసూలు చేసుకోవటం, కేంద్ర ప్రభుత్వ సహాయం పెరిగే ఏర్పాట్లు చేసుకోవటం మొదలగు చర్యల ద్వారా ఈ లోటును పూరించుకోగలమని ఆశిస్తున్నాం.

ముగింపు

ఇంతవరకు నేను క్లుప్తంగా మనవి చేసిన వివిధ విషయాల దృష్ట్యా 1976–77, 1977–78, ఈ రెండు సంవత్సరాలలోను అభివృద్ధి కార్యక్రమాల పెట్టుబడులు సమృద్ధిగా పెంచుకోగలిగామని అంటూ మంత్రి ఉద్యోగుల సంక్షేమం, ఆస్తులు, సేవా కార్యక్రమాల సక్రమ నిర్వహణ మొదలగు అత్యవసరమైన అభివృద్ధి కార్యక్రమాల మీద జరిగే ఖర్చును కూడా మనం తగినంతగా పెంచుకోగలిగాం. మనం ఆర్థిక వనరులు అభివృద్ధి చెందడం వల్లనూ వాటిని మన అతిజాగ్రత్తగా వివేకవంతంగా వినియోగించుకొంటున్నందువల్లనూ ఇది సాధ్యమైంది. మన లక్ష్యమైన సామాజిక న్యాయాన్నీ, సత్వర పురోభివృద్ధినీ సాధించుకోవాలంటే మనకు ఉన్న ఈ వనరులను చాలా సమర్థతతో వినియోగించుకోవాలి. ఈ మహత్తర కృషిలో ప్రభుత్వానికి సంపూర్ణంగా తోడ్పడవలసిందని గౌరవ సభ్యులను అర్థిస్తున్నాను.

1977 మార్చి నెలలో జరిగిన 6వ లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుండి ఎన్నికైన సభ్యులు, వారి నియోజక వర్గాలు

1. శ్రీ బొడ్డేపల్లి రాజగోపాలరావు (శ్రీకాకుళం)
2 శ్రీ వైరిచర్ల కిషోరచంద్ర సూర్యనారాయణ (పార్వతీపురం)
3. శ్రీ పి. వి. జి రాజు (బొబ్బిలి)
4. శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ (విశాఖపట్నం)
5. శ్రీమతి రాధాబాయి ఆనందరావు (భద్రాచలం)
6 శ్రీ ఎస్. ఆర్. ఎ. ఎస్. అప్పలనాయుడు (అనకాపల్లి)
7. శ్రీ ఎం.ఎస్. సంజీవరావు (కాకినాడ)
8. శ్రీ ఎస్.బి.పి. పట్టాభిరామారావు (రాజమండ్రి)
9. శ్రీ కుసుమ కృష్ణమూర్తి (అమలాపురం)
10. శ్రీ అల్లూరి సుభాష్‌చంద్రబోస్ (నర్సాపురం)
11. శ్రీ కొమ్మారెడ్డి సూర్యనారాయణ (ఏలూరు)
12. శ్రీ మాగంటి అంకినీడు (మచిలీ పట్టణం)
13. శ్రీ గోడె మురహరి (విజయవాడ)
14. శ్రీ మేడూరి నాగేశ్వరరావు (తెనాలి)
16. శ్రీ కొత్త రఘురామయ్య (గుంటూరు)
16. శ్రీ పి. అంకినీడు ప్రసాదరావు (బాపట్ల)
17. శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి (నరసరావుపేట)
18. శ్రీ పులి వెంకట రెడ్డి (ఒంగోలు)
19. శ్రీ దొడ్డవరపు కామాక్షయ్య (నెల్లూరు)
20. శ్రీ తంబుర బాలకృష్ణయ్య (తిరుపతి)
21. శ్రీ పి. రాజగోపాల నాయుడు (చిత్తూరు)
22 శ్రీ పోతురాజు పార్థసారథి (రాజంపేట)
23. శ్రీ కందుల ఓబులరెడ్డి (కడప)
24. శ్రీ పి. బయ్యపరెడ్డి (హిందూపూర్)
25. శ్రీ డి. పుల్లయ్య (అనంతపూర్)
26. శ్రీ కె. విజయభాస్కరరెడ్డి (కర్నూలు)
27. శ్రీ నీలం సంజీవరెడ్డి (నంద్యాల)
28. శ్రీ మైలాల భీష్మదేవ్ (నాగర్ కర్నూల్)
29. శ్రీ జె. రామేశ్వరరావు (మహబూబ్‌నగర్)
30. శ్రీ కె. ఎస్. నారాయణ (హైదరాబాదు)
31. శ్రీ ఎం. ఎం. హాషీమ్ (సికిందరాబాదు)
32. శ్రీ జి. వెంకటస్వామి (సిద్ధిపేట)
33. శ్రీ మల్లికార్జున్ (మెదక్)
34. శ్రీ ఎం. రామగోపాలరెడ్డి (నిజామాబాదు)
35. శ్రీ జి. నరసింహారెడ్డి (ఆదిలాబాదు)
36. శ్రీ వి. తులసీరామ్ (కరీంనగర్)
37. శ్రీ ఎం. సత్యనారాయణరావు (పెద్దపల్లి)
38. శ్రీ పి. వి నరసింహారావు (హనుమకొండ)
39. శ్రీ ఎస్. బి. గిరి (వరంగల్)
40. శ్రీ జలగం కొండలరావు (ఖమ్మం)
41. శ్రీ అబ్దుల్ లతీఫ్ (నల్గొండ)
42. శ్రీ జి. ఎస్. రెడ్డి (మిర్యాలగూడ)

హరిజనోద్ధరణ: పంచాయతీల పాత్ర

శ్రీ ఎన్. యెతిరాజరావు

మనరాష్ట్ర జనాభా 4 కోట్ల 35 లక్షలు. వీరిలో 3 కోట్ల 5 లక్షల మంది–అంటే–దాదాపు 81 శాతం జనాభా గ్రామాలలో నివసిస్తున్నారు. రాష్ట్రంలో హరిజనుల జనాభా 57 లక్షల 75 వేలు, అంటే మొత్తం జనాభాలో దాదాపు 14 శాతం హరిజనులున్నారన్న మాట.

మన రాష్ట్ర జీవితానికి ప్రతీకగా ఉంటున్నది గ్రామీణ జీవితం. గ్రామీణస్థాయిలో అభివృద్ధికి పట్టు గొమ్మలు పంచాయతీ రాజ్ సంస్థలు. రాష్ట్రాభివృద్ధి, ముఖ్యంగా రాష్ట్రంలో సాంఘిక, ఆర్థిక రంగాలలో సమానత్వం రావాలంటే అది గ్రామప్రాంతాల నుండి ప్రారంభం కావాలి.

పంచాయతీరాజ్ సంస్థలద్వారా గ్రామీణ ప్రాంతాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు హరిజనుల జీవితాలలో నూతన వికాసాన్ని, నూతన చైతన్యాన్ని కలిగించడంలో ఎంతో దోహదం చేశాయి. ఈ నాడు ప్రతి గ్రామంలోనూ ఒక పాఠశాల ఉన్నది. పాఠశాలకు వెళ్లే బాలబాలికల్లో హరిజనులు కూడా ఉంటున్నారు. బడికివెళ్లే హరిజన బాలబాలికలకు పంచాయతీరాజ్ సంస్థలు ఉచితంగా పలకలూ, పుస్తకాలు, దుస్తులు కూడా సమకూరుస్తున్నాయి. తరతరాలుగా విద్యా గంధానికి దూరంగా ఉన్న హరిజన వాడల్లో ఈనాడు అక్షరాస్యత వెలసింది. ప్రత్యేకంగా హరిజన వాడల్లో పంచాయతీరాజ్ సంస్థలు వయోజన రాత్రిపాఠశాలలను కూడ నిర్వహిస్తున్నాయి.

మన రాష్ట్రంలో ఈ నాడు 15,923 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలన్నీ తప్పనిసరిగా నిర్వహించవలసిన విధులలో గ్రామ పరిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా అతిప్రధానమైనవి. గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమం క్రింద గ్రామాలకు విద్యుద్దీపాల సౌకర్యం కలుగ జేసే కార్యక్రమంలో హరిజన వాడలకు విద్యుద్దీపాలు విధిగా వెయ్యాలని నిబంధన చేశారు. గ్రామపంచాయతీలు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమం క్రింద హరిజనవాడలను కూడా పరిశుభ్రంగా ఉంచుతున్నారు. హరిజన వాడలంటే ఈనాడు మురికి పేటలు కావు. గ్రామాలలో వీధి దీపాలంటే హరిజన వాడల్లో కూడా ఉంటున్నాయి. గ్రామంలో కమ్యూనిటీ రేడియో సెట్లుంటే హరిజనవాడల్లో కూడా రేడియో సెట్లను విధిగా అమర్చుతున్నారు మంచి నీటి బావులు త్రవ్వితే హరిజన వాడలో కూడా త్రవ్వుతున్నారు. అన్ని మంచి నీటి బావుల్లో కులంతో నిమిత్తం లేకుండా అందరూ మంచినీళ్ల తోడుకోవచ్చు. రక్షిత మంచినీటి పథకాలు అమలులో ఉన్న గ్రామాలలో విధిగా హరిజన వాడల్లో మంచినీటి కొళాయిలను పెడుతున్నారు.

ప్రతి గ్రామ పంచాయితీ సభ్యులలో హరిజనులకు విధిగా ప్రాతినిధ్యం కల్పించబడింది. గ్రామపంచాయతీ సమావేశాలలో హరిజన సభ్యులూ–అగ్రవర్ణాలకు చెందిన సభ్యులు సమానంగా కూర్చొని గ్రామ సమస్యలను చర్చించు కుంటున్నారు.

జిల్లా పరిషత్తులలోనూ, పంచాయతీ సమితులలోనూ హరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం విషయాలను చూడటానికి ప్రత్యేకస్థాయీ సంఘాలున్నాయి. ఈస్థాయీ సంఘాలలో మెజారిటీ సభ్యులు తప్పని సరిగా బలహీన వర్గాలకు చెందినవారే ఉండాలనీ, ఈ సంఘాలకు అధ్యక్షులు కూడా వారే ఉండాలని ఇటీవల మన విధానసభ ఆమోదించిన కొత్త పంచాయతీల చట్టాల్లో నిబంధన చేర్చారు.

అయితే పంచాయతీ రాజ్యవ్యవస్థలో ఇప్పటివరకు ప్రధాన నాయకత్వపు పదవులలో హరిజనులకు తగిన ప్రాధాన్యత, తగిన స్థానం లభించడం లేదన్నమాట నిజమే.

ఈ సమస్యను సాకల్యంగా పరిశీలించాలంటే మొదట మన గ్రామీణ వ్యవస్థలో తరతరాలుగా వస్తున్న సాంఘిక వ్యవస్థను అధ్యయనం చేయవలసి ఉంటుంది. గ్రామీణ వ్యవస్థలో కేవలం కొన్ని కులాలవారే వంశ పారంపర్యంగా అధికారం చెలాయిస్తూ ఉన్న సంగతిని ఎవరూ కాదనలేరు. దేశం పరాయి పాలనలో ఉన్న రోజుల్లో కూడా ఈ వంశ పారం పర్యంగా అధికారం చెలాయిస్తున్న కులాలవారు ఆ నాటి పాలకులకు అండగా ఉండి ప్రజా పోరాటాలను అణచడంలో వారికి తోడ్పడ్డవారే. ఈనాడు స్వతంత్ర భారత దేశంలో మళ్లీ కాలానుగుణ్యంగా రంగు మార్చుకుని పాలనాధికారం తమ గుప్పెటిలో నుండి పోకుండా కృషి చేసుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో అతి పటిష్ఠంగానూ జటిలంగానూ ఉన్న కుల వ్యవస్థ ఈ వంశ పారంపర్య పాలనాధికారులకు సహాయకారిగా ఉంటున్నది. గ్రామంలో ఈ వర్గానికి చెందిన వారి సంఖ్యాబలం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, కుల వ్యవస్థ అడ్డు గోడల వల్ల మిగతా బలహీన వర్గాలకు చెందినవారు ఏకం కాకుండా రెచ్చగొడతారు.

పరిశోధనలలో ఒక విషయం రుజువైంది. దిగువ కులాలకు చెందిన వారిలో ఏదైనా ఒక కులం గ్రామ జనాభాలో అధిక భాగం విస్తరించిన సందర్భాలలో మాత్రమే ఆ కులం వారు గ్రామంలో వంశ పారంపర్యంగా పాలనాధికారాన్ని గుప్పిట్లో పెట్టుకున్న వర్గాల నుండి రాజకీయం తమ హస్తగతం చేసుకోగలిగారు. దిగువ కులాలకు చెందినవారు రెండు మూడు కులాల వారు కలిసి కట్టుగా వ్యవహరించి రాజకీయ అధికారాన్ని లాగుకున్న సందర్భాలు పెద్దగా లేవని తేలింది. దీనికి కారణం కుల వ్యవస్థ సృష్టించిన అడ్డు గోడలే ఆ అడ్డు గోడలను కూల్చి వేయడానికి హరిజన సంఘాలు ఇతర స్వచ్ఛంద సంస్థలూ గట్టిగా కృషి చేయవలసి ఉన్నది. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎన్నికల విధానంలో విప్లవాత్మకమైన మార్పులను సిఫార్సు చేసిన శ్రీ వెంగళరావు కమిటీ నివేదికలో ఈ వైఖరులను మార్చి వేయడానికి స్పష్టమైన సూచనలున్నాయి ప్రత్యక్ష ఎన్నికల విధానం ప్రవేశపెట్టినట్లయితే పంచాయతీ రాజ్ వ్యవస్థలో హరిజనులకు ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందనడంలో సందేహంలేదు మనరాష్ట్ర శాసనసభ ఆమోదించిన పంచాయతీరాజ్ చట్టాల్లో సమితి స్థాయి వరకు ప్రత్యక్ష ఎన్నికలను ప్రవేశపెట్టారు. ఈ కొత్త చట్టంప్రకారం ఎన్నికలు జరిగినప్పుడు సమితి అధ్యక్ష స్థానాలకు హరిజనులు సైతం ఎన్నిక కావడం సులభంకాగలదు.

పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులూ తమ తమ బడ్జెట్లలో హరిజన సంక్షేమానికి విధిగా 15 శాతం కేటాయించాలన్న నిబంధనలను ఈ సంస్థలు చాలా వరకు పాటించలేదన్న ఆరోపణ ఒకటి ఉన్నది.

ఈ ఆరోపణలోని నిజానిజాలు పరిశీలించే ముందు కొన్ని వాస్తవాలను పేర్కొనక తప్పదు. పంచాయతీరాజ్ సంస్థలు చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు హరిజన సంక్షేమానికి దోహదం చేసినవే. గ్రామానికి ఒక రోడ్డు వేసినా, గ్రామంలో ఒక పాఠశాలను నిర్మించినా, మంచినీటి బావులు త్రవ్వినా వాటి ప్రయోజనం హరిజనులకు కలుగలేదని గాని, గ్రామంలో సామూహిక సంక్షేమంతో బాటు హరిజన సంక్షేమం కూడా సాధింప బడలేదని గాని చెప్పడానికి వీలు లేదు. పంచాయతీ రాజ్ సంస్థలు చాలా వరకు హరిజన సంక్షేమ కార్యక్రమాలకు తమ సాధారణ నిధుల నుండి కేటాయింపులు చేసిన సందర్భాలు కూడ లేక పోలేదు కొన్ని చోట్ల ఈ విధంగా 15 శాతం కన్నా ఎక్కువ ఖర్చు చేయడం కూడా జరిగింది. అయితే అట్టి ఖర్చులను విడిగా తీసిన 15 శాతం నిధులకు ఖర్చు రాయక పోవడం సిబ్బంది లోపం కావచ్చు. లెక్కలు రాసే పద్ధతిలో లోపం కావచ్చు.

హరిజన సంక్షేమానికి ఉద్దేశించిన ఒక పథకాన్ని గానీ, ఒక కార్యక్రమాన్ని గానీ అధికారులు ప్రతిపాదిస్తే అట్టి ప్రతిపాదనలను స్థాయీ సంఘాల సమావేశాలలో గానీ, పంచాయతీరాజ్ సంస్థల సర్వ సభ్య సమావేశాలలో గాని, ఈ సంస్థలకు నాయకత్వం వహించిన అనధికారుల ద్వారా మరే విధంగానైనా గానీ త్రోసి పుచ్చిన సందర్భాలు ఒక్కటి కూడా లేవని నేను గట్టిగా చెప్పగలను.

హరిజన సంక్షేమానికి సంబంధించిన స్కీములన్నీ జిల్లా పరిషత్తు స్థాయీసంఘాలలోనే నిర్ణయించ బడతాయి. ఈ స్థాయీ సంఘాలకు జిల్లాకలెక్టర్లు అధ్యక్షులుగా ఉన్నారు జిల్లాకలెక్టర్ల ప్రతిపాదనలను కూడా ఏ సందర్భములోకూడా అనధికారులు తృణీకరించడం జరుగలేదని రాష్ట్ర పంచయతీరాజ్య పరిషత్తు అధ్యక్షునిగా నేను గట్టిగా చెప్పగలను.

పంచాయతీరాజ్ సంస్థలలో హరిజనులకు బలహీన వర్గాల వారికి కల్పించే ప్రాతినిధ్యం రిజర్వేషన్ల ద్వారా కల్పించాలా లేక కో-ఆప్షన్ల ద్వారా కల్పించాలా అనే సమస్యను కూడా సాకల్యంగా పరిశీలించవలసి ఉంటుంది కో-ఆప్షన్ పద్ధతివల్ల హరిజనుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మబలం పెంపొందదని, హరిజనులు సర్దుకొని పోతున్నంతకాలం వారిహక్కులకోసం పోరాడే స్వభావాన్ని అలవరచుకోనంతకాలం-ఇతరుల దయాదాక్షిణ్యాలమీద వారు ఆధారపడి ఉండునంతకాలం వారి ఉజ్వల భవిష్యత్తుకు భద్రమైన బాటలు పడవని కొందరివాదం సంతానం కమిటీకూడా కో-ఆప్షన్ పద్ధతిని నిరసించి రిజర్వేషన్ పద్ధతికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. రిజర్వేషన్ పద్ధతికి బదులు కో-ఆప్షన్ పద్ధతివల్ల స్థానికంగా పలుకుబడి గలవారు-వంశ పారంపర్యంగా అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికి అలవాటు పడ్డవారు తమ స్థానాలకు భంగం రాకుండా చూచుకోవచ్చు.'కో-ఆప్షన్ లో మిమ్మల్ని తీసుకుంటాంలే' అని నచ్చజెప్పి హరిజనులనూ, బలహీన వర్గాల వారిని పోటీలనుండి తప్పించవచ్చు ఈ పరిస్థితిలో హరిజన నాయకత్వం రూపొందడం కష్టం. మన ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు గారికి పంచాయతీరాజ్ వ్యవస్థ పట్లనూ, హరిజన సంక్షేమం పట్లనూ ఈ రెండింటి సమన్వయం పట్లనూ అత్యంత ఆసక్తి, అభిరుచి ఉన్నాయి ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం సహకార సంస్థలలో హరిజన, గిరిజన తదితర బలహీన వర్గాల వారికి సగం కన్నా ఎక్కువ సభ్యత్వం ఉండాలని ఒక చట్టాన్ని ఆమోదించింది. రాష్ట్రంలో ఎక్కువమంది వ్యవసాయ కూలీలు హరిజనులే. వారి వేతనాలను ప్రభుత్వం పెంచడమే గాక-ఆడ మగ కూలీలకు సమాన వేతనాలివ్వాలని నిబంధన చేసింది.

రాష్ట్రంలో హరిజనులకూ, ఇతర బలహీన వర్గాలవారికి బంజరు భూములనూ, ఇళ్ల స్థలాలనూ పంచే కార్యక్రమాన్ని అతి చురుకుగా కొనసాగిస్తున్నారు ఈ కార్యక్రమ సాఫల్యానికి పంచాయతీరాజ్ సంస్థలు ముఖ్యంగా గ్రామ పంచాయతీలు అనేక విధాలుగా తోడ్పడుతున్నాయి. ఇటీవల గ్రామీణ ఋణాలను రద్దుచేస్తూ జారీచేసిన ఆర్డినెన్సు వల్ల ఎక్కువగా లాభం పొందిన వారు గ్రామీణ ప్రాంతాలలోని హరిజనులే ననడంలో సందేహం లేదు. ఇప్పటి వరకు మనరాష్ట్రంలో 22 లక్షల ఎకరాల బంజరు భూములు హరిజనులకూ ఇతర బలహీన వర్గాలకు చెందిన 1,69,084 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఒక్క 1975-76 లోనే 3,35,000 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంచారు. ఈ ఏడు అంటే 1976-77 లో ఇప్పటి వరకు 1,74,33 కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంచి పెట్టారు. ఈ సంవత్సరం మార్చి ఆఖరునాటికి మరో 5 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంచి-ఇళ్ల స్థలాలు లేని

హరిజనులు తదితర బలహీన వర్గాలవారు రాష్ట్రంలో లేకుండా చూడాలని ప్రభుత్వం సంకల్పం.

ప్రభుత్వం యిచ్చిన బంజరు భూములనుగానీ, భూసంస్కరణల చట్టంక్రింద మిగులు భూములుగా తేలి పంపకం జరిగిన భూములనుగానీ, ఇళ్ళ స్థలాలను గానీ ఈ పేద ప్రజలు అమ్మకుండా, తాకట్టు పెట్టకుండా ఇటీవల మరో ఆర్డినెన్స్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది.

దేశమంతటా అమలులోనికి వచ్చిన కొత్త పౌరహక్కుల రక్షణచట్టం నిబంధనలను గ్రామీణ ప్రాంతాలలో ఖచ్చితంగా అమలు పరచడంలో పంచాయతీలు ప్రభుత్వాధికారులకు ఎంతో సహాయ సహకారాలను అందజేస్తున్నాయి.

ఇనాడు 20 అంశాల కార్యక్రమం అమలులోగానీ, సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థవారి కార్యక్రమాలకుగానీ హరిజన ఆర్థిక సహాయసంస్థ స్కీములకుగానీ సాముదాయక సేద్యపునీటి బావులు త్రవ్వే పనిలోగానీ, బంజరు భూముల కేటాయింపు, ఇళ్ళస్థలాల కేటాయింపు మొదలైన అన్ని విషయాలలోనూ రాష్ట్రస్థాయిలో ఉన్న అన్ని అభివృద్ధి శాఖలకూ, గ్రామస్థాయిలో పనిచేస్తున్నది పంచాయతీరాజ్ సంస్థలే. అందుకే రాష్ట్ర సమగ్రామాభివృద్ధికి పంచాయతీలు పునాదులవంటివి ఈ పునాదులు పటిష్టంగా సక్రమంగా ఉన్నప్పుడే రాష్ట్ర అభివృద్ధికూడా పటిషంగా ఉండగలదు.

★

గంగావతరణం

✻ 'పైడిపాల'

అంతఃపురం పసిడి పంజరాన్ని వీడి
అంతరాల పరదాలను చీల్చుకొని వచ్చాను
రాణిని కాదు నేను—ప్రజావాణిని
కాల వలాహకాల్ని ఛేదించుకొని
వసుమతి ఒళ్ళో ఆడుకొంటున్నాను
వర్షాన్ని కాదు నేను—హర్షాన్ని
కారులకీ అధికారులకీ వీడ్కోలు చెప్పి
సన్నకారు ముంగిళ్ళ ముందు నిల్చున్నాను
అభినేత్రిని కాదు నేదు—పవిత్రిని
ఎగువ నుంచి దిగువకు ప్రవహించి
చిట్ట పల్లాల నేకం చేస్తున్నాను
నీటిని కాదు నేను—పన్నీటిని
శాంతినీ క్రాంతినీ రెక్కల్లో పెట్టుకొని
రిక్కల్లోంచి ఎగిరి వచ్చాను
పులుగుని కాదు నేను—కొత్త వెలుగుని
జెండాలను ఎజెండాలను దిగి
సామ్యవాద మరీచుల్లో ఒదిగి వస్తున్నాను
నన్ను కలుషకోండి మీ మధ్య నిలుపుకోండి
నా ఊరు భారతం—నా పేరు స్వాతంత్ర్యం!

పరిగి తాలూకాలో పశుగణాభివృద్ధి

—శ్రీ మత్స్యరాజ హరగోపాలరావు

హైదరాబాదు జిల్లాలో రాష్ట్రరాజధానికి ఎనుబదిఐదు కిలోమీటర్ల దూరంలో నున్న తాలూకా కేంద్రం పరిగి. వెనుకబడిన ప్రాంతమైన పరిగి తాలూకాలో గత ఒకటి రెండు సంవత్సరాలుగా మేలురకపు పశుగణాభివృద్ధికై ఎన్నో పథకాలు చేపట్టడం జరిగింది. ఒక వందా నలుబది ఏడు గ్రామాలు, ఏబది రెండు గ్రామ పంచాయతులు గల ఈ తాలూకాలో అధిక శాతం ప్రజలు వ్యవసాయం పైననే ఆధారపడి యున్నారు. వీరిలో చాలామంది పాడిపరిశ్రమని కూడా చేపట్టినారు

పరిగిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు శాఖ: పశువైద్యశాఖాధికారులు, పాలశీతలీకరణ కేంద్రంవారి సమన్వయ సహకారంతో మేలురకపు పశుగణాభివృద్ధి జరుగుతూంది. ఇరువది సూత్రాల ఆర్థిక ప్రణాళిక క్రింద ఇటీవల హైదరాబాదు జిల్లాలో సన్నకారు రైతులకు ఋణ సహాయం చేయడం జరిగింది—అయితే ఈ సంవత్సరం మార్చి నెలాఖరి వరకు ఇరువది మంది సన్నకారు రైతులకు 37 మేలురకపు పశువుల కొనుగోలుకై 37,000 రూపాయల ఋణ సహాయం చేయడం జరిగిందని అప్పటి బ్యాంకు మేనేజరు ప్రకటించారు –తరువాత జూలై మాసాంతము వరకు పాడి పశువుల కొనుగోలుకై 51,000 రూపాయలను స్టేట్ బ్యాంక్ వారు ఋణ సహాయం చేశారు. ఇవేగాక ఎద్దులు, మేకలు, గొర్రెల కొనుగోలుకై పేద ప్రజానీకానికి ఋణ సహాయం గావింపబడింది– ఈ ఋణ సహాయం ద్వారా ఇక్కడి పశువైద్యుల సలహా పాటించి ప్రజలు పాడి పశువులను కొన్నారు.


15 సంవత్సరాల నుండి ఇక్కడి పశువైద్యశాల ఉంది—అయితే ఈ సంవత్సర ప్రారంభంలో రీజినల్ క్యాటిల్ డెవలప్‌మెంట్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు—అయితే పశు సంక్షేమం, రోగపీడిత పశువులకు టీకాలు వేయడం, కృత్రిమ గర్భధారణ, మొదలైనవన్నీ అతి శ్రద్ధగా చేయబడుతున్నాయి. ప్రస్తుతం ఏబది వరకు హాల్‌స్టీన్, జెర్సీ, దేవణీ, హర్యానా, ముర్రా రకాలకు చెందిన ఆవులు, బ్యాంకు ఋణ సహాయం ద్వారా కొన్నారు పరిగి ప్రజలు—అయితే ఈ ఆవు పాలను ఇక్కడి పాల శీతలీకరణ కేంద్రానికి తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో నాలుగు వేల లీటర్ల పాలను నిల్వ చేసేందుకు వీలుంది–వచ్చే మాసంలో పన్నెండు వేల లీటర్ల పాలను నిల్వచేసే విధంగా–కేంద్రంలో ప్లాంటును ప్రారంభిస్తారు. ఈ ఆవులకు అవసరమయ్యే గడ్డిని పెంచడానికి కూడా కృషి జరుగుతుంది. అవసరమైనప్పుడల్లా ఆవులను డాక్టర్లు పరీక్షిస్తున్నారు కూడా.


ఇక్కడి పశువైద్యశాలలో జరిగిన కృషి వివరాలు :

సంవత్సరం	వైద్యశాఖలో రోగవిముక్తి పొందిన పశువుల సంఖ్య	క్యాస్ట్రేషన్స్	టీకాలు	కృత్రిమ గర్భధారణ
1973–74	15319	214	18677	—
1974–75	15917	195	16327	—
1975–76	16388	233	19302	57

అయితే ప్రాంతీయ పశుగణాభివృద్ధి శాఖలో కూడా అమితమైన కృషి జరిగింది. పరిగిశాఖలో గత జూన్–జులై మాసంలోని వివరాల ప్రకారం 1816 పశువులకు ట్రీట్‌మెంట్ జరిగింది. 13 పశువులకు క్యాస్ట్రేషన్స్, 4192 పశువులకు టీకాలు, 10 పశువులకు కృత్రిమగర్భధారణ చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పశుగణాభివృద్ధి శాఖలు ఈ తాలూకాలో రూప్‌ఖాన్‌పేట మరియు నస్కల్ గ్రామాల్లో కూడా పనిచేస్తున్నాయి. అయితే పరిగి R.C.D. శాఖను ఇక్కడినుండి తీసివేసి బొంపల్లి గ్రామానికి మార్చాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఆ విధంగా జరిగితే, తాలూకా కేంద్రమైన పరిగిలోనే R.C.D. శాఖ ఉండకుండా పోతుంది, దీనివల్ల ఇక్కడి పశుగణాభివృద్ధికి చేపట్టిన పథకాలకెంతో నష్టం కల్గుతుందని భావింపబడుతున్నది.

ఈనాడు పరిగిలో ఎన్నో డైరీఫారాలున్నాయి. మేలురకపు ఆవులకొనుగోలుకై ఇక్కడి ప్రజలు గోమాతా చిట్‌ఫండ్స్, అనే సంస్థను ప్రారంభించుకొన్నారు. తద్వారా కొన్ని మేలురకపు ఆవులను కొనడం జరిగింది. పశు పెంపకంపైన ఆధారపడిన కుటుంబాలు కూడా ఎన్నో ఉన్నాయి ముగింపులో ఒకమాట చెప్పాలంటే వెనుకబడిన పరిగి తాలూకాలో పశుగణాభివృద్ధికై ఇంకా ఎంతగానో కృషి జరగవలసియున్నది. ప్రస్తుతం పరిగిలోనున్న పశువైద్యశాల, ప్రాంతీయ పశుగణాభివృద్ధి శాఖ (R. C. D. Unit) ఇతర స్థలాలకు మార్చకుండా అవసరమైతే మరికొన్ని గ్రామాల్లోకూడా శాఖలను ప్రారంభింపవలసిన అవసరమెంతైనా ఉన్నది. అప్పుడే పరిగిలో ప్రస్తుతం పశుగణాభివృద్ధికై చేపట్టిన పథకాలన్నీ సఫలమవుతాయి.





జిల్లా వార్తా చిత్రాలు



పై చిత్రాలు: ఫిబ్రవరి 28 న గవర్నరు విశాఖ నౌకాశ్రయం సందర్శించి నౌకాంతర్భాగ సాంకేతిక విభాగాలు పర్యవేక్షించారు


ఎడమవైపు ప్రక్కన: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో గవర్నరు స్నాతకోపన్యాసం.


ఎడమవైపు క్రింద: ఆంధ్ర విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో కొందరు "కళాప్రపూర్ణ" గ్రహీతలు.

క్రింద: నిజామాబాద్‌లో మార్చి 28 న రాజస్థానీ శిక్ష సమితి వార్షికోత్సవంలో గవర్నరు ప్రసంగం.









పైన: ఫిబ్రవరి 8న నెల్లూరు జిల్లాలో 2 వేలమంది పునరావాసితులుండే వెంగళరావు నగర్‌కు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం.

ఎడమవైపుపైన: మార్చి 8న తాడేపల్లిగూడెం మునిసిపల్ రక్షిత నీటి సరఫరా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.




మధ్య: మెదక్ జిల్లా రామచంద్రాపురంలో ఫిబ్రవరి 26న ఇక్రిశాట్ డైరెక్టరు డాక్టర్ ఆర్. డబ్ల్యు. కమ్మింగ్స్ దంపతులు తమ విరాళంతో నెలకొల్పిన బాలల పార్కు, ఆట స్థలాలకు ప్రారంభోత్సవంచేశారు.

ఎడమ వైపు క్రింద: మార్చి 1న కడపలో రిఫ్రిజిరేటర్ ఫిష్ కంటైనర్‌కు మత్స్య శాఖ మంత్రి శ్రీ డి మునుస్వామి ప్రారంభోత్సవం చేశారు.


క్రింద: నల్ల జర్ల సమితి నల్లమాడులో సహకార లిఫ్టు ఇరిగేషన్, మంచినీటి పథకానికి మార్చి 2న సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. ఆర్. శంకరన్ ప్రారంభోత్సవం చేశారు.





66—4

సీరియల్ :



సర్వయోగి

పులిచెర్ల సాంబశివరావు

—షష్ఠ యోగము—

పెదకోమటి వేమారెడ్డి సమర్థుడైన ప్రభువు. ఆయన దగ్గర తురగా రాముడు కొంతకాలం మంత్రిగా ఉన్నాడు. వాడు వట్టి దుర్మార్గుడు. తాను చేసేదంతా రాజ్య క్షేమానికేనని సమర్థించుకొనేవాడు. రాచ వేమారెడ్డి యువరాజుగా ఉన్నప్పుడే వాడితో సాహచర్యం చేశాడు. ఇద్దరి ఆలోచనలు సమానమే! తురగారాముడు వేమారెడ్డిని చాలాసార్లు అవమానించాడు. రాచ వేమారెడ్డికి, తురగా రామన్నకి స్నేహం ఇలా కొనసాగితే కుమారుడు పూర్తిగా చెడిపోతాడని గుర్తించి పెదకోమటి వేమారెడ్డి తురగా రామున్ని మంత్రి పదవిలోంచి తీసేశాడు. దాంతో వాడు కోరలు పీకిన పాములాగా బుసలు కొడుతున్నాడేగాని ఏమీ చేయలేకపోయాడు.

అదనుకోసం చూస్తున్నాడు.

ఇంతలో పెదకోమటి వేమారెడ్డి స్వర్గస్థుడయ్యాడు. రాచ వేమారెడ్డి ప్రభువయ్యాడు. ఇదే తగ్గ సమయం అని తురగా రాముడు తిరిగి రాచవేముని అండచేరాడు. మళ్లా మంత్రి అయ్యాడు. తన మంత్రాంగంచే రాముడు రాచవేముని మనసుని పూర్తిగా మార్చేశాడు. మహామంత్రి అయిన మామిడి సింగనమీద కొండీలు చెప్పాడు మామిడి సింగన రాచవేముని చంపి, వేమారెడ్డిని ప్రభువుగా చేయాలని ఎత్తుగడ పన్నాడని వాడు పుట్టించాడు. రాచవేమారెడ్డి వాడి మాటలు విని, జీవితమంతా రెడ్డిరాజులకే అంకితం చేసుకున్న మామిడి సింగనను పదవినుండి తొలగించాడు. ఆ మహామంత్రి పదవిని తురగా రాముడికి కట్టబెట్టాడు. దీంతో తురగా రాముడికి మరింత బలం చిక్కింది. వాడి అకృత్యాలకు అంతూ పొంతూ లేకుండా పోయింది.

కొండవీటిలో కరువొచ్చింది. జనం అన్నం లేక 'అలో లక్ష్మణా' అని అల్లాడుతున్నారు. కోటలో ధనాగారం వట్టిపోయింది. రాచవేముడికి దిక్కు తెలియలేదు.

తురగారాముడు రాచవేముని అభ్యంతర మందిరములో సమాసీనుడై ఉన్నాడు. వాళ్ళిద్దరూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

"ప్రభూ! మీరు ప్రజలకోసం చింతించవద్దు! వాళ్ళకర్మ వాళ్ళనుభవిస్తున్నారు. మనమేం చేస్తాం!"

"మంత్రిగారూ! ప్రజల్నిగూర్చి మనంకూడ ఆలోచించకపోతే ఇక వాళ్ళకి దిక్కెవరు?"

"దిక్కులేని వాళ్ళకి దేవుడే దిక్కు! ఈ కాటకాన్ని మనం ఆపలేంగదా!"

"మనం చేయగలిగింది ఏదైనా ఉంటే మనం చేయాలిగదా!"

"చేస్తూనే ఉన్నాంగదా ప్రభూ!"

"మన ప్రజలు కొండవీడు వీడిపోతున్నారని విన్నాం....!"

"పొయ్యేవాళ్లని పోనివ్వండి ప్రభూ! అంతా సుఖంగా ఉన్నప్పుడేమో కొండవీటిలో సందులేకుండా ఉండి, ఇప్పుడు కొంచెం కష్టం కలగానే వెళ్ళిపోవడం వాళ్ళకు మాత్రం ధర్మమా? అటువంటివాళ్లున్నా ఊడినా ఒక్కటే!"

"వైభవోపేతమై సకల సౌభాగ్యములతో అలరారిన కొండవీడిలా బీడుపడిపోవలసిందేనా మంత్రిగారూ!"

"మనం చేయగలిగిందేముంది ప్రభూ! ఉన్న సొమ్మంతా మీ తమ్ముడు వేశ్య ఒళ్లో పోస్తున్నాడు"

"వేశ్య!! ఎవతె అది?"

"నాగులు! అది మూగచింతపల్లెలో ఉంటుంది. టక్కులమారిది. మీ తమ్ముణ్ణి వలలో వేసింది దాని చేతిలో వేమారెడ్డి చిక్కుకున్నాడు!"

"ఎంత అప్రతిష్ఠ! ఈ సంగతి ప్రజలకు తెలిస్తే ఏమైనా ఉందా!''

"తెలీటం ఏంటి ప్రభూ! మీ తమ్ముడి శృంగారలీలలే వినోద కథలుగా ఊళ్లలో చెప్పుకుంటున్నారు. అయ్యయ్యో! ఎంత సిగ్గుచేటు! ఇటువంటి పరువు తక్కువ పని మీ వంశంలో ఎవరైన చేశారా?''

"నిజంగానా! వేమారెడ్డి అలా అయ్యాడా?"

"ప్రభూ! మీకింతకుముందే చాలాసార్లు మనవి చేశాను. అతడు దుష్టుడు, ఎప్పటికైనా మీకు గండం తెస్తాడు. వేమారెడ్డికి స్నేహితులెవరో మీకు తెలుసా? మీరు మంత్రి పదవినుండి తొలగించిన మామిడి సింగన పుత్రుడు పెద్దన! రెండవవాడు రాజులకు కూడా అప్పులిచ్చే చామిశెట్టి! ఇంకేంకావాలి! దుర్మార్గుడైన మీ తమ్ముడు తలుచుకొంటే ఈ క్షణంలో మిమ్మల్ని...''

"రామనా!'' అదురుపాటుతో ప్రభువు అరిచాడు.

"ప్రభువులు క్షమించాలి! ఉన్నమాట అంటున్నాను. ఈ తురగారాముడెప్పుడూ ఉన్నమాటే అంటాడని మీకు తెలుసు! ఎన్నాళ్లనుండో మీకు ఒక్కమాట చెప్పదలచి ఉన్నాను. ఇప్పుడవకాశం వచ్చింది నిజం చెబుతున్నాను! సత్యంకోసం ప్రాణాలైనా బలి ఇవ్వటానికి ఈ మీ తురగారాముడు సిద్ధమే!''

ఇద్దరూ కాసేపు మౌనంగా వున్నారు.

రాచవేముడి హృదయంలో దావాగ్ని చెలరేగింది. మంత్రి మాటలన్నీ సత్యాలుగా కనపడ్డాయి. ప్రతి పలుకూ రూపందాల్చి ప్రత్యక్షమై వికటాట్టహాసం చేస్తూ, నృత్యం చేస్తున్నట్లనిపించింది. రాచవేమారెడ్డి భయంతో వణికిపోయాడు.

"ప్రభూ మీ మనసు నాకు తెలుసు! మీది కుసుమ కోమలమైన మనసు. చీమకూడా హాని చెయ్యలేరు. ఇక తమ్ముణ్ణి ఎలా చంపగలరు...?''

"సోదరుణ్ణి చంపటమా?''

"అవును ప్రభూ! అదే తరుణోపాయం!''

రాచవేమారెడ్డి పలకలేదు.

"ప్రభూ! మీ ఉప్పుతిని బతుకుతున్నాను. మీకు ముప్పు వచ్చినప్పుడు చూస్తుండలేను. ఈ పరిస్థితుల్లో వేమారెడ్డి ఎదురు తిరిగితే మనపాట్లు కుక్కలుగూడ పడవు. మీ వంశంలోనే పూర్వం ఎందరు ప్రభువులు పోట్లాడుకోలేదు. మీ తండ్రిగారు కొమరగిరి ప్రభువులకు దగ్గరి చుట్టమే గదా! వారిని పదవీచ్యుతులను జేసి మీ తండ్రిగారు సింహాసనమెక్కలేదా? అలాగే వేమారెడ్డి చేస్తే మనగతి?''.

"రామన మంత్రీ!'' ఆవేశంతో రాచవేముడరచాడు.

"సందేహంలేదు ప్రభూ! ఇప్పుడు అటువంటి కుట్రే జరుగుతూంది!"

"ఎవరాకుట్ర చేస్తూంది?"

"వేమారెడ్డి! పెద్దన, చామిసెట్లతో కలిసి!''

"నిజమా!''

ఇంకొక రహస్యం! మిమ్మల్ని హత్య చెయ్యడానికి సిద్ధపడ్డారు. నేడో రేపో ఆ ప్రయత్నం జరుగుతుంది!''

"ఆ!"

"ప్రభూ! మీరు భయపడవద్దు! నేనొక ఉపాయం ఆలోచించాను!"

"......?''

''ఆ వేశ్యను మనం లోబరచుకోవాలి! డబ్బేదానికి ప్రాణం. ఈ వేశ్యల సంగతి నాకు బాగా తెలుసు. మనం వేమారెడ్డిని ఏమీ చెయ్యనవసరం లేదు. అంతా నాగుసే చేస్తుంది."

రాచ వేమారెడ్డి భయంతో ఒక్కసారి చుట్టూ చూశాడు. తురగారాముడు ఆయన చెవిలో గుసగుసలాడాడు.

ఆ అభ్యంతర మందిరం వెనుక దాగిన చెవులకా గుసగుసలు వినబడలేదు.

ఆ చెవులు నరసాంబవి.

ఆమె వీళ్లిద్దర్నీ వేయి కన్నుల్తో కనిపెట్టుకొని ఉంది. కుతంత్రాన్ని ఆమె గ్రహించింది.

ఎట్లాగైనా మరదిని రక్షించాలి! వేమారెడ్డిని మూగ చింతపల్లి నుండి తప్పించాలి. ఎలా? ఈ విషయాన్ని గూర్చి ఆమె పొద్దుపోయేదాకా ఆలోచిస్తూ కూర్చుంది.

కొండవీడు గాఢనిద్రలో మునిగిఉంది.

నరసాంబ తన మందిరం నుండి బయటకు వచ్చింది. ఒంటరిగా రాజమార్గంలో నడవసాగింది. చుక్కలు ఈమె ధైర్యంచూచి ఆశ్చర్యంతో మింట మినుకు మినుకు మంటున్నాయి.

నరసాంబ ధీరచిత్తంతో పెద్దన ఇంటిముందు నిలిచింది. ద్వారపాలకుడు ఆమెను చూచి చకితుడయ్యాడు. పెద్దన నరసాంబను చూచి విభ్రాంతుడైనాడు.

''తమ్మా! మీరా? అర్ధరాత్రి వచ్చిన మిమ్మల్ని చూస్తే నా మనసు కీడును శంకిస్తోంది!"

''బిడ్డా మా వేమారెడ్డీ." నీవూ మాకు ఒక్కటే! చిన్నతనం నుండీ నీవు మా వేమారెడ్డితో పాటు కలిసి మెలసి తిరిగావు. అతనితో పాటు నిన్ను కూడా కుమారునిగా భావిస్తూవచ్చాను!"

"అమ్మా! సందేహమెందుకు? చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకొన్న ఈ దౌర్భాగ్యునిపై ఎంతో కనికరం వహించి, మీ వేమారెడ్డిని చూచినట్లుగానే నన్ను చూచిన మీరు నాకు తల్లికంటె ఎక్కువే"

"పెద్దనా! నీవలె మా వేమారెడ్డికూడా క్షేమంగా ఉండాలని భావిస్తున్నాను!"

"అమ్మా! వేమారెడ్డి క్షేమంగానే ఉన్నాడు!"

"పెద్దనా...!" గాద్గదికమైన వరసాంబ కంఠాన్ని విన్న పెద్దన వ్యాకుల పడాడు. గ్రుడ్డివెలుగులో ఆమె కన్నుల నుండి కారుతున్న బాష్పధారల్ని చూచి పెద్దన మరింత చలించాడు.

"తల్లీ! దుఃఖమెందుకు?"

"నాయనా! వేమారెడ్డికి కీడు వాటిల్లింది!"

"అమ్మా! ఆజ్ఞ ఇవ్వండి! వేమారెడ్డికి ఆపద రాకుండా చూస్తాను. మిత్రుని ప్రాణాలకు నా ప్రాణాలను అడువేస్తాను!"

"అట్టి నమ్మకంతోనే వచ్చాను. మూగచింత పల్లెకుపోయి వేమారెడ్డిని అక్కడనుండి తప్పించు!"

పెద్దనకు అంతా అర్థమయింది.

వెంటనే పెద్దన "అమ్మా! నిర్భయంగాపోయి నిద్రించండి! ఇదిగో నేను పోతున్నాను!" అని ఒక ఛట్టుణ్ణి తోడిచ్చి ఆమెను పంపి వేశాడు.

పెదన చామిసెట్టి పడకను సమీపించాడు.......

— సప్తమ యోగము —

తురగా రామన రాచవేమునితో మంతనాలాడిన మరుక్షణం లోనే మూగ చింతపల్లెకు బయలు దేరాడు. వెంట ఇద్దరాంత రంగికులున్నారు.

వాళ్ళు మూగచింత పల్లె చేరే సరికి ప్రొద్దు కుంకుతూంది. ఆ సమయంలో వేమారెడ్డి షికారుకు పోవటం అల టు. ఈ సంగతి రామనకు తెలుసు.

తురగా రామన మూగచింతపల్లెలోని మొదటి ఇంటి ముందు ఆగాడు. సహచరులకు సంజ్ఞ చేశాడు. వాళ్లు లోపలికిపోయి మంత్రి రాకను తెలిపారు. నాగులుకు తురగా రాముని సంగతి తెలుసు. మంత్రిగారు వచ్చారనగానే ఏదో గొప్పవిషయమై ఉంటుందని అది ఎదురు వచ్చింది.

"మహామంత్రిగారికి మామీద ఇంత దయకలిగింది! విశేషమేమో...!"

"ఆఁ! గొప్ప విశేషమే! చెప్పమంటావా?"

"సెలవీయండి!"

"అయితే విను! నీ ప్రాణాలకు ముప్పు వచ్చింది!"

'ప్రాణానికి ముప్పు' అని వినగానే దానికి నిజంగానే ప్రాణం పోయినంత పని అయింది. ఒళ్లంతా చెమట పట్టింది. దానికి ధనమంటే ఇష్టం. కానీ ప్రాణాలంటే ఇంకా...! రామన దారం వైపు మాటి మాటికీ చూడటం అది గమనించింది.

"వేమారెడ్డిగారు చీకటి పడిన తరువాత గాని తిరిగిరారు. దయతో నా ప్రాణాలను కాపాడుకొనే మార్గం తెలపండి స్వామీ!" అని బహువిధాలా బతిమాలటం మొదలు పెట్టింది.

"ఓసీ! నీ ప్రాణాలుండాలంటే ...నేను చెప్పినట్లు చేస్తావా?"

"నా ప్రాణాలు కాపాడండి! మీరు నిప్పుల్లో దూకమంటే దూకుతాను!"

"నిప్పులూ వద్దు...నీళ్ళూ వద్దు! వేమా రెడ్డికి విషప్రయోగం చేయాలి."

నాగులు అదిరి పడింది.

"ఇదిగో ఈ పొట్లంలో ఉన్న చూర్ణాన్ని వేమారెడ్డి చేత తినిపించాలి!"

"ఈ పని కాక ఇంకా వేరొక పని ఏదైనా చెప్పండి స్వామీ!"

"నీ ప్రాణాలు రక్షించాలని ఇలా చేయ మంటున్నానని మరచి పోయావా?"

"మంత్రిగారూ! వేమారెడ్డిగారు నన్నే సర్వస్వంగా భావించారు!"

"అందుకే నీదగ్గరకు వచ్చాం!"

"నన్ను నమ్మిన ప్రభువుల్ని ఇలా మోసం చేయటం నాకు చేత కాదు!"

"అయితే నిన్ను రక్షించటం నాకు చేతగాని పని! నీ మెడలోని సొమ్ములు మహారాణి గారివి. రాజ ద్రోహ నేరం చేశావ్!"

"వీటిని దొంగిలించి తెచ్చు కోలేదు! వేమారెడ్డిగారిచ్చారు!"

"మేము నమ్మం!"

నాగులు పరిస్థితి నర్థం చేసుకొంది. ఇప్పుడు తాను వేమారెడ్డిపై ఆధారపడటం తెలివి తక్కువ. తాను వేమారెడ్డికి విషం పెట్టకపోయినా ఆయన్ను వీళ్ల బ్రతుకనీయరు. ఆ తరువాత ఎట్లాగూ తన ప్రాణం పోకతప్పదు! నాగులు ఆ పొట్లాన్ని అందుకుంది.

"జ్ఞాపక ముంచుకో! ఏమీ అవకతవక జరక్కూడదు. పని అయిన వెంటనే దాసి చేత కబురంపు. మేం ఊరి చివర సరిది తోటలో ఉంటాం!"

తురగా రామన రెండు చిన్న సంచుల్ని తీసి నాగులుకి చూపిస్తూ అటూయిటూ ఊపాడు. అవి ఘల్లు ఘల్లుమని మోగాయి.

"నాగులూ, ఇవేమిటో తెలుసా?"

నాగులు ఆశగా చూచింది.

"నీకు స్వర్ణయోగం అబ్బింది. ఈ పని సక్రమంగా నెరవేరిస్తే...ఇంతకు నూరురెట్లుగా ఇస్తాం!" ఆ సంచుల్ని దాని చేతిలో పెట్టాడు

చీకటి పడింది.

ఆయింటి దాసి చకోరాక్షి గూటిలోని దీపాల్ని వెలిగిస్తూంది తురగా రామన తన సహచరులతో కలసి అక్కడ నుండి వెళ్లిపోయాడు. మరికొంత సేపటికి వేమారెడ్డి వచ్చాడు.

ఆ రేయి నాగులు మరింత చక్కగా అలంకరించుకొంది. వేమారెడ్డికి ఆమె విశ్వ మోహినిగా కనబడింది.

"ఈమె ఎప్పుడూ ఇంత మనోహరంగా లేదు! దీని అందం ఈ నాడు తన ప్రాణాలు తోడేస్తోందే' అని వేమారెడ్డి సంబరపడ్డాడు

నాగు లెక్కువగా మాటాడుతూంది. దాని ప్రవర్తన వేమారెడ్డికి సంతోషం కలిగిస్తున్నప్పటికీ కొంత విచిత్రంగా కూడా అనిపించక పోలేదు.

"అమ్మాయి గారు ఈ రేయి యింత సంతోషంగా ఉన్నారెందుకో...".

"ప్రభూ! ఇవాళ నా పుట్టిన రోజు!"

"పొద్దున చెప్పలేదెందుకు"!!

"ఇప్పుడే... మీరు దేవాలయానికి పోయిన తరువాతే గుర్తుకు వచ్చింది!"

"ఎంత మతి మరపు! పుట్టిన రోజే మరచిపోయేనీకు నేను మాత్రం ఎలా గుర్తుంటాను!"

"ప్రభూ అంత కఠినంగా మాటాడ వద్దు. మీరు లేకుండా ఈ నాగులు బ్రతుకుతుందా?"

వేమా రెడ్డి సంబర పడ్డాడు.

"ప్రభూ! నా పుట్టిన రోజుకి బహుమతి ఏమిస్తారో?"

"బహుమతా! ఇక నా దగ్గర ఏం మిగిలి ఉంది ఇవ్వటానికి? నా సర్వస్వం నీకే ఇచ్చేశా వంసగాని అమూల్యాభరణాలతో సహా అన్నీ సమర్పించా మిగిలిందేముంది! ఇదిగో ఈ శరీరం ఉంది తీసుకో!"

నాగులు మూతి మూడు వంకర్లుగా తిప్పింది.

"పోనీండు ప్రభూ! నాపుట్టిన రోజుకి నేనే మీకు బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను. మీకోసం నా చేత్తో పాయసం చేశా!"

"అలాగా! అయితే ఏదీ... నీ సుకుమారములైన కరములతో నాకు పాయసం ఇవ్వు!" అని వేమారెడ్డి శయ్య మీద మేను వాల్చాడు

నాగులు వెంటనే లోనికి పోయి ఒక రజిత పాత్ర తెచ్చింది. అందులో పాయసము ది. కోమలమైన తన బాహువల్లరిలో వేమారెడ్డిని బంధించి ఆపాత్రను పెదవుల కందించింది.

వేమారెడ్డి కొంచెం త్రాగాడు.

"నాగులూ! ఏమిటిది... కొంచెం చేదుగా ఉందే!"

ఆ మాటలు వినగానే నాగులుకు గుండె దడ బయలుదేరింది. అయినా అది జాణ కాబట్టి వెంటనే తమాయించుకో గలిగింది.

"ఏం చమత్కారం ప్రభూ! పంచదార ఎక్కువైందని చెప్పటానికి బదులు పాయసంచేదని అంటున్నారుగదూ!"

"లేదునాగులూ! సత్యమే! పాయసం కొంచెం చేదుగా ఉంది కావలిస్తే నీవూ త్రాగిచూడు!"

దీంతో అది మరీ చిక్కున పడింది.

"మరి కొంచెం త్రాగండి ప్రభూ! అప్పుడు తెలుస్తుంది!"

వేమారెడ్డి మరియొక గుటక వేశాడు ఇంకా చేదనిపించింది.

"చేదుగా ఉందంటే నమ్మవేం!"

"నాపై నిజంగా మీకు ప్రేమ ఉంటే ఈ పాయసం చేదుగా ఉన్నదని మీరనరు. ఏదీ... ఇటు చూడండి! ఇటు ...ఇటు! నాకన్నుల్లోకి!" అంటూ వేమారెడ్డి కన్నుల్లో తన కన్నులు పెట్టి పాత్రను నోటి దగ్గర పెట్టింది

వేమారెడ్డి ఆ పాత్రలోని పాయసాన్ని అలాగే కన్నులు మూసుకుని గుటకలు వేశాడు.

మరి కొంత సేపటికి వేమారెడ్డి గుండెకో మంట బయలుదేరింది. క్షణ క్షణానికి బాధ ఇనుమడించింది. శయ్యపైన వేమారెడ్డి గిలగిలా కొట్టుకుంటున్నాడు. నాగులేమీ మాట్లాడకుండా చూస్తూంది

"నాగులూ! ప్రాణం పోతున్నంత బాధగా ఉంది. నోరు పిడచకట్టుకొనిపోతూంది. అబ్బ! కొంచెం నీళ్లు ఇవ్వు!" అం అంత బాధలోనూ వేమారెడ్డి నాగుల్ని అడిగాడు. అది కదలేదు


"ప్రభూ! విశ్రమించండి .. అదే పోతుంది!"

"...... పోయేటట్లే ఉంది ... ప్రాణం!" అంటూ వేమారెడ్డి బాధతో మెలికలు తిరిగిపోతూ విలవిల లాడుతున్నాడు ఒక్కసారి నాగులు మొగంవైపు చూశాడు నాగులు చేసిన ద్రోహాన్ని అతడు గుర్తించాడు.

"ఎంత వంచకి! మనసులో ఇంత ద్రోహబుద్ధి ఉంటుందని కలలోనైనా అనుకోలేదే! ఇది నాకన్ను తెరిపించింది... ఏం లాభం ప్రాణం పోతుంది........!"

ఇలా ఎంతోసేపు వేమారెడ్డి ఆలోచింపలేకపోయాడు


స్పృహ తప్పింది. (సశేషం)



వార్తాచిత్రాలు

★

ఎడమవైపు పైన: మార్చి 21న ఆంధ్రప్రదేశ్ శాసనసభ, మండలి సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగం



ఎడమవైపు క్రింద: విద్య, సాంస్కృతిక శాఖా మాత్యులు శ్రీ ఎం. వి. కృష్ణారావు ఉగాది సాంస్కృతికోత్సవాలను మెహబూబ్ కళాశాలలో ప్రారంభోత్సవం చేశారు

ఎడమవైపు ప్రక్కన: ఉగాది సాంస్కృతికోత్సవాలు ముగింపు రోజు సమావేశంలో ఆర్థిక, సమాచార శాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి ప్రసంగం.

క్రింద: శాసన సభలో ఆర్థిక మంత్రి తాత్కాలిక బడ్జెట్ సమర్పణ.


★







సచివాలయం వద్ద మిల్క్ ప్రాజెక్టు వారి పాలవిక్రయ కేంద్రానికి శ్రీ వి. బి. రామచంద్రా రెడ్డి ప్రారంభోత్సవం.




మార్చి 4న ముఖ్యమంత్రి మల్కాజ్‌గిరిలో రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు.

నగరంలో ....

మార్చి 8న సోవియట్ యూనియన్ ప్రతినిధివర్గం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ సందర్శించారు.

గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ సిబ్బంది శ్రీయుతులు టి.ఎస్.జి రాజన్ (లినో, ఇంటర్ టైప్ మెకానిక్) ఎం. కేశయ్య టి. సిద్దయ్య (లినో, ఇంటర్ టైప్ ఆపరేటర్లు) సాంకేతిక ప్రతిభకు గుర్తింపుగా డైరెక్టరు శ్రీ వి. నారాయణరావు - నగదు బహుమతులు అందజేశారు.





రాజధాని విశేషాలు



బాలల మహాసభలు

ఆంధ్రప్రదేశ్ బాలల మహాసభలు ఫిబ్రవరి 10 నుంచి 13వ తేదీవరకు జరిగాయి. మహాసభను 10వ తేది సాయంకాలం కేశవ మెమోరియల్ హైస్కూలు ఆవరణలో ఆర్థికమంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి ప్రారంభోత్సవం జరిపారు. బాలల సంక్షేమ పథకాలు అమలు పరచడంలో ధనికులు ప్రభుత్వంతో సహకరించాలని ఆయన కోరారు. విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. యువభారతి ప్రచురణ "బాలభారతి"ని పద్మశ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆవిష్కరించారు. శ్రీ వంగపల్లి విశ్వనాధం ప్రచురణ ఉద్దేశం తెలిపారు. బాపు సచిత్ర బాల రామాయణాన్ని విద్యామంత్రి ఆవిష్కరించారు. ప్రచురణకర్త శేషాచలం అండ్ కో యజమాని శ్రీ ఎం. ఎన్. రావు రామాయణ పరిచయం చేశారు. ప్రపంచంలోని వివిధ భాషలలో అది ప్రచురితమయిందని, అమెరికా పిల్లలకు బాపు పుస్తకాలంటే వెర్రి వ్యామోహమని ఆయన అన్నారు. మహాసభల ప్రత్యేక సంచికను శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఆవిష్కరించారు.

రాష్ట్ర తాత్కాలిక గవర్నర్

రాష్ట్ర గవర్నర్ శ్రీ ఆర్ డి భండారే తమ పదవికి రాజీనామా యిచ్చినందున రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి బిపిన్ చంద్ర జీవన్‌లాల్ దివాన్ ఫిబ్రవరి 17వ తేదీన రాష్ట్ర తాత్కాలిక గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం రాజ్ భవన్‌లో అతి నిరాడంబరంగా జరిగింది. రాష్ట్ర హైకోర్టు సీనియరు న్యాయమూర్తి శ్రీ అవుల సాంబశివరావు శ్రీ దివాన్‌చేత ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ సాంబశివరావు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తారు.

డా. చివుకుల కృష్ణమూర్తికి బోర్లాగ్ బహుమతి:

నోబిల్ బహుమతి గ్రహీత డాక్టర్ నార్మన్ బోర్లాగ్ గౌరవార్థం కోరమండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ ఒక బహుమానాన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ నిపుణులకు ఏటా ఇస్తున్నది. బహుమానంగా బంగారు పతకము, పదివేల రూపాయల నగదు ఇస్తారు. నిరుడు ఈ గొప్ప బహుమతి హైదరాబాదులోని వరిసమన్వయ పథకంలో పనిచేసే పద్మశ్రీ ఎస్. వి. ఎస్. శాస్త్రికి లభించింది. ఈ సంవత్సరం డాక్టరు చివుకుల కృష్ణమూర్తికి ఇచ్చారు. ఈయన హైదరాబాద్‌లో వున్న అఖిల భారత మెట్ట సేద్యపు పరిశోధన పథకానికి డైరెక్టరు. భూమిగుణాన్ని పరిశీలించి, ఏయే భూమిలో ఏయే పోషక పదార్థాలు లోపిస్తాయి, ఏయే పోషక పదార్థాలు ఎప్పుడు పైర్లకు వేస్తే అధికోత్పత్తి కలుగుతుంది, మున్నగు విషయాల పై ఈయన చేసిన పరిశోధన అధికోత్పత్తికి చాల సహాయపడుతున్నది. ఏడేండ్లుగా వీరు భారత వ్యవసాయ పరిశోధన మండలికి సంబంధించిన మెట్ట సేద్యపు విభాగానికి డైరెక్టరుగా పనిచేస్తున్నారు.

నగర సౌందర్యాభివృద్ధికి ప్రత్యేక సంస్థ

నగర ప్రాంతాల అభివృద్ధిచట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నగరాలు, పట్టణాల స్వరూపాల, అభివృద్ధిపొందిన ప్రాంతాలలోని పరిసరాల పునరుద్ధరణ రక్షణలకు "ఆంధ్రప్రదేశ్ నగర కళాభివృద్ధి కమిషన్" అనే సంస్థనేర్పాటు చేసింది. ఐక్యరాజ్య సమితి మాజీ అధికారి, సౌదీ అరేబియాలో మాజీ భారత రాయబారి శ్రీ జహీర్ అహమ్మద్ ఈ సంస్థ అధ్యక్షులు. శ్రీమతి రోడామిస్త్రీ, (ఎం.ఎల్.సి) శ్రీయుతులు పి. టి. రెడ్డి (ఆంధ్రప్రదేశ్ లలిత కళ అకాడెమీ కార్యదర్శి,) లక్ష్మగౌడ్ (ప్రసిద్ధ కళాకారుడు), సి.జె.జె. రాజు, కె.ఎ. సిద్దికి (వాస్తుశాస్త్రజ్ఞులు), డాక్టర్ వి.కె. బావ (హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు), నరేంద్ర లూథర్ (హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి), డాక్టర్ ఎన్. రమేషన్ (పురావస్తు శాఖ డైరెక్టర్) జె. వెంకటరమణ రెడ్డి (టౌన్ ప్లానింగ్ శాఖ డైరెక్టర్) సభ్యులు.

—శ్రీ తిరుమల రామచంద్ర

వచన కవితా రూపకం :

★

కవితావేశం
నా దేశం

★

—శ్రీ జె. ఎస్. రామకృ

సోషలిజం యిది

(గత సంచిక తరువాయి)

1వ గుమాస్తా :

అయితే
మన ఆఫీసరాధముడు
అవినీతికి ప్రథముడుగదా
వారేమయినట్టు
వీటికి తెలుసా గుట్టు
వాడి ఆయువు పట్టు.

2వ గుమాస్తా :

మిత్రమా
మన ఆఫీసరుడు
పాతాళంలో పడిపోయాడు
నిన్నటితో వాడి ఆటకట్టు
అభ్యుదయానికిది తొలిమెట్టు
బ్రతుకు బాగుపడిన పనిముట్టు.

1వ గుమస్తా :

చుట్టూ అప్పులు
మూతిలో కప్పలు
బ్రతుకు ముప్పతిప్పలు
బడుగు గుమాస్తాల
గతిలేని జీవితాలు
చిరిగే కాగితాలు
చితిలో స్వగతాలు
ఇంకెంత దూరం
ఈ భారం
ఉంటుందా
ప్రభుత్వ సహకారం ?

2వ గుమస్తా :

మూతిలో కప్పలు
విశాలమైన చెరువులో కొచ్చేశాయి
కాబూలీ కర్కోటకుల
కాట్లను తప్పించుకొన్నాయి
కప్పలు సంతోషంతో
బెక బెకలాడుతున్నాయి
చెరువులో పెద్ద చేపలున్నాయి
చిన్న చేపలను తింటున్నాయి
చిన్న చేపలు విలపించాయి.
చిన్న చేపలు ఉద్ఘోషించాయి
వచ్చింది ఓ పెద్ద అల
విసిరింది ఓ పెద్ద వల
చిన్న చేపల కల ఫలించింది
పెద్ద చేపలు వలలో చిక్కాయి
ఊపిరాడక చచ్చాయి
చిన్న చేపలు
చెయ్యెత్తి మొక్కాయి
సంబరాలు చేశాయి
మధ్య తరగతి మండూకాలంటే
మన ప్రభుత్వానికి మమకారం
అనుక్షణం వుంటుంది
వారి సహకారం.
మిత్రమా నిజం యిది
రుజువు యిది
సోషలిజం యిది
అయితే వోదాంపద
ఆఫీసుకు వేళయింది.

* * * * * * * * *

సూత్ర :

సూర్యుడు మబ్బుల్లోంచి చూస్తున్నాడు.
మనవాడు స్వాతంత్ర భానుడు
'పేవ్‌మెంటు' మీద నడుస్తున్నాడు
అతని ప్రక్కగా
ఓ యువకుడు
నిరుద్యోగ పీడితుడు
నిరాశా తాడితుడు
కళ్ళల్లో ఊపిరిలో
కనిపించని ఆశలతో
ఎముకల ప్రోవులా
వున్నవాడు
కుర్రవాడు నడుస్తున్నాడు
స్వగతంగా మాట్లాడుకొంటున్నాడు.

నిరుద్యోగి :

వసంతంలో
వాడింది చెట్టు
మారింది మోడుగా
శ్రావణంలో
క్షేత్రం
మారింది బీడుగా
శరత్కాల శశివి
శుక్లపక్ష చంద్రు
రాకాసి మేఘాలు కప్పేశాయి
ఆకాశ మార్గాన
చీకటి చిందులు వేస్తోంది
"ఏది నాకు దారి
నా హృది గోదారి
ఆశలన్నీ ఆవిరి
నా కన్నులు కావేరి"
'ఎమ్మే డిగ్రీ'
ఎందుకూ పనికిరాదు
'అమ్మామ్మా' లేందే
పనికాదు
ఆసరా లేనివాణ్ణి
ధూళి దూసరితాంతరంగుణ్ణి
ఎవరిస్తారుద్యోగం
ఎపుడు తలుపు తట్టను
సద్యోగం ?
వుంది చీకటి చాటు
వుంది అవినీతికి రూటు
అది ఐశ్వర్యానికి బాట
ఆనందానికి కోట"

పోతున్నా
అటు పోతున్నా
నా మంచి తనం
నా ఋజువర్తనం
నాకు అవకాశం ఇచ్చిందా
ఆదరించిందా...

ఎందుకూ కొరగాని మంచి
తీగలు లేని విపంచి
అందులో ఏ శ్రుతి
పల్లవించదు
ఏ రాగం పరిమళించును ?
ఏ హృది పులకించును ?

అందుకే...
వెళుతున్నా తెరచాటుకి
వెళుతున్నా చీకటిలోకి
మరో వేషంతో మళ్ళీ వస్తాను
ఈ సమాజం ఏమంటుందో చూస్తాను...

సూత్రధారుడు : ఇంటా నిష్క్రమిస్తున్న
యువకుణ్ణి ఆపి;
మనవాడు కథానాయకుడు

స్వాతంత్ర్యభానుడు : సోదరా త్వరపడకు
త్వరపడకు సోదరా
ఆవేశంలో పొరబడకు
అజ్ఞానంలోనికి చొరబడకు
అవినీతి రాటుకన్నా
అపశ్రుతి పాటవిన్నా
చావుకేసే ఓటు మిన్న
ఏడవకు చిన్నా
తుడుచుకో నాన్నా... కన్నీళ్ళు

చేతనను చిదిమి వేసి
వేదన రగిలించకు
ఓడిన హృదయంలో
పగ సెగలించకు
మూసి వుంచిన
మూడో కన్ను తెరు...

మనస్సు నావరించిన
బాధల్ని మరు
మేరువులా
ధీరువులా నిలబడు

చీకటితో కలబడు
చిత్తుగా ఓడించు
గమ్మత్తుగా ఆడించు
నీ గెలుపు
నీ ఒక్కడికే పరిమితం కాదు
అది
వ్యధార్త జీవిత ప్రజకు పిలుపు
నిరాశా పూరిత జాతికి మేలుకొలుపు

నిరుద్యోగి: అన్నా...
నీ మాట విన్నా...
నన్నేం చెయ్యమన్నా!
నగరంలో నరకం కన్నా
కారడవిలో బ్రతుకుమిన్న
మనిషిలో పశువుకన్నా
జంతువుల మనసు వెన్న.
మనుషులంతా ఒక్కటే... ఆకారంలో
కానీ బుద్ధులన్నీ వేరు
కులాలు వేరు
మతాలు వేరు
చూడు వీళ్ళ తీరు
కులాల శృంఖలాలు బిగించుకొని
మతాల ముసుగులు ధరించుకొని
వికటంగా నవ్వుతారు
అమాయకుల మీద,
ఆర్తుల మీద కష్టాలను రువ్వుతారు
సమాజాన చీడ పురుగులు వీరు
దేశవృక్షాన్ని తొలుస్తున్నారు
వీళ్ళతో బ్రతక లేను
పగిలిన హృదయాన్ని అతకలేను
అన్నా.. పోతున్నా... నన్నాపకు

స్వాతంత్ర్యభానుడు : నిజం సోదరా
నీవన్నది నిజం సుమీ
ఉవుల్లో కన్నా
క్రూర జంతువులు
మనలోనే వున్నాయి
మనుషుల్లోనే వున్నాయి
స్వార్థం
సంకుచితత్వం
అవి రెండూ
సత్య ధర్మాలను హింసిస్తున్నాయి

మనిషే మహాత్ముడు
మనిషే విషతుల్యుడు
మనిషిలో పశుత్వం
మరీ దారుణం
సప్త వరాల్లోను
స్వచ్ఛమైన తెలుపున్నటే
మనుషులందరిలోను
మానవత్వముంది
దాన్ని మేల్కొల్పాలి
అందుకై శ్రమించాలి
ఇందుకై తపించాలి
మహాత్ముల నీడే
మనకు అడుగుజాడ
నవ సమాజానికి

అద్దాల మేడ!
నీ కోసం
మీ కోసం
మన కోసం
మన ప్రభుత్వం
స్వచ్ఛంద సేవా పథకాలను
ప్రవేశ పెట్టింది చూడు...
లేకుంటే...లేదంటే...

స్వయం ఉపాధి పథకాలను
పరిశీలించు
స్వచ్ఛంద జీవితంలోనికి
ప్రవేశించు
నీకు అభిరుచి వుంటే
'అప్లికేషన్' పెట్టుకొంటే
ఋణాలను ఇప్పిస్తుంది ప్రభుత్వం
కుటీర పరిశ్రమలకు
మంచి ప్రోత్సాహం
వీనిలో దేనైనా స్వీకరించు
నీ జీవనాన్ని సాగించు
ప్రభుత్వ ధనంతో
పదుగురిని ఆదుకునే
పరిశ్రమ పెట్టు
అనుక్షణం శ్రమించు
అధికోత్పత్తిని పెంచు
విడిపోవును కష్టాలమంచు
నవ వసంతంలో పల్లవించు
సుమ సౌరభాలను పరిమళించు
వెళ్ళిరా
సోదరా
వెళ్ళిరా ...

(తరువాయి వచ్చే సంచికలో)

భీమునిపట్నం: దాని భవిష్యత్తు

ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగి ఇరవై యేళ్ళు గడిచాయి. గడచిన నవంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ 20వ వార్షికోత్సవం జరుపుకొంది. ఈ సందర్భంగా మన రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి. నవ సమాజ నిర్మాణానికి కావలసిన పథకాలకి ప్రభుత్వం తీసుకొంటున్న శ్రద్ధ గురించి కూడా పునశ్చరణ చేసికోవడం అవసరం.

1976 సం॥లో మొత్తం భారత దేశంలోనూ ముఖ్యంగా మన రాష్ట్రంలోనూ పురోభివృద్ధికై చాలా ప్రయత్నాలు జరిగాయి. 20 సూత్రాల పథకంవల్లనేమి, దేశంలో అత్యయిక పరిస్థితివల్లనైతేనేమి మంచి కార్యక్రమాలు జరిగాయి. వ్యవసాయాభివృద్ధి. నదీ జలాల వినియోగం. ఓడ రేవుల నిర్మాణం. పాత ఆనకట్టల రిపేరు. సాంకేతిక వర్గానికి ఉద్యోగావకాశాలు వీటిలో చెప్పుకోదగ్గవి. పెద్ద పట్నాలలో విహార వనాలు. వన్య మృగ ప్రదర్శనాలయములు నెలకొల్పారు. మొదటిసారిగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అఖిల భారత విజ్ఞాన సభలు జరగడం విశేషం.

విశాఖపట్నం నేడు తూర్పు కోస్తాలో ముఖ్యమైన రేవుగా వృద్ధిచెందింది. దీనికి కారణమైన పురాతన నగరం భీమునిపట్నం గురించి తెలుసుకుందాం. 'భీమిలి' అనే భీముని పట్నం ఇప్పుడిప్పుడే మళ్ళీ ప్రసిద్ధికెక్కుతున్నది. విశాఖపట్నానికి ఈశాన్యమూలగా 40 కి. మీ. దూరంలో సముద్ర తీరాన ఉన్న చిన్నపట్నం పూర్వం కళింగపట్నం, తామ్రలిప్తి, యానాం, తుత్తుకాడి రేవులలాగా చరిత్రలో కలిసిపోయింది. కళ్ళికోట, పుదుచ్చేరి, పాండిచ్చేరి నగరాల్లాగా మళ్ళీ ఉన్నత స్థితికి వచ్చే అవకాశాలలో భీమిలి మంచి భవిష్యత్తుకై వేచి చూస్తోంది.

'భీమునిపట్నం' ఇప్పుడొక తాలూకా కేంద్రం మాత్రమే. విశాఖ నుండి కలకత్తాను కలుపు జాతీయ రహదారిపై చిట్టివలసకు తూర్పుగా చిన్న రోడ్డుతో కలుపబడి వున్నది. ఇటీవలే విశాఖ నుండి 'లాసన్స్‌బే' మీదుగా విలాస యాత్రలకనుకూలముగా వేసిన రోడ్డుపై బస్సు ప్రయాణ సౌకర్యం కలిగింది. నిర్మలమైన వాతావరణంతో చేపలు పట్టే చిన్న నావలతో ఈ బెస్త పల్లె పురాణ కథలను గుర్తుకు తెస్తుంది. విశాలమైన తీరం, లోతులేని సముద్రం వలయాకారంలోవున్న ఉప్పుకయ్య ఇసుకతిన్నె, దూరాన తూర్పు తీరపు కొండలు, కొబ్బరి–సరుగుడు తోటలతో కన్నుల పండుగ చేసే రమణీయమయిన పట్టణమిది.


మద్రాసుకి సమీపంలోవున్న మామల్లపురంలోలాగా రాతి చెక్కడాలు వసతి సౌకర్యాలు భీముని పట్నంలో లేవు. కాని అల్లయులు మన ఆంధ్రతీరంమీద ముందుగా అడుగిడిన కారణంగాను, చారిత్రాత్మకంగా కళింగ రాజులు–గంగరాజుల పరిపాలనలో విజయనగరం–జయపురం కోటలకు ఓడ రేవవడంచేత భీమునిపట్నం మూడు వందల సంవత్సరాల చరిత్ర ముద్రవేసికొని శిథిలమైంది.


ప్రస్తుతం మనం భీమునిపట్నంలో కనబడే ముఖ్యమైన ప్రదేశములు కొన్ని వున్నాయి. బస్సుల కూడలి దగ్గర తిరుమునవే ఉన్న చిన్నబంగాళాలు, విశాలమైన ఆవరణలోనున్న పురాతన విహార శాలయం, దీపస్థంభం, 'డప్లే'కంపెనీవారి నారబేలింగ్ మిల్లు, ప్రక్కనే సెమిటరీ. బజారులో గడియారాల స్థంభం. రోమను కాలంనాటి తీరులో కట్టిన చిన్న ఇళ్ళు పాడుపడిన రాణీగారి భవంతి, దగ్గరలోనే విక్రమదేవవర్మగారిచే ప్రారంభించిన క్లబ్బు, ఊరికి పశ్చిమంగా ఆంగేయుల కాలంనాటి వాణిజ్య వీధికి పైన వరాహ నృసింహస్వామి దేవాలయము ఉన్నాయి. ఈ దేవాలయం మెట్లు సింహాచలం కొండకిమల్లె ఎత్తుకావు. గుడి ద్వారంముందు రెండు రాతి నటరాజ విగ్రహాలు. బాటపైన కొన్ని చెక్కడాలున్న ఈ చిన్న దేవాలయం అందమయినదే. గుడి ప్రాంగణమునుంచి భీమిలి అంతా అందంగా కన్పిస్తుంది.


భీముని పట్నంలో ఉన్న భవనాలు చాలవరకు క్రిష్టియన్ మతానికి చెందినవి. కొండకి దిగువ ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఒకటి మెథడిస్టు చర్చి ఒకటి ఉన్నాయి. పశ్చిమంగా ఉన్న కాథలిక్ చర్చి మాత్రం పురాతనమైంది. ఇది అందమైనదే కాకుండా కోలోన్, ప్యారిస్, విండ్సర్ నగరాలలో ఉన్న కాథడ్రల్సు లోవలె చక్కటి వర్ణ చిత్రాల అద్దాలు ఉన్న చర్చి ఇది. 150 సంవత్సరాల క్రితం జార్జి రిప్లే ప్రోద్బలంతో కట్టినట్లు తోస్తున్నది. చర్చినుండి భీముని పట్నం తీరం వెళ్ళేమార్గంలో చిన్న తటాక మొకటి, దానికి చేరి ఆటస్థలాలు, తూర్పుగా పచ్చిక బయళ్ళతోను, కొబ్బరిచెట్లతోను ఉన్న ఉద్యానవన మొకటి ఉంది. 1917లో ఆంగ్లరాజు 'జార్జి' సింహాసన మెక్కినప్పుడు ఆ సందర్భంగా 'కింగ్ జార్జి కరోనేషన్ గార్డెన్' అని భీముని పట్నంలో 'ఖాదిర్ షా సాహెబు' ఈ తోట నెలకొల్పినట్లు విరిగిముక్కలైన చెక్కలపై వ్రాతను బట్టి తెలుస్తోంది. భీమిలిలో సెయింట్ ఆన్స్ బోర్డింగ్ స్కూల్ చెప్పుకోతగ్గది. నూతన భవనాలు, పురాతన సంప్రదాయాలు గల ఉన్నత

" రాజు "

66—7













రోమను కళ ప్రతిబింబించే రాణీ మహల్ చక్కటి వర్ణ చిత్రాలు వున్న కాథలిక్ చర్చి, కొండదిగువన ఆంధ్రా బాప్టిస్టు చర్చి, మెథడిస్టు చర్చి, రిపేకంపెనీ పొగ గొట్టాల భుగభుగలూ, సముద్రతీరాన్ని కాలంతో కొలిచి ప్రకృతిలో మైమరచిన పర్యాటకులను తట్టి లేపే గడియార స్తంభం.












మూడు శతాబ్దాల చరిత్ర 'దాగిన సౌందర్య సీమ భీముని పట్నం









దూరాన తూర్పు తీరపు కొండలు, కొబ్బరి-సరుగుడు తోటలు, "కింగ్‌జార్జి కరోనేషన్" గార్డెన్, ప్రాంగణంలో అడుగు మోపితే - అందాల "భీమిలి"నంతా చూపే వరాహ నృసింహ దేవాలయం, దీప స్తంభం, ప్రకృతి యీ పట్టణానికి యిచ్చినసుందరదృశ్యాలు.





పాతకాల బహుశా ఆంధ్రదేశములో ఇదే మొదటిది. ఇంకా రాజా గారి భవనం. మూనెమిల్లు, మత్స్య పరిశ్రమకి సంబంధించిన కేరళ ప్యాకేర్సు వారి ఫ్యాక్టరీ ఉన్నాయి

ముమ్ముందు విశాఖపట్నం పురపాలక సంస్థలో విభా గంగాను, ఉద్యోగుల నివాస కేంద్రంగాను పరిగణించేందుకు ప్రభుత్వ శాసనం జరిగింది. కనుక భీముని పట్నం విలాస యాత్రా కేంద్రంగాను, కలుషితంగాని వాతావరణంతో నివాస యోగ్యమైన ఆధునిక పురపాలక నగరంగా అభివృద్ధి చెందవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. చికిత్సాలయం, రవాణా సౌకర్యాలు మెరుగవడానికి ముఖ్యమంత్రి వాగ్దానం చేశారు. షష్ఠిపూర్తి చేసికో వలసిన 'శాస్త్రి గార్డెన్'ని మరల 'ఉష్ణమండల ఓషధి వనంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగపర్యవేక్షణలో చేపట్టి ప్రభుత్వం వృద్ధిచేయాలి. 'రాణిమహల్' కామకొని సముద్రజల జీవరాసులు నాచుమొక్కలు ఉన్నాయి. స్వాభావిక పరిసరా లున్నాయి. కనుక ఈ శిథిలమైన భవనాన్ని మరమ్మతుచేసి మ్యూజియం మార్చాలి. రాజాగారి భవనం ఎత్తయిన ప్రదేశంలో విశాలావరణ కలిగిఉంది. కనుక అధునాతన సౌకర్యాలతో భారత ప్రభుత్వ టూరిజం శాఖవారు మంచి వసతి భవనం నిర్మాణచేసి విదేశ యాత్రికులు, విద్యార్థులు మొదలైన వారికి విహార కేంద్రంగా చేయాలి.

తూర్పుతీరంలో ఆంధ్రరాజుల చరిత్రకి సంబంధించిన వస్తుప్రదర్శనశాల లేనేలేదు. జయపూర్-విజయనగర సంస్థానాలకి సంబంధించిన చరిత్రాత్మకమైన వస్తువులు, గ్రంథాలు, నాణెములు మొదలైనవి, సేకరించి వస్తుప్రదర్శనశాల నెలకొల్పేందుకు ప్రభుత్వము, రాజకుటుంబాలు శ్రద్ధతీసికోవాలి.

యూరప్ దేశాల్లో అతివేగంగా పోయే మోటార్ బోట్లు న్నాయి. ముమ్ముందు విశాఖ పట్నం-భీముని పట్నాల మధ్య - సముద్రయాత్రలకు వీలుగా బ్రిటిష్ ప్రభుత్వ సాంకేతిక సహకార పథకం క్రింద ఒక గాలి పడవ (Sea Speed) మనం తెచ్చుకొని విలాస విహార యాత్రా కేంద్రంగా భీమునిపట్నాన్ని వృద్ధి చేసికోవాలి

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

డాక్టర్ దాశరథి, కేరాఫ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, బషీర్‌బాగ్, హైదరాబాదు.
ఎస్. యెతిరాజరావు, ఎం.ఎల్.ఎ., ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్య పరిషత్ అధ్యక్షులు.
"సైదిపాల", పి.ఎస్.రెడ్డి, తెలుగు లెక్చరర్, అమలాపురం-533201
ఎం. హరగోపాలరావు, లెక్చరర్, పరిగి, హైదరాబాద్ జిల్లా-501501
పులిచెర్ల సాంబశివరావు, 7 వ లైను, అరండల్‌పేట గుంటూరు-2
తిరుమల రామచంద్ర, 69, ఆదర్శనగర్, హైదరాబాదు.
కె. ఎస్. రామకృష్ణ, ఏదుమోలు, దివితాలూకా, కృష్ణాజిల్లా-521156
రాజు, సిస్టమేటిక్ బోటనిస్టు, సెంట్రల్ నేషనల్ హెర్బేరియా, హౌరా-3
సి. ఆనందారామం, ఎస్.టి. 26, మారేడుపల్లి, సికిందరాబాదు.
కె. లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాదు
ఉన్నవ మదనమోహనరావు, 6-3-354/2, హిందీనగర్ కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్
మంజుశ్రీ, తెలుగు అకాడమీ, హిమాయత్‌నగర్, హైదరాబాదు
పోరంకి దక్షిణామూర్తి, తెలుగు అకాడమీ, హిమాయత్‌నగర్, హైదరాబా
రంగినేని సుబ్రహ్మణ్యం, "శ్రీవాణి", కొల్లాపురం, మెహబూబ్‌నగర్ జిల్లా.

నిరాశలో నిండు గుండె

— సి. ఆనందారామం

జరిగిన కథ: శ్యామ్ తండ్రి జనార్దన్ వద్ద పెరిగిన సి. ఐ. డి. అధికారి మోహన్ లోటస్ హోటల్ యజమాని సాంబశివం చేస్తున్న దొంగనోట్ల వ్యాపారం పట్టివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రసూన, చిరంజీవి మోహన్‌కు సహాయం చేస్తున్నారు. ఈ కేసు నుండి ప్రసూనను దూరం చేయమని సుశీలను కోరుతాడు శేఖర్. పరమేశ్వరి సహృదయుల సాయంతో కూలిపేటలో అనాథసేవ చేస్తూంది.

జపాన్ త్రీ-ఇన్-వన్ సెట్టు రేఖ ప్రోత్సాహంతో దొంగిలించి పట్టుబడిపోతాడు శ్యామ్. శ్యామ్ దొంగతనం చేస్తూండగా తీసిన ఫొటోలను తనకిచ్చి అతడిని వదిలివేయమని ప్రాధేయపడి మోహన్‌ను అక్రమ ప్రవర్తనకు గురి చేస్తాడు జనార్దన్. ఈ విధంగా సాంబశివం పన్నిన "ట్రాప్" అర్థమౌతుంది మోహన్‌కు. అయినా చేసేదేంలేక కన్నీళ్ళతో తలవంచుకుంటాడు.

19

తెల్లని బట్టలతో కడిగిన ముత్యంలా వుంది ప్రసూన ... అప్పుడు తానున్న మానసిక స్థితిలో ప్రసూనను చూడగానే ఎంతో సంతోషం కలిగింది మోహన్‌కి.

"కంగ్రాట్యులేషన్స్ !" నవ్వుతూ అంది ప్రసూన ...

"దేనికి ?"

"ఇంత చక్కగా మీ ఉద్యోగం మీరు చేస్తున్నందుకు - రక్షక భటాధికారి ఈజ్ ఈక్వల్‌టు తనవారిని సర్వదా రక్షించుకొనువాడు - అంతేనా !"

ప్రసూన ఇలా హేళన చేస్తోంటే మోహన్‌కు కోపంరాలేదు. ఏ విధంగానూ ఏ సమాధానమూ ఇయ్యలేని తన నిస్సహాయస్థితికి తలుచుకుని తన మీద తనకే జాలికలిగింది.

ప్రసూన ఊరుకోలేదు.

"గుర్తుందా ? నా ఉద్యోగానికి కావలసిన అర్హతలన్నీ నాకున్నాయి, అన్నారు. ఇదే కాంప్లిమెంట్ మీకు ఇస్తున్నాను. మీరు చక్కగా నిజాయితీ నటించగలరు. అవసరమని తోస్తే ముందు వెనకలు ఆలోచించకుండా అన్యాయం చెయ్యగలరు. మాటల్లో ఎక్కడలేని కచ్చితమూ చూపించగలరు. చేతల్లో మీ స్వార్థం మీరు సమర్ధవంతంగా చూసుకోగలరు. మిమ్మల్ని నమ్మే అమాయకులకు మీరొక దేవతలాగ కనిపించగలరు. మీగుట్టు మట్టు తెలుసుకున్న వాళ్ళకి చేతులు జోడించగలరు ! వహ్వా ! పోలీస్ ఆఫీసర్ అంటే అందులోనూ సి. ఐ. డి. ఆఫీసర్ అంటే ఇలాగే ఉండాలి ..."

ఇంక సహించలేక పోయాడు మోహన్ ...

"సూనా ! ఇవాళ నేను నీకేసమాధానము ఇయ్యలేను. కానీ, గర్వంగా నీముందు నిలబడి నేనెవ్వరినో నిరూపించు కోగలిగే రోజు రాకపోదు !"

పకపక నవ్వింది ప్రసూన.

"మీదాకా వచ్చేసరికి ముందు రోజులు కూడా ఉంటాయని గుర్తువస్తోందా ? ఇలాగే అందరూ మాట్లాడతారు. రేఖ, సాంబశివం, శేఖర్ ...... అందరూ"

"సూనా ! నేను ఈ రిపోర్టు ఇచ్చివుంటే నువ్వుకూడ ఇరుక్కోవలసివచ్చేది !"

ఈ మాటలు వింటూనే తోక తొక్కిన త్రాచులా లేచింది ప్రసూన.

"ఏమిటీ ? మీరు రిపోర్టు ఇయ్యనిది నాకోసమా ? ఇదంతా నామీద ప్రేమేనా ? ఆహా ! ధన్యురాలిని !"

"సూనా !"

"ఛీ ! ఛీ ! నన్నలా పిలవకండి."

చివాలున లేచి వెళ్ళబోతూ గుమ్మం దగ్గర ఆగి వెనక్కు తిరిగింది.

"సాయంత్రం కూలిపేటకు వస్తారుగా ! అక్కడ మీకు కావలసినన్ని కేసులు. తిండికిలేక గుప్పెడు మెతుకులు 'దొంగతనం' చేసిన వాళ్ళుంటారు. యజమాని పెట్టే బాధలు భరించలేక ప్రాణం విసిగిత్తి ఎదురు తిరిగే 'గుండా'లు ఉంటారు. గుక్కెడు గంజి నీళ్ళకోసం ఒళ్ళమ్ముకునే 'నీతిమాలినవాళ్ళు' ఉంటారు. వాళ్ళందరినీ పట్టుకుంటే మీకు కావలసినంత పేరు ప్రఖ్యాతులొస్తాయి. మీ నిజాయితీని, ధర్మ తత్పరతను ముందు తరాల వాళ్ళు కూడ గానం చేస్తారు."

సెగలు కక్కుతూ సాగిపోయింది ప్రసూన ...

కొన్ని క్షణాలు మోహన్‌కు మనసు పని చెయ్యలేదు అంతలో కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఈ దొంగనోట్ల వ్యవహారం సాధ్యమైనంత త్వరలో తేల్చేయ్యాలి ? ఇందుకు చిరంజీవి సహకారం కావాలి!

చిరంజీవి 'పార్టీ, పార్టీ' అని మురిసి పోతున్నది ఆరోజే వని గుర్తువచ్చింది. ఏకంగా హోటల్‌లోనే చిరంజీవిని కలుసుకో వచ్చునని బయలుదేరాడు.

కాని మోహన్ ఆశించినట్లు చిరంజీవి హోటల్‌లో లేదు.

హుషారుగానూ లేదు – హోటల్ కెదురుగా ఉన్న చెట్టునానుకుని నించున్నాడు. సూట్‌లో లేడు. ఎప్పటి మురికి బట్టలలోనే ఉన్నాడు. ఎప్పుడూ లేనంత దీనంగా ఉన్నాడు.

మోహన్ దగ్గిరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి 'చిరంజీవీ !' అన్నాడు.

ఆప్యాయతతో కూడిన ఆ పలకరింపుకు చిరంజీవి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతి ప్రయత్నంమీద నిగ్రహించుకున్నాడు.

"వినండి సార్ ! మా స్టూడెంట్స్ అంతా ఎంత సరదాగా నవ్వుకుంటున్నారో ?"

"అది సరే ! నువ్విక్కడెందుకున్నావ్? పార్టీలో జాయిన్ అవలేదేం ?"

"జాయిన్ అవలేదేం ? అని అడుగుతున్నారా సార్ ! ఈ క్షణంలో వాళ్ళ మధ్య వుండటానికి నాకున్న దేదైనా వదులుకోగలను సార్ !"

"మరి ...."

"వాళ్ళు రానివ్వలేదు సార్ !"

"అంటే విద్యార్థులలో కూడా బీదా, గొప్పా........."

"అది కాదు సార్ ! మరొకటి ! మా కెమిస్ట్రీ లెక్చరర్‌కి ఒక పన్ను ఊడిపోయింది సార్–తెలివైన వాడే కాని మాట కొంచెం తొస్సిగా వస్తుంది. మొన్న ఆ లెక్చరర్ పాఠం చెప్తొంటే ఒక స్టూడెంట్ ఆయనను ఇమిటేట్ చేస్తూ గొడవ చేసాడు. క్లాసంతా గందర గోళమయింది. లెక్చరర్ ఆ స్టూడెంట్‌ని క్లాస్ నుంచి వెళ్ళి పొమ్మన్నారు–తనను మెడ పట్టి గెంటాడని ఆ స్టూడెంట్ కంప్లెయింట్ చేసాడు– స్టూడెంట్స్ అందరూ ఒకటయ్యారు. ప్రిన్సిపాల్ నన్ను అడిగారు.........నేను నిజం చెప్పాను సార్ ! పాపం, ఒక పన్ను లేనంత మాత్రాన ఆయన్ని ఉద్యోగంలోంచి పీకెయ్యాలనటం నేను ఒప్పుకోలేక పోయాను. వాళ్ళందరితో ఒక కచ్చు మీద నిలవనందుకు స్టూడెంట్స్‌కి నా మీద కోపం వచ్చింది నన్ను బాయ్‌కాట్ చేసారు........."

మోహన్‌ని చూసి దీనంగా నవ్వాడు చిరంజీవి ఏమీ అనలేని మోహన్ ఓదార్పుగా చిరంజీవి భుజం తట్టాడు.

"పరమేశ్వరి గారి దగ్గిరకు పదండి సార్ !" అన్నాడు చిరంజీవి.

"ఇప్పుడా ! ...."

"అవును సార్ ! మన కంటే దౌర్భాగ్యులను చూసి మన దుఃఖం మరచిపోవచ్చు......"

కాదనలేక పోయాడు మోహన్.

మోహన్‌ను చూడగానే కోపంతో మండి పడిన ప్రసూన చిరంజీవిని చూడగానే సమస్తమూ మరచిపోయింది......

"అదేమిటి చిరంజీవీ ? అలా ఉన్నావేం !" అంది ......

చిరంజీవి నవ్వుతూ తుళ్ళుతూ జరిగినదంతా చెప్పాడు. అతడు పైకి ఎంతగా నవ్వుతోన్నా లోలోపల ఎంత మథన పడుతున్నాడో అందరికీ అర్థమయింది– "ఈ మాత్రానికే ఇలా అయిపోతున్నావా చిరంజీవి ! నా కథ వింటే ఏమంటావో ? ......" అంది పరమేశ్వరి–అందరూ కుతూహలంగా చూసారు.

"రవిని నేను ప్రేమించింది ప్రధానంగా అతని వ్యక్తిత్వాన్ని చూసి...... మేం పెళ్ళి చేసుకున్నప్పుడు మా ఫ్రెండ్సు అందరూ మమ్మల్ని ఆదర్శ దంపతులని పొగిడారు. రవిది మొదటి నుండీ క్రమబద్ధమైన జీవితమే ! కొన్ని విలువలకు కట్టుబడి ఉండే మనిషి–అప్పుడప్పుడు నేను సరదాకి అబద్ధాలాడినా నన్ను మందలించేవాడు. డిగ్రీలు తీసుకున్న ఇద్దరమూ ఉద్యోగాన్వేషణలో పడ్డాము. కొంత శ్రమ పడ్డాక నాకు ఉద్యోగం దొరికింది. కానీ రవికి ఎంత ప్రయత్నించినా దొరకలేదు. నా జీతం మీద ఆధార పడి ఉండటానికి అభిమాన పడేవాడు. లంచం పెడితేగాని ఉద్యోగం దొరకని పరిస్థితి......'మన బోటి వాళ్ళం కూడా లొంగి పోతే ఎలా ? లంచం ఇయ్యవద్దు ....' అని నేను...... రవికికూడా లంచం ఇయ్యటం అంటే అసహ్యం.... కానీ, తనను పట్టి పీడించే నిరుద్యోగ పిశాచి ముందు నిలవలేక పోయాడు. లంచం ఇయ్యటానికి సిద్ధ పడ్డాడు–నేను ఒప్పుకో లేదు.

"ఎవరి మటుకు వాళ్ళమే ఇలా లొంగిపోతే ఈ విషవలయాల్లోంచి బయటపడేదెప్పుడు ? ప్రతిఘటించి పోరాడదాం" అన్నాను.

"నా ఒక్కడివల్ల ఏమవుతుంది ? అంతే ! వెల్లువలో పూచిక పుల్లలం—" అన్నాడు.

"నేను ఎంతచెప్పినా వినిపించుకోలేదు– ఆ సందర్భంలోనే మాకు మాటామాటా వచ్చింది. చివరకు విడిపోయాం అందుకు మీరెవరన్నా మీఒక్కరివల్లా ఏమవుతుందీ ? అంటే నేను సహించలేను. నేను రవిని ఎంతగా ప్రేమించానో రవికి మాత్రమే తెలుసు. ఎక్కడున్నా ఏపని చేస్తున్నా రవి గుర్తుకు రాని క్షణం వుండదు అతనికోసం ఆరాటపడకుండా ఉండలేను. అంతమాత్రం చేత ప్రతికూల పరిస్థితులకు లొంగిపోయిన అతని బలహీనతతో రాజీ పడలేను–అలా నరకం అనుభవిస్తున్నాను–ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం మాటలు కాదు దానికి ఏరోజు ఏలాంటి మూల్యం చెల్లించుకోవలసి వస్తుందో మనం ఊహించలేము– దేనినైనా అర్పించుకోగలిగిననాడే దృఢంగా నిలవగలము..."

పరమేశ్వరి చివరివాక్యాలు అక్కడి అందరి మనసులలోనూ మళ్ళీమళ్ళీ మార్మోగాయి.

సుశీలతో కలసి సుఖంగా జీవితం గడపాలని ఎంత వుందో తాను ఇరుక్కొన్న విషవలయం నుండి బయట పడాలని కూడా అంతగా వుంది శేఖర్‌కి. అయితే అందుకు సుశీలను పావుగా వాడుకొనే స్వార్థం మాత్రం లేదు. అందుకే సుశీలకు వున్నవిషయం స్పష్టంగా చెప్పటానికే సంకల్పించు కున్నాడు.

"సుశీలా! మనం బయట పడటానికి ఒకేఒక మార్గం ఉంది. కానీ అందులో సాధక బాధకాలు చాలా ఉన్నాయి..."

"అసలు మార్గమేమిటో చెప్పండి—మార్గమంటూ ఉంటే ఎన్ని బాధలు పడటానికైనా నేను సిద్ధమే—"

ఉత్సాహంగా అంది సుశీల.

అమాయకంగా చిరునవ్వుతో వెలిగిపోయే సుశీల ముఖం చూస్తూ "నేనెంత అదృష్టవంతుణ్ణి!" అనుకున్నాడు శేఖర్.

"సుశీ! మా తమ్ముడు స్టేట్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ముందుగా మా [illegible] అక్కడికి పంపించెయ్యాలి. అందుకు ఏ రహస్యమైన ఏర్పాట్లు అక్కర్లేదు. ఆ తరువాత మనిద్దరము కూడా అక్కడికి వెళ్ళిపోవాలి! దీనికి ఏర్పాట్లు రహస్యంగా జరగాలి—అవి నేను చూసుకోగలను!"

"ఎక్సెలెంట్!"

"ఆలోచన బాగానే ఉంది. కానీ దీనిని ఆచరణలో పెట్టాలంటే చాలా డబ్బుకావాలి!"

"నాన్నగారు తన లాభాలన్నీ ఎప్పటికప్పుడు సగం అమ్మ పేరుమీద సగం నాపేరు మీద ఉంచుతారు..."

"అది నాకు తెలుసు!"

"ఇంక ఆలోచన దేనికి?"

"సుశీ జాగ్రత్తగా ఆలోచించుకో నీ డబ్బంతా నాకోసం ఖర్చుపెట్టి..."

"మీకోసం కాదు! నాకోసమే ఖర్చు పెట్టుకుంటున్నాను. మీరు సందేహించకండి?"

"సుశీ! నామాట విను—నిదానంగా ఆలోచించుకో! అమాయకురాలివి మీనాన్నగారు నీకు అన్నివిధాలా నాకంటె మంచి వరుణ్ని తీసుకురాగలరు".

"ఇక్కడినుండి పారిపోనా?"

కోపంగా అంది సుశీల.

సుశీల చెయ్యిపట్టుకుని తన గుండెల మీదకు లాక్కొని చుట్టూ చేతులు బిగించాడు శేఖర్.

"మిగిలిన లోకమంతా ఏమనుకున్నా నువ్వు మాత్రం నన్ను అపార్థం చేసుకుంటే నేను సహించలేను సుశీ! నీమీద ప్రేమ లేక కాదు. ఈ ప్రేమ నీకు సుఖాలకు బదులు కష్టాలను తెచ్చి పెడుతుందేమో నని భయపడుతున్నాను"

సుశీల శరీరమూ, మనసూ కూడా పులకరించి పరవశించాయి.

"ఇలాంటి ప్రేమను పొందగలిగితే—పరవాలేదు, ఎలాంటి కష్టాలైనా పడవచ్చు"...

మనసారా అంది...

శేఖర్‌తో కలిసి విదేశాలకు వెళ్ళిపోవటానికి నిర్ణయించుకుంది సుశీల.

ఇప్పుడు శేఖర్‌ను చూస్తుంటే సుశీలకు సైతానుకు ఆత్మ అమ్ముకొన్న 'ఫాస్' గుర్తురావటం లేదు. లోకాలన్నీ గెలవబోతున్న మహావీరుడు గుర్తుకొస్తున్నాడు—

తమ ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చూడటంలో మునిగి పోయాడు శేఖర్.

లలిత ఎప్పుడూ తనకాలం వ్యర్థం చెయ్యదు—సాధారణంగా చదువుకొంటుంది. లేకపోతే [illegible], అల్లికలూ మొదలైనవి చేస్తుంది. అప్పుడప్పుడు తోటపని చూస్తుంది.

పరమేశ్వరి, లలిత చిన్ననాటి స్నేహితురాలు—లలిత ప్రతి మాటకోగా ఎప్పుడైనా పరమేశ్వరి లలిత దగ్గర కొస్తుంది అలా వచ్చినరోజు లలితకు పండుగే! ఇద్దరూ ఎన్నో విషయాలు మాట్లాడు కుంటారు—అలా మాట్లాడుతున్నంత సేపు తను రెక్కలు కట్టుకుని ఎక్కడికో ఎగిరి పోతున్నట్టు అనిపించేది లలితకు—కానీ లలిత మాత్రం పరమేశ్వరి దగ్గరకు వెళ్ళేది కాదు.

అందుకు కారణం సాంబశివానికి ఇష్టంలేకపోవటం కాదు. ఆ కూలిపేటలో అందరికీ సాంబశివం తెలిసినవాడు కావటం. సాంబశివం భార్యగా అక్కడికి వెళ్ళలేదు తను.

ఎన్ని పనులలో ఉన్నా, వంట మనుష్యులున్నా, సుశీలకు ఎప్పుడు తనే స్వయంగా వడ్డిస్తుంది లలిత.

"అమ్మా! ఇవాళ నేను నీతోనూ, నాన్నగారితోనూ కలిసి తింటాను."

సాధ్యమయినంత అమాయకంగా ముఖం పెట్టి అంటోన్న సుశీలను విస్తుపోయి చూసింది లలిత.

సాంబశివంతో కలిసికూచుని ఏనాడూ భోజనం చెయ్యలేదు లలిత, —చివరకు పెళ్ళయిన కొత్తలోకూడా. ఆ సంగతి ఇంట్లో అందరికీ తెలుసు. సుశీల ఇప్పుడెందుకిలా మాట్లాడాలి? అంత పసిపిల్ల కాదే!

చివాలున అక్కడినుంచి లేచిపోయింది. సుశీల గుండెలు దడదడ కొట్టుకున్నాయి. తను తలపెట్టిన కార్యం సామాన్యమైనది కాదు. పిల్లిలా తల్లిదగ్గిర చేరింది. ఎఱ్ఱగా కందిపోయిన ముఖాన్ని పుస్తకంలో దాచుకుంది లలిత.

"కోపం వచ్చిందా అమ్మా?" అంది జాలిగా సుశీల.

సుశీల అలా జాలిగా మాట్లాడితే లలిత కోపం నిలవదు.

"నాకేం కోపం?" అంది దెబ్బతున్నట్లుగా.

సుశీల లోలోపల చాలా బాధపడింది.

తండ్రి అంటే తనకు ప్రేమ ఉంది. తండ్రికి తన మీద ఉన్న ప్రేమ తలచుకుని గర్వమూ ఉంది. కాని తన ఎదురుగా

ఉన్న - రూపమూ, చదువూ, సంస్కారము అన్నీ ఉన్న ఆ ఉత్తమురాలికి భర్తగా ఊహించుకుంటే...

"ఛీ ! ఛీ ! నేనిలా ఆలోచించకూడదు" అనుకుంది సుశీల.

"అమ్మా ! నీ చేతులలో నేను ఇంతదాన్నినయ్యాను. చిన్నప్పుడు నువ్వు నాకు మాటలు నేర్పించావు. వాటి సాయంతో నేనింకెన్నో మాటలు నేర్చుకున్నాను. నీతో కొంచెం కూతురిగా కాక స్నేహితురాలిలా మాట్లాడాలని ఉంది"

ఆశ్చర్యంగా చూసింది లలిత

లలిత అంగీకారంకోసం ఆగకుండానే మొదలుపెట్టింది సుశీల. "ద్వేషంతో, కసితో మనసు మరిగించుకుంటూ బ్రతికేవాళ్లు కొందరుంటారమ్మా ! నువ్వు ఆ జాతికి చెందినదానివి కావు. మనసునిండా ప్రేమ నింపుకొని అది చుట్టుపక్కలవాళ్ళకి పంచి ఇస్తావుకాని నువ్వు బ్రతకలేవు. నువ్వు క్షమించాలమ్మా! నీకోసమే, నీమీది ప్రేమతోనే నన్ను క్షమించమని బ్రతిమాలుతున్నాను అందమైన నీ కళ్ళలో ఆ అశాంతి చూడలేకపోతున్నాను. నీ పెదవులు చిరునవ్వు నవ్వినా, ఆ వెనుక ఉన్న విషాదం సహించలేకపోతున్నాను. లోకంలో చాలా తక్కువమందికి లభించే విజ్ఞానము, సంస్కారమూ, నిన్ను నువ్వు దహించుకుపోవటానికి మాత్రమే ఉపయోగపడుతోంటే భరించ లేకపోతున్నానమ్మా !"

సుశీల కళ్ళు చెమ్మగిల్లాయి.—

లలిత నివ్వెరపోయింది. సుశీల స్పష్టంగా చెప్పకపోయినా ఏవిషయం మాట్లాడుతోందో లలితకు అర్థమయింది. ఇంత ఎదిగిందా తన సుశీల ! తన చిన్నారి పాప !

"అమ్మా ! ఎవరి ముఖంచూసి నీ సుఖం నువ్వుచూసుకోకుండా అలిసిపోయావో ఆ నాకోసమే ఇప్పుడు నువ్వు క్షమించాలమ్మా ! నీమనసు ఎంత నలుగుతుందో. నేను ఊహించలేనని అనుకోకు, నలగటం ఎలాగు తప్పనప్పుడు— బ్రతుకుతో రాజీపడుతు నలగ నీయటమే మేలుకదూ ! "

లలిత సుశీలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని సుశీల చెమ్మగిల్లిన కళ్ళను తుడిచింది.

ఆరోజు తనతోపాటు భోజనానికి కూచున్న సుశీలనూ లలితనూ చూసి ఆశ్చర్యపోయాడు సాంబశివం.

ఈ రకంగా ఉంటే బాగుండునని అతడు ఎంతగా కోరుకున్నా పెళ్ళయిన ఇన్ని సంవత్సరాలలో ఎన్నడూ ఇలా జరుగలేదు.

"వాట్ ఎ వండర్ !" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ లలితను చూసి.

లలిత మాట్లాడలేదు. సుశీల కల్పించుకుని "ఇందులో ఆశ్చర్యమేముంది నాన్నా !" అంది దబాయింపుగా....

సాంబశివం తగ్గలేదు.

"నువ్వు నాతో కూచోవటంలో ఆశ్చర్యంలేదు సుశీ ! శ్రీమతి లలితాదేవిగారు కూర్చోవటమే విశేషం ! ఈ దీనుడిమీద తమకు ఇంత అనుగ్రహం ఎందుకు కలిగిందండీ! ఏంకావాలి !"

లలిత కళ్ళెత్తి సుశీలను చూసింది. సుశీల చటుక్కున తల దించుకుంది. ఆ దించివున్న కళ్ళనుండి రెండు నీటి బిందువులు జారిపడ్డాయి అవి చూశాకకాని వాతావరణంలో ఏదో ఉందని అర్థం కాలేదు సాంబశివానికి.

"ఏమిటిది సుశీ ! ఇప్పుడు నేనేం అన్నానని ? ఛ ! ఛ ! నేను—అనలు—తిను"

ఏదో ఒకదానికొకటి పొంతనలేకుండా అన్నాడు. ఆ తరువాత ఎవరూ మాట్లాడలేదు. లలిత సరిగ్గా తినలేకపోయింది. అది చూసి సుశీలా తినలేదు. సాంబశివం సాధారణంగా ఏ విషయానికీ కలతపడడు. కానీ సుశీల కన్నీళ్ళు...తన మాటల కారణంగా సుశీల సరిగ్గా తినకపోవటమూ అతనినీ కలవరపరిచింది. అతనూ ఏమీ తినలేకపోయాడు.

సుశీలకు మొదటినుండీ తండ్రిదగ్గర చాలా గారాబం. తల్లి దగ్గర ఏదైనా మాట్లాడటానికి భయపడుతుంది. కాని, తండ్రి దగ్గర ఎలా అంటే అలా మాట్లాడుతుంది.

"నీ పద్ధతి నాకు నచ్చలేదు నాన్నా !" అంది.

సుశీల అలా సంజాయిషీ అడుగుతున్నట్లు మాట్లాడినా ముద్దుగానే ఉంటుంది సాంబశివానికి...

"ఏమిటమ్మా !" అన్నాడు వాత్సల్యంతో...

"నిన్న అమ్మతో ఎందుకలా మాట్లాడావు?" అంది.

"అదా! పరవాలేదులేదమ్మా! ఆవిడగారు ఈ లోకంలో మనిషినికానని అనుకుంటుంది, ఆవిడ దృష్టికిమనమంతా పురుగులం." కసిగా అన్నాడు సాంబశివం—

ఆకంఠంలో కసికి వణికిపోయింది సుశీల !

తనకు తండ్రిమీదున్న అధికారమంతా ఆయన మనసులోని పితృవాత్సల్యమే! ఈ క్రూరమృగంలో మమత చిగురింపచేసే శక్తి దానికి ఉందా ?

"నాన్నా! నీకు అమ్మప్రేమ పొందాలనివుందా?"

తన మనసులోపలి రహస్యమేదో ఇతరులు కనుగొన్నట్లు ఉలికిపడ్డాడు సాంబశివం, అంతలో సర్దుకొని దర్పంగా అన్నాడు.

"నాకేంలేదు-తలుచుకుంటే ఈక్షణంలో లక్షమందిని సంపాదించగలను"-

నోరుజారినవెంటనే సుశీలముఖంలో మార్పుచూసి, తను మాట్లాడుతున్నది తన కూతురితోననే విషయం గుర్తుకొచ్చి నాలుక కరుచుకొన్నాడు సుశీల మనసులో కంటగించుకున్నా ఆ ప్రసంగం ఆపలేదు.

"కానీ, అమ్మను మాత్రం సంపాదించలేవు. అమ్మ డబ్బుకి ఆశపడదు. బెదిరింపులకు భయపడదు. లోకాన్ని లక్ష్యపెట్టదు. కష్టాలకు లొంగిపోదు. అమ్మలాంటి వ్యక్తులను లొంగదీసుకోగలిగే శక్తి లోకంలో ఒకే ఒకటి ఉంది''

"ఏమిటది"?

ఈప్రశ్న అడిగిన తండ్రికంఠంలో ఆరాటానికి చాలా సంతృప్తి పడింది సుశీల—

"ఎదుటి వ్యక్తులో మంచితనం...."

సాంబశివం మాట్లాడలేదు. సుశీల మళ్ళీ అంది.

"మీరు ట్రై చేసి చూడండి! నామాట అబద్ధమయితే అడగండి!"

సాంబశివం ఆలోచనలో పడ్డాడు.

ఆసాయంత్రం సాంబశివం లలిత దగ్గరకు వచ్చాడు. అలా పెళ్ళయిన కొత్తల్లో వచ్చేవాడు, బెదురుగా చూస్తూ... మొరటుగా తనను సమీపించబోయే అతణ్ణి చూస్తే లలితకు భరింపరాని చికాకు కలిగేది. పెదవి కదపకుండా శరీరం అంగుళమైనా కదలకుండా లలిత చూసేచూపు సాంబశివాన్ని పాతాళంలోకి పడవేసేది. ఆ పరాజయాన్ని భరించలేక మరింత తిక్కతో తిరగబడేవాడు. లలిత ఏ విధంగాను ప్రతిఘటించేదికాదు. అయినా తనే చిత్తుగా ఓడిపోయినట్లు అనిపించేది సాంబశివానికి.

ఆరోజు సాంబశివాన్ని చూడగానే ఒక్కసారి అదంతా గుర్తుకొచ్చింది లలితకి.. ఆక్షణంలోనూ అతణ్ణి చూడగానే భరింపశక్యంగాని కంపరమే కలిగింది. కానీ లోకంలో అపురూపమైన విజ్ఞానము, సంస్కారమూ, నిన్ను నువ్వు దహించుకోవటానికి ఉపయోగపడడం నేను భరించలేనమ్మా! అంటున్న సుశీల ఆర్తస్వరం లలితలో ఎక్కడలేని సహనాన్ని పోగు చేసింది.

చిరునవ్వుతో సాంబశివాన్ని రిసీవ్ చేసుకుంది. అలాంటి చిరునవ్వు లలితముఖంలో ఏనాడూ చూడలేదు సాంబశివం. ఆమాట కొస్తే ఏ ఆడదాని ముఖంలోనూ చూడలేదు.

"చూడు! నీకోసం ఈ చీర తెచ్చాను—నాకు ఎంపికం రాదనుకో! అయినా నువ్వు పసిమిచాయ కదా! అందుకని ముదురు కెంపు రంగులో కొన్నాను."

సిగ్గుపడుతూ ఆ చీర చూపించాడు.

"బాగుంది!" అంది లలిత.

"కట్టుకోవాలనిపిస్తే—కట్టుకుని—చూపించు..."

ఇంకా ఎక్కువసేపు ఉంటే ఆ ఆనందం చెదిరిపోతుందేమోనని భయపడుతున్నట్లు గబగబ వెళ్ళిపోయాడు సాంబశివం.

ఆ రోజే ఆ చీర కట్టుకుని సాంబశివం గదిలోకి వెళ్ళింది లలిత.

లలిత సాంబశివం గదిలోకి తనంత తను రావటం ఇంచుమించు అసంభవమే! యధాప్రకారం గ్లాసుమీదగ్లాసు విస్కీ త్రాగుతున్న సాంబశివం లలితను చూసి తెల్లబోయాడు.

అంతా తెలిసినదే అయినా ఆ దృశ్యం చూడగానే భరించలేక మంచం మీద కూలబడిపోయింది లలిత.

"నావల్ల కాదు — నేను నటించలేను......" అనుకుంది తనలోతను.

కెంపురంగు జరీచీరలో మెరిసిపోతున్న లలితను—తనంత తనుగా వచ్చిన లలితను చూసేసరికి నిషాలో ఉన్న సాంబశివానికి మతి పోయినట్లయింది. దగ్గరగా వచ్చి లలిత చుబుకం పట్టుకుని పైకెత్తాడు—బలిపశువులా చూసింది లలిత—అంతటి మైకంలోను సాంబశివానికాముఖం చూస్తే జాలి కలిగింది.

మెత్తమెత్తగా...ముద్దుగా "ఒంట్లో బాగుండలేదా లలితా! పోనీలే! నువ్విలా పడుకో! నేను సోఫాలో పడుకుంటానులే!" అని వెళ్ళిపోయి సోఫాలో పడుకున్నాడు....

కొన్ని క్షణాలలోనే గుర్రుపెడుతోన్న సాంబశివాన్ని చూచి దీర్ఘంగా నిట్టూర్చింది లలిత....తడబడే అడుగులతో సాంబశివం దగ్గరకు వెళ్ళింది....

ఉలికిపడి లేచాడు సాంబశివం — ఎందుకో ఏమిటో తెలియకుండా సాంబశివం గుండెలమీద వాలి వెక్కివెక్కి ఏడ్చింది లలిత. ఏమిటి? ఏమిటి? అంటూ లలితను చేతులతో చుట్టి బుజ్జగించాడు సాంబశివం.

లలిత చిరునవ్వులు చిందించటంలేదు. విలాసపు వాలుచూపులు విసరటంలేదు. అయినా ఏడుస్తోన్న లలితను తన హృదయానికి హత్తుకున్నప్పుడు ఏదో విచిత్రమైన శాంతి కలిగింది సాంబశివానికి. అరకమైన అనుభూతి ఆనాటి వరకు అతనికి ఎలాంటి విలాసినుల దగ్గిరా లభించలేదు ....

శేఖర్‌తో కలిసి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్న దగ్గిరనుంచీ అంతులేని ఆనందంతోను, అవ్యక్తమైన ఆందోళనతోనూ, మనసు ఉద్వేగాలతో ఊగిపోతూ ఉండటంచేత సుశీల సరిగా నిద్ర పోలేకపోతోంది. ఆ కారణంచేత లలిత సాంబశివం గదిలోకి వెళ్ళటం గమనించింది. చాలా ఆనందించింది. ఆ క్షణంలో తన ఆనందం ఎవరితోనైనా పంచుకోవాలనిపించింది—శేఖర్‌కి ఫోన్ చేసింది.

"శేఖర్! నాకు చాలాచాలా ఆనందంగా ఉంది."

అవతలివైపు నుండి శేఖర్ కంఠం కూడా చాలా ఉత్సాహంగా వినిపించింది.

"నాకు కూడా చాలా ఆనందంగా ఉంది సుశీ! మన ప్రయాణానికి ఏర్పాట్లన్నీ ఇంచుమించు పూర్తయినట్లే! ఇంకొక్క పదిహేనురోజుల్లో డేట్ కూడా నిర్ణయమయిపోతుంది......"

తనలోతను నవ్వుకుంది సుశీల.

(సశేషం)

సామాన్యుల విజయ గాథలు

చీకటిలోంచి వెలుగులోకి

రెండు కళ్లూలేని కబోది సోడా, బీడీ, సిగరెట్ల బడ్డీ నడపడం ఒక చిత్రమైతే, అతని వ్యాపారాభివృద్ధికి తద్వారా అతని ఆర్థిక స్థితి మెరుగుపరచడానికి-ధైర్యంతో ఒకబ్యాంకు ఆర్థిక సహాయం అందజేయడం మరో విచిత్రం. అనకాపల్లి దగ్గర తుమ్మపాల గ్రామంలో, నడిరోడ్డుమీద, చక్కెర ఫ్యాక్టరీకి సమీపంలో 45సం. అంధుడు శ్రీ మాదవరమణ సోడా, బీడీ సిగరెట్లు అమ్మే బడ్డీ గత 10 సం. నుండి నడుపుతూ జీవితం గడుపుతున్నాడు. తనకు ఆసరాగా నిలిచిన అక్కను పోషిస్తున్నాడు. వ్యాపార పెట్టుబడికి ప్రయివేటుగా అధిక వడ్డీలకు అప్పులు తేవడం దానివలన చాల యిబ్బందులకు లోనపడం జరిగేది. తుమ్మపాల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియావారు తక్కువ వడ్డీరేటుపై రూ. 500-00 ఋణం అందజేశారు. శ్రీరమణ తన పూర్వ, ప్రస్తుతస్థితిగతుల గురించి యిలా చెప్పారు "మశూచికం సోకటంవలన నా నాలుగో యేటనే నా రెండు కళ్లు పోయాయి. నేను మా తల్లిదండ్రులుచేసే చేనేత మగ్గంపై పనికికూడా అశక్తుడనయ్యాను, తర్వాత కొన్నాళ్ళకు తల్లిదండ్రులు పోయారు. నేను అవివాహితుడను. నాకు తోడుగా మాఅక్క వుంది. ఇద్దరి బ్రతుకులు యీ బడ్డీవ్యాపారంపై యీడు స్తున్నాము. స్పర్శతో నాణాలు, నోట్లు; ధ్వనితో వ్యక్తుల్ని గుర్తిస్తాను. ఉదయం గం. 7-30 నుండి రాత్రి గం 9-00 వరకు కొట్టు తెరుస్తాను. బ్యాంకు ఋణం అందకపూర్వం, వడ్డీవ్యాపారస్తులకు చెల్లించడానికే నా స్వల్పాదాయం సరిపోయేది తిండికి, గుడ్డకు యిబ్బందే. బ్యాంకువారు నా కష్టాలు విని, నామీద నమ్మకంతో, సానుభూతితో రూ. 500/-లు ఋణం యిచ్చారు. దానితో వ్యాపారాన్ని కొద్దిగా పెంచాను. రోజుకు సుమారు రూ. 12-00 నుండి రూ. 15-00 వరకు అమ్ముతున్నాను. అధిక వడ్డీవ్యాపారస్తులబాధ తప్పింది. తిండికి యిబ్బందిలేదు. ఇప్పటికే రెండు వాయిదాల అప్పు చెల్లించాను. నాకిప్పుడు ఎంతో సంతృప్తిగా వుంది. ఋణవాయిదాలను సక్రమంగా చెల్లిస్తూ, అప్పుతీరుస్తాను. బ్యాంకువారు నాకెంతో మేలు చేశారు".

—శ్రీ జి. సీతారామయ్య

గిరిజన ప్రగతి

తూర్పుగోదావరిజిల్లాలో గిరిజనాభివృద్ధిపథకములు అమలునందు గిరిజన బాలబాలికల విద్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రస్ఫుటముగా కానవస్తాయి.

ఈ జిల్లాలో 16 వసతిగృహాలు వున్నాయి. రాజవొమ్మంగి సమితిలో 235 మందికి 4 వసతిగృహాలు. అడ్డతీగెలసమితిలో 60 మందికి ఒక వసతిగృహము, రంపచోడవరం సమితిలో 250 మందికి 4 వసతి గృహాలు. మారేడుమిల్లి సమితిలో 250 మందికి 5 వసతిగృహాలు, 25 మందికి జగ్గంపేటలో ఒకటి, 50 మందికి కాకినాడలో ఒకటి, మొత్తం 16 వసతిగృహాలు 825 మంది గిరిజన బాలబాలికలకు ఆశ్రయమిచ్చి విద్యావ్యాప్తికి దోహదము చేస్తున్నాయి. వీరందరికీ ఉచితవిద్య, వసతి, భోజనము, వస్త్ర, పాఠ్యగ్రంథాల సరఫరా జరుగుతోంది.

ఇవికాక రాజవొమ్మంగిసమితిలో 450 మందికి 5 గిరిజన ఆశ్రమపాఠశాలలు. మారేడుమిల్లి సమితిలో 360 మందికి 8 ఆశ్రమ పాఠశాలలు, అడ్డతీగెలసమితిలో 555 మందికి 10 పాఠశాలలు, రంపచోడవరంసమితిలో 370 మందికి 7 పాఠశాలలు. అన్నవరంలో 60 మందికి ఒక పాఠశాల మొత్తం 34 ఆశ్రమ పాఠశాలలందు 1795 మంది గిరిజన బాలబాలికలకు ఉచిత విద్యావసతి, భోజనాది సదుపాయములు కల్పిస్తున్నాయి. 95 మంది విముక్తజాతులవారికి జగ్గంపేట, ప్రత్తిపాడు గ్రామాలలో కూడా యీ సదుపాయము కల్పించబడింది.

1095 మందికి యీ సంవత్సరములో మెట్రిక్‌స్థాయి వరకు ఉపకారవేతనాలు మంజూరుచేశారు. పై తరగతి చదువులకుగాను మరి 37 మందికి కూడా యీ వుపకారవేతనాలు మంజూరు చేశారు.

ప్రతిభావంతులయిన గిరిజన విద్యార్థులకు 34 మందిని కాకినాడ ఠాకూరు కాన్వెంటునందు, సి.బి.యం. జూబిలీ సెకండరీ స్కూలునందు, రాజమండ్రి షాడే బాలికోన్నత పాఠశాలలందు విద్యాభ్యాసమునకు ప్రభుత్వ ఖర్చుపై పంపించారు. ముగ్గురు విద్యార్థులు టైపురైటింగు, షార్టుహేండుకోర్సులు శిక్షణపొంది పరీక్షకు హాజరయ్యారు. 34 మంది గిరిజన విద్యార్థులకు యిండస్ట్రియల్ ట్రైనింగు ఇనిస్టిట్యూటునందు శిక్షణా సదుపాయం కల్పించబడింది.

ఈ జిల్లాలో 237 బలవర్ధకాహారపోషణా కేంద్రాలున్నాయి. 14,310 మందికి యీ కేంద్రములందు బలవర్ధకాహారపోషణా కార్యక్రమము అమలు జరపబడుతోంది. ఈ కార్యక్రమమునందు 6 సంవత్సరములలోపు గిరిజన బాలబాలికలకు, గర్భిణీస్త్రీలు, బాలింతలకూ యీ సదుపాయము కల్పించారు. ఇది అమలుచేయుటకు 1976-77 సంవత్సరమునకు రూ 4,74,630 లు ఖర్చు మంజూరు చేశారు.

—శ్రీ పి. వి. సుబ్బారావు



శ్రీ జి. కోటిరెడ్డి విమానంనుండి మందులు చల్లే కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

విమానంనుండి మందుల చల్లకం

గుడివాడ తాలూకా గుడ్లవల్లేరు గ్రామములో కృష్ణాజిల్లా వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యాన దాళ్వా వరి చేలల్లో విమానం నుండి మందులు చల్లే కార్యక్రమాన్ని యీ నెల 12 న నిర్వహించారు.

వ్యవసాయ శాఖకు సంబంధించిన క్షేత్ర సిబ్బంది గుడ్లవల్లేరు సహాయ విస్తరణాధికారి నాయకత్వంలో ముందుగానే రైతులతో సంప్రదించి 120 మంది రైతులను భాగస్వాములుగా చేర్చారు. ఒక్కొక్క ఎకరానికి 120 మి. లీ. డెమెక్రాన్ నీళ్ళలో కలిపి విమానం నుండి చల్లటం జరిగింది. మొత్తం 575 ఎకరాల విస్తీర్ణంలో చల్లడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గుడివాడ అసిస్టెంటు డైరెక్టరు ఆఫ్ అగ్రికల్చరు శ్రీ జి. కోటిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాధారణంగా వరిపైరుకు సోకే మొవ్వ తెగులు, తాటాకు తెగుళ్ళను పుట్టించే క్రిములను ఈ మందువల్ల నాశనం చేయడం గాని లేదా నిరోధించడంగాని జరిగినట్లు చెప్పారు.

ఎకరానికి ఇలా చల్లినందుకు రూ. 10.90లు ఖర్చవుతుందని అంటూ ఇందులో రైతు రూ. 3.90 లు భరిస్తే మిగిలిన ఏడు రూపాయలను ప్రభుత్వం సబ్సిడీగా భరించిందన్నారు. మందు ఖర్చులు రైతులే భరించారని శ్రీ కోటిరెడ్డి తెలిపారు.

—శ్రీ ఆర్. సుబ్బారావు

రైతులకు సౌకర్యాలు

విశాఖపట్నం జిల్లాలోని గిరిజనేతర పంచాయితీసమితుల్లో సన్నకారు, చిన్న రైతుల వ్యవసాయకూలీల అభివృద్ధి సంస్థవారు జిల్లాలోని సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకులద్వారా వ్యవసాయ బావుల త్రవ్వకానికి, పంపుసెట్లు కొనుగోలుకు దీర్ఘకాలిక వ్యవసాయపరపతి సౌకర్యాలు కల్పిస్తున్నారు

1976 డిశంబరుతో అంతమైన ఒక ఏడాదికాలంలో శృంగవరపుకోట సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకు, విశాఖపట్నం జిల్లా మార్జినల్ ఫార్మర్స్ అభివృద్ధి సంస్థవే శృంగవరపుకోట, వియ్యంపేట, పెందుర్తిపంచాయితీ సమితుల్లో ఇంతవరకు గుర్తింపబడిన 960 రైతులలో 411 మంది సన్నకారు, చిన్నరైతులకు రూ. 13.38 లక్షల మేరకు ఈ సంవత్సరకాలంలో దీర్ఘకాలిక ఋణాలు పంపిణీచేసి రికార్డు సృష్టించింది.

ఈ వ్యవసాయాభివృద్ధి బ్యాంకు 352 వ్యవసాయపుబావులు గొట్టపుబావుల త్రవ్వకానికి రూ 11.32 లక్షల, 59 పంపుసెట్లు, ఎలక్ట్రిక్ మోటార్లు కొనుగోలుకు రూ. 2.03 లక్షలు, పైమూడు సమితుల్లోని చిన్నరైతులకు పంపిణీచేసి 579 ఎకరాల మేరకు అదనంగా నీటి పారుదాల సౌకర్యం కల్పించింది.

మార్జినల్ ఫార్మర్స్, వ్యవసాయకూలీల అభివృద్ధి సంస్థ ఇంత వరకు 258 సన్నకారు, చిన్నరైతులకు రూ. 2 16,326 లు సబ్సిడీగా విడుదలచేసింది.

—శ్రీ ఎం. ఎ. నాయుడు

ప్రగతిపథంలో ఎలకుర్తి విశాల పరపతి సహకార సంఘం

హుజూరాబాద్ తాలుకా ఎలకతుర్తి గ్రామములో విశాల పరపతి సహకార సంఘము 1957లో స్థాపించబడినది. నాటినుండి నేటి వరకు సంఘ పరిధిలోని ఎనిమిది గ్రామాల రైతులకు సహకార పద్ధతిలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాలు, ఆయిల్ ఇంజనులు, మోటారు పంపుసెట్లు పరపతిపైన ఇవ్వడం జరుగుతున్నది. సంఘ సభ్యత్వము 2488. హరిజన, బలహీనవర్గాల వారందరికి ప్రాతినిధ్యమున్నది. 406 మంది హరిజన సభ్యులు, బలహీన వర్గాలవారు 1101 మంది కాగా 981 మంది మిగతా కులాలవారున్నారు.

సభ్యుల వాటాధనము రూ. 2 లక్షల 59 వేలు. డిపాజిట్ల రూపములో రూ. 1 లక్ష 17 వేలు కాగా, క్షేమనిధి రూ. 33558 లు. నాలుగు లక్షల అధికార వాటా ధనముతో సహకార సంఘము అత్యంత శ్రద్ధతో నడుపుచు గ్రామీణ రైతులను సమయానికి ఆదుకుంటున్నారు.

సమీప గ్రామమైన దామెర్లలో సంఘ విక్రయశాల కలదు. సహకార సంఘ ఆధీనములో ఒక రైసుమిల్లు ఉండుట ఎంతేని అవసరం. ఈమేరకు రైసుమిల్లు స్థాపన విషయంలో జిల్లా సహకార శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమును సంప్రతించి తుది నిర్ణయము కొరకు ఆశతో ఎదురు చూస్తున్నారు.

సంఘ పరిధిలోని గ్రామాల రైతుల వ్యవసాయ భూముల సేద్యమునకు గాను ఒక ట్రాక్టర్ అవసరం. ప్రభుత్వ లోనుపై

ఖరీదు చేయుటకు నిర్ణయము గైకొన్నారు. ఈ విశాల పరపతి సహకార సంఘానికి ఆర్థిక వనరులందించు ఏకైక సంస్థ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు.

సామాన్య ప్రజలకు సహకార సంఘాలే శరణ్యం మధ్య దళారీలనుండి కాపాడటానికి అత్యంత కృషి అవసరం.

20 అంశాల ఆర్థిక కార్యక్రమములో సహకార సంఘాల పాత్ర విశిష్టమైనది. కార్యక్రమం అమలులో సహకారసంఘ సభ్యుల శ్రద్ధ అత్యంతావశ్యకము.

ఇటీవల ప్రకటించిన గ్రామీణ ఋణభారముపై మారుటోరియం అమలులో సహకార సంఘాల కృషి ఎంతైనా అవసరం.

సంఘ కార్యకలాపాల పర్యవేక్షణకు కార్యదర్శి, అకౌంటెంటు 10 మంది క్లర్కులు మరియు ఎనమండుగురు జవానులు గ్రామీణ ప్రజలకు సేవచేయుటలో నిరంతర కృషి చేస్తున్నారు.

ఈ సంఘమునకు 11మందితో కూడిన కార్యవర్గము కలదు. సంఘాధ్యక్షుడు శ్రీ దుర్గయ్య ఉత్సాహవంతుడు, పేదలపాలిటి పెన్నిధి, కార్యదీక్ష కలవాడు.

పాత్రికేయులకు సంఘ కార్యకలాపాలను వివరించారు.

—శ్రీ బి. కోటేశ్వరరావు

సూళ్లూరుపేట తాలూకాలో గిరిజన సంక్షేమ పథకాలు

సూళ్లూరుపేట తాలూకా పాదర్తివారి ఖండ్రిక, పుదూరు, బొవ్వలపాళెం, వావిలి, నరసారెడ్డి ఖండ్రిక గ్రామాలలో సహకార వ్యవసాయక్షేత్రాలు నెలకొల్పి 226 ఎకరముల భూమిని అదనంగా సాగుకు లాయకు చేశారు. యీ పథకం క్రింద 149 గిరిజనులకు స్వయం పోషకత్వం లభిస్తుంది. కార్యక్రమ నిర్వహణలో జాతీయ బ్యాంకుల ద్వారా రూ. 43,000/-లు గిరిజన సంక్షేమ నిధులనుండి రూ 64,000/- , సన్నకారు రైతుల సహాయ సంస్థ ద్వారా రూ. 26 000/-లు మంజూరు చేశారు బీడు భూములు సాగుకు లాయకు చేసి, దొరువు బావులు, గొట్టపు బావులు నిర్మించి, అవసరమైనచోట పైపులైన్లు కూడా వేసి, ఆయిల్ ఇంజన్లు ద్వారా, వరి, రాగి, సజ్జ, మిరప మున్నగు మెట్టపైర్లు పండించుచున్నారు. గత నెలలో రూ. 48 000లు మేరకు అత్యవసర వస్తువులను సూపరుబజారు ద్వారా, సన్నకారు, హరిజన, గిరిజన, బలహీన వర్గాల వారలకు అందుబాటు చేశారు ప్రభుత్వం ప్రోత్సాహకర విధానాలద్వారా బలహీన వర్గాలలో దరహాస రేఖ మెరిసింది. ప్రభుత్వ అండదండలే వారి ఆస్తిగా ఉద్యోగుల నిర్విరామ కృషియే వారి భావిసౌభాగ్య సోపానాలుగా, కొండంత ఆశతోసుందర భవిష్యత్ స్వప్నాలకు వాస్తవతను సంతరింప జేసుకుంటూ సాగిపోయే సన్నకారు రైతు—పచ్చని పంటల విప్లవం సాధించి ఆహార కొరత అనంత దూరాలకు తరిమి వేయుట తథ్యం.

—శ్రీ యస్. పోలయ్య

వెంకటగిరి తాలూకాలో జరీ చేనేత పరిశ్రమ

ప్రాచీన గ్రామీణ కుటీర పరిశ్రమలలో జరీ చేనేత పరిశ్రమ ప్రధానమైనది. వెంకటగిరి జరీ చేనేత పరిశ్రమకు ఒక ప్రధాన కేంద్రము

వెంకటగిరి చీరలు ఆంధ్ర రాష్ట్రములోనేకాక యావద్భారత దేశములో కూడా పేరెన్నిక గన్నవి. వెంకటగిరి తాలూకాలో సుమారు 4,000 మగ్గములపై దాదాపు 20,000 మంది కార్మికులు జీవనోపాధిని సమకూర్చుకొనుచున్నారు. అతి నాజూకైన సన్నని నూలుతో 100 మొదలు 200 నెంబరు వరకు నైపుణ్యముతో జరీ చీరలు తయారు చేస్తున్నారు సుమారు రు. 1,000 వరకు ఖరీదు చేయగల జరీ చీరలు ఉత్పత్తి అవుతున్నాయి. జరీ చీరలను సర్కారు జిల్లాలకు, దేశములోని వివిధ సూపర్ మార్కెట్లకు విడుదల చేస్తున్నారు. ఢిల్లీ లేపాక్షి ఎంపోరియంలో కూడా వెంకటగిరి చీరలు ప్రఖ్యాతి వహించినవి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహాయంతో యీనాడు వెంకటగిరి తాలూకాలో "చేనేత సహకార సంఘము" జరీ చేనేత చీరలు, యితర వస్త్రములు ఉత్పత్తి చేస్తున్నవి. రాష్ట్ర స్థాయి సహకార సంఘములు చేనేత పరిశ్రమకు సహాయ సహకారము లందించు చున్నవి. 'పట్టెమార్పు' అను కొత్త రకములను విదేశములకు ఎగుమతి చేస్తున్నారు. 20 సూత్రముల ఆర్థిక కార్యక్రమము వలన తదితర చేనేత కార్మికులవలె వెంకటగిరి చేనేత కార్మికులు కూడా నూతనోత్సాహముతో, కొంగ్రొత్త ఆశలతో సామాజిక ఆర్థికాభ్యున్నతిలో పాలుపంచుకొంటూ పని చేస్తున్నారు.

—శ్రీ యస్. వెంకటరాజు

తెనాలి తాలూకాలో పంచదార ఫ్యాక్టరీ ఏర్పాట్లు

తెనాలి తాలూకాలో అన్నపూర్ణ సహకార చక్కెర ఫ్యాక్టరీ స్థాపించే దృష్ట్యా, 1980 డిశంబరు సీజనుకు చాలినంత చెరకు వుత్పత్తి చేయవలసివుంది. ఈ ఫ్యాక్టరీ ప్రాంతంలో చెరకు వుత్పత్తి కవసరమగు ఏర్పాట్లన్నీ చేయబడినాయి. 8 నెలల వయసు నుండి 10 నెలల లోపల పక్వానికి వచ్చే C.O. 7601, 7602,997 రకాలు, 10 నెలల నుండి 11 నెలలలోపు పక్వానికి వచ్చే C.O. 627, 975,-11 నెలల అనంతరం పక్వానికి వచ్చే C.O. 62175, 419 మొదలైన రకాల చెఱకు విత్తనాన్ని రైతులకు సరఫరా చేస్తున్నారు. విత్తనపు చెరకు కావలసిన రైతులు తెనాలిలోని అన్నపూర్ణా సహకార చక్కెర ఫ్యాక్టరీ కార్యాలయంలో విత్తనాని కవసరమగు డబ్బు చెల్లించాలి. విత్తనం సరాసరి రైతులకు వారి వారి గ్రామాలకు చేర్చబడుతుంది.

—శ్రీ సి. ఎ. మాధవరావు

మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

కీచకుడు ద్రౌపది రూపసౌందర్యములనువర్ణించుట

"కల్యాణీ! నీవెవరు! ఎవరి స్త్రీవి? ఎక్కడినుండి వచ్చినావు! నీ రూపము-కాంతి-సౌకుమార్యము అనన్య సామాన్యములు. నీ ముఖము చంద్రునివలె నిర్మలమైన కాంతితో విరాజిల్లుచున్నది. నీ నేత్రములు పద్మపత్ర విశాలములు. నీమాట కోకిల కూజితము వలె మధురముగా నున్నది. నీవంటి అనిందిత రూపసౌందర్యవతిని నేను భూమండలమునందు చూడలేదు. నీవు సాక్షాత్తు లక్ష్మీదేవివా? సాకారమైన ఐశ్వర్యమవా? హ్రీ-శ్రీ-కీర్తిదేవతలలో నొకతెవా? మన్మథునితో క్రీడించు రతీదేవివా? చంద్రికవలె భాసిల్లుచున్నావు. నీ కనురెప్పల కాంతి వెన్నెలవలెనున్నది. దివ్యకాంతులచేత చుట్టబడి మనోహరముగానున్న నీ ముఖచంద్రుని చూచి యీ సమస్త ప్రపంచమునందు ఎవడు కామవశుడు కాకుండ నుండగలడు"

"హారాలంకారయోగ్యములు, పీనములు, కమలపు మొగ్గల వలెనున్న నీ స్తనములు మన్మథుని కొరడాలవలె నా మనస్సును తట్టి నన్ను బాధించుచున్నవి. నీ నడుము కరాగ్రముతో (అంగుష్ఠ-తర్జనీలతో) కొలుచుటకు వీలైయున్నది. నీ యుదరము త్రివళులతో సుందరముగానుండి స్తనభారముచేత వంగియున్నది. నదీపులినము (ఇసుకదిబ్బ) వలె అందముగానున్న నీ జఘన స్థలమును చూచినతోడనే నాకు కలిగిన కామవ్యాధి అసాధ్యమై నా వంటి వీరునిగూడ పరవశుని జేసివైచినది. నాకు గలిగిన యీ మదనాగ్ని నిన్ను సంగమించవలెనను సంకల్పములతో, హెచ్చుగా మండి దావాగ్ని (కార్చిచ్చు)వలె వృద్ధిచెందుచున్నది. భామినీ! నీ సంగమమనెడు మేఘముతోను నీ యాత్మ సమర్పణమనెడు వర్షముతోను మండుచున్న నా కామాగ్నిని చల్లార్చుము."

"నా చిత్తమును పిచ్చియెత్తించుచున్న మన్మథ బాణసమూహములు, నీ సంగమాశచేత పదునుచేయబడినవై అతి తీక్ష్ణములుగా నన్ను బాధించుచున్నవి. ఈ బాణములు నా హృదయమును చీల్చి లోపల ప్రవేశించి అతి ప్రచండముగా దారుణములై, అత్యంతోన్మాదకరములై, నీయందు ప్రీతియనెడు పిచ్చిని తీవ్రవేగముతో పెంచినవి. నీవు నాకు ఆత్మసమర్పణచేసి నీ సంభోగ ప్రదానములచేత నన్ను ఉద్ధరించుము. విలాసినీ! నీవు చిత్రమాల్యాంబరములను, సర్వాభరణములను ధరించి నన్ను అతిశయ కామభోగములలో తేల్చి సేవించుము. సుఖమునకు అర్హురాలవైన నీవు ఇక్కడ సుఖరహితముగా నివసించుటకు తగవు. నానుండి ఉత్తమ సౌఖ్యములను పొందుము. రుచికరములు, అమృత కల్పములునైన మధువులను సేవించి సుఖముగా నాతో రమించుచుండుము. వివిధములైన భోగోపచారములు, అత్యుత్తమ సౌభాగ్యము నాతో అనుభవించుచు ఉత్తమ మధుపానముచేయుచు నాతో సుఖింపుము. భామినీ! ఈ నీ సర్వోత్తమ రూపసౌందర్యములు వ్యర్థములగుచున్నవి. ఉత్తమ పుష్పమాలికను ఆదరించి కంఠమునందు ధరించనియెడల సుందరీ! అది శోభనముగా శోభిల్లదు. నాకు ఇదివరకున్న భార్యలనందరిని నీయందలి ప్రేమచేత విడిచెదను. వారు నీకు దాస్యము చేయుదురుగాక. నేనుగూడ నీకు దాసుడనై సర్వదా వశుడనైయుండెదను"

జనమేజయా! ఆ మాటలువిని ద్రౌపది అతనితో నిట్లనెను:

ద్రౌపది హితబోధ

"సూతపుత్రా! కోరదగని నన్ను ప్రేమించుచున్నావు. ఛీ! నేను హీనజాతిదానను సైరంధ్రిని. అసహ్యవేషముతో నున్నాను రాణివాసములో తలదువ్వి జడలువేయుట మొదలగు ఊడిగములుచేయు సేవకురాలను. నీవంటి బుద్ధిమంతుడు తనకు సమానురాలిని కోరుట యుక్తము. తనభార్యయందే ఆసక్తిగలవాడు అనేక శుభములను పొందగలడు అట్టివానికి అధర్మము అపకీర్తి అంటదు. తన భార్యయందు అనురాగముచూపుట మృత పురుషునికిగూడ ధర్మమే. తనజాతి భార్య భర్తను ఈ లోకమునందు సుఖపెట్టుట మాత్రమేకాక, పరలోకమునందుగూడ అతనికి ప్రేతకార్యములు, తర్పణోదకములు నెరవేర్చి తృప్తిపరచును. స్వజాతి స్త్రీ రతి అక్షయము. అది నశించనిది, ధర్మసమ్మతము, స్వర్గప్రాప్తి హేతువునగునని బుద్ధిమంతులు చెప్పెదరు. స్వజాతి భార్యవలన గల్గిన పుత్రులు స్వకులమునందు పూజింపబడుదురు. కులోద్ధారకులగుదురు. ప్రాణులకు భార్యలే ప్రియమైన వస్తువులు. కనుక నీవు ధర్మవంతుడవుకమ్ము. పరస్త్రీ రతిని గోరువాడు అధర్మపరుడై శుభములను పొందజాలడు.

"కీచకా! నేను పరభార్యను, నన్ను కోరుట నీకు యుక్తము కాదు. నీకు మేలుకలుగుగాక. ధర్మమును చింతించి

కార్యముచేయుము. పరస్త్రీయందు ఎప్పుడూకూడ బుద్ధిపోనీయకుము. చెడ్డపనులను విడుచుట మంచిపురుషుని లక్షణము. అసత్యములైన విషయవాసనలయందు ఆసక్తికలిగియుండు మనుష్యుడు పాపాత్ముడై మోహముచెందును. గొప్ప అపకీర్తిని, భయమును పొందగలడు."

జనమేజయ మహారాజా! ద్రౌపది యీ విధముగా హిత బోధచేసినప్పటికిని కీచకుడు కామమోహితుడై పరస్త్రీని పొందుట వలన, ప్రాణాపాయము, లోకనింద మొదలైన దోషములు కలుగునని తెలిసినప్పటికిని దుర్బుద్ధిగలవాడై యిట్లు పలికెను :—

"సుముఖీ! ఈ విధముగా నీవు నన్ను నిరాకరించుట తగదు. నాపైన మన్మథుడు ఆవేశించినాడు. నీయెడల ప్రియములు పలుకుచు నీకు వశుడనైన నన్ను నిరాకరించి, ఆ తరువాత పశ్చాత్తాపము చెందెదవు. నేను ఈ సమస్తమత్స్య రాజ్యమునకు ప్రభువునేకాక, దీనిని స్థిరముగా రక్షించువాడనుగూడనై యున్నాను. మహా బలపరాక్రమములు గలవాడను. ఉత్తమరూప-యౌవన-సౌభాగ్య-భోగములలో నాతో సమానుడు మరియొకడీ పృథివిలోనే లేడు. కల్యాణీ! నీవు పరిపూర్ణ మనోరథములను పూర్తిచేసికొనుటకు, అసమానములైన భోగములు నీకు లభించుచున్నప్పుడు దాస్యమునందు ఎందుకు ఇష్టముగలదానవై యున్నావు? ఇదిగో! నీకు ఈ మత్స్యరాజ్యమునంతయు నిచ్చితిని. దీనికి నీవు యజమానురాలవు. నన్ను పొంది యీ రాజ్య భోగములను అనుభవించుము."

ఈ విధముగా అశుభవచనములను కీచకుడు చెప్పగానే, ఆ మాటలను అసహ్యించుకొనుచు ద్రౌపది కీచకునితో నిట్లనెను:—

"సూతపుత్రా! ఇట్లు మోహముచెందకుము. నీ జీవితమును నష్టము చేసికొనకుము. అతిభయంకరులైన ఐదుగురు భర్తలచేత సర్వదా రక్షింపబడుచున్నదానినిగా నన్ను తెలిసికొనుము. నీకు నేను లభ్యురాలను కాను. గంధర్వులు నా పతులు. వారు కోపించినచో నిన్ను చంపుదురు. జాగ్రత్తసుమా! వ్యర్థముగా నాశనము చెందకుము. పురుషులకు అసాధ్యమైన మార్గములో నడవగోరుచున్నావు. ఒక నదీతీరమునందు కూర్చొనియున్న మందబుద్ధిగల బాలకుడు తనకు అసాధ్యమైన నదిని ఈది అవలియొడ్డుకు పోవజూచుచున్నట్లే నీవుగూడ అకార్యము చేయుచున్నావు. అది ఆ బాలకునికి వినాశహేతువైనట్లే నీకును నిది వినాశమునకు కారణమగును సుమా! సూతపుత్రా! నా పతులు అసాధ్య శౌర్యవంతులు. నన్ను వెనకి నీవు పాతాళమున దూరినను, ఆకాశమున కెగిరినను, సముద్రము అవలిగట్టుకు దాటిపోయినను వారు నిన్ను విడువరు. పట్టి వధింతురు. వారు దేవపుత్రులు. ఆకాశగమనము గలవారు సుమా."

"నన్ను అవమానపరచినచో సూతపుత్రా! ఇప్పుడేకాని, లేక కొంతకాలమునకేకాని పుత్రబాంధవులతో గూడ తప్పక నశించగలవు. దుర్లభురాలనైన నన్ను కోరి నీవు వశముతప్పి, కొమ్మనుండి తాటిపండు ఊడిపడినట్లు పడిపోయెదవు. నన్ను వీరులు రక్షించుచున్నారు. నేనెవతినో నీకు తెలియదు గనుక కామార్తుడవై అసంబద్ధములైనమాటలు పలుకుచున్నావు. అసమర్థుడైన పురుషుడు ఎంత ప్రయత్నముచేసినను మహాపర్వతమును ఎగిరి దాటలేడుసుమా! మహాత్ములు, తమ భార్యను అవమానపరచినవాడు దిక్కులను శరణు జొచ్చినను, పర్వత గుహలలోను, భూమిలోను దూరినను, జపహోమాదులు విశేషముగ చేయుచున్నను, కొండచరియ నుండి క్రిందికి పడినను అగ్నిని సూర్యుని శరణు జొచ్చినను అతనిని విడువరు. ఈ నీ మాటలన్నియు వ్యర్థములు. నన్ను నీవు పొంద గోరుట ఒక మహా పర్వతమును త్రాసులో తూచుటకు ప్రయత్నించుట వంటిది. కనుక అది అసంభవము. ఇంతేకాక నన్ను కోరుట గ్రీష్మకాల మధ్యాహ్నమునందు అడవిలో మండుచున్న దావాగ్నిలో దూరుట వంటిది. అది పుత్ర బాంధవ సహితముగా నీ కుల నాశనముకే కారణము కాగలదు. ఇక్కడ ప్రచ్ఛన్న రూపములోనున్న నన్ను అవమానము చేసి నీవు బ్రతుకదలచి దేవ-గంధర్వ-మహర్షి సన్నిధిలోగాని, నాగ-రాక్షస లోకములలోగాని శరణు పొందజాలవు. నీవెక్కడనున్నను నా పతులు నిన్ను పట్టి వధింతురు. వ్యర్థముగా నీ వినాశమును ఎందుకు కోరుకొనెదవు?"

"కీచకా! ఒకరోగి కాళరాత్రిని కోరినట్లుగా, నన్ను పొందుటకు ఇంతటి దురాగతమును నీవు ఏల చేయుచున్నావు? ఇది నీ వినాశమునకు హేతువగును. నీవెంత మూర్ఖుడవు. తల్లి యొడిలోనున్న శిశువు ఆకాశమునందలి చంద్రుని గ్రహింపదలచునట్లున్నది నీవు నన్ను పరిగ్రహింపబూనుట. ఇది నీకు తగదు. నన్ను పొందగోరి నీవు వ్యర్థముగా నా పతులు గంధర్వులచేత చచ్చెదవు. ఎక్కడగూడ నీకు శరణు దొరకదు. నీ వెంతటి కామాంధుడవైతివి. నీకు శుభములు కలిగించు మంచి దృష్టి, నీ జీవితము సురక్షితముగా నుంచుకొను సద్బుద్ధి కలుగుటలేదు." ఈ విధముగా వైశంపాయనుడు జనమేజయునికి ద్రౌపదీకీచకుల సంభాషణక్రమమును చెప్పి తరువాతి వృత్తాంతమును ఇట్లు చెప్పదొడగెను:—

కీచకుడు సుదేష్ణ సహాయముకోరుట

"జయమేజయా! ద్రౌపదిచేత నిరాకరింపబడి కీచకుడు కామార్తుడై సుదేష్ణతో నిట్లనెను:— "కేకయ రాజపుత్రీ! సైరంధ్రి నన్ను కలియునట్లు ఏదైన ఉపాయము వెదకుము. లేకున్న నేను మోహవశుడనై ప్రాణములు విడువవలసి వచ్చును. నా ప్రాణములను కాపాడుము" ఇట్లు అనేక విధములుగా విలపించుచు పలుకుచున్న కీచకునిపై దయతలచి సుదేష్ణ యిట్లనెను:— సోదరా! సైరంధ్రి నా శరణుజొచ్చినది. ఈమెకు అభయమిచ్చినాను. ఈమె సత్ప్రవర్తకురాలు. కనుక నీ మనోభిప్రాయము నీమెకు చెప్పజాలను. ఎవడుగూడ ఈమెను పాప బుద్ధితో తాకజాలడు. ఈమె పతులు ఐదుగురు గంధర్వులు ఈమెను రక్షించుచు సుఖింపజేయుచున్నారు. ఈమె మొదట నన్ను కలిసినప్పుడీమాటనే చెప్పెను. ఈమె మాట సత్యమే. ఈమెను అవమానపరచిన వానిని ఈమె పతులు క్రోధముతో నశింపజేయుదురు. విరాటరాజుగూడ ఈమెను చూచి తొలుత మోహపరవశుడయ్యెను. సర్వదా యీమె రూప సౌందర్యములను అభినందించుచుండెను. వాస్తవ

మును నావలన విని, గంధర్వ భయముచేత ఇప్పుడు ఈమెను మనస్సులోగూడా తలచదు. ఈ రహస్యమును నీయందలి స్నేహము చేత చెప్పుచున్నాను. నా మాటను నీవు పాటించిన యెడల దుర్గతి పాలు కావు. గంధర్వులు బలవంతులు, నీ కులమును సంపదను నశింపజేసెదరు. కాబట్టి, నీకు ప్రాణములు ప్రియములైనచో సైరంధ్రిపై మనస్సుడించకుము. నాకు ప్రియము చేయదలచిన యెడల నీవు ఈమె వద్దకు పోవకుము. ఈమె తలంపునే విడువుము.

"జనమేజయా ! సుదేష్ణ చెప్పిన మాటలు విని కీచకుడు, గంధర్వులు నూరుగురు, వేవురు, పదివేవురు నాపైకి వచ్చినను నేనొక్కడనే వారిని చంపెదను. ఐదుగురి లెక్కయెంత ? అని సుదేష్ణతో ననెను. ఆతని మాటలు విని సుదేష్ణ మిగుల దుఃఖించి 'అయ్యో ! వీడు అధఃపాతాళములో పడిపోవుచున్నాడే ! బడబానలమునందు పడిపోవుచున్నాడే !' అని మనస్సులో చింతించి కీచకునితో నిట్లనియె:—

"సోదరా ! ఏ కారణముగా నా సోదరులు-మిత్రులు నశించ పోవుచున్నారు. నీవిట్లు అనుచితముగా ప్రవర్తించుచున్నావు. నేనేమి చేయగలను? నీ శ్రేయస్సు తెలిసికొనజాలకున్నావు. కామమునే అనుసరించుచున్నావు. నీవిట్లు కామమోహితుడవగుటచేత నిశ్చయముగా నీకు ఆయుస్సు తీర్నదని తెలిసికొనుము. నరాధమా ! చేయగూడని పాపకార్యమునందు నన్నునీవు నియోగించుచున్నావు. 'ఒకడు పాపము చేసి తన జాతినే నశింపజేయును' అని పెద్దలమాట నిశ్చయమైనది. నీవు తప్పక యమధర్మరాజు దేశమునకు పోవుటయేకాక, ఏ పాపమునెరుగని నీ బంధుజనమునుగూడ చంప బోవుచున్నావు. ఈ వినాశ మంతయు నేను తెలుసుకొనిగూడ నీ సంతోషం కొరకు భ్రాతృస్నేహముతో నీకోర్కె నేను నెరవేర్చెదను. పాపాత్మా ! నీవు నీ కులమును నశింపజేసి సంతుష్టుడవు కమ్ము."

"జనమేజయా ! తరువాత సుదేష్ణ తాను చేయవలసిన ఉపాయమును చింతించి, కీచకుని మనోభావమును కనిపెట్టి, అతకి ద్రౌపదిని లభింపజేయుటకు తగిన ఉపాయమును నిశ్చయించుకొని కీచకునితో నిట్లనెను:—

"కీచకా ! నీమాక పండుగ దినమునందు యింటిలో మద్యము-భోజన సామగ్రి సిద్ధము చేయించుము దానిని. నా కొరకు తీసికొనివచ్చునెపముతో సైరంధ్రిని నీ కడకు పంపెదను. నీ యింటిలో ఏ విఘ్నబాధలులేని విజన స్థలమునందు ఈమెను సమాధానపరచి చూడుము. ఒకవేళ నీ ప్రార్థనను ఈమె అంగీకరించినచో స్వేచ్ఛగా నీతో రమించునుగాక."

"జనమేజయా ! సోదరి చెప్పినమాటలు విని కీచకుడు తన యింటికిబోయి రాజోచితమైన మద్యమును తెప్పించెను. వివిధములైన భోజన పదార్థములను సమర్థులైనవంట వారితో చేయించెను. తరువాత సుదేష్ణను భోజనమునకు ఆహ్వానించెను. ఆతనికి త్వరయెక్కువ. యమపాశము ఆతని కంఠమునందు బంధింపబడినది. ఆ మూర్ఖుడు తనకు మరణమాసన్నమైన సంగతి తెలిసికొనలేక సుదేష్ణతో ఇట్లనెను:— 'మద్యము బహువిధభోజన పదార్థములు సిద్ధము చేయించినాను. సైరంధ్రిని త్వరగా పంపుము. నేడు నాకు సైరంధ్రితో సమాగమమో లేక మరణమో యిమ్మని పరమశివుని వేడుకొనినాను"

ఆ మాటకు ఆమె అతనితో నిట్లనెను:—

"నీ యింటికి పొమ్ము. ఇదుగో యిప్పుడే మద్యము తెమ్మని సైరంధ్రికి చెప్పెదను. అది విని పాపాత్ముడైన కీచకుడు సైరంధ్రినే తలచుచు త్వరగా తన యింటికిపోయెను. తరువాత సుదేష్ణ సైరంధ్రితో "లెమ్ము. త్వరగా కీచకుని యింటికి పోయి నా కొరకు పానయోగ్యమైన రసమును తెమ్ము. నాకు చాల దప్పియగుచున్నది" అని చెప్పెను. ఆ మాటకు సైరంధ్రి యిట్లనెను.

కీచకునింటికి పోవుటకు సైరంధ్రి నిరాకరించుట

"రాజపుత్రీ ! నేను కీచకుని యింటికి పోవను. అతడు ఎంత సిగ్గుమాలిన వాడో నీకుతెలియునుగదా ! కల్యాణీ ! నీ పతుల దృష్టిలో వ్యభిచారిణిగాను, స్వేచ్ఛాచారిణిగాను అగుచు నీ యింటిలో నుండ జాలను. భామినీ! నేను నీయింటికి వచ్చినప్పుడు చేసిన నీ ప్రతిజ్ఞను నీవెరుగుదువుగదా? కీచకుడు మూఢుడు, కామగర్వితుడు. అతడు నన్ను చూచి అవమానము చేయును. ఆ యింటికి నేను పోను. నీకుఎందరో సేవకురాండ్రు ఉన్నారు గదా ! ఎవరినైన అక్కడికి పంపుము. నన్నతడు అవమానపరచును" ఆ మాటలకు సుదేష్ణ యిట్లనెను:— "ఇక్కడి నుండి నాచే పంపబడిన నిన్ను కీచకుడు ఎప్పుడు గూడ హింసించి అవమానపరచడు" అనిచెప్పిమూతతో గూడిన యొక్క బంగారు మద్య పాత్రను సైరంధ్రికి ఇచ్చెను. ఆమె శంకించుచు, ఏడ్చుచు, దైవమును శరణుపొందుచు మద్యము తెచ్చుటకు కీచకుని యింటికి బయలుదేరుచు, భగవంతుడా ! నా పతులుదప్ప ఇతర పురుషుని ఎవనినిగూడ ఎరుగను. నా యీ పాతివ్రత్య మహిమచేత నన్ను కీచకుడు తన వశములోకి తీసికొనకుండగాక ! అని వివశురాలై సూర్యుని ఒక క్షణకాలము ప్రార్థించెను. సూర్యుడు ఈమె పరిస్థితి తెలిసికొని కరుణించి రక్షణకొరకు ప్రచ్ఛన్నముగా నొక రాక్షసుని సైరంధ్రి వెంట పంపెను. అతడు ద్రౌపదిని ఏ పరిస్థితిలో గూడ ఒంటరిగా విడువకుండెను. మృగాంగనవలె భయపడుచున్న ద్రౌపదిని చూచి కీచకుడు, నదిలో ఆవలిగట్టుకు చేరదలచు వానికి నావ దొరికినట్లు సంతసించి లేచి నిలబడెను.

కీచకుడు ద్రౌపదిని అవమానపరచుట

ద్రౌపదీ-కీచకులకు ఈ విధముగా సంభాషణ జరిగెను:—

కీచ:—"సుకేశీ ! నీకు స్వాగతము. నేటి ప్రాతఃకాలము నాకు చాల శుభకరము (మంచివేళ నిద్ర మేలుకొనినాను అని భావము) ఇప్పుడిక నీవు నాకు స్వామినివై నా కడకు వచ్చితివి. నాకు ప్రియము చేకూర్చుము నా దాసీ జనమునకు ఆజ్ఞయిచ్చి నీ కొరకు సువర్ణ మయహారములు, శంఖ నిర్మితములైన గాజులు అనేక నగరములలో నిర్మితములైన సువర్ణ కుండలములు, మంగళకరమైన మణి రత్ననిర్మితాభరణ జాలము, పట్టుచీరెలు, మృగచర్మము తెప్పించెదను. నీకొరకు

ఏర్పరుప బడిన దివ్యమైన శయనము గలదు. రమ్ము. నాతోపాటు మధుర మద్యరసమును పానము చేయుము.''

ద్రౌపది:- దుర్బుద్ధీ! కిరాతుడు బ్రాహ్మణస్త్రీని స్పృశింప జాలనట్లే నీవు నన్ను తాకజాలవు. ఇట్లు పాపకార్యమును తలపెట్టి నీవు మహా దుర్గతికి పాలుకాకుము. తమహద్దును మీరి పర స్త్రీగమనము చేయుచు పురుగులవలె గుహలలో పడియుండు ననేక మనుష్యులు పోవు దుర్గతికి నీవు పోవకుము. రాజపుత్రి సుదేష్ణ మద్యము తెచ్చుటకు నన్ను నీ కడకు పంపెను. త్వరగా మద్యపాన రసమును తెమ్ము నాకు చాల దప్పికగా నున్నది.' అని ఆమె చెప్పెను.''

కీచ:- "కల్యాణీ! సుదేష్ణ కోరిన మద్యరసమును ఇతర దాసజనము ఆమెవద్దకు తీసికొని పోయెదరు.'' అని చెప్పి ద్రౌపది కుడి చేతిని పట్టు కొనెను.

ద్రౌపది:-''పాపీ! ఒక వేళ నేను నేటి వరకు మనస్సులో గూడ నాపతులకు విరుద్ధముగా ఆచరించని దాననైనచో ఈనాసత్య ప్రభావము చేతనే నీవు శత్రువులకు వశుడవై నేలపైన ఈడ్వబడుచుండగా కనులార చూచెదను."

"జనమేజయమహారాజా! ఇట్లు తనను బెదరించి నీచముగా చూచుచున్న ద్రౌపదిని కీచకుడు పట్టుకొన బోయెను. కాని ఆమె త్వరగా వెనుకకు తప్పుకొనెను. అప్పుడు ద్రౌపది బుసకొట్టుచు ఆపాపాత్ముని ఒక్క త్రోపుతో క్రింద పడవేసెను. అతడు వేళ్ళు తెగిన వృక్షము వలె పడిపోయెను. ఇట్లు ద్రౌపది కీచకునికి పట్టు పడక అతనిని క్రిందకు త్రోసి పరుగెత్తుచు యుధిష్ఠిరుడున్న రాజసభకు పోయెను. కీచకుడు ఆమెను తరుముచు జుట్టుపట్టుకొని రాజసభలో రాజు చూచుచుండగనే క్రిందపడద్రోసి కాలితోతన్నెను.

"రాజా! అప్పుడు సూర్యభగవానుడు ద్రౌపది రక్షణ కొరకు పంపిన రాక్షసుడు కీచకుని పట్టుకొని సుడిగాలి వలె దూరముగా విసరి పారవేసెను. ఆరాక్షసుని దెబ్బచేత కీచకుడు నేలపైన తిరుగుచు వేళ్ళు తెగిన చెట్టువలె నిశ్చేష్టుడై పడిపోయెను. ఆసభలో నున్న విరాటరాజు బ్రహ్మణులు, వృద్ధులు, రాజ బంధువులు చూచు చుండగనే కీచకుడు తన్ని పడవేసిన ద్రౌపది నోటి నుంచి నెత్తురు కారుచుండెను. ఆమెను చూచి సభా సదులందరు హాహాకారము చేయుచు 'కీచకా! నీకిది యుక్తము గాదు. దీనురాలైన ఈ అబలను చంపెదవా యేమి?' అనిరి.


"సభలో నున్న భీమసేనుడు, యుధిష్ఠిరుడు ద్రౌపదికి కీచకుని చేత జరిగిన యవమానమును చూచి సహించ లేక పోయిరి. భీమసేనుడు దురాత్ముడైన కీచకుని అక్కడనే చంపదలచి క్రోధము చేత పండ్లు పటపట కొరికెను. అతని కను రెప్పలు తెరువబడి స్థిరముగా నిలిచి పోయెను. కన్నులకు పొగ గ్రమ్మినట్లయ్యెను. నొసట చెమట పట్టెను. కనుబొమ్మలు వంకరగా ముడివడి అతి భయంకరముగా నీతడు తోచుచుండెను. లలాటమును చేతితో తుడుచు కొనుచు అతిక్రోధము చేత త్రుళ్ళిపడుచు హఠాత్తుగా లేవబోయెను. అప్పుడు యుధిష్ఠిరుడు తమ రహస్యము బయట పడునను భయము చేత. తన బొటన వ్రేలితో భీముని బొటన వ్రేలిని అదిమి నొక్కి, అతడు లేవకుండ ఆపెను.

"మదపుటేనుగువలె క్రోధముతో నొక చెట్టువైపు భీమసేనుడు చూచుచుండెను. అతనిని ఆపుచు యుధిష్ఠిరుడు ఇట్లనెను: "బల్లవా! నీవు ఇంధనముల కొరకు వృక్షము వైపు చూచుచున్నావా? నీకొక వేళ వంటకుగాను ఎండు కట్టెలు కావలసి యుండిన యెడల బయటకు పోయి అక్కడి చెట్టునుండి తీసికొనుము. పచ్చగా నుండి శీతల చ్ఛాయనిచ్చు చున్న చెట్టును ఆశ్రయించి యుండవలెను. అది చేయుచున్న ఉపకారమును స్మరించుచు ఒక్క ఆకును గూడ త్రుంచకుండ ఆ వృక్షమును సర్వదా కాపాడవలెను.''

"ఇట్లు అన్యాపదేశముగా చెప్పిన అన్నగారి మనోభిప్రాయమును కనుగొని భీమసేనుడు ఊరకుండెను. భీముని సంరంభమును, దానిని అణచుచు ధర్మరాజు శాంతి పూర్వకముగా నన్న మాటలు వినిన ద్రౌపది అతిక్రుద్ధురాలై, కీచకుడు తరుమగా దుఃఖముచే ఎఱ్ఱబడిన కన్నుల నుండి అశ్రువులు రాలగా ఏడ్చుచు రాజసభాద్వారము వద్దకు పోయి దీనులైయున్న పతులనుచూచుచు అప్పుడు తమ అజ్ఞాతవాస ప్రతిజ్ఞా ధర్మము చేత కట్టుబడి, తన స్వరూపమును బయలుపడకుండ రక్షించుకొనుచు క్రోధము చేత దహింప బడుచు, విరాటరాజుతో నిట్లనెను.

"ప్రజా రక్షణ శీలురై, అమిత పరాక్రమసంపన్నులై, సర్వదా సత్య-ధర్మరతులై, తన బిడ్డలయందు - ప్రజలయందు భేదభావము లేక అందరిని సమానముగా చూచుకొనుచు ఆశ్రిత జనులను కాపాడుట రాజుల కర్తవ్యము. ఒక వివాదము కలిగినప్పుడు, మిత్రులయందు, శత్రువులయందు సమ బుద్ధితో ధర్మాసనమునందు కూర్చున్నరాజు తీర్పు చెప్పవలెను. అట్టిరాజునకు ఐహికము ఆముష్మికమునైన ఉభయఫలమున్ను సిద్ధించును రాజా! ధర్మాసనము నందుండి కూడ నీవు ఇప్పుడు ఊరకుండుట న్యాయముకాదు. నిరపరాధురాలనగు నన్ను రక్షింపుము. ఏయాపరాధముగూడ చేయని నన్ను దురాత్ముడైన కీచకుడు నీవు చూచుచుండగనే నిర్లక్ష్యముచేసి క్రీత దాసినివలెనన్ను గాల దన్నెను. మత్స్యరాజా! ఔరసపుత్రులను వలె ప్రజలను రక్షింపుము. మోహము చేత ఏరాజు అధర్మపరుడై రాజకార్యములను చేయునో అట్టి దురాత్ముడైన రాజును శత్రువులు వశపరచు కొనెదరు నీవు మత్స్యరాజుల కులము నందు పుట్టితివి. మీ వంశపు రాజులు సత్యమునే ఆశ్రయించి రాజ్యము నేలిరి అట్టి ధార్మిక కులము నందు అధర్మపరుడై జనించిన నిన్నేమనవలెను.

"నాకు శరణమును ఇమ్మని మొరపెట్టుకొను చున్నాను పాపిష్ఠుడైన కీచకునినుండి నన్ను రక్షింపుము. ఇక్కడ నేను అనాథనని. పురుషాధముడు కీచకుడునన్ను కొట్టుచున్నాడు. అతనికి ధర్మముపైన దృష్టి లేదు, చేయగూడని పనులను చేయక, చేయదగిన పనులను చేయుచు, ప్రజల యెడల సర్వదా మంచిగా వ్యవహరించుచుండు రాజులు స్వర్గసుఖమును పొందెదరు. కాని, యే రాజుల కర్తవ్యా కర్తవ్యముల భేదమును తెలిసియు స్వేచ్ఛాచారులై ప్రజల యెడల పాపకార్యములచే పెదవరో అట్టి రాజులు అధోముఖులైన రకమునకు పోయెదరు. చేయదగిన మంచి పనులను చేయువారు యజ్ఞహోమములతను, దానముల చేతను, గురుసేవ చేతను గూడ పొందజాలని ధర్మమును పొందెదరు. (సశేషం)



హరిజన వాడ

— శ్రీ ఉన్నవ మదన మోహనరావు

-6-

కృష్ణమాచారి స్కూలు ఫైనలు ప్యాసవగానే కాలేజీని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నాడు! కాలేజీ చదువంటే మాటలా మరి! పి.యూ.సి. ఒక ఏడాది చదివే సరికి అన్ని అవలక్షణాలు అలవడ్డాయి. సిగరెట్లు, సినిమాలు, త్రాగుడు వగైరాలు—

పెద్దవాళ్ళ అదుపు లేకపోవటం, చేతినిండా డబ్బులు ఖర్చు పెట్టుకొనే అవకాశం కలగటం కృష్ణమాచారిని విచ్చలవిడిగా తిరిగేట్టు చేశాయి.

వెంకటచారి కొడుకు బస్తీలో ఎక్కడ అవస్థపడి పోతున్నాడోనని అనుకొని. ఉత్తరం వచ్చినప్పుడల్లా అప్పో సొప్పో చేసిపంపుతూనే వున్నాడు।

రామదాసు పెద్దకొడుకు వెంకటస్వామిలాగా తన కొడుకూ పెద్ద ఆఫీసరు కావాలని వెంకటాచారి ఆశ.

పి.యూ. సి. పరీక్షలయినా కృష్ణమాచారి ఇ టికి రాకపోయె సరికి, వెంకటాచారి వెళ్ళి స్వయంగా కొడుకుని ఇంటికి తీసుకవచ్చాడు.

అసలు కృష్ణమాచారి పరీక్షకు ఫీజే కట్టలేదని తెలిసింది వెంకటాచారికి।

వెంకటాచారి కొడుకుని మందలించాడు అయితే కృష్ణమాచారి తెలివి తక్కువవాడు కాదు. ఎదురు తిరిగి తండ్రినే మందలించాడు.

పి. యూ. సి. పరీక్ష ప్రాముఖ్యాన్ని గురించీ, ఎంత మంది గొప్పవాళ్ళు పి. యూ. సి. ప్యాసుకాలేకపోయినదీ, వివరించాడు తనకు తక్కువ మార్కులతో ప్యాసుకావటం ఇష్టంలేదు కనుకనే ఫీజు కట్టలేదన్నాడు.

ఊరికే ప్యాసయితే ఏం లాభం నాన్నా। రేపు పొద్దున కలెక్టరు కావాలనుకొన్నా. ఇంజనీరు కావాలనుకొన్నా పి.యూ సి.లో బాగా మార్కులు రావాలిమరి।

'నాకు సెకండు క్లాసు ఎటూవస్తుంది అనుకో కాని ఫస్టుక్లాసు రాదేమోనని అనుమానంతో ఫీజు కట్టలేదు వచ్చే సంవత్సరం ట్యుటోరియల్ కాలేజీలో క్లాసు గ్యారంటీ అందుకనే ఇంటికి రాకుండా గుంటూరులోనే వున్నా ఇప్పట్నించీ చదివితేగాని లాభం లేదు నీకేమో తెలియదు' ఘాటుగా గిరీశంలా ఫోజు పెట్టి చెప్పాడు కృష్ణమాచారి.

వెంకటాచారికి కొడుకు చెప్పింది నిజమో, అబద్ధమో తెలియకుండావుంది ఒకవేళ నిజంగానే ఫస్టుక్లాసు కోసం ఫీజు కటకుండా మానివేశాడేమో బిడ్డ అనుకున్నాడు.

'కానియ్యి। అంతా రాముడిదయ। ఇన్నాళూ ఆరాముణ్నే నమ్ముకున్నాను. ఒక్కనాడు కూడ భోగంలో లోపం రానివ్వలేదు. ఆ రాముడి సంకల్పం ఎలావుంటే అలా జరుగుతుంది. నా కొడుక్కు పెద్ద ఆఫీసరు అయ్యే యోగం వున్నది కాబోలు అందుకే రాముడు పరీక్షలకు వెళ్ళ నివ్వలేదు.'

వెంకటాచారి మనసును సమాధాన పరుచుకున్నాడు.

వెంకటాచారికి రెండు రోజులుగా జ్వరం తగులుతూవున్నది. జ్వరంగా వున్నా స్వామి వారికి నిత్యనైవేద్యం లోటు కానీయలేదు కాని మూడో రోజుకూడ జ్వరం తగ్గలేదు.

స్వామికి నివేదన చేసే ఓపిక లేకపోయింది కొడుకుని పిలిచి బ్రతిమాలాడు 'నాయనా కృష్ణా! కాస్త గుడి తలుపులు తెరిచి, స్వామి దగ్గర దీపము వెలిగించి నారికేళమన్నా నైవేద్యం పెట్టి రారా' అని.

'నాకు చేతకాదంటే వినవేం నాన్నా ఒకరోజుకి నైవేద్యం పెట్టక పోతే మానిలే ఏంపోయింది' దురుసుగా జవాబిచ్చాడు కృష్ణమాచారి.

'రామరామ! ఎంతమాట అన్నావురా? స్వామిని ఉపవాసం వుంచుతావురా?' రెండు చేతులతో చెవులు మూసుకున్నాడు వెంకటాచారి మంచం మీద పడుకొనే!

'లేకపోతే, స్వామి రోజూ నీ కొబ్బరికాయలూ, పులిహోర తింటున్నాడను కుంటున్నావా? ఉపవాసం వుంచటానికి!'

'అపచారం... అపచారం! స్వామీ అపచారం జరిగింది' చెంపలు వేసుకొన్నాడు వెంకటాచారి.

'మన కుటుంబం ఆ స్వామినే తరతరాలుగా సేవిస్తున్నదిరా ఆ స్వామి భూములేరా మనం అనుభవిస్తున్నది. ఆయన సొమ్ము ఆయనకు నివేదన చేయటమే కష్టమైతే ఎలారా?'

'నాన్నా నీవు లక్ష చెప్పు. నీ దేవుడిమీద నాకు నమ్మకంలేదు. నమ్మకం లేనివాడిచేత నైవేద్యం పెట్టించటం ఎందుకు?'

వెంకటాచారి బాధపడి పోయాడు! ఈ రోజున తన కడుపున పుట్టినవాడే తన స్వామిని కాదంటున్నాడు! ఆ క్షణంలో మృత్యువు తనను ఆహ్వానిస్తే బాగుండునని పించింది వెంకటచారికి! వీడికి చదువు నేర్పించినందుకు కలిగిన ఫలితం ఇదేనా? ఎంత అపచారం! తన దేవుడి అస్తిత్వాన్నే శంకిస్తున్నాడే!

వెంకటాచారికి దుఃఖం ముంచుక వచ్చింది! ఆవేశం కలిగింది. తనేలేచి స్నానం చేసి, పులిహోర నివేదనచేసి వద్దామని నిశ్చయించు కున్నాడు! తన శరీరంలో ప్రాణం వున్నంత వరకూ, తనస్వామికి లోపం రానీయ కూడదు!

ఆవేశంతో లేచి నిలబడ్డాడు వెంకటాచారి! కాని తల తిరిగినట్టని పించింది! తూలిపోయి మంచంమీద కూర్చుండి పోయాడు. శరీరం తన వశంలో లేదని తేలిపోయింది.

చివరికి కొడుకు రెండు చేతులూ పట్టుకొని 'బాబూ! నాయీ ఒక్క కోరిక తీర్చరా బ్రతిమాలుకుంటున్నానురా? ఇన్నాళ్ళూ నీవు అడిగినవన్నీ ఇస్తూ వచ్చానురా! నాయీ కోరిక మన్నించరా' అని బ్రతిమాలుకున్నాడు వెంకటాచారి.

ఆయన నేత్రాల నుండి వేడి వేడి అశ్రు బిందువులు జారి కృష్ణమాచారి చేతులమీద పడ్డాయి.

'సరే! కొబ్బరికాయ నైవేద్యం పెట్టివస్తానులే, నాకు పూజలు, మంత్రాలు రావు' తండ్రికోరిక నెరవేర్చటానికి ఒప్పుకున్నాడు చివరికి కృష్ణమాచారి.

'దీపం వెలిగించి, నైవేద్యం పెట్టిరా నాయనా అంతేచాలు కాస్త ఆ పట్టుధోవతి కట్టుకొనివెళ్లు.'

'అదిగో మళ్ళీ మొదలెట్టావు! నేను ధోవతికట్టుకొని వెళ్ళను. నాకు దోవతి కట్టుకోవటం చేతకాదు అందులోనూ పట్టుదోవతి వెధవది జారి పోతూవుంటుంది '

'ప్యాంటూ చొక్కా తొడుక్కొని దీపారాధన ఎలా చేస్తావురా? మా నాయన కదూ! చొక్కా విప్పి, దోవతి కటుకొనిపోరా' ప్రాధేయ పూర్వకంగా అడిగాడు వెంకటాచారి.

'చొక్కా లేకుండా ధోవతితో వెళ్ళాలంటే నాకు సిగ్గు నాన్నా అలా అయితే అసలుపోను.'

వెంకటాచారికి అరచీ అరచీ కొడుకుతో మాట్లాడే వోపిక లేకుండాపోయింది.

'పోనీ ఒక పనిచేస్తా! ధోవతి గుడికి పట్టుకొనిపోయి అక్కడ కట్టుకుంటానులే అన్నాడు కృష్ణమాచారి సమస్యను పరిష్కరిస్తూ.'

'సరే ఎలానో అఘోరించు! నిన్ను అనవలసిన పనిలేదు! అంతా నేను చేసికొన్న కర్మ! అనుభవించక తప్పుతుందా మరి!' వెంకటాచారి అలసిపోయి పడుకున్నాడు.

కృష్ణమాచారి గుడికి దారితీశాడు.

* * *

'నాన్నా! నాకీ పెళ్ళి వద్దు నాన్న!' కచ్చితంగా చెప్పింది లక్ష్మి. తండ్రితో.

'ఈ సంబంధానికేమమ్మా! పిల్లవాడు రూపసి. చదువున్నది స్థితిగలవాడు. ఏంలోటయిందమ్మా!' చౌదరికి ఈ సంబంధం కలుపుకోవాలనివున్నది.

'మనిషికి రూపమూ చదువేకాదు నాన్నా కావలసింది! సంస్కారము కూడా కావాలి! సంస్కారము లేని చదువు ఎందుకు?'

'ఇప్పుడతనికి సంస్కారం లేదని ఎవరన్నారమ్మా! వాళ్లది చాలా మర్యాదగల కుటుంబం '

'సంస్కారం లేదని ఎవరో అనటం ఎందుకు నాన్నా! మొన్న నీవుకూడ విన్నావుగా ఆయన ప్రశ్నలు! పెళ్లి చూపులకు రాగానే తానేదో రాజకుమారుడైనట్లూ, ఎదుటి వాళ్ళకు వ్యక్తిత్వం లేనట్టు ప్రవర్తిస్తే ఎలా? ఛీ-ఛీ అతని ప్రవర్తన ఎంత అసభ్యంగా వున్నదో చూశావుగా!'

'ఏదో కుర్రతనమమ్మా! అసలు ఈ కాలపు కుర్రవాళ్ల తీరే అంత! ఆ మూడుముళ్లూ పడ్డాక నోరెత్తరు.'

'అసభ్యంగా మాట్లాడితే కుర్రతనమౌతుందా నాన్నా! పోనీ అవి సరిపుచ్చుకున్నా కట్నం విషయంలో అంతం నిక్కచ్చి ఎందుకు?'

'నీకు లోక వ్యవహారం తెలియదమ్మా! గడపదాటి బయట కాలు పెట్టలేదు నీవు! అయినా కట్నం మనం ఇచ్చుకోలేక పోతే గదా! నాకు మాత్రం వేరే ఎవరున్నారుగనుక! ఎప్పుడైనా ఈ ఆస్తంతా నీకు నీ పిల్లలకి చెందాలసిందేగదా!'

'అందుకనే నేనన్నది! ఎలాగూ ఈ ఆస్తి వాళ్ళకే చెందుతుంది కదా! అటువంటప్పుడు ఈ బేరం ఎందుకూ అంట!'

'అది లోకంతీరమ్మా! అది తెలియని వాళ్ళకి నిజంగా ఆశ్చర్యంగానే వుంటుంది వాళ్ళ ప్రవర్తన'

'నీవేమైనా చెప్పు, కట్నంకోసం, ఆస్తికోసం ఆశించి నన్ను పెళ్ళి చేసుకుంటానంటే నేనసలు పెళ్ళే చేసుకోను!'

చౌదరికి లక్ష్మి మనస్తత్వం బాగా తెలుసు. అమ్మాయి ఒకసారి కాదంటే మళ్ళీ ఒప్పించటం కష్టం!

లక్ష్మి అన్నట్లు రవికుమార్‌కి సభ్యత లేదని తనకూ అనిపించింది. పోనీ కుర్రతనమని సరిపెట్టుకున్నా లక్ష్మి అసలు రాజీపడటంలేదు. పైగా కట్నం విషయంలోకూడా వాళ్ళు చాలా నిక్కచ్చిగా వున్నారు. పిల్లవాడు బిజినెస్ ఇంప్రూవ్ చేయాలంటు న్నాడుట. కనీసం లక్ష అయినా కట్నంక్రింద ఇవ్వాలి.

లక్ష ఇవ్వటానికి తను సిద్ధపడినా పిల్లకు సంబంధం నచ్చ లేదుగదా!

'ఒకవేళ లక్ష్మి ఎవరినైనా ప్రేమించిందా? అందుచేత ఈ సంబంధం నచ్చలేదా?' మొదటిసారిగా ప్రశ్నించుకున్నాడు చౌదరి తనలో.

లక్ష్మి ఎవరినైనా ప్రేమిస్తే తనకు ఎందుకు చెప్పదు? తను అడిగిందెప్పుడు చెప్పటానికి? అయినా అడిగి చూదామనిపించింది చౌదరికి.

'సరేలేతల్లీ! ఆ సంబంధం మానుకుందాం! పోనీ నీ మనసులో ఎవరైనా వున్నారా అమ్మా?' లక్ష్మి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు చౌదరి.

ఎదురు చూడని ఈ ప్రశ్నకు లక్ష్మి ఉలికిపడింది. సిగ్గువేసింది.


'నాదగ్గర సిగ్గెందుకు తల్లీ! నీకు తల్లినైనా, తండ్రినైనా నేనేగదమ్మా. నిజంగా మీ అమ్మేగనుక బ్రతికివుంటే నేనిప్పుడు ఇలాంటి ప్రశ్న అడగాల్సిన అవసరమే వుండేదికాదు! అంతా నా నెత్తిన ఒదిలేసి తను హాయిగా స్వర్గములో కూచుంది.'

భార్య గుర్తుకురాగానే చౌదరి కళ్లు చెమర్చాయి.

లక్ష్మికి కళ్ళలో నీరునిండి మసకలు వేశాయి.

'నీ మనసులో ఎవరైనావుంటే చెప్పుతల్లీ!' లాలనగా అడిగాడు చౌదరి.

'మీకు కోపం రాదుగదానాన్నా!' అంది భయంభయంగా చూస్తూ లక్ష్మి.



'పిచ్చి తల్లీ కోపమెందుకమ్మా! ఈ సంగతి ముందే చెప్ప లేదేమమ్మా. అసలు ఈ సంబంధాల వేట మానేసి నిశ్చింతగా ఉండేవాణ్ని'

'తరువాత నీవు కాదంటావేమో నాన్నా' అనుమానంగా అడిగింది లక్ష్మి.

నేను కాదంటానా! నాకూతురు మనసు తెలిసినవాణ్ని నేను కాదంటానా వెర్రితల్లీ! నాకు నీ శుభంకన్నా కావలసింది ఏముం దమ్మా! చెప్పుతల్లీ! ఆ కుర్రవాడెవరో చెప్పు. ఆస్తిలేనివాడైనా సరే. నిశ్చయం చేస్తాను. మన ఆస్తే చాలు అనుభవించటానికి చెప్పు లక్ష్మి త్వరగాచెప్పు.'

'చెప్పనా మరి!' అన్నది లక్ష్మి సిగ్గుతో తలవంచుకొని.

'చెప్పమ్మా చెప్పు. నాదగ్గర దాపరికమెందుకమ్మా!'

'మన ప్రకాశాన్ని చేసుకుంటాను' నాన్నా! అన్నది లక్ష్మి తండ్రి కళ్ళలోని భావన పరిశీలిస్తూ.

ఉరుములు, మెరుపులు లేకుండగానే పిడుగుపడ్డట్లనిపించింది చౌదరికి.

తల తిరిగిపోతున్నట్లుగా అనిపించింది. తను విన్నది నిజమో అబద్ధమో తెలియకుండా వున్నది. లక్ష్మి పరిహాసానికి అన్నదా మరి!

'ఎవరు? ప్రకాశమా!....ప్రకాశమా...!! ప్రకాశమా...!!! లక్ష్మి నీవు ఎవర్ని గురించి మాటాడుతున్నావు? ఆ మాల వాణ్ని గురించేనా? వాడేనా? ఆ మాలవాడేనా?'

'మాలవాడు కాదునాన్నా హరిజనుడు!' నిశ్చలంగా అన్నది లక్ష్మి.

కాళ్ళక్రిందినుండి భూమి జారిపోయినట్టుగా అనిపించింది చౌదరికి.

(సశేషం)

గ్రంథసమీక్ష

శిలలో సెలయేరు

(కథల సంపుటి; రచయితలు : విహారి&శాలివాహన. ప్రతులకు : స్పందనసాహితీ సమాఖ్య 23/182E. మునిసిపల్ క్వార్టర్స్, మచిలీపట్టణం; పుటలు108 వెల: నాలుగు రూపాయలు.)

ఉత్తమసాహిత్యాన్ని అందించాలని చిత్తశుద్ధితో ఉద్యమ స్థాయిని కృషిచేసే సాహిత్యసంస్థ మచిలీపట్నంలోని స్పందన సమాఖ్య. ఉత్తమాభిరుచులను ప్రోత్సహించే ఉద్దేశంతో పీఠాక పథకాన్నికూడా నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో పన్నెండో ప్రచురణగా సుప్రసిద్ధ కథకులైన విహారి, శాలివాహనగార్ల కథా సంపుటం శిలలో సెలయేరు ప్రచురించారు. ఈ సంపుటిలో ఇదీ అసలయిన ఇంటింటి కథ, ఒక్క మనిషీ నవ్వడేం మెత్తని పులులు, విజేత, గొంగళి పురుగు, నీతికథ, కర్త-కర్మ-క్రియ, శిలలో సెలయేరు, అనే ఎనిమది కథలున్నాయ్ నేటి సమాజము, సమస్యలూ, వివిధ ప్రవృత్తులుగల వ్యక్తులు. వ్యక్తిత్వాలు, ఈ ఇతివృత్తాల్లో సాక్షాత్కరిస్తాయి. అలతి అలతి వాక్యాలతో కవితా స్ఫో రకంగా భావుకతతో సాగింది రచన. సున్నితమైన వ్యంగ్యం సుకుమారమైన హాస్యంకూడా కథలకు వన్నెపెట్టాయి. మొదటి కథలో మధ్యతరగతి కాపురంలోని ఈతిబాధలు. కరుణ రసాత్మకంగా వర్ణించారు రచయితలు. నెలలో 16వ తారీకున సామాన్యుడి సంసారంలోని సరిగమపదనిసలు, విసవిసలు, రుసరుసలు, నీపని సరిసరులు, ఏడవలేక నవ్వుతునేకళ్ళు, అప్పుకోసం తిరిగే కాళ్ళ కదలికలు చిత్రించారు. రెండో కథ గొంగళి పురుగు వీధుల్లో బొమ్మలుగీసి అడుక్కుతిని బ్రతికే అసిరిగాడికథ. ఈ చిత్ర కారుణ్ణి మూగోణ్ణిగా చిత్రించడంలో దరిద్రులను, అసహాయులను క్రూరంగా, మాటకూడా పెగిలి రానీయకుండా నలిపివేసే ఒక వర్గపు విలాసజీవితం తాలూకు క్రౌర్యం గూర్చిన ధ్వని వుంది. ఇవాల్టి నాగరక సమాజంలోకూడా విస్తరాకులను నాకి, దైన్యంగా బతికే, బతుక్కోసం పాకులాడే యదార్థ జీవిత వ్యథార్త దృశ్యాలు సామాజిక దురన్యాయాలకు స్పందించే కథన కౌశలంగల రచయితల చేతుల్లో ఏ విధమయిన రూపురేఖలు పొందగలవో నిరూపిస్తుందీ కథ. చాలా వాస్తవికమైన చిత్రణ ఈ కథనిండా పరచుకొని వున్నది. మామూలుగా ఏ బొగ్గు ముక్కతోనో, లేదా ఏ రంగు సుద్దముక్కతోనో పేవ్‌మెంట్లపైనా, పక్కనా, సినిమా హీరోలను, పురాణ వీరులను, దేవుళ్ళను రకరకాల భంగిమలలో చిత్రించే గుర్తింపులేని కళాకారులను ముఖ్యంగా నగరాలలోను. చిన్నచిన్న పట్నాలలోనూ చూస్తూ వుంటాము. అటువంటి అసిరిగాడనే మూగ చిత్రకారుణ్ని గురించి. పేరాకలితో అతడు చనిపోవడం గూర్చి గొంగళిపురుగు కథ చెపుతున్నది. మూడోకథ 'ఒక్క మనిషీ నవ్వడేం?'. భవిష్యత్తుమీద కొండంత ఆశా. బ్రతుకులోని మాధుర్యంపైని అమితమైన నమ్మకమూ, ఆత్మవిశ్వాసమూ ఉన్న వ్యక్తిత్వంగల, ఉద్యోగి సద్యోగం కథ. ఆఫీసు ఉద్యోగానికి సలాంకొట్టి, అదిన్నీ నవ్వుతూ, ఇంగ్లీషు మీడియం ప్రైమరీ స్కూలు టీచర్‌గిరీ స్వీకరించిన సత్యం గాథ యీ కథ సాధారణంగా ఒక పాటి ప్రభుత్వకార్యాలయాల్లో. దినచర్యగా సాగే ఆఫీసు పనిని. పనిమంతులను, వారు పనిచేసే పద్ధతులను. వాళ్ళ వాళ్ళ అసంతృప్తులను. కరుణతో హాస్యాన్ని జోడించి కథగా చెప్పడం జరిగింది ఇందులో. కథనం చాలా ఆకర్షకంగా వుంది.

నాలుగోకథ, నీతికథ. ఆఫీసుల్లో ఉద్యోగస్తుల జీతాలబిల్లులు చేసే ఉద్యోగి దర్పాన్ని, విలాసాన్ని చిత్రించే కథ ఇది. అటువంటి వాళ్ళు పరిస్థితుల్ని ఎంతగా ఉపయోగించుకొని, ఎంత నిర్దాక్షిణ్యంగా, సాటి ఉద్యోగస్తుల్నే అయినా బాధలు పెట్టగలరో వర్ణించే కథ ఇది. ప్రస్తావికంగా నేటి సమాజంలో చెలామణి అవుతున్న అవినీతి. లంచగొండితనం, హాస్య చమత్కార వ్యంగ్య ధోరణిలోనైనా మనసుని బాధపెట్టే కథ ఇది.

మెత్తని పులులు అనే కథ అవిభక్త కుటుంబాలలో నోరుగలవాడూ, చోరవగలవాడూ, అమాయకులను ఎలా మోసం చేస్తారో తెలియచేసే కథ. ఒక కడుపున పుట్టిన సంతానమే అయినా స్వార్థం దగ్గరకు వచ్చేసరికి, అన్న తమ్ముణ్ణి కూడా ఏ విధంగా మోసం చేయగలడో, అదంతా సంఘంలో ప్రయోజకత్వంగా ఏ విధంగా చెలామణి కాగలదో సొగసుగా నిరూపించే కథఇది. పొరుగు వాడిదాకా ఎందుకు, పొత్తుగుడిచినవాడి విషయమైనా సొంతలాభం కొంత మానుకోవడం, చాలామంది విషయంలో జరిగేప కాదు.

కర్త-కర్మ-క్రియ అనే కథలో ఆలుమగల మధ్య పట్టింపులు ఏ విధమైన కష్టాలు తెచ్చిపెట్టగలవో, తల్లి దండ్రుల మధ్య పసిమనస్సులు ఏ విధంగా వికలమై పోగలవో, ఆ సంసారంలోని చిన్నా పెద్దా ఎలాంటి కష్ట నిష్ఠూరాలకు గురిఅవుతారో, లలితంగా హృద్యంగా, భావుకతా సుందరంగా వివరించిన కథ. భార్య ఉద్యోగం చేయడం భర్తకు ఇష్టం ఉండదు. అయినా ఆమె తనదైన వ్యక్తిత్వంతో ఉద్యోగం చేస్తుంది. భర్త దగ్గర కూతురూ, భార్య దగ్గర కొడుకూ వుండిపోవడం. వాళ్లు వేరేవేరే ఊళ్ళలో ఉద్యోగాలు చేస్తూ మమతలకు దూరమై బాధపడటం, చివరకు ఒకే ఊరికి ఇద్దరకూ బదిలీఅయి, కథ సుఖాంతం కావడం, కమనీయంగా వుంది. నేటి సమాజంలో రావలసిన సంస్కారాన్ని, సంసారంలో ఆలుమగలు పాటించవలసిన సున్నితమైన విలువల్ని, మనసుని స్పందింపజేసే విధంగా ఈ కథలో చిత్రించారు రచయితలు.

విజేత అనే కథ నిరుద్యోగి దురుద్యోగం కథ. ఆత్మహత్య చేసుకోవాలని సంకల్పించిన సున్నిత మనస్కునిలోకూడా అమ్మ రేకెత్తించిన నిబ్బరం, బ్రతుకులోని ఆసక్తి, జీవితంపట్ల ఆశనూ, ధైర్యాన్ని కలిగించిన కథ.

ఎనిమిదోదీ చివరదీ అయిన కథ శిలలో సెలయేరు. శిలలాగా మారిపోయిన రాఘవులి హృదయంలో సెలయేరులాగా దయా, దాక్షిణ్యం, జాలీ, సానుభూతి, కరుణ, మానవత్వం ప్రవహింపజేసిన వీరమ్మ కథ. రాఘవులి టీ దుకాణానికి పోటీగా వీరమ్మ టీ దుకాణం నడిపి, అందర్నీ తన కొట్టుకే ఆకర్షిస్తుంది. అప్పుడెంతగానో వీరమ్మను ద్వేషించిన రాఘవులు, కలరాతో వీరమ్మ పోగానే, ఆమె ముగ్గురు బిడ్డల్నీ తనే దగ్గర తీశాడు. మనసు కదిలించే కథ ఇది.

భాష, భావాలు, కథనం ఈ కథకులకు మంచి భవిష్యత్తును పలుకుతున్నాయి.

—మంజుశ్రీ

తెల్లకాకులు (నవల), గాజు పెంకులు (కథలు):

[రచయిత్రి: శ్రీమతి పరిమళా సోమేశ్వర్; ప్రచురణకర్తలు: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్, విజయవాడ–2; మొదటి కూర్పు: ఆగష్టు, 1976]

సాహిత్యం సమాజంలోంచి పుడుతుంది. సమాజం కోసం పుడుతుంది. అయితే ఇది సమాజాన్ని ప్రతిబింబిస్తుందన్న మాట పూర్తిగా నిజంకాదు. అలా కాకపోవడానికి కారణం, సాహిత్యంగా చెలామణి అవుతున్న సరుకు కొంత ఊహాపోహల్లోంచి పుట్టుకొస్తూ ఉండటమే. వాటిని పాఠకులు చదవడం లేదా, సాహిత్యం కాకపోదా–అనడిగితే మనం యేమీ చెప్పక్కర లేదు. పాఠకుల్లోను రకరకాలుంటారు, సాహిత్యం లోనూ రకరకాలు ఉంటుంది. అసలు చదవకపోవడంకంటె ఏదో ఒకటి చదివే అలవాటు ఉండడం మంచిదే. కాబట్టి చదివేవాళ్ళని తప్పుపట్టక్కర్లేదు. మంచి అయినా చెడయినా రాసేవాళ్ళు అలవాటు చేసిందే. వాటిని పరామర్శించి చూసి చదువుకునే తీరికా, ఓపికా, శ్రద్ధా, అలవాటు పాఠకుల్లో, పాపం, చాలామందికి ఉండదు. అందువల్ల దొరికిందల్లా చదువుకుంటారు. ఏదో రుచి చూపించి మత్తుగా, గమ్మత్తుగా లాక్కుపోయే రచనలయితే వేరే చెప్పనే అక్కరలేదు. సరే–ఎవరికిష్టమైంది వాళ్ళు చదువుకుంటారు. మన మెవళ్ళం కాదనడానికి? అయితే చిక్కెక్కడంటే, అదే ఘనమైన సాహిత్యమని అనుకోవడంలోనూ, దాన్నే ఆకాశానికి (కాకపోతే వెండితెరకి) ఎత్తడంలోనూ ఉంది, కాని మానవత్వపు అంతరాంతరాల్లో వేళ్ళూని నిటారుగా పెరగవలసిన జాతికి, ఊహాపోహల్లో విహరించే ఈ మాదిరి సాహిత్యం ఆరోగ్యకరమైంది ఎంత మాత్రంకాదని చెప్పకతప్పదు. ఈ సంగతి పాఠకుల్లోనూ కొందరికైనా తెలియకపోదు.

ఏ కాలంలో జీవించేవాడికి ఆ కాలాన్ని గురించి అవగాహన సమగ్రంగా ఏర్పడాలి కాబట్టి ఆ కాలపు సమాజ స్థితిగతుల్ని ప్రతిబింబింపజేస్తాడు. వాటిలో, పదిమంది దృష్టిని ఆకర్షించే సమస్యల్ని ఎత్తుకొని వాటి చుట్టూ కథ నడిపినప్పుడు ఆ రచన ఎంత సార్థకమవుతుందో ప్రత్యేకించి చెప్పక్కరలేదు. అందుకే సాహిత్యం సమాజంలోంచి పుట్టాలనడం అది కూడ సమకాలిక సమాజంలోంచే పుట్టడం మరి అవసరం. ఒక్కొక్క రచన మన కళ్ళకున్న పొరల్ని చీల్చేస్తుంది; ఒక్కొక్కటి వెలుగు ఇస్తుంది; ఒక్కొక్కటి మనస్సును మథిస్తుంది; మరొకటి హృదయాన్ని కలిచి పారేస్తుంది. మంచి కమైన రచన చదవడం గొప్ప అనుభూతిగా భాసిస్తుంది.

శ్రీమతి పరిమళా సోమేశ్వర్‌గారు రాసిన పై పుస్తకాలు రెండూ సమకాలిక సమాజంలోంచి వెలవడ్డవే. రకరకాల సామాజిక, వైయక్తిక సమస్యల్ని నిశితదృష్టితో పరిశీలించి రాసినవే. వీటి పరిధి ఎంత విశాలమైనదో చూపు అంత తీక్షణమైనది. ఈ రచయిత్రికి సామాజికమైన అవగాహన ఉంది; సమస్యల వికృత రూపాల్ని విడమరచి చూపాలన్న ఆసక్తి ఉంది; వాటి పరిష్కారానికి రవ్వంత ప్రేరణ ఇవ్వాలన్న అన్వేషణ ఉంది. అందుకు పాఠకులు ఆమెను అభినందించక తప్పదు.

ప్రతి వ్యక్తికీ ఉన్నట్లుగానే ప్రతి రచనకీ ఒక స్వరూపమూ ఒక స్వభావమూ ఉంటుంటాయి. స్వరూపం రచనా సౌందర్యపరమైనది; స్వభావం రచనా విషయ పరమైనది. అందం కంటిని ఆకర్షిస్తుంది. గుణం హృదయాన్ని ఆకర్షిస్తుంది. ఒక వ్యక్తి పట్లకాని, ఒక రచన పట్లకాని మనకు మమత్వం ఏర్పడాలంటే ఈ రెండూ ఉండాలి. కళా సౌందర్యం భాసించినంత మాత్రాన ఉద్దిష్ట విషయం సరైనది కాకపోతే ఆ రచనకు విలువ ఉండదు: పైపై మెరుగులు చూసి మనం ఎల్లకాలం మోసపోము. దానికి భిన్నంగా విషయం ఎంత ఉదాత్తమైనా శిల్ప విన్యాసం లోపిస్తే మన చూపునే నిలుపుకోలేదు. అందుకే అనుభవజ్ఞులంటారు, వస్తు శిల్పాలు రెండూ సమఉజ్జీలో సమ్మేళనం చెందాలని. అటువంటి శిల్పమర్మజ్ఞులు వెనకటి తరంవాళ్ళలో కొందరు కనిపిస్తారు; చలం, మల్లాది రామకృష్ణశాస్త్రి పాలగుమ్మి పద్మరాజు మొదలైనవాళ్ళు. రావిశాస్త్రిలాంటి వాళ్ళు ఇప్పటికీ కొందరున్నారు. తీసుకొన్నది బంగారమూ కావాలి, దాంట్లో చికిలిపనీ చూపించాలి. ప్రపంచ సాహిత్యంలో విటివన్నీ ఎన్నటికీ తరిగిపోదు. ఈ స్పృహ రచయితలకందరికీ ఉండటం అవసరం; ఇది కొందరికైనా ఉండటం ఆహ్లాదకరం.

శ్రీమతి పరిమళా సోమేశ్వర్ నవల పేరు 'తెల్ల కాకులు' కాకు లెప్పుడూ నల్లగానే ఉంటాయి. వీటిని సమాజానికి ప్రతీకగా తీసుకోనడం జరిగింది. కొవ్వడం కాకులే అయినా, ఆదర్శమనే ధవళచ్ఛాయతో మెరిసే తెల్ల కాకులు–సావిత్రి, లతీఫ్. వీళ్ళిద్దరూ ప్రేమించుకొన్నారు. పెళ్ళిచేసుకోడానికి రెండు వేపుల వాళ్ళనుంచీ అభ్యంతరాలు వచ్చాయి. అయినా నిరుత్సాహపడలేదు. పెళ్ళి చేసుకుని సంసారం ప్రారంభించారు. చుట్టు ప్రక్కల వాళ్ళు కాకుల్లా పొడవక మానలేదు: అయినా వాళ్ళు వెరవలేదు. తెలివి, మాట నేర్పరితనం ఉన్నవాళ్ళే కాదు, పరస్పరం గాఢమైన ప్రేమానురాగాలున్న వాళ్ళు. ఒకప్పుడు తమను వేలెత్తి చూపిన సమాజమే చివరికి తమ వెంట నడచి రావడం గమనించిన వాళ్ళు.

ఇందులో రచయిత్రి కనబరిచిన దృక్పథం ప్రశంసనీయమైంది. కేవలం సంస్కరణ కోసం చేసుకొనే వివాహ బంధాలు పొట్లాలదారాల్లా బలహీనంగా ఉంటాయి. పరస్పర ప్రేమానురాగాలనే నైలాన్ దారాలతోనే అవి ముడివడాలి. అంతేకాదు:

ఔదార్యం, సహనం గుండె విశ్వరం ఉండాలి. వీటన్నిటితోబాటు ఆర్థిక సుస్థితి అన్నది ప్రప్రథమంగా ఉండాలి. ఇవి ఉన్ననాడు, మతాంతర కులాంతర వివాహాలే కాదు. పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు కూడా సార్థకమవుతాయనడంలో సందేహం లేదు. పెద్దలనుకాదని అభ్యుదయ భావాలతో చేసుకొనే వివాహాలు కొన్ని విచ్ఛిన్నం కావడానికి కారణం పరస్పరావగాహన, సర్దుబాటు తత్వం లోపించడమే కాని కులమతాంతరాలు కావన్న విషయం రచయిత్రి చక్కగా స్పష్టం చేశారు. తీసుకొన్న వస్తువునుబట్టి నవల పరిధి ఇంకా పెరగడానికి అవకాశమున్నా రచయిత్రి ఉద్దేశించిన అంశాలన్నీ ఇందులో సుస్పష్టంగా వెల్లడి అయాయి.

రెండో పుస్తకం 'గాజు పెంకులు' అన్న కథల సంపుటి. ఇందులో మొత్తం పద్నాలుగు కథ లున్నాయి. తాను కూడబెట్టిన ఆస్తి పరులపాలు కాకుండా కాపాడుకోవడం కోసం ప్రహరీ గోడ మీద గుచ్చిన గాజు పెంకులే సింహాచలం మరణానికి కారణ మయాయి అదే పేరుగల కథలో. ఆకలితో వకనకలాడేవాడి పొట్టకు ఆశచూపిన 'రొట్టె ముక్క' సాటి మనుషుల స్వార్థానికి చిహ్నమైంది మరో కథలో. సత్యాన్ని 'ఉరి' తీయవలసివచ్చినందుకు ఆత్మహననమే అనుభవించిన హాంగ్‌మన్ కథ మూడోది. కూటికి గతిలేని వాడు కోట్లు గడించడమేకాదు, ఆ పాపిష్టి 'డబ్బు కోసం' నానాగడ్డి కరిచే అధికారుల, నాయకులనైజాన్ని బయట పెట్టాడు మరో కథలో. కులం తక్కువ వాళ్ళమన్న న్యూనతా భావం మనస్సును ఏ విధంగా హింస పెడుతుందో తెలిపే కథ ఐదోది. ఉద్యోగరంగంలో 'ఇన్‌ఫ్లుయన్సు' ల ప్రభావాన్ని తెలిపేది ఆరో కథ. తక్కినవి 'పద్మశ్రీ ప్రొఫెసర్', డమ్మీ, ఆదర్శాలు—అనుభవాలు, నేను చేసిన నేరం ఏమిటి?, ప్రొఫెసర్ పరమేశం, రంగులకల, కీర్తి కండూతి, బహుమతి కథ' అన్నవి. వీటిలో ప్రతి కథకూ సమకాలిక సామాజిక వైయక్తిక జీవనాల్లోని ఒక్కొక్క అంశం కథావస్తువైంది.

కథావస్తువరణంలో శ్రీమతి పరిమళా సోమేశ్వర్‌గారు చూపించిన వైవిధ్యం ఎన్నదగినది. ఆమె చూపు అభ్యుదయ పథీనమైనది. దాన్ని మనసా వాచా కర్మణా నిరూపించ గలిగిన రచయిత్రి శ్రీమతి పరిమళ. 'తెల్ల కాకులు' నవలా 'గాజు పెంకులు' కథలూ పాఠకుల్ని అలరిస్తాయనడంలో సందేహం లేదు.

—శ్రీ పోరంకి దక్షిణామూర్తి

నవమౌక్తిక మాల

— శ్రీ రంగినేని సుబ్రహ్మణ్యం

రసహృదయమ్ములు స్పందించే
కమ్మని తీయని రమణీయోహల తోరణమాలల
రస సౌధానికి కడ్తున్నా !
సమతా నవతా సిం సనమున
నా శాంతి సుందరిని సామ్రాజ్ఞిగా కూర్చొన బెట్టగ
సర్వము సిద్ధము చేస్తున్నా !

నా మదిలో మెదిలే అక్షరమాలల
కవితా మయమౌ నవ మౌక్తిక మాలగా గ్రుచ్చి
గళములో అలంకరించగ తెస్తున్నా !
కాల తరంగిణీ లయమై పోయే ప్రతిక్షణమ్మును
నా కలమ్ముతో చెరగని రూపము నిచ్చి
మానవతా మణి మకుటము శిరమున పెడ్తున్నా !

తమస్సు తెరలను రజస్సు పొర ను పారద్రోలుటకు
నే మమతా నక్షత్రాల కాంతులను
జగతికి పంచగ వస్తున్నా !
ప్రతిక్షణమ్ము ఈ ప్రకృతిలో పరిమళించు అందాల చందముల
ప్రతి నిముషము కన్నులలో వెల్గులుగా నిల్పుకొనుచు
ముందు కడుగు వేస్తున్నా !

నా అక్షర మేళనలో కదిలే మెదిలే
శబ్దస్ఫూర్తిని నా సోదర యువతరానికి
రస్తా వేస్తూ వస్తున్నా !
వెన్నెల కన్నులతో మనసు లోతులను పట్టేస్తూ
నే నిన్న మొన్నటి పాశవికతకు
చెలియలి కట్టను కడ్తున్నా !

మనసులోని మంచిని పెంచే
మహీతలం వెలయించే మనసున్న మనుషులుగా
యువతరాన్ని తీర్చి దిద్ద వస్తున్నా !

జిల్లాల్లో ఏం జరుగుతోంది?

(సమాచార లేఖలు)

నెల్లూరు జిల్లా

నూతన ఆర్థిక కార్యక్రమము గత 19 మాసాలలో ఎంతో విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది. ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన ప్రజల హృదయాలలో ఆశాజ్యోతి వెల్గించిందనే చెప్పాలి. సాంఘిక వ్యతిరేక శక్తులకు యిది అశనిపాతంగా పని చేస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగంలో గల స్తబ్దత చాలవరకు తొలగిపోయి అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరగడంలో వేగం పుంజుకుంటున్నది.

రాష్ట్రం మొత్తంమీద నెల్లూరు జిల్లా భూ పరిమితుల చట్టం అమలు పరచడంలో భూమిలేని నిరుపేదల, వ్యవసాయ కూలీల స్థితిగతులను బాగుపర్చే కృషిలో ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. 1973 భూ సంస్కరణల చట్టం క్రింద జిల్లాలో 15,606 (ప్రకటనలు) డిక్లరేషన్స్ దాఖలా చేయగా యింతవరకు 15465 కేసులు పరిశీలించబడినవి. 141 కేసులలో పరిశీలన పూర్తి కావలసి యున్నది. అవైనా యితర జిల్లాలనుండి అందవలసిన సమాచారం మూలంగా నిల్చిపోయాయి. జిల్లాలో గల నాల్గు ట్రిబ్యునల్స్ నిర్విరామంగా పనిచేసి యింతవరకు 15257 కేసులను పరిష్కరించాయి. ఇందులో 2709 కేసులలో మిగులుభూమి లభిస్తున్నది. 71390 ఎకరముల మెట్టభూమి 9460 ఎకరముల మాగాణి మిగులు భూమిగా తేలింది. మిగులు భూమిని తేల్చడం లోనేగాక స్వాధీనం చేసుకోడంలోను, పంపిణీ చేయడంలోనూ, యీ జిల్లా ముందంజవేసింది. 23792 ఎకరములు స్వాధీనం చేసుకొని ఇంతవరకు 16373 ఎకరములను, 7643 షెడ్యూలు కులములకు, 4106 షెడ్యూలు జాతులకు, 2699 వెనుకబడిన జాతులకు, 234 యితర పేద కుటుంబాలకు (మొత్తం 14712) భూమి పంపిణీ చేస్తారు. తరతరాలుగా భూమితల్లిని నమ్ముకొని పరిశ్రమిస్తున్న యీ బక్కయ్యలు నేడు భూమికి స్వంతదారులైనారు వారి బ్రతుకుల బాట మలుపు తిరిగింది. వారిలో క్రొత్త ఆశలు చిగురించాయి. నవభారత నిర్మాణంలో వారు మున్ముందు భాగస్వాములై పురోగమిస్తారనడంలో ఏలాంటి సందేహంలేదు.

భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను పంచిపెట్టడంలోను, జిల్లా అగ్రగామిగా నిలిచింది. 1-11-1969 నుండి అనగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బంజరుభూమి పంపిణీ తీవ్రతర కార్యక్రమం లగాయతు యింతవరకు 1,48,013 ఎకరములు పంచిపెటబడినది. 30 వేల ఎకరములకు పైగా పంపిణీ జరిగిందంటే యీ కార్యక్రమం ఎంత చురుకుగా సాగుతున్నదో ఊహించుకోవచ్చు.

పొలాలు పంచిపెట్టడంతో వెనుకటి రోజులలో తృప్తిపడేది ప్రభుత్వం. గత అనుభవాల దృష్ట్యా పేద ప్రజల ఆర్థిక దుస్థితిని గుర్తించి జిల్లా యంత్రాంగం బంజర్లను సాగులోనికి, తెచ్చేందుకు ఆర్థిక సహాయం చేస్తున్నది. సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ, షెడ్యూలు కులాల, షెడ్యూలు జాతుల కార్పొరేషన్, సహకార బ్యాంకులు. జాతీయ బ్యాంకులు తదితర సంస్థలనుండి ఋణాలు సబ్సిడీ సదుపాయం కలుగచేస్తున్నది. దీనితో మరుభూములన్ని మొగ్గతొడుగుతున్నాయి. ఆత్మకూరు తాలూకా అప్పారావు పాలెం సహకార వ్యవసాయ సంఘ సభ్యులు హైబ్రీడ్ జొన్న పదింతలు అధిక దిగుబడి సాధించి రైతులను ఆశ్చర్యంలో ముంచివేశారు. ఇలా ఎన్నో సందర్భాలు సంభవిస్తున్నాయి.

బంజరు భూములను సాగులోనికి తెచ్చేందుకు జిల్లాలో ఒక బృహత్తర యజ్ఞం సహకార రంగంలో జరుగుతున్నది. డిసెంబరు నెలాఖరుకు ఈ జిల్లాలో 360 సహకార వ్యవసాయ సంఘాలు నెలకొల్పబడినవి. ఈ సంఘాలలో 15,317 మంది షెడ్యూలు కులాల, 5346 షెడ్యూలు జాతుల, 5717 వెనుకబడిన కులాల, 319 యితర పేద కుటుంబాలవారు సభ్యత్వం కల్గి ఉన్నారు. భూమి విస్తీర్ణం 35786 ఎకరములు. ఇందు 26710 యెకరములలో మెట్ట సేద్యం కొనసాగుతున్నది. సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ షెడ్యూలు కులాల, షెడ్యూలు జాతుల కార్పొరేషన్ల బ్యాంకుల ఆర్థిక సహాయంతో యీభూములను సాగులోనికి తెచ్చేందుకు యింతవరకు 164 వ్యవసాయ బావులు త్రవ్వబడినవి. 122 బావుల పని జరుగుతున్నది. 351 ఫిల్టర్ పాయింట్లు వేయబడినవి. 425 ఆయిల్ యింజన్లు, 58 కరెంటు మోటార్లు బిగించబడినవి. 19,242 ఎకరముల భూమి మరమత్తులు పూర్తయినవి. 1 కోటి 43½ లక్షల రూపాయలతో రూపొందించబడిన యీబృహత్తర కార్యక్రమానికి యింతవరకు రూ. 56½ లక్షలు ఖర్చుఅయింది.

ఈ కుటుంబాల పోషణకు అదనపు ఆదాయం లభించేందుకు స్వయం ఉపాధి కార్యక్రమాలు అనుబంధించబడినవి. పాడిపశువులు గొఱ్ఱెలు, ఎద్దులు పెంపకం. నైలాను, నూలు పంపిణీ ద్వారా 7621 బలహీన వర్గాల కుటుంబాలకు 67 లక్షలతో స్వయంఉపాధి కల్పించబడినది. ట్రాక్టర్ రిపేరు, టైర్ రిపేరింగ్ తదితర వృత్తులలో శిక్షణ యివ్వబడుతున్నది.

ప్రభుత్వభూములను అక్రమంగా ఆక్రమించుకొన్నవారిని దొంగ పట్టాదారులను, ఆ భూములనుండి జిల్లా యంత్రాంగం విశేషంగా ఖాళీ చేయించింది.

షెడ్యూలు కులముల, షెడ్యూలు తరగతుల తదితరులకు ఇండ్ల స్థలాలు పంపిణీ భారీయెత్తున నిర్వహించడం జరుగుతున్నది. ఏప్రిల్ 76 నుండి డిశంబరు ఆఖరు వరకు 7843 మందికి యిండ్ల స్థలాలు భూసేకరణచేసి యివ్వబడినది. మరియు 730 ఎకరాల ప్రభుత్వ భూమిలో 12276 మందికి నివేశన స్థలాలు మంజూరు చేశారు. ప్రైవేటు స్థలాల్లోచిరకాలంగా యిండ్లు కట్టుకొని

నివాసం చేస్తున్న 1,686 కుటుంబాలకు పట్టాలు ఇవ్వబడినవి. భూపరిమితి చట్టం క్రింద లభించిన మిగులు భూమిలో 1,286 మందికి యిండ్ల స్థలాలు చూపించారు. మొత్తంమీద ఏప్రిల్ 76 నుండి డిశంబరు ఆఖరు వరకు 22,970 మందికి యిండ్ల స్థలాలు లభ్యమైనాయి. గత సంవత్సరం 23 లక్షల 73 వేలు అక్విజిషన్ కొరకు జిల్లాలో ఖర్చయింది. వర్తమాన సంవత్సరానికి ఇరవై లక్షలు మంజూరు చేయబడినది.

పేదల ఋణాలపై ప్రభుత్వం మారటోరియం ప్రకటించడంతో పేదలకు వడ్డీ వ్యాపారస్తుల నుంచి ఋణాలు లభించడంలో కొంత యిబ్బంది ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జాతీయం చేయబడిన బ్యాంకులు, ప్రభుత్వం నెలకొల్పిన వివిధ ఆర్థిక కార్పొరేషన్స్‌ద్వారా ఋణ సదుపాయం జరుగుతున్నది. నెల్లూరు సహకార కేంద్ర బ్యాంకు జూన్ 76 నుండి డిశంబరు ఆఖరుకు బలహీన వర్గాలకు 117 లక్షలు ఋణాలుగా మంజూరు చేసింది. 94 సహకార వ్యవసాయ సంఘాలు ఆర్థిక సహాయం పొందేందుకు యీ బ్యాంకుకు అనుబంధించబడ్డాయి. సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ ద్వారా యింతవరకు 32.31 లక్షల సబ్సిడీ యివ్వబడింది. దీని మూలంగా 11,343 ఎకరములు మరమత్తు చేయబడి సాగులోనికి వచ్చాయి. 8,365 సన్నకారు రైతులు లాభం పొందారు. డిశంబరు ఆఖరుకు 15 లక్షల వరకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలుకు స్వల్పకాలిక ఋణాలు మంజూరు చేసింది. నెల్లూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకు వారు ఈ సంవత్సరములో మూడుకోట్ల రూపాయల ఋణాలు పంపిణీచేసి రికార్డు స్థాపించారు.

కంట్రోలు గుడ్డ సహకార సంఘాల ద్వారా పేద ప్రజలకు ధారాళంగా అందుతున్నది. డిశంబరు 76 ఆఖరుకుజిల్లాలో 12 లక్షల 85 వేల మీటర్లగుడ్డ అమ్మకం జరిగింది. దీని విలువ 32 లక్షల దాకా ఉంటుంది.

జిల్లాలో 179 విద్యార్థి వసతి గృహాలు పనిచేస్తున్నాయి. వీనిలోని 10,187 మంది విద్యార్థులకు బియ్యం తదితర నిత్యఅవసర వస్తువులు పర్మిట్లు ద్వారా సరఫరా జరుగుతున్నది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు కూడా వీరికి ఉచితంగా లభిస్తున్నవి. ఇతర విద్యార్థులకు కూడా కంట్రోలు ధరకు నోటుపుస్తకాలు అమ్మకం జరుగుతున్నది. జూన్ 76 నుండి నవంబరు ఆఖరుకు 12½ లక్షల నోటుపుస్తకాలు అమ్మకం జరిగింది. ఇంతేగాక విద్యాసంస్థలలో 141 బుక్ బ్యాంకులు నెలకొల్పబడినవి.

1976-77 సంవత్సరమున హరిజన, వెనుకబడిన కులాల హాస్టల్ నిర్వహణకై జిల్లాలో రూ.19½లక్షలు, అలాగే గిరిజన హాస్టళ్లకు మరో 4 లక్షల 85 వేలు వెచ్చించారు. స్కాలర్‌షిప్పులు కూడా బహుళంగా పేద విద్యార్థులకు అందుతున్నాయి.

ఈ ఏడాది హరిజన, గిరిజన కాలనీలలో 240 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించబడినవి. సరైన వసతి లేక మధ్యంతరంగా చదువు ఆగిపోయిన విద్యార్థుల సౌకర్యార్థం 17 రాత్రి ప్రాథమిక పాఠశాలలు కావలి సమితిలో తెరువబడి పనిచేస్తున్నాయి. జిల్లాలో తక్కిన సమితులలో కూడా యీ రకం పాఠశాలలు ప్రారంభం కాగలవు.

వర్ణాంతర వివాహాలకు 1.50 లక్షలు యీ ఏడాది మంజూరుకాగా యింత వరకు 60 వేలు ఖర్చు అయింది. ఇటీవల గూడూరులో 45 సామూహిక వివాహములు ఒకే వేదిక మీద జరగడం విశేషము.

జిల్లాలో 116 మంది అప్రెంటిస్ శిక్షణ పొందుతున్నారు. వీరిలో అధికులు బలహీన వర్గాలకు చెందినవారే.

బలహీన వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో కూడా ఎంతో ఉత్సాహం, వేగం కనిపిస్తుంది. అసంపూర్ణముగా నిల్చిపోయిన మైనర్ ఇరిగేషన్ పథకాలు పరుగు లంకించుకున్నాయి. కావలి కాల్వ పనిలో 3,000 మంది కూలీలు నిమగ్నులైయున్నారు. కనుపూరు కాల్వ జూన్78 నాటికి, గండిపాలెం ప్రాజెక్టు జూన్ 79 నాటికి పూర్తికాగలవని విశ్వసించబడుతున్నది.

నెల్లూరుజిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన సోమశిల పని చురుకుగా సాగుతున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణముతో సస్యవిప్లవానికి నాంది జరుగుతున్నది. వ్యవసాయశాఖ ప్రవేశపెడుతున్న అధికోత్పత్తికి వంగడాలు, అధిక ఆహారోత్పత్తికి మరింత దోహదం చేస్తున్నవి. జిల్లా యంత్రాంగం ధాన్యం తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోకుండతగిన చర్యలు తీసుకొంటున్నారు. రేషన్‌కార్డుద్వారా బియ్యం, చక్కెర తదితర నిత్యావసర వస్తువుల సర్ఫరా జరుగుచున్నది.

చేనేత రంగానికి రాష్ట్రప్రభుత్వము చేకూర్చిన ప్రోత్సాహముతో ఆవర్గాలలో నూతనోత్సాహము వెల్లివిరుస్తున్నది.

—శ్రీ యం. చంద్రశేఖరయ్య

కరీంనగర్ జిల్లా

బ్యాంకింగ్ అభివృద్ధిపై 1969 లో గాడ్గిల్ పరిశీలన బృందం సూచనల ప్రాతిపదికగా జిల్లాసర్వతోముఖాభివృద్ధికి వలసిన ఆర్థిక సహాయాన్ని అన్నిరంగాలలో అందచేయడానికి, ఈ అభివృద్ధికార్యక్రమంలో అన్ని వాణిజ్య బ్యాంకులు సమిష్టిగా కృషి సల్పేందుకు వీలుగా లీడ్ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు వారు జిల్లాకు రు.32.71 లక్షలతో ఒక బృహత్తర ఋణ సహాయ పథకాన్ని తయారు చేశారు.

ఈ పథకాన్ని రూపొందించేముందు లీడ్ బ్యాంకు వారు జిల్లాలో నలుమూలలపర్యటించి, అన్నిరంగాల అవసరాలను సర్వే చేశారు. ఈ పరిశీలనను అనుసరించి ఋణసహాయ పథకం తయారుచేయడం జరిగింది. ఇది పూర్తి జిల్లా అభివృద్ధి పథకం.

ఈ పథకంలో సూచించబడిన సాంకేతిక, ఆర్థిక అవసరాలకు వివిధ బ్యాంకులద్వారా ఋణాన్ని అందజేసేందుకు అప్పుడే చర్యలు ప్రారంభించారు. దీని ఫలితంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలకు బ్యాంకు సౌకర్యం కల్పించేందుకు ఇదివరకు ఉన్న 35 బ్యాంకు బ్రాంచీలను కలుపుకొని బ్రాంచీల సంఖ్య 75కు పెంచడానికి సత్వర చర్యలు గైకొంటున్నారు. ఇది సాధారణ ఆర్థికావసరాలను తీర్చడమేగాక బ్యాంకులు రానున్న ప్రణాళికా కాలంలో చేయవలసిన కార్యక్రమాన్ని నిర్దిష్టం చేసింది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 14 పంచాయతీ సమితులను సంప్రదించి అక్కడి వృత్తి, వ్యాపార, రవాణా, వ్యవసాయం, భూవసతి పంటలు ఆదిగాగల వాటిని దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్క సమితిని ఒక్కొక్క యూనిట్‌గా ఏర్పాటు చేశారు. ప్రణాళిక అమలు సౌలభ్యంకొరకు జిల్లాను 3 భాగాలుగా విభజించారు. మంథెని, పెద్దపల్లి, సుల్తానాబాద్, జగిత్యాల, మల్యాల, మెట్టుపల్లి సమితి మొదటి విభజనలో ఉండగా, రెండవ దానిలో సిరిసిల్ల, వేములవాడ, భీమదేవరపల్లి, హుజూరాబాద్, కరీంనగర్, హుస్నాబాద్, గంగాధర సమితులు, మూడవ విభజనలో మంథెని మహదేవపూర్ సమితులు ఉన్నాయి.

ఈ ప్రణాళిక రూపొందించడంలో పరిశీలక బృందం కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆఫీసర్లను, పోచంపాడు అధికారులను, సి. ఎస్ ఐ ఆర్ అధికారులను, పరిశ్రమ అధికారులను, తదితర సేవా సంస్థలను సంప్రదించి పథకం ఏవిధంగా అమలు పర్చాలనే విషయంపై నిర్ణయం గైకొన్నారు.

సత్వర అభివృద్ధికి, ప్రణాళిక అమలుకు సానుకూలమైన జిల్లాలోని మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని, దానిద్వారా వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు, యంత్ర సామగ్రి, రిపేర్లు, పశుగణాభివృద్ధి, గోదుములు, మార్కెటు వసతులు చురుకుగా అందించేందుకు వీలు కల్పించారు. ఈ ఆర్థిక సహాయం ఒక్క వాణిజ్య బ్యాంకులద్వారానేకాక, సహకారబ్యాంకుల నుండి, ఎగ్రికల్చరల్ రీఫైనాన్స్ మరియు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి కూడా లభింపచేస్తారు. ఇంకా సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ, ఆం. ప్ర. పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆం. ప్ర. షెడ్యూల్డు కులాలు, వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ, గ్రామీణ పరిశ్రమల ప్రాజెక్టు, రైతు సేవాసంఘాలు తదితర సంస్థల ద్వారా కూడా యీ పథకంలో ఋణసహాయాన్ని కల్గిస్తారు.

ఈ ప్రణాళికా కాలంలో పైరు ఋణాల క్రింద రూ. 1153.362 లక్షలు, చిన్నతరహా నీటి వనరులకు రూ. 169.913 లక్షలు, భూ అభివృద్ధి పథకం క్రింద రూ. 476.222 లక్షలు, యంత్ర సామగ్రికి రూ. 79.050 లక్షలు, వ్యవసాయ అనుబంధిత కార్యక్రమాలకు రూ. 146.200 లక్షలు. ఇతరాలు రూ. 140 660 లక్షలు మొత్తం రూ. 2165.407 లక్షలు వ్యవసాయాభివృద్ధికిగాను, పరిశ్రమకు సంబంధించి పెద్ద, మధ్య తరహా పరిశ్రమలకు రూ. 483.760 లక్షలు, చిన్నతరహా పరిశ్రమలకు రూ. 503.822 లక్షలు మొత్తం రు. 983.572 లక్షలు ఖర్చుచేస్తారు. ఇక సేవా కార్యక్రమాలకు రు. 118.431 లక్షలు వ్యయం చేస్తారు. ఈ విధంగా మొత్తం రూ. 3271.410 లక్షలు ఋణాన్ని అందజేస్తారు.

వ్యవసాయం క్రింద క్రొత్త వ్యవసాయ బావులు, పంపు సెట్లు, ఆయిల్ ఇంజన్లు, లిఫ్టు ఇరిగేషన్ పథకాలు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, ఆగ్రో సర్వీస్ సెంటర్స్, దుక్కిటెద్దులు, గోబర్ గ్యాస్ ప్లాంటులు, పాడి పశువులు, కోళ్ళ పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం ఉంటాయి.

పరిశ్రమల క్రింద రైసుమిల్లులు ఆధునిక హల్లర్లు, నూనె మిల్లులు, చర్మశుద్ధి కర్మాగారాలు, ఇటుకల తయారీ యూనిట్లు, రంపపు మిల్లులు, పేపర్ మిల్లులు, ఎగ్‌పౌడర్ కాంప్లెక్సులు, మరమగ్గాలు, అద్దకం, పశుగ్రాసం, క్రిమిసంహారక మందులు, బేకరీలు మొదలగునవి ఉంటాయి.

ఎరువులు, జనరల్ స్టోర్లు, పాన్‌షాపులు, ఇంజనీరింగ్ వర్క్‌షాపులు, మోటర్ వైండింగ్ వర్కుషాపులు, టైర్ల రిట్రేడింగ్ యూనిట్లు, టైలరింగ్ యూనిట్లు తదితరాలు సేవా పథకాల క్రింద గుర్తిస్తారు.

ఈ పథకం ఏ ఒడుదుడుకులు లేకుండా సక్రమంగా అమలు జరిగిన పక్షంలో కరీంనగర్ జిల్లా భవిష్యత్తు మరొక క్రొత్త మలుపు తిరుగుతుందనడంలో సందేహంలేదు.

—శ్రీ వి. రామమోహనరావు

తూర్పుగోదావరి జిల్లా

శ్రీకాకుళం జిల్లా సమాచార పౌరసంబంధశాఖ ఆద్వర్యమున శ్రీకాకుళం జిల్లా జర్నలిష్టు బృందం ఫిబ్రవరి 3వ తేదీనుండి 7వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమములను చూశారు. ఈ బృందంలో హిందూ ప్రతినిధి శ్రీ పి. ఎస్. ఆచార్య; ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేఖరి శ్రీ టి. శివరావు ఆంధ్ర జ్యోతి ప్రతినిధి శ్రీ పి. రాఘవేంద్రరావు; ఈనాడు ప్రతినిధి శ్రీ ఎ. వి రమణ; దక్కన్ క్రానికల్ విలేఖరి శ్రీ కె. ఎస్. లక్ష్మణరావు సమాచార, పౌరసంబంధ శాఖ సిబ్బంది వున్నారు.

ఈ బృందం అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామి దర్శనం చేసుకొని, రంపచోడవరం గోదావరి ప్లైఉడ్ లిమిటెడ్ ఫ్యాక్టరీని ప్రథమంగా దర్శించింది. ఏజన్సీ ప్రాంతంలో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి, బహుశ రాష్ట్రంలోనే స్థాపించబడిన మొట్టమొదటి ఫ్యాక్టరీ యిదే కావచ్చును. వర్క్సు మేనేజరు శ్రీ ఎం.వి.డి. మీనన్ స్వాగతంచెప్పారు.

ఫ్యాక్టరీ వివిధ వుత్పత్తులను, పద్ధతులను, ఉపయోగిస్తున్న యంత్రపరికరములను శ్రీ మీనన్ ఈబృందానికి చూపించి వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తంరూ 142లక్షలపెట్టుబడితో నెలకొల్పబడింది. ఇందులో ప్లైవుడ్ తయారు చేయడంలో ప్రముఖమైన నిపుణులుపారిశ్రామికవేత్త శ్రీ ఎన్. వెంకయ్య 26% వాటా, ఆంధ్ర ప్రదేశ్ యిండస్ట్రియల్ కార్పొరేషన్ 25% వాటాను, మిగిలిన 49% వ్యక్తుల నుండి షేర్లు వసూలు చేసి ఈ ఫ్యాక్టరీ నిర్మించారు.

తక్కువ కాలంలోనే వివిధరకాల ప్లయివుడ్‌ను తయారు చేయడంలో గణనీయంగా ముందుకు వస్తూంది. ఈఫ్యాక్టరీ పూర్తి అయిన తరువాత సుమారు 6 వేల మందికి ఉపాధి కలుగుతుందని అంచనా.

తరువాత ఈ బృందం సిరిగిందలపాడు గిరిజన సంక్షేమ ఉద్యానవనమును దర్శించారు. ఈ ఫారం1953లో 30 ఎకరములలో ప్రారంభించబడింది. దరిమిలా 1959లో మరో20ఎకరములలో విస్తరింపబడి ఏజన్సీప్రాంతంలోని గిరిజన రైతుల అవసరాలను తీర్చడానికి ఎంతో వుపకరిస్తూంది. ఈక్షేత్రంలో అనేక రకాల ఫలములఅంటులు తయారు చేయబడుచున్నవి. ముఖ్యంగా 50 రకాల మామిడి అంటులు వుత్పత్తి చేయడం ఎంతో గమనార్హమైనది. రూ. 36 వేల నిధులతో పనిచేస్తూ గిరిజన రైతులకు పండ మొక్కలు సరఫరా చేయుటలో ద్విగుణీకృతమైన పాత్ర నిర్వహిస్తూన్నది.

తరువాత ఈ బృందం రంపచోడవరం సమితి ఆఫీసును దర్శించింది. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు శ్రీ ఎ. జె. రామారావు విస్తరణాధికారులతో స్వాగతం చెప్పారు. గిరిజన సమితిలో వివిధ సంక్షేమ కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. గిరిజనులలో విద్యా తృష్ణను ఆదుకోవడానికి 7 ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించబడినాయని, సుమారు 64 ఎస్.ఎన్.పి. సెంటర్లు నడపబడుచున్నవనియు, బ్లాకు కేంద్రంలో ఒక వాణిజ్యబ్యాంకు ప్రారంభించవలసిన అవశ్యకతవుందనీ తెలియజేయబడింది. మొదటి రోజు అంతటితో పరిసమాప్తమయినది. రెండవ రోజు కార్యక్రమము రాజమండ్రి శ్రీ కందుకూరి వీరేశలింగం స్టేట్ హోంను దర్శించడంతో, ప్రారంభమయినది. స్త్రీ జన సంక్షేమశాఖ అసిస్టెంటు డైరక్టర్ శ్రీమతి ఎం. లక్ష్మీతులసి పాత్రికేయులకు స్వాగతం చెప్పి హోం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమములు చూపించారు. ప్రస్తుతం హోంలో 62 మంది స్త్రీలు కలరు, భర్తలు వదిలినవారు, అనాథలు, విధవలు ఈ హోంలో ఆశ్రయం తీసుకుంటున్నారు. వారిని స్వయం శక్తితో జీవించేలాగున 3సంవత్సరాలపాటు వారి అభిరుచినిబట్టి వివిధ వృత్తులలో శిక్షణ ఈయబడుతుంది. ఈ సంస్థ 1905లో విక్టోరియా విడోహోంగా స్థాపించబడింది, తరువాత అది శ్రీ వీరేశలింగం స్టేటు హోంగా మారింది. దీనిని ఆంధ్ర ప్రదేశ్ స్త్రీ.శిశు సంక్షేమశాఖ వారు 25 సం॥ లకు లీజుకు తీసుకుంది. తరువాత ఈ బృందం కాకినాడ పడవల నిర్మాణం కేంద్రాన్ని దర్శించింది, ప్రొడక్షన్ మేనేజర్ శ్రీ బి. ఆర్. రఘునాధశాస్త్రి స్వాగతం చెప్పారు. రెండు సంవత్సరాల కాలంలో ఈ కేంద్రం వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. యార్డును అంతా బృందానికి చూపించారు. 1959 నుండి యింతవరకు 655 బోటులు నిర్మించినట్లు చెప్పారు శ్రీ శాస్త్రి. సరాసరి మర పడవల ఖరీదు రూ. 1.5 లక్షలనుండి రూ 1.80 లక్షలవరకు వుంటుంది. శ్రీ ఫాబ్లో అనే విదేశీయుడు 1954లో కాకినాడలో మరపడవలను రూపొందించాడు. యిప్పుడు ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్ మత్స్య పారిశ్రామిక ఫైనాన్సు కార్పొరేషన్ యొక్క నేతృత్వంలో దిన దిన ప్రవర్ధమానమవుతూంది. రాష్ట్రంలోని మత్స్యకార్మికులఅవసరాలను తీర్చడానికి స్వయం సమృద్ధిని సాధించడానికి కృషి జరుగుతూంది. రూ. 55 లక్షల పెట్టుబడితో నడపబడుతున్న ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో యింకా ఎంతో ప్రగతి సాధించబడే అవకాశాలు మెండుగా వున్నాయి.

తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ యు. బి. రాఘవేంద్రరావుతో పత్రికా ప్రతినిధుల బృందం గోష్ఠి జరిపారు. మూడవ రోజు కార్యక్రమం ప్రారంభమయినది. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న మహత్తరమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. రూ 4 కోట్ల రూపాయలతో అమలాపురంలో ప్రారంభించబోయే 'మాసర్ ప్లాన్' ఆయన వివరించారు. ఈ ప్లాన్ ప్రకారం కోస్తా ప్రాంతంలోని మత్స్య కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. 20సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద చేపట్టిన ప్రగతి కార్యక్రమాలు ఆయన వివరించారు. బలహీన వర్గాల అభివృద్ధికి రూ. 1.5 కోట్లు మార్జిన్ ధనం వ్యయపరచి అనేక ఆర్థిక కార్యక్రమాలు చేబట్టినట్లు తెలియజేశారు. 15% రిజర్వు నిధులనుండి సుమారు రూ 40 లక్షలు హరిజన వాడలలో రహదారులు, మంచినీటి నూతులు నిర్మాణమునకు ఖర్చు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత సంవత్సరములో 20 వేల ఇళ్ళ స్థలములు బలహీన వర్గాలవారికి పంచిపెట్టినట్లు కలెక్టర్ వివరించారు.

తరువాత ఈ బృందం అమలాపురం పద్మావతి మహిళా సూపర్ బజారును దర్శించింది. ఈ సూపర్ బజారు పనిచేయు తీరుకు పాత్రికేయులు ఎంతో హర్షించారు.

తరువాత అంబాజీపేట కొబ్బరి పరిశోధనా స్థానమును దర్శించారు. శ్రీ కె. వెంకటరెడ్డి స్వాగతం చెప్పారు. ఈ పరిశోధన స్థానంలో వివిధ కార్యక్రమాలను బృందానికి చూపించారు. కొబ్బరి పంటను రక్షించడంలో-అభివృద్ధి చేయడంలో చేయుచున్న కృషిని ఆయన వివరించారు.

ర్యాలి, జగన్మోహిని దేవాలయం కోటిపల్లి ద్రాక్షారామ, భీమేశ్వర దేవాలయం పాత్రికేయులు తమ పర్యటనలో సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకొన్నారు.

—శ్రీ కుసుమ ధర్మారావు

PUBLISHED BY THE DIRECTOR, DEPARTMENT OF INFORMATION AND PUBLIC RELATIONS GOVT. OF ANDHRA PRADESH HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD

స్వీయ చరిత్ర ఆధారంగా - బుజ్జాయి



(ఇంకా వుంది)

